
www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 29-6-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 74

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: అష్టమి మ. 2.20 తదుపరి నవమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 8.49 తదుపరి రేవతి; వర్జ్యం: రా. 8.11-9.42; దుర్ముహూర్తం: ఉ.5.47-7.31; అమృతఘడియలు: తె. 5.17 మొదలు; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.49

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



2 భారత్ తరపున డబుల్ సెంచరీ చేసిన రెండో మహిళా బ్యాటర్‌గా షఫాలీ. అంతకు ముందు 22 ఏళ్ల క్రితం ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో మిథాలీ రాజ్ (214) ఈ ఘనత సాధించింది.

1 షఫాలీ, మంధాన జోడించిన 292 పరుగులు మహిళల టెస్టు చరిత్రలో తొలి వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఈ క్రమంలో పాకిస్థాన్ ఓపెనర్లు సాజిదా షా, కిరణ్ బలూచాలు నమోదుచేసిన 241 రన్స్ రికార్డు బద్దలైంది. కాగా, ఆస్ట్రేలియా జంట రీలర్, అన్నెట్ (మూడో వికెట్‌కు 309 రన్స్) తర్వాత షఫాలీ, స్మృతి జోడీ చేసిన పరుగులు ఏ వికెట్‌కైనా రెండో అతిపెద్ద భాగస్వామ్యం.

షఫాలీ వర్మ (197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్సర్లతో 205)

స్మృతీ మంధాన (161 బంతుల్లో 27 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 149)

తొలిరోజు భారత్ 525/4

# మనమ్మాయిల మరో చరిత్ర

- షఫాలీ.. ఫాస్టెస్ట్ డబుల్ • శతక్కొట్టిన మంధాన
- దక్షిణాఫ్రికాతో ఏకైక టెస్టులో రికార్డుల హోరు

చెన్నై: దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి జోరుమీదున్న భారత మహిళలు ఏకైక టెస్టులోనూ దుమ్మురేపుతున్నారు. ఓపెనర్లు పరుగుల వరద పారించారు. రికార్డుల బూజు దులుపుతూ టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించారు. శుక్రవారం మొదలైన ఈ టెస్టు మ్యాచ్‌లో తొలిరోజే ఓపెనర్లు షఫాలీ వర్మ (197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్సర్లతో 205) డబుల్ సెంచరీతో గర్జించగా, స్మృతీ మంధాన (161 బంతుల్లో 27 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 149) శతకంతో కదం తొక్కింది. జెమీమా రోడ్రిగ్స్ (55) అర్ధ సెంచరీ సాధించింది. ఫలితంగా మొదటిరోజు ఆట ముగిసేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 525 పరుగుల భారీ స్కోరు నమోదుచేసింది. ఈ క్రమంలో పలు రికార్డులు వెల్లువెత్తాయి. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టులో షఫాలీ, మంధాన సఫారీ బౌలర్లను ఆడుకున్నారు. ఇద్దరూ వన్డే తరహాలో రెచ్చిపోవడంతో పరుగులు కట్టడిచేసేందుకు బౌలర్లు ఆపసోపాలు పడ్డారు. లంచ్ విరామానికల్లా భారత్ వికెట్ నష్టపోకుండా 130 పరుగులు చేసింది. ఆ తర్వాత షఫాలీ, స్మృతి దూకుడు పెంచుతూ రికార్డు భాగస్వామ్యంతో విరుచుకుపడ్డారు. తొలి వికెట్‌కు రికార్డుస్థాయిలో 292 పరుగులు జోడించారు. 52వ ఓవర్లో టక్కర్ బౌలింగ్ మంధాన వెనుదిరగగా.. యువ ఓపెనర్ షఫాలీ మాత్రం బాదుడు ఆపలేదు. లేడీ సెహ్వాగ్ తరహాలో బౌలర్లపై శివాలెత్తుతూ సెంచరీ.. ఆ తర్వాత దాన్ని డబుల్ సెంచరీగా మలిచింది. ఈ క్రమంలో మహిళల టెస్టు చరిత్రలోనే అత్యంత వేగంగా.. అంటే 194 బంతుల్లోనే ద్విశతకాన్ని నమోదు చేసింది. టెస్టుల్లో తొలి డబుల్ సెంచరీ సాధించిన షఫాలీ.. చివరకు 205 పరుగుల వద్ద రనౌటైంది. అప్పటికి టీమిండియా స్కోరు 411/3. ఇక, తొలిడౌన్‌లో వచ్చిన శుభా సతీశ్ (15) నిరాశపరచగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (42 నాటౌట్)తో కలిసి రోడ్రిగ్స్ వేగంగా ఆడింది. రోడ్రిగ్స్ అవుటయ్యాక రిచా ఘోష్ (43 నాటౌట్)తో కలిసి హర్మన్ జట్టు స్కోరును 500 దాటించింది. వీళ్లిద్దరూ కలిసి ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించారు.



స్కోరుబోర్డు

1 మహిళల టెస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా షఫాలీ. 194 బంతుల్లోనే ద్విశతకం బాదిన షఫాలీ.. ఈ ఏడాది ఆరంభంలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ అనబెల్ సదర్లాండ్ 248 బంతుల్లో చేసిన డబుల్ సెంచరీ రికార్డును అధిగమించింది.

ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక (8) సిక్సర్లతో షఫాలీ ప్రపంచ రికార్డు.

ఓవరాల్‌గా (పురుషులు, మహిళల) టెస్టు చరిత్రలో ఒకరోజు అత్యధిక పరుగులు (525) చేసిన తొలి జట్టుగా భారత్. అంతకుముందు 2002లో బంగ్లాదేశ్‌తో టెస్టులో రెండోరోజు ఆటలో శ్రీలంక పురుషుల జట్టు చేసిన 509/9 స్కోరే అత్యుత్తమం. కాగా, మహిళల టెస్టు క్రికెట్‌లో 1935లో న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు మొదటి రోజు 431/4 స్కోరు చేసింది.

**భారత్ తొలి ఇన్నింగ్స్:** షఫాలీ (రనౌట్) 205, స్మృతీ మంధాన (సి) డెర్క్‌సెన్ (బి) టకర్ 149, సతీశ్ శుభా (సి) జఫ్తా (బి) డీ క్లెర్క్ 15, జెమీమా (సి) డీ క్లెర్క్ (బి) టకర్ 55, హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 42, రిచా ఘోష్ (నాటౌట్) 43; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 98 ఓవర్లలో 525/4; వికెట్ల పతనం:** 1-292, 2-325, 3-411, 4-450; **బౌలింగ్:** మసబాట క్లాస్ 14-2-63-0, డెర్క్‌సెన్ 11-0-60-0, డీ క్లెర్క్ 10-1-62-1, సెఖుఖునె 10-0-55-0, నాన్‌కులులెకో మ్లాబా 24-1-113-0, టక్కర్ 26-1-141-2, సునె లూస్ 3-0-15-0.

జట్టులో స్టార్ ఆటగాళ్లకు కొదువలేదు.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ మనోళ్లదే హవా.. కానీ ఓ వరల్డ్‌కప్‌ను ముద్దాడి ఎన్నేళ్లవుతుంది? ఒకటా.. రెండా.. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచకప్ గెలిచి 17 ఏళ్లయ్యింది.. ఇక భారత్ వన్డేల్లో విశ్వకప్ గెలిచి 13 ఏళ్లు. మధ్యలో ఈ రెండు టైటిల్స్‌ను గెలిచే చాన్స్ రెండుసార్లు వచ్చినా దురదృష్టం వెంటాడింది. కోట్లాదిమంది అభిమానులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రపంచకప్‌ను సగర్వంగా అందుకునేందుకు మరో సువర్ణావకాశం ముందుంది.. అందుకే ఈసారి ఎట్టి పరిస్థితిల్లోనూ టైటిల్ పట్టేయాలని రోహిత్ సేన పట్టుదలగా ఉంది.. అటు చోకర్స్‌గా ముద్రపడిన దక్షిణాఫ్రికా అంచనాలకు మించిన ఆటతీరుతో తొలి వరల్డ్ కప్ టైటిల్ కోసం సై అంటోంది.. మరి, అజేయంగా దూసుకొచ్చిన ఈ రెండు జట్లలో చాంపియన్‌గా నిలిచేది ఎవరన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.

# ఈసారి వదలొద్దు!

టీ20 ప్రపంచకప్ ఫైనల్ నేడు

రాత్రి 8 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో..

## జోరుమీదున్న భారత్
## తొలి కప్పు వేటలో దక్షిణాఫ్రికా



సఫారీల సారథి మార్‌క్రమ్

బ్రిడ్జ్‌టౌన్: టీ20 ప్రపంచకప్‌లో విశ్వ విజేతను తేల్చే అంతిమ సమరానికి వేళైంది. రెండో టైటిల్ కోసం టీమిండియా.. తొలి ట్రోఫీ కోసం దక్షిణాఫ్రికా శనివారం జరిగే ఫైనల్లో అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. ఈ మెగా టోర్నీ చరిత్రలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా రెండు జట్లు ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. ఈనేపథ్యంలో తుదిపోరుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2007 ఆరంభ టీ20 ప్రపంచకప్ గెలిచాక భారత జట్టు ఈ ఫార్మాట్‌లో మరోసారి విజేత కాలేకపోయింది. అలాగే 2011లో వన్డే వరల్డ్‌కప్ గెలిచి, గతేడాది అజేయంగా ఫైనల్‌కు చేరినా నిరాశే ఎదురైంది. అందుకే ఈ రెండు ఫార్మాట్లలో సుదీర్ఘ ఎదురుచూపులకు తెరదించాలన్న కసితో రోహిత్ సేన ఉంది. మరోవైపు ఏ ప్రపంచకప్‌లోనైనా సఫారీలు ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. ఐదుసార్లు వన్డే, రెండుసార్లు టీ20 వరల్డ్‌కప్‌ల్లో సెమీస్ వరకు చేరి వెనుదిరిగారు. అందుకే మార్‌క్రమ్ సేనకు కూడా ఈ పోరు అత్యంత కీలకంగా మారింది.

### అన్ని విభాగాల్లోనూ అదుర్స్

వాస్తవానికి భారత జట్టుకు ఈ మెగా టోర్నీ నల్లేరు మీద నడకలా సాగుతోంది. గ్రూప్ దశలోనే కాదు.. సూపర్-8, సెమీస్‌లోనూ పాక్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లపై అసలు పోటీ అనేదే లేకుండా వరుసగా ఏడు విజయాలతో ఫైనల్‌కు చేరింది. కెనడాతో మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. ఈ మ్యాచ్‌ల్లో పిచ్‌ను పరిస్థితి బట్టి స్వల్ప స్కోర్లు నమోదైనా.. బౌలర్లు విజృంభించారు. పేసర్లు, స్పిన్నర్లు కలిసికట్టుగా కదం తొక్కుతూ గత వరల్డ్‌కప్‌ల్లో పరాభవాలకు ఆసీస్, ఇంగ్లండ్ జట్లపై బదులు తీర్చుకుంటూ భారత్ ముందుకెళ్లింది. కెప్టెన్ రోహిత్ తన సమర్థ నాయకత్వానికి తోడు బ్యాటింగ్‌లోనూ రఫ్ఫాడిస్తున్నాడు. ఇప్పటికే 248 పరుగులతో ఉన్న తను మరో 33 రన్స్ చేస్తే టోర్నీ టాపర్‌గా నిలుస్తాడు. ఇక సూర్యకుమార్ తన సహజశైలిని కొనసాగిస్తుండగా హార్దిక్ ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంటున్నాడు. పంత్ ధనాధన్ ఆటతో సాగుతున్నాడు. బ్యాటింగ్ విభాగంలో ఓపెనర్‌గా కోహ్లీ, మిడిలార్డర్‌లో దూబె మాత్రమే బలహీనంగా కనిపిస్తున్నారు. ఐపీఎల్‌లో విరుచుకుపడిన ఈ ఇద్దరూ అనూహ్యంగా ఇక్కడ మాత్రం నిరాశపరుస్తున్నారు. అయినా తుది పోరులో విరాట్ తన మార్క్ ఆటను చూపుతాడని జట్టుతో పాటు ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. దూబెను ఆడిస్తారా? శాంసన్, జైస్వాల్‌లలో ఒకరికి చోటిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. బౌలింగ్‌లో మాత్రం స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ అదరహో అనిపిస్తున్నారు. జడేజా పరుగులను నియంత్రిస్తుండగా.. పేసర్లు అర్షదీప్ 15 వికెట్లతో బుమ్రా 13 వికెట్లతో టాప్ ఫామ్‌తో చెలరేగుతున్నారు. తుది పోరులోనూ అన్ని విభాగాలు కదం తొక్కితే టైటిల్ పట్టేయడం ఖాయమే.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్ (కెప్టెన్), విరాట్, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్షదీప్.
**దక్షిణాఫ్రికా:** డికాక్, హెన్‌డ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), క్లాసెన్, మిల్లర్, స్టబ్స్, జాన్సెన్, కేశవ్, రబాడ, నోకియా, షంసీ.

### బౌలింగ్ పవర్‌తో..

సఫారీలు ఈస్థాయి ప్రదర్శనతో ఫైనల్‌దాకా వస్తారని నిజంగా ఎవరూ ఊహించలేదేమో. భారత్ మాదిరి కాకుండా ఈ జట్టుకు గ్రూప్, సూపర్-8లో క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. అయినా గతంలో మాదిరి కాకుండా ఒత్తిడిని దరిజేరనీకుండా గట్టెక్కగలిగారు. నేపాల్‌లాంటి పసికూనపై ఒక్క పరుగుతో ఆఖరి బంతికి గెలిచారు. ఓవరాల్‌గా వీరి విజయాల్లో బౌలర్ల పాత్ర కీలకమని చెప్పవచ్చు. టోర్నీ టాప్-5 బ్యాటర్లలో ఒక్క సఫారీ బ్యాటర్ కూడా లేకపోవడం గమనార్హం. డికాక్ (204) పర్వాలేదనిపిస్తున్నాడు. కానీ మార్‌క్రమ్, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్‌లలో ఒక్కరు నిలదొక్కుకున్నా భారత బౌలర్లకు కష్టాలు తప్పవు. మరోవైపు పేసర్లు నోకియా (13), రబాడ (12), స్పిన్నర్ షంసీ (11) ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నారు. అలాగే కీలక సెమీస్ పోరులో దూకుడు మీదున్న అఫ్ఘాన్‌ను కేవలం 56 పరుగులకే కట్టడి చేసిన విషయం తెలిసిందే. ఇక నేటి ఫైనల్లో స్టార్లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌ను వీరు ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే సఫారీల విజయం ఆధారపడి ఉంటుంది.

### వర్షం ఖాయమేనట..

కరీబియన్ దీవుల్లో ఇది వర్షాకాలం. కాబట్టి మ్యాచ్ రోజుతో పాటు రిజర్వ్ డే అయిన ఆదివారం కూడా వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఆకాశం దట్టమైన మేఘాలతో ఉండనుంది. అలాగే వర్షానికి 78 శాతం అవకాశం ఉంది. బలమైన గాలులకు ఆస్కారం. అయితే 190 నిమిషాల అదనపు సమయం ఉంది కాబట్టి మ్యాచ్‌కు ఇబ్బంది ఉండకపోవచ్చు. విజేతను తేల్చేందుకు పది ఓవర్ల మ్యాచ్ సరిపోతుంది. అదీ వీలు కాకపోతే రిజర్వ్‌డే ఉండనే ఉంది. ఒకవేళ రిజర్వ్‌డే రోజు కూడా మ్యాచ్ జరగకపోతే ఇరు జట్లు సంయుక్త విజేతలుగా నిలుస్తాయి.

1 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడడం ఇదే తొలిసారి.

## యూఎస్ ఓపెన్ క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

ఫోర్ట్‌వర్త్ (అమెరికా): తెలుగమ్మాయి గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ యూఎస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం జరిగిన డబుల్స్ ప్రీక్వార్టర్స్ పోరులో గాయత్రి ద్వయం 16-21, 21-11, 21-19తో హిస్సీ షాన్-హుంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ)పై గెలిచింది. సింగిల్స్ రెండో రౌండ్‌లో 8వ సీడ్ ప్రియాన్షు రజావత్ 21-18, 21-16తో హువాంగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గి, క్వార్టర్స్ చేరాడు. మాళవిక బన్సోడ్ 15-21, 21-19, 21-14తో తెరెజా స్వాబికోవా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గింది.

## ఆంధ్ర రిలే జట్టుకు స్వర్ణం

● స్ప్రింటర్ నిత్యకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఇంటర్ స్టేట్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 4×400 మహిళల రిలేలో ఆంధ్రప్రదేశ్ బృందం స్వర్ణ పతకం కొల్లగొట్టింది. శుక్రవారం హరియాణాలోని పంచకులలో జరిగిన ఈ పోటీల్లో ఆర్.స్వాతి, ఎం.శిరీష, కె.రజిత, ఎల్.మధుకావ్యతో కూడిన ఆంధ్ర జట్టు 3 నిమిషాల 41.84 సెకన్లలో రేసును ముగించింది. హైదరాబాద్ అమ్మాయి నిత్య 100 మీటర్ల స్ప్రింట్‌లో కాంస్యం సాధించింది. నిత్య 11.79 సెకన్లలో రేసును పూర్తి చేసి మూడోస్థానంలో నిలిచింది. స్నేహ (కర్ణాటక) స్వర్ణం, గిరిధరణి (తమిళనాడు) రజతం నెగ్గారు.

## ఫైనల్లో స్వేచ్ఛగా ఆడండి

రోహిత్ సేనకు గంగూలీ సూచన

న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడికి లోను కాకుండా స్వేచ్ఛగా ఆడాలని రోహిత్ సేనకు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సూచించాడు. 'ఆరు నెలల క్రితం ఐపీఎల్‌లో రోహిత్ ముంబై జట్టుకు కెప్టెన్‌గా కూడా లేడు. కానీ నేడు భారత జట్టును ఓటమి లేకుండా ప్రపంచకప్ ఫైనల్‌కు చేర్చడం సంతోషంగా ఉంది. ఆటగాళ్లు స్వేచ్ఛగా ఆడితే ఫైనల్లోనూ విజయం ఖాయం' అని దాదా అన్నాడు.

## నగాల్‌కు క్లిష్టమైన డ్రా

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో తొలిసారిగా ఆడబోతున్న భారత స్టార్ సుమిత్ నగాల్‌కు క్లిష్టమైన డ్రా ఎదురైంది. సోమవారం నుంచి జరిగే ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో అతను తొలి రౌండ్‌లో ప్రపంచ 53వ ర్యాంకర్ మియోమిర్ కెక్మానోవిక్(సెర్బియా)తో తలపడనున్నాడు. ఒకవేళ మెరుగైన ఆటతీరుతో ముందుకుసాగినా మూడో రౌండ్‌లో వరల్డ్ నెంబర్ వన్ జానిక్ సిన్నర్ ఎదురుకానున్నాడు. ఇక డిఫెండింగ్ చాంప్ అల్కారజ్, టాప్‌సీడ్ సిన్నర్ ఒకే పార్శ్వంలో పోటీపడనున్నారు. దీంతో అంతా సవ్యంగా సాగితే ఈ ఇద్దరూ సెమీస్‌లో తలపడే చాన్సుంది. జొకోవిచ్ క్వాలిఫయర్ కోప్రివాతో టోర్నీ ఆరంభించనున్నాడు. పురుషుల డబుల్స్‌లో భారత్ నుంచి బోపన్న-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా), శ్రీరామ్ బాలాజీ-జాన్సన్ (బ్రిటన్) తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

## జావెలిన్ త్రోయర్ మనుపై వేటు



పంచకుల (హరియాణా): ఆసియా చాంపియన్‌షిప్ రజత పతక విజేత, పారిస్ ఒలింపిక్స్ రేసులో ఉన్న యువ జావెలిన్ త్రోయర్ డీపీ మనుపై నాడా (జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ) ప్రాథమికంగా వేటు వేసింది. గత ఏప్రిల్‌లో జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రీ సందర్భంగా మను నుంచి 'నాడా' రక్త నమూనాలను సేకరించింది. వాటిలో అనబోలిక్ ఉత్ప్రేరకం ఉండడంతో డోపింగ్ టెస్టులో మను పాజిటివ్‌గా తేలాడు. దీంతో అతడిపై ప్రాథమిక సస్పెన్షన్ విధిస్తున్నట్టు నాడా తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న జాతీయ అంతర్రాష్ట్ర చాంపియన్‌షిప్స్‌కు దూరంగా ఉండాలని జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ఆదేశించింది.

ఈ మార్చి చివరినాటికి

# ప్రభుత్వ అప్పు రూ.171.78 లక్షల కోట్లు

వెల్లడించిన కేంద్ర ఆర్థిక శాఖ




న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి చివరి నాటికి కేంద్ర ప్రభుత్వం మొత్తం రుణాలు రూ.171.78 లక్షల కోట్లకు పెరిగాయి. 2023 డిసెంబరు చివరి నాటికి నమోదైన రూ.166.14 లక్షల కోట్లతో పోలిస్తే, మూడు నెలల్లో 3.4 శాతం పెరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం వెల్లడించింది. మొత్తం స్థూల రుణాల్లో పబ్లిక్ డెట్ వాటా 90.2 శాతంగా నమోదైందని తెలిపింది. ఈసారి బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన రుణ సమీకరణ ప్రణాళిక మార్కెట్ అంచనాల కన్నా మెరుగ్గా ఉండటం, ద్రవ్యలోటును జీడీపీలో 5.1 శాతానికి కట్టడి చేస్తామన్న లక్ష్యంతోపాటు క్యాపిటల్ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడం, ద్రవ్యోల్బణం అదుపులోకి రావడంతో ప్రభుత్వ బాండ్ల వడ్డీరేట్లు కాస్త తగ్గుముఖం పట్టాయని తన ప్రకటనలో పేర్కొంది. కాగా, అమెరికా బాండ్ల రేట్లు తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయని.. ఫెడ్ రిజర్వ్ నిర్ణయాలు, ఆ దేశ ద్రవ్యోల్బణం, ఉద్యోగాల కల్పన గణాంకాలు అందుకు కారణమని నోట్‌లో ప్రస్తావించింది.

### కీలక రంగాల వృద్ధి 6.3 శాతం

ఈ ఏడాది మే నెలకు దేశంలోని 8 కీలక మౌలిక రంగాలు 6.3 శాతం వృద్ధిని కనబర్చాయి. ఈ ఏప్రిల్‌లో నమోదైన 6.7 శాతం వృద్ధితో పోలిస్తే తగ్గినప్పటికీ, గత ఏడాది మే నెలలో నమోదైన 5.2 శాతం వృద్ధితో పోలిస్తే మెరుగైంది. బొగ్గు, ముడిచమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలను కీలక మౌలికాభివృద్ధి రంగాలుగా పరిగణిస్తారు. ఏప్రిల్‌తో పోలిస్తే తగ్గినప్పటికీ.. బొగ్గు, సహజ వాయువు, విద్యుత్ రంగాలు గతనెలలో మెరుగైన పనితీరు కనబర్చాయని ప్రభుత్వం వెల్లడించింది. ముడిచమురు, సిమెంట్, ఎరువుల రంగాలు మాత్రం డీలా పడ్డాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు నెలలకు (ఏప్రిల్-మే) కీలక రంగాల ఉత్పత్తి వృద్ధి 6.5 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వృద్ధి 4.9 శాతంగా ఉంది.

### బడ్జెట్ అంచనాల్లో 3 శాతానికి ద్రవ్యలోటు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు నెలలు పూర్తయ్యే సరికి కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాలో కేవలం 3 శాతానికి పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ వ్యయాలపై ఆంక్షలు అమలు కావడం ఇందుకు ప్రధాన కారణం. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి లోటు బడ్జెట్ అంచనాలో 11.8 శాతంగా నమోదైంది. ప్రభుత్వ రాబడి, వ్యయాల మధ్య అంతరాన్ని ద్రవ్యలోటు అంటారు. మార్కెట్ నుంచి రుణాల సమీకరణ ద్వారా ప్రభుత్వం ఈ లోటును పూడ్చుతుంది. 2024-25లో ద్రవ్యలోటు రూ.16,85,494 కోట్లు లేదా జీడీపీలో 5.1 శాతంగా నమోదు కావచ్చని ఈ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో కేంద్రం అంచనా వేసింది. కాగా, ఈ ఏప్రిల్, మే గడిచేసరికి ద్రవ్యలోటు రూ.50,615 కోట్లు లేదా బడ్జెట్ అంచనాలో 3 శాతంగా నమోదైంది.

## చిన్న మొత్తాల పొదుపు రేట్లు యథాతథం

ఈ జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి చిన్న మొత్తాల పొదుపు పథకాలపై చెల్లించే వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం ప్రకటించింది. అనగా, ప్రస్తుత రేట్లే మరో మూడు నెలలు కొనసాగనున్నాయి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి చిన్న మొత్తాల పొదుపు రేట్లను సవరిస్తుంటుంది. ఈ రేట్లను యథాతథంగా కొనసాగించడం వరుసగా ఇది రెండో సారి. ప్రస్తుతం సుకన్య సమృద్ధి పథకంపై వడ్డీ రేటు 8.2 శాతంగా ఉండగా.. మూడేళ్ల టర్మ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్(పీపీఎఫ్)పై లభించే వార్షిక వడ్డీ ఆదాయ రేటు 7.1 శాతంగా ఉంది. పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీమ్‌లో 4 శాతం, కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం వడ్డీ లభిస్తోంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్(ఎన్ఎస్‌సీ)పై లభించే వడ్డీ రేటు 7.7 శాతంగా ఉంది.

## ఎన్‌పీఎస్ ఖాతాదారులకు టీ+0 సెటిల్‌మెంట్

న్యూఢిల్లీ: ఎన్‌పీఎస్ పెట్టుబడులకు సంబంధించి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. సెటిల్‌మెంట్ రోజు ఖాతాదారుల నుంచి ఉదయం 11 గంటల వరకు వచ్చిన పెట్టుబడి నిధులను ట్రస్టీ బ్యాంకులు ఇక అదే రోజు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉదయం 9.30 గంటల వరకు వచ్చిన నిధులను మాత్రమే ట్రస్టీ బ్యాంకులు, అదే రోజు పెట్టుబడి పెడుతున్నాయి. ఆ తర్వాత వచ్చిన నిధులను మరుసటి రోజు, ఖాతాదారుల చాయిస్‌కు అనుగుణంగా వివిధ పెట్టుబడి సాధనాల్లో మదుపు చేస్తున్నాయి. పీఎఫ్ఆర్‌డీఏ జూలై 1 నుంచి ఈ గడువును ఉదయం 11 గంటల వరకు పొడిగించింది.

## కోరమాండల్ నుంచి 'పరంఫాస్ ప్లస్'

హైదరాబాద్ : ప్రముఖ ఎరువుల కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ 'పరంఫాస్ ప్లస్' పేరుతో మరో సరికొత్త ఎరువుని మార్కెట్‌లో విడుల చేసింది. ఇప్పటికే ఉన్న 'పరంఫాస్' బ్రాండ్ పోషక ఎరువుని మెగ్నీషియంతో సుసంపన్నం చేసి కంపెనీ ఈ ఎరువుని అభివృద్ధి చేసింది. పరంఫాస్ ప్లస్ ఎరువులో 16 శాతం నత్రజని, 20 శాతం ఫాస్పరస్, 13 శాతం సల్ఫర్‌తో పాటు అదనంగా 0.6 శాతం మెగ్నీషియం ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ ఎరువుని ఉద్యాన పంటలతో పాటు, అన్ని ఆహార ధాన్యాల పంటలపై ఉపయోగించ వచ్చని తెలిపింది.

## కిరాణా సరుకుల డెలివరీ సేవల్లోకి ఓలా

న్యూఢిల్లీ: క్యాబ్ బుకింగ్ సేవల కంపెనీ ఓలా.. బ్లింకిట్, స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్ వంటి క్విక్ కామర్స్ కంపెనీలకు సైతం పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ కంపెనీ త్వరలోనే కిరాణా సరుకుల డెలివరీ సేవల్లోకి ప్రవేశించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్‌ఫామ్‌తో జట్టు కట్టనున్నట్లు సమాచారం. ఆన్‌లైన్ కిరాణా సరుకుల విభాగంలోకి ప్రవేశించేందుకు ఓలా చేస్తున్న మూడో ప్రయత్నమిది. గతంలో సంస్థ కిరాణా సరుకుల కేంద్రాలను ప్రారంభించింది. ఆ తర్వాత ఫుడ్ డెలివరీ యాప్‌ను లాంచ్ చేసింది. కానీ, ఆ రెండు ప్రయత్నాలూ విఫలమయ్యాయి.

www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శనివారం | 29-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 74 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

# కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే మంత్రి పదవులు

**నేడు వరంగల్, హనుమకొండల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన**

- పార్టీ బీ ఫాంపై గెలిచిన వారికే చోటు
- పీసీసీ చీఫ్ నియామకం, విస్తరణ ఒకేసారి
- 3, 4 రోజుల్లో రుణమాఫీ మార్గదర్శకాలు
- అసెంబ్లీ తర్వాతే రైతు భరోసా, పింఛన్ల పెంపు
- మళ్లీ సీఎం అవుతానని కేసీఆర్ కలలు!
- అందుకే విద్యుత్తు కమిషన్‌పై విమర్శలు
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య
ఢిల్లీలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన సీఎం

న్యూఢిల్లీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ మీద గెలిచిన వారికే మంత్రి పదవులు దక్కుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడి నియామకం, మంత్రివర్గ విస్తరణ ఒకేసారి ఉంటాయని, వాటిపై చర్చలు జరుగుతున్నాయని, ఆ రెండు అంశాలకు సంబంధించి పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి అందించామని చెప్పారు. సామాజిక సమీకరణాలకు అనుగుణంగా నిర్ణయాలు ఉంటాయని, పీసీసీ చీఫ్ మహిళ కావచ్చు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కావచ్చునని వ్యాఖ్యానించారు. అన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ పదవి మహిళకు ఇస్తే బాగుంటుంది కదా!? అని ఓ విలేకరి ప్రశ్నించగా.. మీరు అడిగారని అధిష్ఠానానికి చెబుతానులే అని నవ్వుతూ బదులిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "మూడు, నాలుగు రోజుల్లో రుణమాఫీకి మార్గదర్శకాలు విడుదల చేస్తాం. రెండు లక్షలలోపు పంట

మిగతా 13వ పేజీలో...

### పాతబస్తీ విద్యుత్తు బిల్లుల వసూలు అదానీకి..

పాతబస్తీలో కరెంటు బిల్లుల వసూలు బాధ్యతను అదానీ కంపెనీకి అప్పగించాం. అక్కడ భూగర్భ లైన్లు వేసి మొత్తం వ్యవస్థను మార్చాలని కోరాం. కేంద్రం ఆస్తులను కారుచౌకగా అదానీకి అప్పగించడాన్నే రాహుల్ తప్పుపడుతున్నారు. అంతేతప్ప అదానీతో వ్యాపారం చేయొద్దని ఎప్పుడూ అనలే. అదానీ దగ్గర డబ్బులున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడి పెడుతున్నాడు. అందుకే ఆహ్వానించా. - సీఎం రేవంత్

### పీసీసీ చీఫ్‌పై కసరత్తు కొలిక్కి!

- మహేశ్‌కుమార్‌గౌడ్ లేదా బలరాంనాయక్!
- మంత్రివర్గ విస్తరణలో నలుగురికి చాన్స్?



## గ్లాస్ పరిశ్రమలో పేలుడు

- ఐదుగురు కార్మికుల దుర్మరణం.. 10 మందికి తీవ్ర గాయాలు
- రంగారెడ్డి జిల్లా బూర్గుల గ్రామశివారులో ఘోర ప్రమాదం
- పేలుడు ధాటికి ఛిద్రమై.. చెల్లాచెదురైన మృతదేహాలు
- మృతులు యూపీ, ఒడిసా, బిహార్ రాష్ట్రాలకు చెందినవారు
- సీఎం రేవంత్ ఆరా.. సహాయకచర్యలు చేపట్టాలని ఆదేశం

14

## ఢిల్లీ మునక!

2

- 24 గంటల్లో 22.81 సెంటీమీటర్ల వర్షం
- 88 ఏళ్లలో ఇదే అత్యధికం.. విద్యుత్తు బంద్
- ఎంపీల నివాసాల్లోకీ నీళ్లు
- ఎయిర్‌పోర్ట్ టెర్మినల్-1లో కూలిన పైకప్పు
- కారు డ్రైవర్ మృతి.. ఆరుగురికి గాయాలు

## ఆగస్టు 21 నుంచి యూజీసీ-నెట్ పరీక్షలు

» కొత్త షెడ్యూల్ ప్రకటించిన ఎన్‌టీఏ

న్యూఢిల్లీ, జూన్ 28 : పరీక్షల నిర్వహణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) రద్దు, వాయిదా వేసిన మూడు వేర్వేరు పరీక్షలకు సంబంధించిన కొత్త షెడ్యూల్ శుక్రవారం విడుదలైంది. డార్క్‌నెట్‌లో ప్రశ్నపత్రం లీకవ్వడంతో రద్దు అయిన యూజీసీ-నెట్ పరీక్షలను ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు4 వరకు తిరిగి నిర్వహిస్తున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. జూన్ 18న జరిగిన యూజీసీ-నెట్ పరీక్షలను ఆ మరుసటి రోజే రద్దు చేశారు. ఇక, ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా వాయిదా వేసిన సీఎస్ఐఆర్-యూజీసీనెట్ పరీక్షలను జూలై 25-27 తేదీల్లో నిర్వహిస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది. అలాగే, ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ)లో ప్రవేశాలకు సంబంధించి ఎన్‌సీఈటీ(నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్షను జూలై 10న నిర్వహిస్తామని ప్రకటించింది. జూన్ 12 జరగాల్సిన ఎన్‌సీఈటీని వాయిదా వేస్తున్నట్టు పరీక్ష ప్రారంభానికి కొన్ని గంటల ముందు ప్రకటించారు.

## ఎన్‌టీఏలో సంస్కరణలకు సలహాలివ్వండి

» విద్యార్థులు, తల్లిదండ్రులకు కేంద్రం పిలుపు.. వెబ్‌సైట్ ఏర్పాటు

న్యూఢిల్లీ, జూన్ 28: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, యూజీసీ-నెట్ రద్దు వంటి ఘటనల నేపథ్యంలో ఈ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లో సంస్కరణలకు కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్‌టీఏలో సంస్కరణలకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, పరీక్షలతో సంబంధమున్న ఇతర వర్గాలను కోరింది. పరీక్షల నిర్వహణ విధానం, భద్రత ప్రమాణాల పెంపు, ఎన్‌టీఏ సంస్థాగత కార్యకలాపాల్లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సూచనలు చేయాలని అడిగింది. మైజీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా జూలై 7లోగా తమ సిఫారసులు తెలియజేయాలని సూచించింది. ఎన్‌టీఏ నిర్వహించే పరీక్షల విధానంలో సంస్కరణల కోసం ఇస్రో మాజీ చీఫ్ ఆర్.రాధాకృష్ణన్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం జూన్ 22న ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా, నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ఝార్ఖండ్‌కు చెందిన ఇద్దరిని సీబీఐ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు.

## టీచర్లే కదా..అర్హత పరీక్షంటే భయమెందుకు?

న్యూఢిల్లీ, జూన్ 28: తమ రాష్ట్ర ప్రభుత్వం 2023లో ప్రవేశ పెట్టిన అర్హత పరీక్ష నుంచి మినహాయించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన బిహార్ పంచాయతీ ఉపాధ్యాయులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టం సరైనదేనని ప్రకటించింది. ఉపాధ్యాయుడైన ఒక పోస్టుగ్రాడ్యుయేట్ కనీసం సెలవు చీటీ కూడా రాయలేరా...? దేశంలో విద్యా వ్యవస్థ స్థాయి ఇదేనా? అని ప్రశ్నించింది. ఈ అర్హత పరీక్షను రాయలేని పక్షంలో ఉపాధ్యాయులు రాజీనామా చేయాలని వ్యాఖ్యానించింది. ఈ అంశంలో పట్నా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టానికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ బీవీ నాగరత్న డిస్మిస్ చేశారు.

## పని చేయకుంటే పదవీ విరమణే

» ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, జూన్ 28: సక్రమంగా పనిచేయకుంటే ముందుగానే పదవీ విరమణ చేయాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అన్ని బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను హెచ్చరించింది. ఈ విషయమై 2020లోనే ఉత్తర్వులు ఇచ్చినా వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని ఆక్షేపణ తెలిపింది. ఆ ఉత్తర్వులను విధిగా పాటించాలని సిబ్బంది, శిక్షణ శాఖ శుక్రవారం మరోసారి ఆదేశాలు ఇచ్చింది. సక్రమంగా విధులు నిర్వర్తించకున్నా, విశ్వసనీయత లోపించినా, సమర్థతలేకున్నా గడువుకు ముందుగానే పదవీ విరమణ చేయించాలని తెలిపింది. అలాంటి వారిని తక్షణమే గుర్తించాలని సూచించింది. ఉద్యోగుల పనితీరుపై ప్రతి నెలా 15వ తేదీన నిర్ణీత ఫారంలో నివేదికలు పంపిస్తుండాలని ఆదేశించింది.

## అగ్రకులాల వారి చేతిలో 88.4% దేశ సంపద

» ప్రపంచ అసమానతల ల్యాబ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 28: దేశ సంపదలో దాదాపు 88.4% అగ్రకులాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని, ఇది భారత్‌లో వేళ్లూనుకుపోయిన తీవ్రమైన ఆర్థిక, సామాజిక అసమానతలను ఎత్తిచూపుతోందని ప్రపంచ అసమానతల ల్యాబ్ ఇటీవల "టువార్డ్స్ టాక్స్ జస్టిస్ అండ్ వెల్త్ రీడిస్ట్రిబ్యూషన్ ఇన్ ఇండియా" పేరిట విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం దేశ సంపదలో 40%.. ఒక శాతం మంది సంపన్నుల వద్దే ఉండగా.. దేశ జనాభాలో అట్టడుగున్న ఉన్న 50 శాతం మంది మొత్తం సంపదలో 6.4% మాత్రమే కలిగి ఉన్నారు. 1980వ దశకం నుంచి భారత్‌లో ఆర్థిక అసమానతలు పెరుగుతూ వచ్చాయి. 2000 తర్వాత అది మరింత వేగం పుంజుకుంది. ముఖ్యంగా 2014-15 నుంచి 2022-23 మధ్యకాలంలో ఈ అసమానతలు విపరీతంగా పెరిగాయి.

## భారత్‌లో ప్రమాదంలో మతస్వేచ్ఛ: అమెరికా

వాషింగ్టన్, జూన్ 28: భారత్‌లో మైనారిటీల నివాసాలను కూల్చివేస్తున్నారని, వారికి ప్రార్థనామందిరాలపై దాడులు జరుగుతున్నాయని అమెరికా విమర్శించింది. మత మార్పిడికి వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్నారని, విద్వేష ప్రసంగాలు వినిపిస్తున్నాయని పేర్కొంది. అతి సన్నిహిత మిత్ర బంధం కలిగిన భారత్‌పై అమెరికా అసాధారణ రీతిలో ఘాటు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ మతస్వేచ్ఛపై వార్షిక నివేదికను విడుదల చేశారు. యూదులు, ముస్లిమ్‌లపై ప్రపంచ వ్యాప్తంగా మతదాడులు పెరిగాయని ఆయన తెలిపారు. గాజా యుద్ధం నేపథ్యంలో తీవ్ర యూదు వ్యతిరేకతను, ఇస్లామోఫోబియాను స్వయంగా అమెరికా చవిచూస్తోందని బ్లింకెన్ పేర్కొన్నారు.

## ఢిల్లీ మద్యం కేసులో వినోద్ చౌహాన్‌పై చార్జిషీటు

న్యూఢిల్లీ, జూన్ 28: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మరో నిందితుడు వినోద్ చౌహాన్‌పై శుక్రవారం ఈడీ చార్జిషీటు దాఖలు చేసింది. ఎంఎంఎల్ఏ కేసుల ప్రత్యేక కోర్టులో ఇంతవరకు దాఖలు చేసిన అభియోగపత్రాల్లో ఇది తొమ్మిదోది కావడం గమనార్హం. ఈ కేసులో చౌహాన్ 18వ నిందితునిగా ఉన్నాడు. దర్యాప్తులో భాగంగా ఆయనను మే నెలలో ఈడీ అరెస్టు చేసింది. ఈ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవితను అరెస్టు చేసిన సందర్భంగా ఈడీ సమర్పించిన అధికారిక పత్రాల్లో చౌహాన్ పేరును ప్రస్తావించింది. "కె.కవిత వద్ద పనిచేసే సిబ్బంది ఒకరు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం.. అభిషేక్ బోయినపల్లి సూచనల మేరకు దినేష్ అరోరా కార్యాలయం నుంచి ఆయన రెండు పెద్ద బ్యాగుల్లో నగదు తీసుకొచ్చాడు. ఆ బ్యాగులను వినోద్ చౌహాన్‌కు ఇచ్చాడు" అని ఈడీ ఆ పత్రాల్లో పేర్కొంది. ఆ సొమ్మునే చౌహాన్ హవాలా మార్గంలో గోవాలో ఆప్ ఎన్నికల ప్రచారం కోసం పంపించాడని ఈడీ ఆరోపించింది.

## మమతపై గవర్నర్ పరువు నష్టం దావా

కోల్‌కతా, జూన్ 28: పశ్చిమ బెంగాల్ సీఎం మమతపై ఆ రాష్ట్ర గవర్నర్ సి.వి. ఆనంద బోస్ శుక్రవారం కలకత్తా హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. రాజ్‌భవన్‌కు వెళ్లేందుకు మహిళలు భయపడుతున్నారంటూ మమత చేసిన వ్యాఖ్య అభ్యంతరకరంగా ఉందంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మరికొందరు నాయకులపైనా ఆయన దావా వేశారు. గురువారం సచివాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో మమత మాట్లాడుతూ రాజ్‌భవన్‌కు వెళ్లేందుకు భయం కలుగుతోందంటూ కొందరు మహిళలు తనతో చెప్పారని అన్నారు. దీనిపై స్పందించిన గవర్నర్..ప్రజాప్రతినిధులు దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేయకూడదని చెప్పారు.

## పంచశీలతోనే సంక్షోభాల నివారణ: జిన్‌పింగ్

బీజింగ్, జూన్ 28: ప్రపంచ సంక్షోభాల నివారణకు నెహ్రూ ప్రతిపాదించిన పంచశీల సిద్ధాంతం ఎంతగానో ఉపకరిస్తుందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దాని అవసరం ఎంతో ఉందని అభిప్రాయపడ్డారు. రెండు దేశాల సార్వభౌమత్వాన్ని పరస్పరం గుర్తిస్తూ, శాంతి కోసం పంచశీలను ప్రతిపాదించి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పంచశీలను తాజాగా తాను ప్రతిపాదించిన 'ప్రపంచ భద్రత ప్రయత్నం' (గ్లోబల్ సెక్యూరిటీ ఇనిషియేటివ్-జీఎస్ఐ)తో సరిపోల్చి చూడాలని కోరారు. రెంటింటి భావజాలం ఒకే విధంగా ఉందని చెప్పారు. ప్రస్తుతం పశ్చిమ దేశాలు, దక్షిణ (గ్లోబల్ సౌత్) దేశాల మధ్య నెలకొన్న సంఘర్షణ నివారణకు ఈ విధానం ఉపకరిస్తుందని చెప్పారు. 1954లో నెహ్రూ, అప్పటి అధ్యక్షుడు చౌ ఎన్‌లై మధ్య పంచశీల ఒప్పందం కుదిరింది.

# నీట్‌పై దద్దరిల్లిన పార్లమెంటు

## సమగ్ర చర్చకు విపక్షాల డిమాండ్.. నిరాకరించిన అధికారపక్షం

» రాజ్యసభలో కళ్లు తిరిగి పడిపోయిన కాంగ్రెస్ మహిళా ఎంపీ ఫూలోదేవి నేతమ్



లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటు ఉభయసభలు శుక్రవారం దద్దరిల్లాయి. నీట్‌పై సమగ్ర చర్చను చేపట్టాలన్న తమ డిమాండ్‌కు అధికారపక్షం అంగీకరించకపోవటంతో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై తొలుత చర్చిద్దామని, ఆ సందర్భంగా నీట్‌పైనా చర్చ జరపవచ్చన్న ప్రభుత్వ సూచనకు విపక్షాలు అంగీకరించలేదు. దీంతో ఉభయ సభల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఫలితంగా పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే.. నీట్‌తోపాటు ఇతర పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకైన ఘటనలపై చర్చను కోరుతూ కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇతర కార్యకలాపాలను రద్దు చేసి పేపర్ లీకేజీలపై చర్చను చేపడదామని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. ఇటీవల దివంగతులైన 13 మంది మాజీ ఎంపీలకు తొలుత నివాళి అర్పిద్దామన్నారు. నివాళి ముగియగానే విపక్ష ఎంపీలు మళ్లీ తమ డిమాండ్‌ను కొనసాగించారు. నీట్ చాలా ముఖ్యమైన అంశమని, దానిపై చర్చ అవసరమని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరపాలని ఇప్పటికే నిర్ణయించామని, ఆ చర్చలోనే అన్ని అంశాలనూ లేవనెత్తవచ్చని, తగిన సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ముందే మరో అంశంపై చర్చిద్దామని విపక్షం కోరటం గతంలో ఎన్నడూ జరగలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు అన్నారు. సభలో ప్రతిష్టంభన నేపథ్యంలో స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇటువంటి గందరగోళమే నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను పక్కనపెట్టి, ముందుగా నీట్‌పై చర్చిద్దామని విపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్ష నేత ఖర్గే వెల్‌లోకి రావటం తనను తీవ్రంగా బాధించిందని ధన్‌కడ్ పేర్కొన్నారు. కాగా, నిరసన సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ఫూలోదేవినేతమ్ కళ్లు తిరిగి పడిపోయారు. ఆమెను ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందించారు. ఎంపీ బీపీ తీవ్రంగా పెరిగిందని, దాదాపుగా పక్షవాతం వచ్చే స్థాయిలో ఉందని వైద్యులు తెలిపినట్టుగా ఇతర ఎంపీలు వెల్లడించారు. చికిత్స తర్వాత ఫూలోదేవి కోలుకున్నారు.

### మానవత్వానికే మచ్చ: రేణుకాచౌదరి

సభలో ఒక ఎంపీ కళ్లతిరిగి పడిపోయినప్పటికీ, ఏమాత్రం పట్టించుకోకుండా సభా కార్యకలాపాలను చైర్మన్ కొనసాగించటాన్ని విపక్ష ఎంపీలు తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్‌కే చెందిన రేణుకా చౌదరి మాట్లాడుతూ, 'ఒక మహిళా ఎంపీ కళ్లు తిరిగి పడిపోతే, ఆమెను సహచర ఎంపీలు ఆస్పత్రికి తీసుకెళ్తుంటే కూడా సభ కొనసాగుతూనే ఉంది. అంటే, ఎంపీల ప్రాణాలకు విలువే లేదా? ఇది మానవత్వానికే మచ్చ' అని దుయ్యబట్టారు. నీట్‌పై చర్చకు చైర్మన్ అంగీకరించకపోవటాన్ని నిరసిస్తూ విపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. బీజేడీ ఎంపీలు కూడా వారితో కలిసి వాకౌట్ చేయటం విశేషం. కాగా, లోక్‌సభలో నీట్‌పై చర్చను చేపట్టాలంటూ రాహుల్ గాంధీ మాట్లాడుతున్న సమయంలో ఆయన ముందున్న మైక్‌ను ఆపేశారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు ఎక్స్‌లో ఒక వీడియోను షేర్ చేసింది. దీంట్లో రాహుల్.. మైక్‌ను పునరుద్ధరించాలని స్పీకర్‌ను కోరటం కనిపించింది. కాగా, రాహుల్ విజ్ఞప్తికి స్పీకర్ స్పందిస్తూ.. తాను మైక్‌ను కట్ చేయలేదని, వాటిపై నియంత్రణ తన వద్ద ఉండదని చెప్పారు.

## 'నీట్' నుంచి మినహాయింపు ఇవ్వండి

తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసేలా ఉన్న 'నీట్' పరీక్ష నుంచి రాష్ట్రానికి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. అంతేగాక ఆ పరీక్షను రద్దు చేయాలని కూడా డిమాండ్ చేసింది. ఈ పరీక్ష నుంచి రాష్ట్రాన్ని మినహాయించాలని కోరుతూ గతంలో శాసనసభ ఆమోదించి, ప్రస్తుతం రాష్ట్రపతి పరిశీలనలో ఉన్న నీట్ వ్యతిరేక బిల్లుకు వెంటనే ఆమోదం తెలపాలని కూడా డిమాండ్ చేసింది. తద్వారా మునుపటి లాగే విద్యార్థులకు ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో వచ్చే మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశం కల్పించే పాతపద్ధతిని అమలు చేసేందుకు మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శుక్రవారం ప్రతిపాదించిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది.

## లోకం తీరు




## అజిత్ వర్గం ఎమ్మెల్యేలు తిరిగి పవార్ గూటికి?

» 22 మంది జంప్‌నకు చాన్స్



ముంబై, జూన్ 28: మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్నవేళ మరో రాజకీయ కుదుపు సంభవించే సంకేతాలు కనిపిస్తున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అజిత్ పవార్ వర్గానికి చెందిన చాలా మంది ఎమ్మెల్యేలు శరద్ పవార్ శిబిరంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇప్పటికే వారు ఎన్సీపీ (ఎస్పీ) తలుపులు తట్టారని తెలుస్తోంది. అయితే వారిలో ఎంత మందిని చేర్చుకోవాలన్న దానిపై శరద్ పవార్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం. 22 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు ఎన్సీపీ (ఎస్పీ)ని సంప్రదించారని ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ చెప్పారు. వీరంతా శరద్ పవార్ శిబిరంలో చేరాలనుకుంటున్నారని, అయితే వారి విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. కాగా శరద్ పవార్ వారందరినీ పార్టీలో చేర్చుకునే అవకాశంలేదని, 10 నుంచి 12 మందికి మాత్రమే ఆహ్వానం పలకవచ్చని తెలుస్తోంది. అజిత్ పవార్ రాజకీయ ప్రాధాన్యాన్ని తగ్గించాలని బీజేపీ భావిస్తున్నట్టు ఉందని రోహిత్ తెలిపారు. ప్రతిపక్షం ఓట్లను చీల్చే వ్యూహంలో భాగంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీని వేరేగా పోటీ చేయించాలని బీజేపీ అనుకుంటూ ఉండవచ్చన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీలో 288 సీట్లు ఉన్నాయి. అయితే ఇందులో 20 సీట్లు మాత్రమే అజిత్ పవార్‌కు బీజేపీ ఇవ్వవచ్చని ఆయన చెప్పారు. మరోవైపు అజిత్ పవార్ వర్గానికి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు ఎన్సీపీ ఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్‌ను కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీ (ఎస్పీ) సాధించిన విజయం నేపథ్యంలో ఈ పార్టీ వైపు ఎన్సీపీ ఎమ్మెల్యేలు దృష్టిసారించారు. వీరిలో చాలా మంది అసెంబ్లీ ఎన్నికలకు ముందే తిరిగి రావాలనుకుంటున్నారని మరో నేత తెలిపారు

## హేమంత్ సోరెన్‌కు బెయిల్



భర్త సోరెన్‌కు స్వాగతం పలుకుతున్న కల్పన

రాంచీ, జూన్ 28: భూ కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి జైల్లో ఉన్న ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు ఊరట లభించింది. ఈ కేసులో ఝార్ఖండ్ హైకోర్టు శుక్రవారం ఆయనకు బెయిలు మంజూరు చేసింది. భూ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఝార్ఖండ్ సీఎం, ఝార్ఖండ్ ముక్తి మోర్చా కార్యనిర్వాహక అధ్యక్షుడైన సోరెన్‌ను ఈ ఏడాది జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆయన బిర్సా ముండా జైల్లో ఉన్నారు. ఈ కేసులో బెయిల్ కోసం సోరెన్ పలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఎన్నికల వేళ ప్రచార నిమిత్తం బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరినప్పటికీ ఉపశమనం లభించలేదు. బెయిలు పిటిషన్‌పై విచారణ జరిపిన ఝార్ఖండ్ హైకోర్టు ఈ నెల 13న తీర్పును రిజర్వ్ చేసింది. శుక్రవారం బెయిలు మంజూరు చేస్తూ జస్టిస్ రొంగొన్ ముఖోపాధ్యాయ తీర్పు ఇచ్చారు. రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. "ప్రాథమిక ఆధారాల పరంగా ఆయన ఏ నేరానికీ పాల్పడలేదు. బెయిల్‌పై ఉన్నప్పుడు నేరం చేసే అవకాశాలు కూడా లేవని కోర్టు గుర్తించింది. అందుకే ఆయనకు బెయిల్ ఇస్తున్నాం" అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ తీర్పు అమలుపై 48 గంటల పాటు స్టే ఇవ్వాలని, తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న ఈడీ తరఫు న్యాయవాది అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. దీంతో, బిర్సా ముండా జైలు నుంచి హేమంత్ సోరెన్ విడుదలయ్యారు. సోరెన్‌కు బెయిలు లభించడంపై హర్షం వ్యక్తం చేసిన ఝార్ఖండ్ సీఎం చంపయి సోరెన్ 'నిజం గెలిచింది' అన్నారు.

## కంపెనీలోనూ సగం!

ఉద్యోగం మానేసి ఇంట్లో ఉండి పిల్లలను చూసుకోవాలని భార్యను అడిగిన ఓ భర్త

అతడి కంపెనీలో 50% వాటా కోరిన భార్య

ఆమె కోరిక మేరకు 49% వాటా ఇచ్చిన భర్త

న్యూయార్క్, జూన్ 28: మహిళల గురించి చెప్పాల్సి వస్తే.. 'ఆకాశంలో సగం' అని కవితాత్మకంగా చెప్తాంగానీ.. వాస్తవంగా అలాంటి పరిస్థితి కనిపించడం చాలా అరుదు! సంసారంలో ఏ కష్టం వచ్చినా భార్యే సర్దుకుపోవాలని చెప్పేవాళ్లే ఎక్కువ. కానీ, ఆ రోజులు మారుతున్నాయి. సర్దుకుపోవడానికి కూడా ఒక పద్ధతి ఉండాలని నిరూపించిందో మహిళ. తన పేరు వెల్లడించకుండా.. తనకు వచ్చిన సందేహం గురించి ప్రముఖ సామాజిక మాధ్యమం రెడిట్‌లో వెల్లడించిందామె. "మాకు పెళ్లయి ఆరేళ్లయింది. ఇద్దరు పిల్లలున్నారు. నేను మళ్లీ గర్భం దాల్చాను. దీంతో నా భర్త నన్ను ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉండి పిల్లలను చూసుకోవాలని కోరాడు. ఆ ప్రతిపాదనతో నేను కలత చెందాను. అతడి కంపెనీలో 50% వాటా నాకు ఇస్తే ఉద్యోగం మానేసి ఇంట్లో ఉండి పిల్లలను చూసుకోవడానికి సిద్ధమని చెప్పాను. ఎందుకంటే.. నేను ఉద్యోగం మానేసి ఎంత ఎక్కువ కాలం ఇంట్లో ఉంటే నాకు మళ్లీ మంచి ఉద్యోగం వచ్చే అవకాశాలు అంత తగ్గిపోతాయి. భవిష్యత్తులో ఎప్పుడైనా విడాకులు తీసుకుంటే నాకు అన్యాయం జరుగుతుంది. అందుకే 50% వాటా అడిగాను. నేను చేసింది తప్పా?" అని ఆమె రెడిట్‌లో పోస్ట్ చేసింది. ఆ పోస్ట్ ట్విటర్‌లో సైతం వైరల్ అయ్యింది. వేలాది మంది ఆమెకు మద్దతుగా నిలిచారు. ఆమె చేసింది తప్పు కాదని.. సరిగ్గా ఆలోచించిందని చెప్పారు. ఆ తర్వాత కొద్దిరోజులకు.. 'నా భార్యకు నా కంపెనీలో 49% వాటా ఇచ్చాను' అంటూ రెడిట్‌లోనే ఆమె పోస్ట్ కిందే ఆమె భర్త సమాధానం ఇవ్వడంతో.. సరైన నిర్ణయం తీసుకున్నావంటూ అందరూ అతణ్ని అభినందించారు.

# ఢిల్లీ మునక!

సిబ్బంది భుజాలపై కారు వద్దకు ఎంపీ రాంగోపాల్



» 24 గంటల్లో 22.81 సెంటీమీటర్ల వర్షం

» 88 ఏళ్ల తర్వాత ఇదే అత్యధికం

న్యూఢిల్లీ, జూన్ 28: మొన్నటిదాక నీటి కొరతతో అల్లాడిన ఢిల్లీ నేడు భారీ వర్షాలతో అతలాకుతలం అవుతోంది..! రికార్డు స్థాయి వర్షపాతంతో దేశ రాజధాని ప్రాంతం మోకాలు లోతు నీటిలో మునిగింది..! ఇళ్లలోకి.. రోడ్లపైన వరద.. ఎక్కడికక్కడ భారీగా ట్రాఫిక్ జామ్‌లు.. విద్యుత్తు సరఫరా నిలిపివేతతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది..! సఫ్దర్ జంగ్‌లో గురువారం ఉదయం 8.30 నుంచి 24 గంటల వ్యవధిలో 22.81 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 1936 తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఆ ఏడాది జూన్‌లో ఒక్క రోజులో 23.55 సెంటీమీటర్ల వర్షం పడింది. కాగా, గురువారం రాత్రి 3 గంటల్లోనే 14.85 సెంటీమీటర్ల వాన కురిసింది. జూన్ నెలలో ఢిల్లీ సగటు వర్షపాతం 8.60 సెంటీమీటర్లు మాత్రమే. తాజాగా దీనికి మూడు రెట్లు వాన ఒక్క రోజులోనే పడింది. దీంతో అశోకా రోడ్, ఫిరోజ్ షా రోడ్, కన్నాట్ ప్లేస్‌లో పలు రోడ్లు జలమయం కాగా అండర్‌పాస్‌లను మూసివేశారు. గోవింద్‌పురి, తీన్ మూర్తి మార్గ్‌లో వరద భారీగా చేరింది. నోయిడాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వాన ముంచెత్తడంతో స్థానికులు నడుము లోతు నీటిలో నడుస్తూ కనిపించారు. ఇటీవల తాగునీటి కోసం దీక్ష చేసిన ఢిల్లీ జల శాఖ మంత్రి ఆతిశీ ఇంట్లోకీ నీరు చేరింది.

పార్లమెంటు సమావేశాల కోసం ఢిల్లీ వచ్చిన ఎంపీలకు వర్షాలు భిన్న అనుభవాన్ని చూపాయి. లోధి ఎస్టేట్‌లోని ఎస్పీ ఎంపీ రాంగోపాల్ యాదవ్ ఇంటిని నీరు చుట్టుముట్టింది. పార్లమెంటుకు వెళ్లాల్సి ఉండడంతో అతికష్టమ్మీద బయటకొచ్చిన ఆయనను సిబ్బంది ఎత్తుకుని తీసుకొచ్చి కారులో కూర్చోబెట్టారు. ఇంట్లో రెండ్రోజుల క్రితమే ఫ్లోరింగ్ వేయించానని, అంతా పాడైందని రాంగోపాల్ తెలిపారు. నిద్ర లేచి చూసేసరికి గదులన్నీ నీటితో నిండిపోయాయని, ఫర్నీచర్‌తో పాటు నేలపై ఉన్న వస్తువులు తడిచిపోయాయని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వాపోయారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ మనోజ్ తివారీ ప్యాంట్ మడిచి, బూట్లు చేతిలో పట్టుకుని ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఆయన ఇంటి లాన్.. కొలనులా మారిపోయింది.

### ఎయిర్‌పోర్ట్‌లో టెర్మినల్ కూలి ఒకరి మృతి

ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-1 డిపార్చర్ ప్రాంతంలోని కప్పు కొంత భాగం కూలి కార్లపై పడింది. దీంతో ట్యాక్సీ డ్రైవర్ రమేష్‌కుమార్ (45) మృతిచెందాడు. ఆరుగురికి గాయాలయ్యాయి. పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయానికి వచ్చి పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం సమీక్ష చేపట్టారు. అన్ని విమానాశ్రయాల్లోని నిర్మాణాలను క్షుణ్నంగా తనిఖీ చేసి, 2 నుంచి 5 రోజుల్లో నివేదిక అందించాలని పౌర విమానయాన శాఖ ఆదేశించింది. కాగా, మురుగు కాల్వలు, నాలాల్లో చెత్త తరలించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ ఢిల్లీ బీజేపీ కౌన్సిలర్ రవీందర్ సింగ్ నేగి వరదలో బోటు వేసుకుని పర్యటించారు. కిషన్‌గంజ్‌లోని కొడియా బ్రిడ్జి అండర్ పాస్ వద్ద బస్సు వరదలో చిక్కుకుంది. రెస్క్యూ సిబ్బంది వచ్చి లైఫ్ జాకెట్లు అందించి, తాడుతో ప్రయాణికులను రక్షించారు. ఢిల్లీతో పాటు శుక్రవారం జబల్పూర్ విమానాశ్రయంలోనూ కప్పు కూలింది. దీంతో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనలకు అవినీతి, నేరపూరిత నిర్లక్ష్యం కారణం అని ట్వీట్ చేశారు. అయితే, కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ అధికార ప్రతినిధి అమిత్ మాలవీయ తిప్పికొట్టారు. పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కూలిన కప్పు.. 2009లో చేపట్టిన పాత నిర్మాణంలోనిదన్నారు. మార్చి10న ప్రధాని ప్రారంభించిన భవనం మరోవైపున ఉందని తెలిపారు.

# ఈ బైడెన్ మాకొద్దు!

## 'అధ్యక్ష' అభ్యర్థి మార్పునకు డెమోక్రాట్ల పట్టు

» ట్రంప్‌తో చర్చలో అధ్యక్షుడి తడబాటు

» 81 ఏళ్ల వయసులో ఆయనకు అభ్యర్థిత్వం ఎందుకని సొంత పార్టీలోనే ఆగ్రహం





వాషింగ్టన్, జూన్ 28: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షుడు జో బైడెన్ (81) అభ్యర్థిత్వం డోలాయమానంలో పడింది. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్(78)తో గురువారం రాత్రి (భారత కాలమానం ప్రకారం శుక్రవారం) జరిగిన ప్రథమ చర్చలో.. పలు ప్రశ్నలకు జవాబులివ్వలేక తడబడిపోయారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, వలసలు, ఎకానమీ తదితర అంశాలకు సంబంధించి తన డెమోక్రాటిక్ పార్టీ విధానాలు, నిర్ణయాలపై సమర్థంగా వాదన వినిపించలేకపోయారు. ట్రంప్ మాత్రం ఆత్మవిశ్వాసంతో జవాబులిచ్చారు. తన పాలసీలను విడమరచి చెప్పగలిగారు. దీంతో బైడెన్ రెండోసారి గెలవడం అనుమానంగా మారింది. దరిమిలా ఆయన్ను పోటీ నుంచి తప్పించేందుకు పాలక డెమోక్రాటిక్ పార్టీలో పెద్దఎత్తున మంతనాలు జరుగుతున్నాయి. అంతేకాదు.. ఆ పార్టీకి భారీ విరాళాలిచ్చిన దాతలు సైతం అభ్యర్థి మార్పును కోరుతుండడంతో సీనియర్ డెమోక్రాట్లకు ఏంచేయాలో పాలుపోవడం లేదు. వాస్తవానికి బైడెన్ రెండోసారి బరిలో నిలుస్తానని ప్రకటించినప్పుడే పార్టీలో వ్యతిరేకత వ్యక్తమైంది. బైడెన్‌కు జ్ఞాపక శక్తి మందగించింది. తరచూ వేదికపై తడబడుతుండడం, ఎవరో ఒకరి ఆసరా లేకుండా మాట్లాడలేకపోవడం తదితరాల నేపథ్యంలో వేరే అభ్యర్థిని ఎంచుకుందామని పలువురు సీనియర్లు అప్పట్లోనే పట్టుబట్టారు. 81 ఏళ్ల వయసులో ఆయన గౌరవప్రదంగా వైదొలగి.. సమర్థ నేతకు అవకాశమివ్వాలని వాదించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఈ ఏడాది నవంబరు 5న జరుగనుంది. పోటీచేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు పలువురు ప్రముఖులు, సీనియర్ జర్నలిస్టుల సమక్షంలో బహిరంగ చర్చలో పాల్గొనడం రివాజు. గతంలో మూడుసార్లు ఈ చర్చలు జరిగేవి. ఈసారి ట్రంప్, బైడెన్ రెండింటికే అంగీకరించారు.

### అబద్ధాల ట్రంప్..

డిబేట్‌లో ట్రంప్ కూడా గొప్పగా మాట్లాడిందేమీ లేదని.. ఎప్పటిలాగే అబద్ధాలు చెప్పారని.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. సత్యం తనవైపే ఉన్నప్పటికీ.. వయోభారం కారణంగా బైడెన్ తడబడ్డారని. తెలిపారు. గత ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, ఆ సమయంలో క్యాపిటల్ హిల్‌పై దాడిలో తన ప్రమేయం ఏమీ లేదని ట్రంప్ మొండిగా వాదించారు.

### తనకు తానుగా తప్పుకొంటేనే..

శుక్రవారం నాటి చర్చ సీఎన్ఎన్ ఆధ్వర్యంలో జరుగగా.. త్వరలో జరిగే రెండో చర్చను 'ఏబీసీ న్యూస్' నిర్వహించనుంది. శుక్రవారం చర్చలో బైడెన్ వయోభారంతో గలగలా మాట్లాడలేకపోయారు. పోడియం వద్దకు వెళ్లేప్పుడే బలహీనంగా వణుకుతూ కనిపించారు. దీంతో, చర్చ మొదలైన కొద్ది నిమిషాలకే డెమోక్రాట్లలో ఆందోళన చెలరేగింది. అయితే డెమోక్రాట్లే తమ అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తున్నా.. బైడెన్ తనంతట తాను వైదొలిగితే తప్ప ఈ సమయంలో అదంత తేలిక కాదని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే ప్రతి రాష్ట్రంలో పార్టీ అభ్యర్థిని ఎన్నుకునే ప్రతినిధుల ఎంపిక కోసం జరిగే ప్రైమరీ ఎన్నికలు పూర్తయిపోయాయి. డెమోక్రాటిక్ పార్టీ నిబంధనల ప్రకారం.. రేసు నుంచి తాను వైదొలుగుతున్నట్లు బైడెన్ స్వయంగా చెబితే తప్ప.. వీరంతా ఆయనకే మద్దతివ్వాల్సి ఉంటుంది. అయితే అధ్యక్షుడు అందుకు సుముఖంగా లేరు.

# టెక్స్‌టైల్ పార్కు.. అడ్డంకులు దాటేనా?

## ఐదు లక్షల మందికి ఉపాధే లక్ష్యంగా శ్రీకారం.. 22 కంపెనీలతో అప్పటి సర్కారు ఒప్పందాలు

- ఏడేళ్లలో వచ్చింది 3 సంస్థలే
- 'పీఎం మిత్ర'లో దక్కని గుర్తింపు
- నేడు వరంగల్‌కు సీఎం రేవంత్
- పార్కు పరిశీలన.. మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుపై సమీక్ష



వరంగల్ సమీపంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన స్థలం

హైదరాబాద్/వరంగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో 4 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ పార్కులో 200కుపైగా వస్త్ర కంపెనీలు ఏర్పాటవుతాయని చెప్పిన గత ప్రభుత్వం.. 22 కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. మూడు సంస్థలు మాత్రమే ఇక్కడ ప్లాంట్లు ఏర్పాటు చేశాయి. పలు కారణాలతో మిగతా సంస్థలేవీ అడుగు పెట్టలేదు. మరోవైపు.. పీఎం మిత్ర పథకంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును చేర్చేందుకు కేంద్రం ససేమిరా అంటుండడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం పార్కును సందర్శించనున్నారు. టెక్స్‌టైల్ పార్కును పట్టిపీడిస్తున్న మూడు ప్రధాన సమస్యలను పరిష్కరిస్తేనే ఇక్కడికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుందన్న వాదన వినిపిస్తోంది.

### పలు సమస్యలు.. కంపెనీల నిరాసక్తత

వరంగల్ జిల్లాలోని గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతలపల్లి గ్రామాల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు 2017లో అక్టోబరు 22న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాథమికంగా 1,350 ఎకరాల్లో రూ.1,150 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టింది. అప్పట్లోనే 22 కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోగా.. ఏడేళ్లలో మూడు కంపెనీలు మాత్రమే వచ్చాయి. కేరళకు చెందిన కైటెక్స్ సంస్థ రూ.1,200 కోట్లతో 187ఎకరాల్లో చిన్నపిల్లల దుస్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. రూ.588కోట్లతో సుమారు 50 ఎకరాల్లో గణేషా ఎకోపెట్, ఎకోటెక్ సంస్థ రెండు యూనిట్లను ప్రారంభించింది. యంగ్‌వన్ సంస్థ 8 ఫ్యాక్టరీల ఏర్పాటుకు ముందుకొచ్చినా పనులు ఇంకా పూర్తికాలేదు. ఇక, మిగతా 19 సంస్థలు ఇటువైపు కూడా చూడలేదు. కాగా, ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర) పథకం కింద దేశవ్యాప్తంగా ఏడు టెక్స్ పార్కులను 2023 మార్చి 18న ప్రకటించిన కేంద్రం.. అందులో ఒకటి తెలంగాణకు కేటాయించింది. అయితే, ఈ పథకం కింద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా.. అప్పటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కేంద్రం కొర్రీలు పెట్టింది. ఆ మార్గదర్శకాలను అమలు చేస్తే మొదటి దశలో రూ.300కోట్లు, రెండో దశలో రూ.200కోట్లు, మూడో దశలో రూ.500కోట్లను కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది. ఇక్కడి కంపెనీలకు భారీగా సబ్సిడీలు లభిస్తాయి. అయితే, ఇప్పటికే భూసేకరణ చేపట్టడంతోపాటు కొన్ని కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకున్న నేపథ్యంలో ఈ పార్కు పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోంది.

### ఆ మూడింటిపైనే రేవంత్ దృష్టి

వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం పరిశీలించనున్నారు. ఇటీవలే ఢిల్లీలో కేంద్ర మంత్రులతో విస్తృతంగా చర్చలు జరిపిన రేవంత్‌రెడ్డి మెగా టెక్స్‌టైల్ పార్కును పట్టాలెక్కించేందుకు అవసరమైన మూడు ప్రధానాంశాలపై దృష్టి పెట్టినట్టు సమాచారం. ఇందులో ప్రధానంగా పీఎం మిత్రలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును చేర్చే అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. రవాణా వ్యవస్థను మెరుగు పర్చేందుకు ప్రత్యేకంగా రైల్వే లైన్ ఏర్పాటుతోపాటు ఎగుమతులు, దిగుమతులకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిసింది. వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టును త్వరగా వినియోగంలోకి తీసుకువస్తే పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ఆసక్తి చూపుతాయని వెల్లడించినట్లు సమాచారం.

### గాలిమోటారు వచ్చేదెప్పుడు?

వరంగల్ శివారులోని మామునూరులో 1930లో నిజాం హయాంలోనే ఎయిర్‌పోర్టు ఏర్పాటైంది. అయితే, 1980లో విమానాశ్రయాన్ని మూసివేశారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం విమానాశ్రయ అభివృద్ధికి ఒప్పందాలు కుదుర్చుకున్నా.. అడుగు పడలేదు. 2017లో మోదీ సర్కారు తీసుకొచ్చిన ఉడాన్ పథకంలో మామునూరును ఎంపిక చేశారు. మరోవైపు శంషాబాద్ విమానాశ్రయ నిర్మాణ సమయంలో అప్పటి ప్రభుత్వంతో జీఎంఆర్ సంస్థ కుదుర్చుకున్న ఒప్పందం మేరకు.. 150 కి.మీ. దూరంలో 30 ఏళ్ల దాకా మరో ఎయిర్‌పోర్టును నిర్మించకూడదు. ఈ ఒప్పందం 2038 వరకు అమల్లో ఉండనుంది. అయితే.. ఈ షరతు నుంచి ఉపశమనం పొందేలా రేవంత్ సర్కారు ప్రయత్నాలు మొదలు పెట్టింది. అదే సమయంలో విమానాలను నడిపేందుకు అవసరమైన ఇన్‌స్ట్రుమెంటల్ ఫ్లైట్ రూల్స్(ఐఎఫ్ఆర్), విజువల్ ఫ్లైట్ రూల్స్(వీఎఫ్ఆర్) అనుమతుల కోసం రాష్ట్ర ఏవియేషన్ విభాగం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు తాజా పర్యటనలో మామునూరు విమానాశ్రయంపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

## నేడు వరంగల్‌లో రేవంత్ పర్యటన

- మెడికవర్ ఆస్పత్రి ప్రారంభోత్సవం
- పలు అభివృద్ధి పనులపై సమీక్షలు

వరంగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. శనివారం ఉదయం ఢిల్లీ నుంచి బయలుదేరి.. మధ్యాహ్నం 12.40 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్కుకు చేరుకోనున్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించి, ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి 2.45 గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుని మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభిస్తారు. 3 గంటలకు కలెక్టరేట్‌లో వరంగల్ మహానగర అభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమీక్షలో ప్రధానంగా మామునూరు ఎయిర్‌పోర్టు, వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం తదితర పనులపై చర్చిస్తారు. సాయంత్రం 5.40 గంటలకు హంటర్ రోడ్డులో నూతనంగా నిర్మితమైన మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సహా ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. కార్యక్రమాలు పూర్తయిన అనంతరం సాయంత్రం 6.10 గంటల తరువాత వాతావరణ అనుకూలతనుబట్టి రేవంత్‌రెడ్డి వరంగల్ నుంచి హెలికాప్టర్‌లోగానీ లేదంటే రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## తొలి చర్చ

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న జోబైడెన్, డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్ వెనుకంజవేశారని, ట్రంప్ పైచేయి సాధించారని విశ్లేషణలు సాగుతున్నాయి. మంచి మాటకారితనం తోపాటు, తోచింది అనేయడం, అబద్ధాన్ని అతికినట్టు చెప్పడం ఇత్యాది నైపుణ్యాలు ట్రంప్‌కు ఉన్నాయి కనుక, ఆయన దాడిమాటలు సహజంగానే వినడానికి బాగుంటాయి. తనకు దక్కిన సమయాన్ని ట్రంప్ తెలివిగా వాడుకొని బైడెన్‌మీద ఎదురుదాడిచేశారని, ఈయనేమో ఆత్మరక్షణలో పడిపోయి, తడబాటుకు గురైనారని, కొన్ని అంశాల్లో పొంతనలేకుండా మాట్లాడారని అమెరికన్ మీడియా అంటోంది. మాట్లాడుతున్న విషయాన్ని మధ్యలో వదిలేసి పూర్తిభిన్నమైన అంశాన్ని ప్రస్తావించడం వంటివి సైతం జరిగాయట. బైడెన్ జలుబుతో బాధపడుతున్నారని, గొంతులో జీరకు కారణమదేనని చర్చ మధ్యలో ఆయన పక్షాన మీడియాకు ఇచ్చిన వివరణను కూడా ఎక్కువ మంది మెచ్చలేదు. దీనికితోడు బైడెన్ ఏదో అర్థంపర్థంలేకుండా మాట్లాడుతున్నట్టుగా మధ్యమధ్యలో ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు సరేసరి. ట్రంప్ పచ్చి అబద్ధాలాడుతున్నా, అసత్య ఆరోపణలు చేసినా బైడెన్ సరిగ్గా తిప్పికొట్టలేకపోయారని ఆయన పార్టీవారు మధనపడిపోతున్నారు. అమెరికా చరిత్రలో బాగా ముందుకు జరిగిన ఈ చర్చనుంచి ఎంతో లబ్ధిపొందవచ్చునని ఆశించిన బైడెన్ బృందం ఈ తొలిదశలో తీవ్రంగ ఆశాభంగం చెందిందని వార్తలు వస్తున్నాయి. దీనిని అదునుగా చేసుకొని, ఇప్పటికైనా బైడెన్‌ను తప్పించాలనీ, ఆయనబదులు ఫలానా వారిని నిలబెడితే మంచిదనీ డెమోక్రాట్లకు చాలామంది ఉచిత సలహాలు ఇస్తున్నారు.

నూరుశాతం నిజాలతో, నిజాయితీగా ఈ అధ్యక్ష చర్చ జరగదు కానీ, అత్యున్నత స్థానానికి పోటీపడుతున్న ఇద్దరిమధ్య విభిన్నమైన అంశాలపై విస్తృత చర్చ జరగడమనే సంప్రదాయం ప్రశంసనీయమైనది. మొన్నటి మన సార్వత్రిక ఎన్నికల సందర్భంలో నరేంద్రమోదీ, రాహుల్ గాంధీ మధ్య ఇటువంటి చర్చనే కొందరు ప్రముఖులు ప్రతిపాదించారు. భావోద్వేగాలు రాజేసే వ్యాఖ్యలతో, ఊకదంపుడు ఉపన్యాసాలతో ఎన్నికల ప్రచారం జరగడం కంటే, దేశాన్ని కుదిపేస్తున్న, జనజీవితాలను ప్రభావితం చేస్తున్న కీలకమైన అంశాలపై అధినాయకుల మధ్య చర్చ జరగడం వల్ల అధికప్రయోజనం ఉంటుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈ ప్రెసిడెన్షియల్ డిబేట్ ప్రభావం కాదనలేనిది. ఈ చర్చలో బైడెన్, ట్రంప్ పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకున్నారు, వ్యక్తిగత విమర్శలకూ దిగారు. కానీ, దేశ ఆర్థికవ్యవస్థ, విదేశాంగ విధానం, వలసలు, అబార్షన్, గాజాయుద్ధం, కరోనా కష్టకాలం, సామాజిక భద్రత ఇత్యాది అంశాలమీద వారి అభిప్రాయాలను వారినోటినుంచే ప్రజలు విన్నారు.

బైడెన్, ట్రంప్ మధ్య వయసులో తేడా మూడేళ్ళు మాత్రమే. కానీ, బైడెన్ అడపాదడపా తన హావభావాలతో, చర్యలూ చేష్టలతో తన వయసును తెలియబరుస్తూంటారు. ఈ చర్చలో కూడా ఆయన ఆరంభంలో పేలవమైన ప్రదర్శనతో వెనుకబడినా, ఆ తరువాత పుంజుకున్నారు. కానీ, వయసు కారణంగా బైడెన్‌ను మెచ్చనివారి సంఖ్య ట్రంప్‌తో పోల్చితే రెట్టింపు ఉందట. ఈ దశలో తనకు తానుగా తప్పుకోవడం తప్ప, బైడెన్‌ను తప్పించడం ఆయన పార్టీకి కూడా సాంకేతికంగా సాధ్యం కాదు. ఆగస్టులో చికాగోలో జరిగే డెమోక్రాటిక్ పార్టీ కన్వెన్షన్‌లో ఒకవేళ ఆయన ఈ పనికి సిద్ధపడినా, పార్టీ డెలిగేట్లనుంచి మరొకరు ఆ స్థాయిలో మద్దతు కూడగట్టుకోవడం అంత సులభం కాదు. ఉపాధ్యక్షపదవికి పోటీపడుతున్న కమలా హారిస్ పేరు గట్టిగా వినిపిస్తున్నది కానీ, చాలా కారణాలవల్ల పార్టీ డెలిగేట్లు ఆమెను ఆ స్థానానికి ఆమోదించరు. పార్టీలో బైడెన్‌కు గట్టిపోటీ ఇవ్వగలిగేవారు లేకనే ఆయన సులభంగా ఇంతవరకూ రాగలిగారు. ఇప్పుడు కూడా పార్టీ లోలోపల భయపడుతున్నదే తప్ప, బైడెన్ తప్పుకోవాలన్న మాట బయటకైతే లేదు. ఈ తొలిదశ చర్చలో ఒకవేళ భంగపడినా, ఎన్నికలకు సరిగ్గా రెండునెలలముందు సెప్టెంబరులో జరిగే మలిదశ చర్చలో బైడెన్ పైచేయి సాధించి అమెరికన్ల మనసులో నిలిచిపోవచ్చునన్న ఆలోచనతోనే అధికారపక్షం ఈ చర్చను ముందుకు జరిపిందని అంటారు. సెప్టెంబర్ చర్చలో బైడెన్ దే పైచేయి కావచ్చును కానీ, ఇంతలోగా ఆయనను మరింత అప్రదిష్టపాల్జేసే ప్రయత్నాలైతే విపక్షం నుంచి తప్పవు. ట్రంప్, బైడెన్‌లో ఎవరు గెలిచినా అమెరికా చరిత్రలో అత్యంత వృద్ధ అధ్యక్షుడిని ఎన్నుకున్న కీర్తి ఈ మారు అమెరికన్లకు దక్కడం ఖాయం.

## మార్పు మిథ్య, మోదీయే సత్యం!

నరేంద్ర మోదీ మూడో ప్రభుత్వం ఈ నెల 9న పదవీ ప్రమాణ స్వీకారం చేసింది. అయితే దాని ఆరంభం అంత ఆనందకరంగా లేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మద్దతు నిచ్చిన టీడీపీ, జేడీ(యు) నాయకులతో కలిసి వేదికపై మోదీ ఆసీనులయ్యారు. ఆ పార్టీలకు, ఇతర మిత్ర పక్షాలకు వివిధ మంత్రిత్వ శాఖలు కేటాయించారు స్పీకర్ ఎన్నికకు సంబంధించి కూడా మిత్రపక్షాలతో ఆయన సంప్రదింపులు జరపవలసివచ్చింది. ఇరవై రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వాధినేతగా కొనసాగుతున్న మోదీకి ఆ రెండూ కొత్త అనుభవాలు.

మోదీ కొత్త ప్రభుత్వం కొలువుదీరిన ఇరవై రోజులలోనే దానికి అనేక పరాజయాలు సంభవించాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో అవకతవకలు బహిర్గతమయ్యాయి. ఆ అక్రమాలకు బాధితులు అయిన లక్షలాది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి తీవ్ర నిరసనలు తెలిపారు. జల్పాయిగురిలో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. జమ్మూ–కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులు కొనసాగుతున్నాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

టొమాటో, పొటాటో, ఉల్లిపాయల ధరలు మరింతగా పెరిగాయి. నిజానికి ఏటేటా వాటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ మున్నెన్నడూ లేని రికార్డు స్థాయికి పెరిగాయి అయితే డాలర్–రూపాయి మారకం ధర ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. టోల్ ట్యాక్స్‌ను 15శాతం పెంచారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్ అధికార దురహంకారాన్ని ప్రదర్శించిన వారిని మందలించారు. మోదీ సర్కారుకు ఇది స్పష్టమైన అభిశంసనే. సంఘ్ అధినేత అధిక్షేపణతో బీజేపీ నాయకత్వం తత్తరపడింది. అనవసర చిక్కులు తెచ్చుకోకుండా జాగ్రత్తగా ఉండడం మంచిదని నిర్ణయించుకున్నది.

18వ లోక్‌సభ మొదటి సమావేశాలలో స్పీకర్ ఎన్నిక, రాష్ట్రపతి ప్రసంగం మినహా చెప్పుకోదగిన కార్యకలాపాలు ఏవీ జరగలేదు. అయినా దైనందిన కార్యకలాపాలు సైతం వివాదాస్పదమయ్యాయి. సంప్రదాయం ప్రకారం అత్యధిక పర్యాయాలు ఎన్నికైన వ్యక్తి కొత్త లోక్‌సభకు ప్రోటెమ్ స్పీకర్‌గా వ్యవహరిస్తారు. కొత్త సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సువ్యవస్థిత సంప్రదాయం ప్రకారం ఈ గౌరవం నిస్సందేహంగా కె. సురేష్‌కు లభించాలి. కేరళకు చెందిన ఈ కాంగ్రెస్ ఎంపీ ఒక్కసారి మినహా ఎనిమిది పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికయ్యారు. అయితే ప్రభుత్వం ఒడిశాకు చెందిన బీజేపీ ఎంపీ భర్తృహరి మెహతాబ్‌ను ప్రోటెమ్ స్పీకగా నామినేట్ చేసింది. ఆయన ఇప్పటికి 7 సార్లు (ఆరుసార్లు బిజూ జనతాదళ్ తరఫున, ఇటీవలి ఎన్నికలల్లో బీజేపీ పక్షాన) లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ప్రోటెమ్ స్పీకర్ ఎంపిక వివాదరహితంగా జరిగి ఉండవల్సింది. అయినా అది అనవసరంగా వివాదాస్పదమయింది. కారణమేమిటి? సంభావ్య సమాధానాలు: లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ప్రభుత్వాధినేత వ్యవహారశైలిలో ఎటువంటి మార్పుకు దారితీయబోవని స్పష్టం చేయాలని అధికార పక్షం ఆశించడమే కావచ్చు. గతంలో మాదిరిగానే ఇప్పుడూ వ్యవహరిస్తాను అన్నది మోదీ అంతరంగం. అది ప్రోటెమ్ స్పీకర్ ఎంపికలో ప్రతిబింబించింది.




**ఎన్నికల ఫలితాలతో ఏమీ మారలేదన్నది భారతీయ జనతా పార్టీ సునిశ్చితాభిప్రాయంగా కనిపిస్తోంది. చివరకు ప్రజల మనస్థితిలో కూడా ఎటువంటి మార్పు లేదని అధికార పక్షం గట్టిగా భావిస్తోంది. కొత్త కేబినెట్, రాష్ట్రపతి ప్రసంగం ప్రజలకు తీవ్ర ఆశాభంగం కలిగించాయి. మరి బడ్జెట్ 2024–25 విషయంలోనైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం మేలుకొంటుందా?**

స్పీకర్ ఎన్నిక ఎలా ముగిసినప్పటికీ మిగతా సభా కార్యకలాపాలపై దాని ప్రభావం ఉండనవపసరం లేదు. అయితే గౌరవనీయ సభాపతి 49 సంవత్సరాల క్రితం (అవును 49 సంవత్సరాల, 50 ఏళ్లు కాదు) క్రితం అత్యయిక స్థితిని విధించినందుకు కాంగ్రెస్‌ను తీవ్రంగా తప్పుపడుతూ ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. సరే, ఇక ముందు పార్లమెంటు 'బోధించే' చరిత్ర పాఠాలు ఏమై ఉంటాయో ఊహించగలరా? బహుశా అవి : పాకిస్తాన్ 1947లో కశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించుకోవడాన్ని ఖండించడం; 1962లో సరిహద్దు యుద్ధానికి చైనాను గర్హించడం; 1971లో ఇండియాను బెదిరించేందుకు అమెరికా విమాన వాహక యుద్ధ నౌకను పంపించడాన్ని ఖండించడం మొదలైనవి. చెప్పవచ్చిందేమిటంటే ఎమర్జెన్సీ విషయమై కాంగ్రెస్‌ను విమర్శిస్తూ స్పీకర్ స్వయంగా ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టడం సమర్థించజాలని కవ్వింపు. విపక్షాలను రెచ్చగొట్టేందుకే అలా చేశారనేది స్పష్టం.

పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగం సభా సభ్యతలను పునరుద్ధరించేందుకు ఒక అవకాశం. అయితే ఈ అవకాశం వ్యర్థమయింది. లోక్‌సభలో మారిన పరిస్థితులను రాష్ట్రపతి ప్రసంగం గుర్తించి ఉండవలసింది. పాలక పక్షానికి మెజారిటీ కంటే 32 సీట్లు తక్కువగా లభించడం, ప్రధానమంత్రి ఒక సంకీర్ణ ప్రభుత్వ Primus inter Pares (సమానులలో ప్రథముడు) కావడం, పదేళ్ల అనంతరం లోక్‌సభలో ఒక అధికారిక ప్రతిపక్ష నాయకుడు ఉండడం మొదలైనవి స్పష్టమైన మార్పులు. అయితే రాష్ట్రపతి ప్రసంగం ఈ మార్పులు వేటినీ ఏ మాత్రం ప్రస్తావించకపోవడం ఎంతైనా ఆశాభంగం కలిగించింది.

సార్వత్రిక ఎన్నికలకు ముందు, ఎన్నికల ప్రచారంలోను బీజేపీ చేసిన వాదనలనే రాష్ట్రపతి ప్రసంగం ప్రస్తావించింది. ఆ వాదనలనే ఓటర్లు పూర్తిగా తిరస్కరించారు. కొత్త ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం కానే కాదు, అది ఒక సంకీర్ణ ప్రభుత్వం. ఈ వాస్తవాన్ని అంగీకరించేందుకు బీజేపీ నిరాకరిస్తోంది. ఈ వైఖరే రాష్ట్రపతి ప్రసంగంలో వ్యక్తమయింది. 'సంకీర్ణం' అనే పదం రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావనకు రానే లేదు. 'ఏకాభిప్రాయం', 'ద్రవ్యోల్బణం', 'పార్లమెంటరీ కమిటీ' మొదలైన పదాలు కూడా ఆ ప్రసంగంలో ప్రస్తావింపబడలేదు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, వెనుకబడిన వర్గాలు అనే పదాల ప్రస్తావనలు ఉన్నాయి. అయితే మరి కొన్ని ఇతర ముఖ్య పదాలు ముఖ్యంగా 'మైనారిటీ వర్గాలు'ను 'సామాజిక, మత బృందాలు' అనే విశాల పదంలో కలిపివేశారు. మణిపూర్ విషాదం గురించి ఒక్క మాట కూడా లేదు 'అగ్నివీర్, 'ఉమ్మడి పౌర స్మృతి' గురించి కూడా ప్రస్తావనలు లేవు. ఇండియా ఇంకెంత మాత్రం ఒక విశ్వగురు కాదు, ఇక విశ్వబంధు' హోదాతో సంతృప్తిపడవలసిందే సుమా!

ఎన్నికల ఫలితాలతో ఏమీ మారలేదన్నది భారతీయ జనతా పార్టీ సునిశ్చితాభిప్రాయంగా కనిపిస్తోంది. చివరకు ప్రజల మనస్థితిలో కూడా ఎటువంటి మార్పు లేదని అధికారపక్షం గట్టిగా భావిస్తోంది. కనుకనే మోదీ 3.0లో కూడా అదే కేబినెట్, ఆ మంత్రులే. పాత కేబినెట్‌లోని కీలక మంత్రులు ఇప్పుడూ అవే శాఖలను నిర్వహిస్తున్నారు. పాత స్పీకరే కొత్త స్పీకర్. ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి కూడా పాతకాపే. జాతీయ భద్రతా సలహాదారు ఇంటెలిజెన్స్ బ్యూరో ఛీఫ్ కూడా పాతవారే అటార్నీ జనరల్ మొదలైన కీలక ప్రభుత్వాధికారులు కూడా పాతవారే. అంతేనా? బీజేపీ తరఫున సామాజిక మాధ్యమాలలో పనిచేస్తున్నవారు కూడా పాతవారేనని తెలుస్తోంది. ఈ ఉద్యోగులు పాక్షిక అక్షరాస్యులు, అశ్లీల సాహిత్యంలో ప్రావీణ్యులు. ఏమీ మారలేదనడానికి ఇదే నిశ్చిత రుజువు.

వచ్చే నెలలో కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. దేశ ప్రజలను అమిత ఆందోళనకు గురిచేస్తున్న సమస్యలు నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం. సిఎస్‌డిఎస్ పోస్ట్ పోల్ సర్వే ప్రకారం ధరల పెరుగుదల/ ద్రవ్యోల్బణంను తగ్గించడంలోను, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగితను అదుపు చేయడంలోను బీజేపీ ప్రభుత్వ పనితీరు సంతృప్తికరంగా లేదని భావిస్తున్నవారు వరుసగా 29 శాతం, 27 శాతం మంది ఉన్నారు. కొత్త కేబినెట్, రాష్ట్రపతి ప్రసంగం ప్రజలకు తీవ్ర ఆశాభంగం కలిగించాయి. మరి బడ్జెట్ 2024–25 విషయంలోనైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం మేలుకొంటుందా?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

## కుల నిర్మూలనకు లోహియా మార్గం




**రాజకీయాలు, పాలనా వ్యవహారాల నిర్వహణలో ద్విజుల ఆధిపత్యం 1950లలో వలే నేడు సంపూర్ణంగా లేకపోవచ్చు కానీ సాంస్కృతిక, ఆర్థిక రంగాలలో ఆ సవర్ణులు, దేశ జనాభాలో తమ నిష్పత్తికి మించి ఎన్నో రెట్లు ఎక్కువగా ప్రభావాన్ని నెరపుతున్నారు. ఆ కారణంగా, కులంపై నాటి లోహియా ఆలోచనలు, భావాలు అసాధారణంగా మన కాలంలోనూ ప్రతిధ్వనిస్తున్నాయి.**

భారత్‌లో బ్రిటిష్ పాలన తుది దశాబ్దాలలో వలస వాద వ్యతిరేక రాజకీయాలలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు ప్రభావదాయకంగా ఉన్నారు. స్వతంత్ర భారతదేశ తొలి దశకాలలో పాలకపక్షమైన భారత జాతీయ కాంగ్రెస్‌కు ఆ రెండు రాజకీయ బృందాలే ముఖ్య సవాల్ దారులుగా ఉన్నాయి. తొలి తరాల సోషలిస్టులు, కమ్యూనిస్టులు ధైర్య సాహసాలు, ఉత్కృష్ట ఆదర్శవాదానికి ప్రతీకలుగా వెలుగొందారు. ప్రజా జీవితాన్ని పునీతం చేసే సుజనులకు ఉండే సద్గుణాలన్నీ వారిలో సమృద్ధంగా ఉండేవి. అయితే భారతీయ సమాజంలో అమానుష వివక్షకు ప్రాతిపదికగా ఉన్న కుల వ్యవస్థపై అవగాహనా లేమి సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఇరువురికీ బాగా ఉండేది. ఇందుకు ఒకే ఒక్కరు మాత్రమే మినహాయింపు. ఆ విశిష్టుడే సోషలిస్ట్ చింతకుడు, రాజనీతిజ్ఞుడు డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా (1910–67).

కుల వ్యవస్థ తీరుతెన్నులు, ఆ సామాజిక దురాచారాన్ని నిర్మూలించాల్సిన ఆవశ్యకతపై లోహియా వ్యాసాలు, ప్రసంగాలు, లేఖలు అన్నీ 'ది క్యాస్ట్ సిస్టమ్' పేరిట గ్రంథ రూపం పొందాయి. 'ఆర్థిక సమానత్వం కోసం పోరాడితే చాలునని, ఆర్థిక సమత్వం పర్యవసానంగా కులం మొదలైన సామాజిక దౌష్ట్యాలు వాటికవే అంతరించి పోతాయని సోషలిస్టులు చిత్తశుద్ధితో విశ్వసిస్తున్నారని లోహియా పేర్కొన్నారు. అయితే 'ఆర్థిక అసమానత, కుల అసమానత అనేవి జంట దౌష్ట్యాలని, ఆ రెండిటినీ సంపూర్ణంగా నిర్మూలించాలన్న అవగాహన, జాగరూకత సోషలిస్టుల్లో పూర్తిగా కొరవడ్డాయని' లోహియా నిర్దుష్టంగా అభిప్రాయపడ్డారు.

'భారతీయుల జీవితాలలో కులంకు ఎనలేని ప్రాధాన్యమున్నది. కులాన్ని సూత్రప్రాయంగా వ్యతిరేకించేవారు సైతం తమ జీవితాలలో దానిని ఆచరిస్తున్నారని' లోహియా గర్హించారు. జీవితంలోని అనివార్య వాస్తవాలు అయిన జనన మరణాలు, వివాహం. పండుగలు, వ్రతాలు, ఇతర ఆచారాలు అన్నీ కుల చట్రం పరిధిలో మాత్రమే జరుగుతాయని లోహియా విశ్లేషించారు. ఒకే కులానికి చెందిన వ్యక్తులు ఈ నిర్దయాత్మక ఆచారాలను అనుష్ఠించడంలో పరస్పరం సహకరించుకుంటారని' ఆయన వ్యాఖ్యానించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు :'కుల వ్యవస్థ మార్పును వ్యతిరేకిస్తుంది. ప్రతి ఒక్కరి జీవన వ్యవహారాలను తీర్చిదిద్దుతుంది. మార్పును వ్యతిరేకించే కుల వ్యవస్థే వర్తమాన భారతీయ సమాజంలోని సమస్త నీచత్వం, అమానుష అనాదరణ, అసత్యాలకు ఒక ప్రధాన ఆలంబనగా ఉన్నదని కూడ ఆయన వ్యాఖ్యానించారు. వివక్షే కులవ్యవస్థ మౌలిక లక్షణం. ఆర్థిక, రాజకీయ రంగాలలో అగ్రకులాల ఆధిపత్యానికి, వ్యవహారాలలో వాటి ప్రాబల్యానికి కులం ప్రధాన ఆధారంగా ఉన్నది. కింది కులాల వారిలో న్యూనతా భావాన్ని నెలకొల్పడం ద్వారా అగ్రవర్ణాలవారు తమ పెత్తనాన్ని కొనసాగించుకుంటున్నారని లోహియా విపులీకరించారు.

దళితులకు వ్యతిరేకంగా పాటిస్తున్న అమానుష వివక్షను లోహియా విస్మరించలేదు (ఆ నాటి భాషలో వారిని 'హరిజనులు'గా లోహియా పేర్కొన్నారు) ముఖ్యంగా సవర్ణులు లేదా ద్విజులు, శూద్రకులాల మధ్య వ్యత్యాసాలపై ఆయన ప్రధానంగా దృష్టి పెట్టారు. రాజకీయ, పరిపాలనా రంగాలలోను, వృత్తులు, వ్యాపారాలు, మేధో కార్యకలాపాలలో అగ్రకులస్తులే అగ్రగాములుగా ఉండడం, అధికార పదవులలో శూద్రకులాల వారికి పెద్దగా ప్రాతినిధ్యం లేకపోవడం గురించి ఆయన విపులంగా విశ్లేషించారు. 1958లో రాసిన ఒక వ్యాసంలో 'దేశ జనాభాలో సవర్ణులు ఐదో వంతు మంది మాత్రమే అయినప్పటికీ జాతి జీవనంలోని నాలుగు ప్రధాన రంగాలు– వ్యాపారం, సాయుధ బలగాలు, సివిల్ సర్వీసులు, రాజకీయ పార్టీలలో అగ్రకులస్తులు ఐదింట నాలుగు వంతులుగా ఉన్నారని' పేర్కొన్నారు. దేశం సర్వతోముఖంగా పురోగమించేందుకు ఈ సామాజిక అసమతౌల్యతలను సరిదిద్ది తీరాలని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో అట్టడుగు స్థానంలో ఉన్న హరిజనులు, మహిళలు, శూద్రులు ముస్లింలు, ఆదివాసీలు నాయకత్వ స్థానాలకు ఎదిగేందుకు దోహదం చేసే పోరాటాలకు సోషలిస్టులు నాయకత్వం వహించాలని లోహియా సూచించారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

భిన్న కులాల మధ్య, వర్ణాల వారి మధ్య అంతర్ వివాహాలను ప్రోత్సహించాలని లోహియా విజ్ఞప్తి చేశారు. 'కుల నిర్మూలన సంఘం' నొకదాన్ని ఏర్పాటు చేయాలని లోహియా 1960లో కోరారు. ఆ సంఘానికి ఎనిమిది నిర్దిష్ట లక్ష్యాలతో కూడిన ఒక ప్రణాళికను కూడా ఆయన ప్రతిపాదించారు. వాటిలో రెండిటిని ప్రస్తావిస్తాను. మొదటిది కుల దురాచారాల నుంచి మతాన్ని ప్రక్షాళన చేయడం. ఇందుకు కులాంతర, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాలి. ఈ అంతర్ వివాహాల ద్వారా అంతిమంగా కుల వ్యవస్థ మనుగడ కోల్పోతుందని వైజ్ఞానిక అధ్యయనాలు, సృజనాత్మక కళల ద్వారా ప్రచారం చేయాలి. రెండు– ప్రభుత్వ వ్యవస్థలు, రాజకీయ పార్టీలు, వ్యాపారాలు, సాయుధ బలగాలలో నాయకత్వ స్థానాలలో 60 శాతాన్ని వెనుకబడిన కులాల వారికి, అలాగే అణగారిన వర్గాలుగా ఉన్న మహిళలు, శూద్రులు, హరిజనులు, ఆదివాసీలకు, మతపరమైన మైనారిటీలలో కింది కులాల వారికి దక్కేలా చేయాలి. అయితే అత్యధిక సంఖ్యలో ఉన్న కింది కులాల వారి హక్కులను జనాభాపరంగా సంఖ్యాబలం ఉన్న ఏవో ఒకటి రెండు కింది కులాలవారే స్వాయత్తం చేసుకోవడానికి వీలు లేకుండా జాగ్రత్తవహించాల్సిన అవసరమున్నది.

1955–56లో డాక్టర్ లోహియా, డాక్టర్ అంబేడ్కర్ మధ్య, లోహియా, ఆయన సోషలిస్టు సహచరుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల అధ్యాయం ఈ పుస్తకంలో చాలా ఆసక్తికరమైనది. 1957 సార్వత్రిక ఎన్నికలలో లోహియా, అంబేడ్కర్‌ల నాయకత్వాలలోని పార్టీలు కలిసి పోటీ చేసేందుకు గాను లోహియా, అంబేడ్కర్‌లను వారి అనుయాయులను సన్నిహితం చేసే ప్రయత్నాలు జరిగాయి. ఆ సందర్భంగా ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. అంబేడ్కర్‌కు లోహియా రాసిన లేఖతో ఇవి ప్రారంభమవుతాయి. 'మీరు కేవలం షెడ్యూల్డు కులాల వారికే కాకుండా, సమస్త భారత ప్రజలకూ నాయకుడుగా కావాలని నేను కోరుకుంటున్నానని' లోహియా తన లేఖలో పేర్కొన్నారు. అంబేడ్కర్ ఈ లేఖకు ప్రతిస్పందిస్తూ 1956 అక్టోబర్ 2న తనతో సమావేశమయ్యేందుకు న్యూఢిల్లీకి రావాలని లోహియాను ఆహ్వానించారు. అయితే లోహియా సంచార జీవితం, అంబేడ్కర్ అనారోగ్యం కారణంగా ఆ ఇరువురి మధ్య వ్యక్తిగత సమావేశం జరగనేలేదు. డిసెంబర్ 6, 1956న అంబేడ్కర్ చనిపోయారు. సోషలిస్టు పార్టీ సహచరుడు మధు లిమాయెకు రాసిన లేఖలో లోహియా ఇలా పేర్కొన్నారు: 'గాంధీజీతో పాటు అంబేడ్కర్‌ను భారత రాజకీయాలలో చాలా గొప్ప వ్యక్తిగా నేను భావిస్తున్నాను. డాక్టర్ అంబేడ్కర్ చిత్తశుద్ధి ఉన్న వ్యక్తి. ధైర్య సాహసాలు, స్వతంత్ర ఆలోచనాశక్తి ఉన్న ధీమంతుడు. విశాల ప్రపంచానికి ఆయనను సమున్నత భారత్‌కు ప్రతీకగా చూపవచ్చు. అయితే ఆయన కటువైన వ్యక్తి. ఇతరులతో ప్రమేయం లేకుండా వ్యవహరించే స్వతంత్రుడు. హరిజనేతరులకు నాయకుడు కావడానికి ఆయన తిరస్కరించారు. అంబేడ్కర్ స్వతంత్ర ఆలోచనా రీతిని అలవరచుకోవడం, హరిజనులకు మాత్రమే కాకుండా సమస్త భారతీయులకు నాయకత్వం వహించగల అంబేడ్కర్ గొప్పతనం నుంచి స్ఫూర్తి పొందడమే ఆయనకు సమర్పించగల నిజమైన నివాళి అవుతుందని లోహియా పేర్కొన్నారు.

కుల వ్యవస్థ గురించిన లోహియా నిశిత అవగాహన ఆయనను సమకాలీన సోషలిస్టులలో ఒక ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టింది. అలాగే ఆయన స్త్రీ వాద దృక్పథం కూడ ఆ విశిష్టతకు మరింత వన్నెనిస్తోంది. భారతీయుల వెనుకబాటుతనానికి, కష్టాలకు కుల, జెండర్ వివక్షలే కారణమని, ఈ రెండూ పరస్పర సంబంధమున్నవని ఆయన అన్నారు. ఒక స్త్రీ పాత్ర వంటగదికే పరిమితం కావాలన్న అభిప్రాయం ఒకటి విస్తృతంగా ఉన్నది. పురుషుల స్థానం శిశు సంరక్షణకు పరిమితం కావాలని సోసలిస్టులు ప్రతివాదన చేయాలని ఆయన సూచించారు. బిడ్డల పెంపకంలో భర్తలు, తండ్రులు స్త్రీలతో సమానంగా పాల్గొనాలని ఆరు దశాబ్దాల క్రితమే లోహియా ప్రతిపాదించడం ఆయన మానవతాపూర్వక దూరదృష్టికి నిదర్శనం.

1953లో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ బెనారస్‌లో బ్రాహ్మణులకు పాదపూజ చేశారు. వారి కాళ్లను ఆయన స్వయంగా కడిగారు. దీనిపై లోహియా ప్రతిస్పందిస్తూ రాష్ట్రపతి భావ బానిసత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆ చర్యద్వారా రాష్ట్రపతిపట్ల నేనూ, నా లాంటి లక్షలాది భారతీయులు చూపే గౌరవ ప్రపత్తులను రాజేంద్రప్రసాద్ కోల్పోయారు. భారత సార్వభౌమాధినేత అయిన రాష్ట్రపతి స్వయంగా బ్రాహ్మణుల కాళ్లు కడిగిన మన సమాజంలో పూజారి, చర్మకారుడి మధ్య, ఉపాధ్యాయుడు, రజకుడి మధ్య సమస్థాయిలో స్వేచ్ఛా సంభాషణ సాధ్యమయ్యే అవకాశం లేదని లోహియా అభిప్రాయపడ్డారు. కుల మతాలకు అతీతంగా సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆయన కోరుకున్నారు. ఈ విషయంలో లోహియా భావాలు అంబేడ్కర్ ఆమోదాన్ని తప్పక పొందే వనడంలో సందేహం లేదు. కుల వ్యవస్థ తీరుతెన్నులు, హిందూ మతానికి కళంకంగా ఉన్న ఆ సామాజిక దురాచార నిర్మూలన గురించి ఈ కాలమ్‌లో ఉటంకించిన డాక్టర్ రామ్ మనోహర్ లోహియా వ్యాసాలు, లేఖలు, ప్రసంగాలు అన్నీ 1953–61 సంవత్సరాల మధ్య రాసినవి. రాజకీయాలు, పాలనా వ్యవహారాల నిర్వహణలో ద్విజుల ఆధిపత్యం 1950లలో వలే నేడు సంపూర్ణంగా లేకపోవచ్చు కానీ సాంస్కృతిక, ఆర్థిక రంగాలలో ఆ సవర్ణులు, దేశ జనాభాలో తమ నిష్పత్తికి మించి ఎన్నో రెట్లు ఎక్కువగా ప్రభావాన్ని నెరపుతున్నారు. ఆ కారణంగా, కులంపై నాటి లోహియా ఆలోచనలు, భావాలు అసాధారణంగా మన కాలంలోనూ ప్రతిధ్వనిస్తున్నాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

## కొత్త నేర చట్టాలతో న్యాయసంక్షోభం

**ప్రభుత్వ అధికారాల మీద ఇప్పటికే న్యాయ వ్యవస్థ విధించిన పరిమితులను అధిగమించి అధికారాలను చేజిక్కించుకొనే ప్రయత్నం కొత్త నేరచట్టాలలో కనిపిస్తుంది. దేశద్రోహం అనే నేరం వలసవాదానికి గుర్తు అని ప్రకటించి దాని అమలును సుప్రీంకోర్టు నిలిపివేసినా నేర న్యాయ సంహితలో సెక్షన్ 150 ద్వారా మరింత ప్రమాదకర రూపంలో అది పునఃప్రత్యక్షమైంది. ఈసారి దేశ ఐక్యత, సమగ్రత అనే అమూర్త రూపం తీసుకుంది. ఇది సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయాన్ని నిరాకరించడమే. ఈ పేరు మీద ఏమి జరుగుతుందో ఊహించుకోవడం కష్టం కాదు.**




నేరాలను నిరోధించడానికి ఉద్దేశించిన మూడు నేర న్యాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం జూలై ఒకటి నుంచి అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. వాటి అమలు వాయిదా వేయాలని న్యాయకోవిదులు పలు కారణాల వల్ల కోరుతున్నారు. తగినంత చర్చ లేకుండా, వాటి అమలు వల్ల సామాన్యులకు జరిగే తీవ్ర పరిణామాలు, ప్రజలలో ఇప్పటికే విశ్వాసాన్ని కోల్పోతున్న నేర న్యాయ వ్యవస్థ మీద పడే ఒత్తిడి, వాటి మీద అంచనాలు లేకుండా వాటిని అమలు చేయడం తీవ్రమైన సామాజిక పరిణామాలకు దారి తీస్తుంది.

ఈ కొత్త చట్టాలను న్యాయ శాఖ రూపొందించలేదు. వీటిని హోం శాఖ రూపొందించింది. పాలకపక్ష శాసనకర్తలు తలలూపారు. ప్రతిపక్షం మొత్తాన్ని సస్పెండ్ చేసి వాటిని ఆమోదించారు. పోనీ నేర న్యాయ వ్యవస్థలో ముఖ్య భాగమైన న్యాయవాదుల సంఘాలతో చర్చించారా, అదీ లేదు. ప్రజాస్వామ్య పాలనలో ఇలాంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు చర్చలు, సంభాషణ అనివార్యం అన్న విశ్వాసం పాలకపక్షానికి మొదట ఉంటే, ఆ తర్వాత ఎవరితో ఎంత చర్చించాలి అనే ప్రశ్న తలెత్తుతుంది. నోట్లరద్దు నిర్ణయానికి ముందు ఎంత చర్చ జరిగిందో, ఆ తర్వాత ఏం జరిగిందో మనం చూసాం.

జూలై 1 తర్వాత జరిగే నేరాలను నేర న్యాయ సంహిత కింద నమోదు చేసినా, భారతీయ న్యాయ సురక్షా సంహిత (కొత్త క్రిమినల్ ప్రొసీజర్ కోడ్)ను మాత్రం పాత నేరాల విచారణకు కూడా వాడవచ్చు. ఏ అంశాలు నేరాలుగా పరిగణిస్తామో, వాటిని ఏ పద్ధతిలో విచారిస్తామో కూడా అంతే ముఖ్యం. నేర విచారణా పద్ధతి శిక్షగా రూపాంతరం చెందిన సమాజంలో ఇది మరింత ప్రధానమైన అంశం. ప్రస్తుతం విచారణలో ఉన్న చాలా నేరాలు వచ్చే ఐదేళ్ల నుంచి ఇరవై ఏళ్ల వరకు కొనసాగవచ్చు. కొత్త లేక పాత విచారణా పద్ధతి ప్రకారం పోలీసులు విచారణ చేశారనే వివాదాలు కోర్టు కేసులు కక్షిదారుల సహనాన్ని, నిందితుల స్వేచ్ఛను అన్యాయంగా పరీక్షించవచ్చు. కేసులు ఒక కొలిక్కి వచ్చే కాలం ఇప్పటికంటే మరింత పెరుగుతుంది.

ప్రభుత్వం కొత్తగా తెచ్చిన చట్టాలు వలస పోకడలను అధిగమించాయనే ప్రభుత్వ వాదన రూపంలో, సారంలో చాలావరకు నిజం కాదు. ఈ చట్టాలు ప్రస్తుతం ఉన్న చట్టాలకు 95 శాతం నకలు. నేర శిక్షా సంహిత కొత్తగా 20 రకాల నేరాలను సృష్టించింది. వాటి సృష్టి అవసరమా కాదా అనే చర్చ జరగలేదు. 33 నేరాలకు జైలు శిక్షలను పెంచింది. 23 నేరాలకు కనిష్ఠ శిక్షను ఖరారు చేసింది. అంటే న్యాయ వ్యవస్థకు ఈ శిక్షల విషయంలో ఉండే విచక్షణాధికారాన్ని నేర శిక్షా సంహిత తొలగించింది. నేరాలకు సామాజిక ఆర్థిక మూలాలు ఉంటాయనే గుర్తింపు వల్ల న్యాయస్థానాలకు ఈ అధికారాలు ఇవ్వబడ్డాయి. ఈ చట్టం కొన్ని చిన్న నేరాలకు సమాజ సేవ లాంటి శిక్షలను ప్రతిపాదించినంత మాత్రాన, దానికి కఠిన స్వభావం మరుగున పడిపోదు. ఇదంతా పాలనలో కఠినమైన నిర్ణయాలు అవసరం అనే పాలకపక్ష వైఖరికి అనుగుణంగా ఉంది.

ప్రజలకు రాజ్యాంగంలోని 21వ అధికరణం జీవించే హక్కుకు, స్వేచ్ఛకు హామీ పడింది. వీటిని రక్షించడం నేర న్యాయవ్యవస్థ ముఖ్య కర్తవ్యం. అది రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా తయారైన చట్టాల ద్వారా జరగాలి. ఆచరణలో నేర న్యాయ చట్టాల అమలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉందా అనే కాపలాదారు పాత్రను న్యాయ వ్యవస్థ పోషించాలి. గత యాభై ఏళ్లుగా అమలులో ఉన్న చట్టాలు ప్రభుత్వాలు దుర్వినియోగం చేయకుండా న్యాయవ్యవస్థ సూత్ర రీత్యా కొంతవరకు అడ్డుకుంది. చట్టాలకు పరిధి పరిమితులను విధించి కొంత స్పష్టత ఇచ్చింది. కానీ ఈ కొత్త చట్టాలు ఉద్దేశపూర్వకంగా అస్పష్టంగా రూపొందించబడ్డాయనేది ముఖ్యమైన ఆరోపణ. ఈ చట్టాలలోని అస్పష్టత ప్రభుత్వ నిరంకుశ అధికారాన్ని బలోపేతం చేస్తుంది, ప్రజల హక్కులకు ప్రమాదకారిగా మారుతుంది అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఆందోళన నిరాధారం కాదు.

పై అనుమానాలకు బలం చేకూర్చే విధంగా కొత్త చట్టాలు రూపొందించారు. ప్రభుత్వ అధికారాల మీద ఇప్పటికే న్యాయ వ్యవస్థ విధించిన పరిమితులను అధిగమించి అధికారాలను చేజిక్కించుకోవడానికి జరిగిన ప్రయత్నం వాటిలో కనిపిస్తుంది. ఉదాహరణకు దేశద్రోహం అనే నేరం వలసవాదానికి గుర్తు అని ప్రకటించి దాని అమలును సుప్రీంకోర్టు నిలిపివేసింది. కానీ నేర న్యాయ సంహితలో సెక్షన్ 150 ద్వారా మరింత ప్రమాదకర రూపంలో అది పునఃప్రత్యక్షమైంది. ఈసారి దేశ ఐక్యత, సమగ్రత అనే అమూర్త రూపం తీసుకుంది. ఇది సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయాన్ని నిరాకరించడమే. ఈ పేరు మీద ఏమి జరుగుతుందో ఊహించుకోవడం కష్టం కాదు.

మరొక సామాన్య విషయంలో నేర సురక్ష సంహిత చేసిన మార్పు చూద్దాం. ఒక బాధితురాలి నుంచి ఫిర్యాదు రాగానే మొదటి ప్రాథమిక నివేదిక తక్షణమే నమోదు చేయాలని లలితకుమారి వెర్సెస్ ఉత్తర్‌ప్రదేశ్ అనే తీర్పులో సుప్రీంకోర్టు నిర్దేశించింది. జరిగిన సంఘటనకు సంబంధించిన వాస్తవాలు కల్తీ లేకుండా, అతిశయోక్తులు లేకుండా నమోదు కావాలంటే ఎఫ్ఐఆర్ వెంటనే నమోదు కావాలనేది ఆ తీర్పు సారాంశం. వ్యాపార సంబంధమైన కొన్ని నేరాల విషయంలో మాత్రం ప్రాథమిక పరిశీలన (పరిశోధన, విచారణ కాదు) తర్వాత మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నిర్దేశించింది. ఈ తీర్పును పోలీసులు అన్ని రకాల కేసులలో దుర్వినియోగం చేస్తున్నారనేది వాస్తవం. అరుదుగా తప్ప, పోలీసు స్టేషన్లలో రోజుల తరబడి పంచాయతీలు చేసి, ఉత్తర దక్షిణల మీద ఆధారపడి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సగటు పౌరుడి అనుభవం. ఈ కొత్త చట్టం ఈ దుర్వినియోగానికి చట్టబద్ధత కల్పించింది. ఏడు ఏళ్ల వరకు శిక్ష పడే నేరాలలో అన్నింటిలో ప్రిలిమినరీ ఎంక్వయిరీ తర్వాతే కేసులు నమోదు చెయ్యాలని ఇది నిర్దేశిస్తుంది. ఇది పోలీసులు అధికారాన్ని దుర్వినియోగం చేయడానికి అవకాశం కల్పించడం. అరెస్ట్ చేసే అధికారం, అరెస్ట్ చేయడానికి కారణాలు ఉండడం వేరు వేరనే స్పృహలేని ప్రస్తుత పోలీస్ వ్యవస్థలో, అనుమానం మీద ఎవరినైనా అరెస్ట్ చేసే అధికారం ఈ చట్టాలు ఇచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు సుప్రీంకోర్టు న్యాయవాది ముకుల్ రస్తోగి.

ఊపా కేసులు పేరు మీద ఇప్పటివరకు ఎంతటి హక్కుల అణచివేత జరిగిందో అందరికీ తెలుసు. కనీసం ఊపా చట్టంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎవరి మీద, కేసులు నమోదు చేయడానికి లేదు అనే రక్షణ ఉంది. ఇది కఠినమైన చట్టం కాబట్టి, హోమ్ సెక్రటరీ లాంటి ఉన్నతాధికారులు, వివేచన ఉపయోగించి అనుమతి ఇస్తారు అని ప్రభుత్వం చట్టం చేసినప్పుడు ఇచ్చిన సమర్థన. ఆచరణలో అదంతా నిజం కాదని చాలా కేసులు రుజువు చేశాయి. ఆచరణలో అది ఒక సాంకేతిక అనుమతిగా దిగజార్చి (నిర్దోషిగా నిరూపితమైన ఒక నిందితుడిని ఇదే వాదనతో మరో రెండేళ్లు జైలుకు పంపింది మన సర్వోన్నత న్యాయస్థానం) పదేళ్ల పాటు చాలా మందిని జైళ్లలో నిర్బంధిస్తే, న్యాయస్థానాలు నింపాదిగా నిర్దోషులుగా ప్రకటించడం ఆనవాయితీ అయింది. విచారణ క్రమమే నిందితులకు ప్రమాదకరంగా మార్చిన వైనం చూసాం. ఊపా చట్టంలో ఉన్న ఆ మాత్రం రక్షణ పౌరులకు దేనికి అనుకున్న ప్రభుత్వం దానిలోని చాలా సెక్షన్లను నేర న్యాయ సంహితలో చేర్చింది. ఇది చాలా ప్రమాదకరం అని ఇందిరా జై సింగ్ లాంటి న్యాయ నిపుణులు అంటున్నారు. ఊపా చట్టం పరిణామాలు రోజువారీ జీవితంలో అందరూ ఎదుర్కొనే పరిస్థితి రావచ్చనేది ఆందోళన.

ఈ కొత్త చట్టాలను ప్రజాస్వామిక న్యాయవాదులు సర్వోన్నత న్యాయస్థానంలో ఖచ్చితంగా సవాలు చేస్తారు. తన న్యాయస్థానంలో ఈ చట్టాలు సవాలుకు రావచ్చు అనే స్పృహ లేకుండా వాటికి స్వాగతం పలికిన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి నుంచి మనం ఏమి ఆశించలేకపోవచ్చు. న్యాయవ్యవస్థలో చట్టబద్ధ పాలన పట్ల, రాజ్యాంగ స్ఫూర్తి పట్ల విశ్వాసం ఉన్నవారు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ఈ చట్టాలు రద్దు చేయబడవచ్చు. కానీ జీవితంలో కనీసం సామాన్యులకు ప్రాధమ్యాల పట్ల ఉన్న స్పృహ, విచక్షణ కూడా లేనట్లు నటిస్తున్న సర్వోన్నత న్యాయస్థానం ఒక ఐదేళ్ల తర్వాత సాకల్యంగా ఈ చట్టాలు రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించవచ్చు. అప్పటికి ఎంతమంది ప్రజలు మూల్యం చెల్లించుకున్నారు అనే అంచనా లేకపోవచ్చు. ఎలక్టోరల్ బాండ్స్ విషయంలో తీర్పు 2020లో వచ్చి వుంటే నేటి రాజకీయ పరిస్థితి ఇంకోలా ఉండేది కదా?

ఈ చట్టాలు సృష్టించబోయే సమస్యలను అంచనా వేయడం అసాధ్యమేమీ కాదు. దేశంలో ఏడాదికి సుమారు 60 లక్షల మంది నిందితులను పోలీసులు నిర్బంధిస్తారు. అందులో పది లక్షల మందికి న్యాయస్థానాలు శిక్షలు విధిస్తే, పదిలక్షల మందిని నిర్దోషులుగా విడుదల చేస్తున్నాయి. వీళ్లలో చాలామంది నెల నుండి మూడు నెలలు జైలులో మగ్గిన తర్వాతే నిర్దోషులుగా బయటపడతారు. ఏడాదిలోపు నిర్ణయించబడేవి చిన్న చితక కేసులు మాత్రమే. మిగిలిన 40 లక్షల కేసులలో నిందితులు ఏడాది నుంచి 20 ఏళ్ల వరకు, తమ ఆర్థిక, సామాజిక స్తోమత బట్టి కోర్టుల చుట్టూ తిరుగుతుంటారు. ఇదంతా ఒక్క ఏడాదిలో. సకాలంలో బాధితులకు న్యాయాన్ని అందించే నేర న్యాయ వ్యవస్థను సృష్టించడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయకపోవడంతో సమస్య ఇంత తీవ్రంగా మారింది. యుద్ధకాలంలో లాభాలు పెరిగినట్టు, కోవిడ్ సంక్షోభం తర్వాత బిలియనీర్లు పుట్టుకొచ్చినట్టు, అస్తవ్యస్తమైన న్యాయ వ్యవస్థలో కొందరికి మంచి ప్రయోజనాలు కలగవచ్చు. ఈ మొత్తం వ్యవహారం పట్ల అసహనంతో ఉండే సామాన్య ప్రజానీకం 'తక్షణ న్యాయం' పేరుతో న్యాయబద్ధ పద్ధతులకు అతీతంగా నిందితులను శిక్షించాలని కోరుకుంటారు. ఈ నేపథ్యంలో కొత్త నేర చట్టాలు అమలు చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను దానికున్న మద్దతును అర్థం చేసుకోవాలి. ఈ న్యాయ సంక్షోభాన్ని ఎదుర్కోడానికి రాజ్యాంగం మీద విశ్వాసం ఉన్నవారందరూ నడుం బిగించాలి.

■ మురళి కర్ణం

హ్యూమన్ రైట్స్ ప్రొఫెసర్, నల్సార్ యూనివర్సిటీ

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 కనిష్ఠం 23.5

## పోలీసులకు మందుబాబు ఝలక్

**బ్రీత్ ఎనలైజర్‌తో పరార్**

బోయిన్‌పల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్న పోలీసులకు ఓ మందుబాబు షాక్ ఇచ్చాడు. బ్రీత్ ఎనలైజర్ ఊదుతున్నట్లు నటించి దాన్ని తీసుకుని కారుతో ఉడాయించాడు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత

మిగతా 6వ పేజీలో..

## రెండు గంటలు పెన్‌డౌన్

- కమిషనర్ సూచనతో విధుల్లోకి ఆర్టీఏ అధికారులు, ఉద్యోగులు
- ఆటో యూనియన్ల సభ్యులను ప్రోత్సహించొద్దని విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్‌పై దాడిని పలు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు శుక్రవారం రెండు గంటలపాటు పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్న రవాణా శాఖ కమిషనర్ హామీతో అనంతరం యథావిధిగా విధులు నిర్వర్తించారు. ఆర్టీసీ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్, గ్రూప్-1 ఆఫీసర్స్ అసోసియేషన్, టీఎన్‌జీఓ సెంట్రల్ యూనియన్, టీజీఓ తదితర యూనియన్లు రమేష్‌పై దాడిని తీవ్రంగా ఖండించాయి. వివిధ సంఘాల నేతలు రవాణా శాఖ కమిషనర్ జ్యోతిబుద్ధప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్టీఏ కార్యాలయాల్లో అన్ని స్థాయిల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆటో రిక్షా యూనియన్ సభ్యులను ఆఫీసుల్లో ప్రోత్సహించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జేటీసీపై ఆటో డ్రైవర్ల జేఏసీ కన్వీనర్ అమానుల్లాఖాన్ దాడి చేయడాన్ని కమిషనర్ ఖండించారు. దాడికి పాల్పడిన అమానుల్లాఖాన్‌పై తగిన చర్యలు తీసుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో చర్చిస్తామని పేర్కొన్నారు. పెన్‌డౌన్‌ను

మిగతా 6వ పేజీలో..



ఆర్టీఏ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ చేసి ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



సికింద్రాబాద్‌లో అనవసరపు షెల్టర్



జేఎన్‌టీయూ వద్ద రోడ్డుపై నిలుచున్న ప్రయాణికులు

# ప్రకటనల కోసమే షెల్టర్లు ప్రయాణికులకు పాట్లు



## ప్రయాణికులకు అవసరమైన చోట కరువు

- బల్దియాలో ఇదో దందా..!
- ప్రకటనల విభాగంలో అంతులేని అవినీతి
- యాడ్ ఏజెన్సీలతో అధికారుల కుమ్మక్కు
- టెండర్లలోనూ గోల్‌మాల్
- సిండికేట్ అయ్యి.. బల్దియాకు గండికొట్టి
- అక్రమంగా 800 వరకు షెల్టర్ల నిర్మాణం
- అవసరం లేని ప్రాంతాల్లోనే ఏర్పాటు
- అవసరమున్న చోట కనిపించని షెల్టర్లు

> ప్రయాణికులకు అవసరమైన చోట షెల్టర్లు కనిపించవు. అనవసరమైన ప్రాంతాల్లో చాలాచోట్ల షెల్టర్లు కనిపిస్తాయి. ఎందుకిలా? అంటే వ్యాపారమే కారణమని తెలుస్తోంది. ప్రయాణికులకు సౌకర్యం కల్పించడం మరిచి యాడ్ ఏజెన్సీలకు ఆదాయం సమకూర్చేందుకే యంత్రాంగం ప్రాధాన్యమిస్తోంది. జీహెచ్ఎంసీ ప్రకటనల విభాగంలో అంతులేని అవినీతికి ఇదొక ఉదాహరణ. యాడ్ ఏజెన్సీలతో కుమ్మక్కవుతోన్న అధికారులు అక్రమంగా షెల్టర్లు ఏర్పాటుచేసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బల్దియాలో బస్ షెల్టర్ల దందా నడుస్తోంది. ట్రాఫిక్ పోలీసుల అనుమతితో ఆర్టీసీ అధికారులు సూచించిన ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని జీహెచ్ఎంసీ ప్రకటనల విభాగం వర్గాలు చెబుతున్నాయి. టెండర్ ప్రక్రియ ద్వారా ఏజెన్సీలను ఎంపిక చేస్తున్నామన్నది వారి వాదన. డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్ఓటీ)లో కొత్త షెల్టర్లకు కొన్నేళ్లుగా అనుమతినిస్తున్నారు. నిధులు వెచ్చించి షెల్టర్లు ఏర్పాటుచేసే ఏజెన్సీలు ప్రకటనల ద్వారా ఆదాయం పొందాల్సి ఉంటుంది. నగరంలో ప్రకాష్ యాడ్స్, లీడ్ స్పేస్, యూని యాడ్స్ తదితర ఏజెన్సీలు షెల్టర్ల ఏర్పాటు కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం గ్రేటర్‌లో 1200 వరకు బస్ షెల్టర్లున్నాయి. అంతకంటే 65 శాతం ఎక్కువగా దాదాపు 2000 వరకు షెల్టర్లు ఉంటాయని అంతర్గత సంభాషణల్లో అధికారులే అంగీకరిస్తున్నారు. ఈలెక్కన 800 వరకు అక్రమంగా షెల్టర్లు ఉన్నాయి. వాటిలో మెజార్టీ షెల్టర్లు ప్రయాణికులకు అవసరం లేని ప్రాంతాల్లో ఉన్నాయి. యాడ్ ఏజెన్సీలు ప్రకటనల ఆదాయం పొందడం లక్ష్యంగా బస్ షెల్టర్ల ఏర్పాటు జరుగుతోంది. ప్రధాన మార్గాలు, ఎక్కువ విజిబులిటీ ఉన్న చోట అనుమతి లేని షెల్టర్లు కనిపిస్తున్నాయి. ప్రయాణికులకు ఎండ, వాన నుంచి రక్షణగా కూర్చునేందుకు వీలుగా సీటింగ్‌తో సహా షెల్టర్లు ఉండాలి. కొన్నిచోట్ల ప్రమాణాల ప్రకారం షెల్టర్లు ఉండడం లేదు. కొన్నిచోట్ల షెల్టర్లు

మిగతా 6వ పేజీలో..

**బస్‌షెల్టర్లు అవసరమైన ప్రాంతాల్లో కొన్ని..**

- ఎల్బీనగర్ చౌరస్తా
- సరూర్‌నగర్
- కామినేని చౌరస్తా
- రామంతాపూర్ హోమియో ఆస్పత్రి
- అంబర్‌పేట ఇరానీ హోటల్
- శ్రీరమణ చౌరస్తా
- అలీ కేఫ్ జంక్షన్
- పంజాగుట్ట హిమాలయ బుక్ వరల్డ్
- నారాయణగూడ ఏఐటీయూసీ ఆఫీస్
- ఉప్పల్ వైపు నుంచి వస్తోన్న మార్గంలో చిలకలగూడ చౌరస్తా
- తిలక్‌నగర్
- సిండికేట్ బ్యాంక్
- కేపీహెచ్‌బీ విశ్వనాథ థియేటర్





వనస్థలిపురం వద్ద ఎండలో నిలుచున్న ప్రయాణికులు

### కొన్ని ప్రాంతాల్లో ఇలా..

- కేబీఆర్ పార్కు మెయిన్ గేట్ చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు వెళ్లే మార్గంలో ఇరువైపులా 11 బస్ షెల్టర్లున్నాయి. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వద్ద నిలిపే బస్సులను చెక్‌పోస్ట్ సమీపంలోని చౌరస్తా వద్ద ఆపుతారు. మధ్యలో బస్సులు నిలపకున్నా షెల్టర్లు నిర్మించడం గమనార్హం.
- సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఈఎస్ఐ కార్యాలయం వద్ద ఉన్న షెల్టర్ వద్ద బస్సులు ఆగవు.
- ఎల్బీనగర్‌లోని ఆనంద నిలయం ఎదురుగా వనస్థలిపురం వెళ్లే మార్గంలోని షెల్టర్ వద్ద బస్సులు ఆగవు. దీంతో ప్రైవేట్ వాహనాలను పార్క్ చేస్తున్నారు.
- తార్నాకలోని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) కార్యాలయం వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒక్క బస్సు కూడా నిలపరు. తార్నాక చౌరస్తా సమీపంలో బస్సులు ఆపుతారు కానీ అక్కడ షెల్టర్లు లేవు.
- సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని సూర్య టవర్స్ వద్ద బస్ షెల్టర్లను నిర్మించారు. కానీ ఇక్కడ ఒక్క బస్సు కూడా నిలపరు.
- పనామా వద్ద షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సు కోసం ఎదురుచూస్తుంటారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారు.
- చందానగర్ గంగారంలోని నీరూస్ వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. వయోధికులు, చిన్న పిల్లల తల్లిదండ్రులు బస్సుల కోసం నిలబడలేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.





**తాగునీటి పరీక్షలు మూడోవంతే!**

- ప్రస్తుతం 4 వేల వరకే చేస్తున్న వాటర్‌బోర్డు
- గతంలో రోజుకు 12 వేలకు పైగా..

8

## రాత్రుళ్లు డీజేలు.. పగలు స్మగ్లర్లు

- డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్ట్



స్మగ్లర్స్(ముసుగులో)ను అరెస్టు చేసిన అధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాత్రుళ్లు పబ్‌లలో డీజే నిర్వహించి, పగలు డ్రగ్స్ గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు డీజే (డిస్క్ జాకీ)లను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి 15.13 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లో డీజే నిర్వాహకుడు అఖిల్ డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నవీన్ సిబ్బందితో కలిసి అఖిల్‌ను పట్టుకున్నారు. అతని వద్ద 2.65 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. తనతోపాటు.. ఇబ్రహీంపట్నానికి చెందిన సన్నీ పేరును అఖిల్ ప్రస్తావించడంతో అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. సన్నీ ఇంట్లో 12.48 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ దొరికింది. వీరు బెంగళూరుకు చెందిన అలెక్స్ అనే స్మగ్లర్ నుంచి తీసుకుంటున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. చాకచక్యంగా అలెక్స్‌ను బెంగళూరు నుంచి నగరానికి రప్పించి అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నవీన్ బృందంలో ఉన్న లక్ష్మారెడ్డి, బాలరాజు, యాదగిరి, మహేశ్వర్‌రావు, అరుణ్, కృష్ణలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.



బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఓ స్టోర్‌ను పారిశ్రామిక వేత్త పింకీ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నటి శోభితా ధూళిపాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.





హెచ్ఏఎల్‌తో చేసుకున్న ఒప్పందపత్రాలను స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి

## నిలోఫర్‌లో గైనిక్ ఓపీ

- మూడంతస్తుల భవన నిర్మాణం
- హెచ్ఏఎల్‌తో ఒప్పందం చేసుకున్న ఆస్పత్రి
- భవనం, వైద్య పరికరాలకు రూ.20.22 కోట్లు

హైదరాబాద్‌సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) నిలోఫర్ ఆస్పత్రిలో కొత్తగా గైనిక్ ఓపీని ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది. ఇందుకోసం కొత్త భవనానికి వైద్యాధికారులు అంకురార్పణ చేస్తున్నారు. ప్రస్తుతం గర్భిణులకు, పిల్లలకు ఒకే భవనంలో ఓపీ చికిత్సలు అందుతున్నాయి. ఇకపై గర్భిణులకు ప్రత్యేకంగా చికిత్సలు అందించనున్నారు. ఈ మేరకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో నిలోఫర్ ఆస్పత్రి శుక్రవారం ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.10.20 కోట్లు, భవన నిర్మాణం, వైద్య పరికరాలకు మరో రూ.10.02 కోట్లు అందజేయనున్నట్లు ఒప్పందం చేసుకున్నారు. హెచ్ఏఎల్ జనరల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి ఆస్పత్రిలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

### మూడంతస్తుల భవనం

గైనిక్ ఓపీ కోసం కొత్త భవనం నిర్మించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. సెల్లార్ ప్లస్ మూడు అంతస్తులతో ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. భవనం అందుబాటులోకి రాగానే మహిళలకు యాంటినెంటల్, గర్భిణి వైద్య సేవలు ప్రత్యేకంగా అందించనున్నట్లు ఆమె చెప్పారు. 2డీ ఈకో, అల్ట్రాసౌండ్, మల్టీ పారామీటర్స్ తదితర వైద్య పరికరాలను ఏర్పాటు చేస్తామన్నారు.

## వాహనం మిస్ అయిందా?

- ఇందులో ఉందేమో చెక్ చేసుకోండి
- ఆరు నెలలు దాటితే వేలం



8



## నకిలీ మందుల గుట్టురట్టు

- డీలర్లపై ఔషధ నియంత్రణ సంస్థ దాడులు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వేరే బ్రాండ్‌ను పోలిన నకిలీ మందులను, తప్పుడు ప్రకటనలతో ఆయుర్వేద మందులను విక్రయిస్తున్న సంస్థల గుట్టును ఔషధ నియంత్రణ సంస్థ రట్టు చేసింది. నగరంలో పలువురు డీలర్లపై అధికారులు గురువారం దాడులు నిర్వహించి నకిలీమందులను స్వాధీనం చేసుకున్నట్లు ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. సుల్తాన్‌బజార్‌లోని గోయల్ ఫార్మా, మూసారాంబాగ్‌లోని యశ్వంత్ ఫార్మాలపై దాడులు నిర్వహించి నకిలీ మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 'కిడ్నీలో రాళ్లు పోతాయ్.. జ్వరాలు రావు' అంటూ తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తున్న ఆయుర్వేద డీలర్లపై కూడా దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

## ఎల్లంపల్లి జలాశయానికి వరద

- ఇలాగే కొనసాగితే అత్యవసర పంపింగ్ బంద్

హైదరాబాద్ సిటీ, జూన్28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరానికి గోదావరి జలాల తరలింపులో ప్రధాన ఆధారమైన ఎల్లంపల్లి జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరుతోంది. ఇదే విధంగా వరద కొనసాగితే ఎల్లంపల్లిలో ప్రస్తుతం వాటర్‌బోర్డు నిర్వహిస్తున్న అత్యవసర పంపింగ్ అవసరం ఉండదని అధికారులు తెలిపారు. వర్షాలకు అడపాదడపా వరద రాగా, తాజాగా శుక్రవారం 1200కు పైగా క్యూసెక్కుల వరద ఎల్లంపల్లికి తరలివచ్చిందని అధికారులు తెలిపారు. ఎల్లంపల్లి జలాశయం నీటి సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.917 టీఎంసీల నీరు ఉన్నది. ప్రస్తుతం నగరానికి జలాల తరింపునకు పంపింగ్ కొనసాగుతోంది. ఎల్లంపల్లి జలాశయానికి వరద కొనసాగితే త్వరలోనే అత్యవసర పంపింగ్‌ను నిలిపివేయనున్నారు





### న్యాయం చేయాలి..

కాళోజీ యూనివర్సిటీ తప్పిదాల వల్ల 850 మంది విద్యార్థులకు 16 మంది మాత్రమే ఉత్తీర్ణత పొందారని, దీనికి తోడు వర్సిటీలో లైబ్రరీ, హాస్టల్ వసతి, సరైన టీచింగ్ సిబ్బంది లేకపోవడం వల్ల నష్టపోయామని బీఎస్సీ అలైడ్ సైన్స్ విద్యార్థులు కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ధర్నా చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

- మంగళ్‌హాట్, (ఆంధ్రజ్యోతి)

# 'నీట్'ను రద్దు చేయాలి..

- మళ్లీ నిర్వహించే వరకు ఉద్యమం ● త్వరలో భారత్ బంద్
- నీట్ అవకతవకలపై కిషన్‌రెడ్డి మౌనం వీడాలి : ఎన్ఎస్‌యూఐ


కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడించడానికి ప్రయత్నిస్తున్న విద్యార్థి సంఘాల నేతలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించేంత వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్‌యాదవ్ హెచ్చరించారు. నీట్‌లో అవకతవకలు జరిగినా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మౌనంగా ఉండడం సిగ్గుచేటని, ఇప్పటికైనా దీనిపై నోరు మెదపాలని అన్నారు. నీట్, ఎన్‌టీఏలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారత్ బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి నివాసాన్ని విద్యార్థి సంఘాల నేతలు ముట్టడించడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగి కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎడ్ల అభిజిత్‌యాదవ్‌తో పాటు 23మంది విద్యార్థి సంఘాల నేతలను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి ఆ తర్వాత వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రితీష్‌రావు, కార్యదర్శి శ్రీకర్, ఎస్ఎఫ్ఐ, పీవైఎల్, వీజేఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

## టీపీసీసీ అధ్యక్ష పదవిని బీసీ సామాజిక వర్గానికే ఇవ్వాలి

పంజాగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం మంత్రివర్గంలో, నామినేటెడ్ పదవుల్లో బీసీ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని, టీపీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకే ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. మంత్రివర్గంలో, నామినేటెడ్,పార్టీ పదవులు, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఇతర పదవులు, పోస్టులలో బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. పార్టీలు మారే వారికి పదవులు ఇవ్వొద్దని, పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న బీసీ నాయకులకే పదవులు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు మణిమంజరి, బాలు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ కిసాన్ యూనియన్(ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా డి.కె చంద్రశేఖర్ యాదవ్


నియామకపత్రంతో చంద్రశేఖర్ యాదవ్

పంజాగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ యూనియన్ (ఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎర్రగడ్డకు చెందిన డి.కె చంద్రశేఖర్‌యాదవ్‌ను నియమిస్తూ యూనియన్ జాతీయ ప్రధానకార్యదర్శి, దక్షిణ భారత ఇన్‌చార్జి ఎం.ఎం.ముస్తాక్ వాజిద్ అలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డికె చంద్రశేఖర్‌యాదవ్ శుక్రవారం సోమాజిగూడలో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు యూనియన్ జాతీయ అధ్యక్షుడు చౌదరి రిశీపాల్ అంబావటకు కృతజ్ఞతలు తెలిపారు.

## రెండు గంటలు పెన్‌డౌన్

(5వ పేజీ తరువాయి)

విరమించాలని కోరారు. స్పందించిన అధికారులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధుల్లో పాల్గొన్నారు.

### సౌత్‌జోన్ ఆర్టీఏ కార్యాలయంలో

సౌత్‌జోన్ ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో అధికారులు పెన్‌డౌన్ చేసి ఆందోళన వ్యక్తం చేశారు. రవాణాశాఖ అధికారి సదానందం, అసిస్టెంట్ ఆఫీసర్ హరిప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గంట రవీందర్, సురేష్, సోలమన్ రాజ్, కార్యాలయం సిబ్బంది నిరసన తెలుపుతూ పెన్‌డౌన్ చేయటంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

### తిరుమలగిరిలో..

తిరుమలగిరి జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ఆర్టీఓ సిబ్బంది శుక్రవారం పెన్‌డౌన్ నిర్వహించి నిరసన తెలిపారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన పౌరులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



## సికింద్రాబాద్ స్టేషన్‌లో పట్టాలు తప్పిన రైలింజన్

- ఆరు ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేసిన అధికారులు
- నేటినుంచి మరో 8 సర్వీసుల రద్దు: దక్షిణమధ్యరైల్వే

హైదరాబాద్ సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఉదయం 8గంటలకు రైలింజన్ పట్టాలు తప్పింది. యార్డులో మరమ్మతులు పూర్తిచేసుకొని సికింద్రాబాద్ స్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాం వైపు వస్తుండగా రైలింజన్ పట్టాలపై నుంచి పక్కకు ఒరిగింది. తక్కువ వేగంతో వస్తున్న రైలింజన్ మాత్రమే పట్టాల నుంచి పైదొలిగినందున ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. ఈ విషయమై సీపీఆర్‌వో రాకేశ్‌ను వివరణ కోరగా, జరిగిన ప్రమాదంపై విచారణకు ఆదేశించామని, విచారణ పూర్తయితేనే కారణాలు తెలుస్తాయని చెప్పారు. అయితే.. రైలింజన్ పట్టాలు తప్పిన కారణంగా ఆ మార్గంలో వెళ్లాల్సిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను 7,8 ప్లాట్‌ఫారాలపైకి మళ్లించారు. దీంతో ఫలక్‌నుమా-సికింద్రాబాద్, మేడ్చల్-హైదరాబాద్, సికింద్రాబాద్-ఉందానగర్ మార్గాల్లో ఆరు ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేశారు. ఆకస్మాత్తుగా ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేయడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా.. నిర్వహణ కారణాల రీత్యా శనివారం నుంచి జూలై 6వ తేదీవరకు 8ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది.


భారీ స్క్రీన్లపై గేమింగ్ పోటీలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

## ఉత్సాహంగా బీజీఐఎస్ -2024 ఫైనల్

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గేమింగ్ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తోన్న బ్యాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా సిరీస్ 2024 (బీజీఐఎస్-2024) ఫైనల్స్ శుక్రవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా పలు దశల పోటీల తరువాత ఎంపికైన 16 జట్లు ఈ ఫైనల్స్‌లో పోటీపడుతున్నాయి. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ పోటీలలో గేమర్ల నైపుణ్యం ప్రత్యక్షంగా వీక్షించడానికి పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. క్రాఫ్టాన్ ఇండియా నిర్వహిస్తున్న ఈ పోటీలను యూట్యూబ్‌లో కూడా ప్రత్యక్ష ప్రసారం చేస్తుండటం విశేషం. కాగా, గేమ్ పట్ల ఆసక్తి కలిగించడానికి స్పైరో, అన్కీ, మేజీ, జానీ లాంటి వారు కామెంటరీతో వీక్షకులకు వినోదం కలిగించారు.

## పోలీసులకు మందుబాబు ఝలక్

(5వ పేజీ తరువాయి)

సుమారు ఒంటిగంట సమయంలో బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు పుల్లారెడ్డి బంగ్లా సమీపంలో డ్రంకెన్ డ్రైవ్ విధుల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కారు నడుపుతున్న డ్రైవర్‌ను పరీక్షలు నిర్వహించగా అతను మద్యం తాగలేదని గుర్తించి పంపించివేశారు. ఆ వెనకాల వచ్చిన కారును ఆపి బారికేడ్లకు అవతలివైపు తీసుకెళ్లారు. డ్రైవింగ్ సీటులో ఉన్న వ్యక్తిని పరీక్షించేందుకు బ్రీత్ ఎనలైజర్‌తో ఊదమని కానిస్టేబుల్ మహేందర్ కోరాడు. అతను ఊదినట్లే చేసి ఎదురుగా ఎవరూ లేకపోవడంతో కానిస్టేబుల్ చేతిలోని బ్రీత్ ఎనలైజర్‌ను లాక్కుని పారిపోయాడు. ట్రాఫిక్ పోలీసులు కారును వెంబడించినా లాభం లేకుండాపోయింది. అర్ధరాత్రి కావడం, వర్షం కురుస్తుండడం, ట్రాఫిక్ లేకపోవడంతో నిందితుడు తప్పించుకుపోయాడు. కారు నంబరు, కంపెనీ ఏదీ గుర్తించలేకపోయినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు. బోయిన్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ పుటేజీల ఆధారంగా సదరు వ్యక్తిని శుక్రవారం గుర్తించినట్లు వెల్లడించారు.

## ప్రకటనల కోసమే షెల్టర్లు..

(5వ పేజీ తరువాయి)

లేక బస్సుల కోసం వయోధికులు, మహిళలు, చిన్న పిల్లల తల్లులు గంటల తరబడి ఎండలో నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థలం అందుబాటులో లేదని, ఫుట్‌పాత్‌ల వెడల్పు తక్కువగా ఉందని చాలా చోట్ల షెల్టర్లు ఏర్పాటు చేయడం లేదు.

### అక్రమార్కుల అడ్డా

జీహెచ్‌ఎంసీలోని ప్రకటనల విభాగంలోని అధికారుల సహకారంతో పలు ఏజెన్సీలు అవసరం లేని చోట షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో మెజార్టీ ఎలాంటి టెండర్ నోటిఫికేషన్ ప్రకటించకుండా అక్రమంగా అనుమతినిస్తున్నవే. ఇందుకుగాను ప్రకటనల విభాగంలోని కొందరు అధికారులకూ భారీగా ముడుపులు అందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ట్యాక్స్ పేరిట ఉద్యోగి కార్తీక్ వసూళ్లు చేసి హోర్డింగులు, బస్ షెల్టర్లు, లాలీపాప్‌ల ఏర్పాటుకు అక్రమంగా అనుమతి ఇచ్చారని పాలకమండలి సభ్యులు కౌన్సిల్‌లో ఆరోపించారు. అనంతరం కార్తీక్‌ను బదిలీ చేయగా.. కొన్నాళ్లుగా మరో అధికారి వసూళ్ల మొదలు పెట్టారనే ఆరోపణలున్నాయి. ప్రకటనల విభాగంలోని కొందరు అధికారులకు ఏజెన్సీలు రాచమర్యాదలు చేస్తుంటాయి. కొన్నాళ్ల క్రితం ప్రకటనల విభాగంలోని అధికారి తిరుపతికి వెళ్తున్నారని తెలుసుకున్న ఓ ఏజెన్సీ. రైలు దిగేసరికి కారు సిద్ధంగా ఉంచారు. వసతితో పాటు వీఐపీ దర్శనం చేయించినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో వందల సంఖ్యలో ట్రాఫిక్ అంబరిల్లాలు, సైనేజీలు, హోర్డింగ్‌లు, బస్ షెల్టర్లు అక్రమంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో యథేచ్ఛగా దందా సాగుతోంది.

### గతేడాది రూ.12 కోట్లు

బస్‌షెల్టర్ల ఏర్పాటుకు అప్‌సెట్ ప్రైస్ నిర్ణయించి అధికారులు టెండర్ నోటిఫికేషన్ ప్రకటిస్తున్నారు. షెల్టర్లను నాలుగు కేటగిరీలుగా విభజించి చదరపు మీటర్‌కు ఇంత అని ధర నిర్ణయించారు. రూ.1,875, రూ.1,500, రూ.1,125, రూ.900గా ఈ ధరలున్నాయి. మెజార్టీ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు 24 చదరపు మీటర్లు ఉంటాయని ఓ అధికారి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం షెల్టర్ల ద్వారా రూ.12 కోట్ల మేర ఆదాయం వచ్చిందన్నారు. వాస్తవంగా ఈ మొత్తం కనీసం రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు ఉండాలి. టెండర్ ప్రకటన సమయంలో అధికారుల సూచన మేరకు సిండికేట్‌గా మారుతోన్న ఏజెన్సీలు బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నాయి. ఏ ప్రాంతంలో షెల్టర్లకు ఎవరు టెండర్ వేయాలన్నది ముందే నిర్ణయించుకొని.. తదనుగుణంగా బిడ్‌లు దాఖలు చేస్తున్నారు. అప్‌సెట్ ప్రైస్ కంటే స్వల్ప మొత్తం అదనంగా కోట్ చేసి ఏజెన్సీలు టెండర్ దక్కించుకుంటున్నాయి. జీహెచ్‌ఎంసీకి రూ.10 కోట్లు నుంచి 12 కోట్లు చెల్లిస్తోన్న ఏజెన్సీలు.. డిమాండ్‌ను బట్టి ప్రకటనల ధరలు భారీగా నిర్ణయించి యేటా రూ.50-60 కోట్లు ఆదాయం పొందుతున్నట్టు సమాచారం.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శివరాంపల్లి రాఘవేంద్ర కాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఒకటిన్నర గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని శాస్త్రీపురం ఆపరేషన్స్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. రాఘవేంద్ర కాలనీ, ఆల్ భారీ మజీదు ప్రాంతం, శాస్త్రీపురం ఏరియా సగ భాగం, జూమ్ కిరాణ, క్రాంతి వాటర్, ఎంఎస్ స్కూల్ ప్రాంతాలలో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

**మైలార్‌దేవుపల్లి ప్రాంతాలలో....**

దుర్గానగర్ ఫీడర్‌లో ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని మైలార్‌దేవుపల్లి ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు. వినాయక్‌నగర్, దుర్గానగర్, దుర్గా వెంచర్, దుర్గా కన్వెన్షన్, గణేశ్‌నగర్, శాంతినగర్, స్వప్న థియేటర్, పయనీర్ స్కూల్ పరిసర ప్రాంతాలలో కరెంటు సరఫరా ఉండదన్నారు.

**బండ్లగూడ ఫీడర్ పరిధిలో.....**

బండ్లగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి 12 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుంది. వినాయక్‌నగర్, అలీనగర్, ఆయేశా కాలనీ, అహ్మద్‌నగర్, కింగ్స్ ఎవెన్యూ, మిరాజ్ గార్డెన్, యూసుఫ్ గుల్షన్ కాలనీలలో కరెంటు ఉండదన్నారు.

**రీగల్ గార్డెన్ ఫీడర్ పరిధిలో......**

రీగల్ గార్డెన్ ఫీడర్ పరిధిలో ఉదయం 12 నుంచి 12:30 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుంది. సుబాన్ కాలనీ పేజ్-1, మిలన్ కాలనీ, రీగల్ గార్డెన్, పల్లెచెరువు, అయేశా కాలనీలలో కరెంటు ఉండదన్నారు.

**శివరాంపల్లి సెక్షన్ పరిధిలో....**

చింతల్‌మెట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు వాదియే సులేమాన్‌నగర్, అక్బర్ హిల్స్ ప్రాంతాలలో కరెంటు ఉండదని అధికారులు తెలిపారు. ఉదయం 11:30 గంటల నుంచి 12 గంటల వరకు సులేమాన్‌నగర్, చింతల్‌మెట్, పహడీ ప్రాంతాలలో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 12 నుంచి 12:30 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆరామ్‌ఘర్, మార్కండేయనగర్, సోలిటర్ స్కూల్ పరిసర ప్రాంతాలలో కరెంటు సరఫరా ఉండదన్నారు. హసన్‌నగర్ ఫీడర్ పరిధిలో 12:30 నుంచి 1 గంట వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుంది. హసన్‌నగర్, శివరాంపల్లి, గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ, బెస్ట్ ప్రైజ్, కాధరీ హిల్స్, శ్రీదేవీ కాలనీలో కరెంటు సరఫరా ఉండదన్నారు.



కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

## షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పహడీషరీఫ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని జల్లపల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన 45 మంది లబ్ధిదారులకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడ బిడ్డల ఉన్నతి కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు కావలసిన నిధులను సమకూరుస్తూ వచ్చిందన్నారు. ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆడ బిడ్డల కోసం నిధులతోపాటు తులం బంగారాన్ని సైతం ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో బాలాపూర్ ఎమ్మార్వో మాధవి రెడ్డి, జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి, డీఈ వెంకన్న, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే సత్ఫలితాలు




కేన్సర్ అవగాహన అంశంపై ప్రసంగిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

మంగళ్‌హట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ అనేది జీవనశైలి వ్యాధి అని.. భారతదేశంలో కేన్సర్‌కు ముఖ్య కారణాలు మద్యం, ఆహారం, అనారోగ్యకరమైన ఆహారం, వైరల్ ఇన్‌ఫెక్షన్లతో సంక్రమిస్తుందని ఈ కేన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్సలు అందిస్తే ఫలితాలు ఉంటాయని ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ చాంబర్ ఆఫ● కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో కేన్సర్‌పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు మీలా జయదేవ్, ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్సలు అందించే దానిపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ కమిటీ చైర్ పర్సన్ శేఖర్ అగర్వాల్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీకి బస్సు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ వరకు జూలై 1వ తేదీ నుంచి బస్సును ప్రారంభించనట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాణిగంజ్ డిపో నుంచి రూట్ నంబర్ 90/253టి నంబర్‌తో బస్ సర్వీస్ నడుస్తుందని తెలిపారు. బస్సులు సికింద్రాబాద్, తార్నాక, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, నాగోల్ మెట్రోస్టేషన్, సాగర్ క్రాస్‌రోడ్స్, చంపాపేట క్రాస్‌రోడ్స్, బార్కస్, పహాడిషరీఫ్, తుక్కుగూడ, ఇమాంగూడ మీదుగా ఫ్యాబ్‌సిటీకి చేరుకుంటాయని తెలిపారు. ఫ్యాబ్‌సిటీలో పని చేస్తున్న వారి సౌకర్యార్థం ఈ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

## కోడలి హత్య కేసులో అత్త మామల అరెస్ట్

రాజేంద్రనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోడలిని హత్య చేసిన సంఘటనలో అత్త, మామలను అత్తాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి వివరాలను వెల్లడించారు. హసన్‌నగర్ మదీనా మజీదు ప్రాంతానికి చెందిన ఫర్జానా బేగం, మహ్మద్ నూర్‌ల పెద్ద కుమారుడు మహ్మద్ అబ్బాస్ భార్య అజ్మేరీ బేగం(28) ఇళ్లలో పని మనిషిగా చేసేది. గత కొంతకాలంగా ఆమె పని చేయడం మానేసి ఇంట్లోనే ఉంటుంది. దీంతో వారి ఇంట్లో తరచు గొడవలు జరుగుతున్నాయి. అజ్మేరీ బేగంను పనికి వెళ్లాలని భర్త, అత్త మామలు వేధిస్తున్నారు. వారి గోల పడలేక అజ్మేరీ బేగం పుట్టింటికి వెళ్లిపోయింది. తనను భర్త వేధిస్తున్నాడని మహిళా మండలిలో ఫిర్యాదు చేసింది. ఇరు కుటుంబాల పెద్దలు కూర్చుని మాట్లాడుకున్నారు. ఆ సమయంలో భర్త ఇక మీదట మంచిగా చూసుకుంటానని చెప్పడంతో అజ్మేరీ బేగం ఇద్దరు పిల్లలను తీసుకుని అత్తగారింటికి వచ్చింది. ఆ తర్వాత కూడా అజ్మేరీ బేగంపై భర్త వేధింపులు ఆపలేదు. బక్రీద్ పండుగ సందర్భంగా తిరిగి ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి అత్తగారింటికి రాలేదు. దీంతో భర్త మహ్మద్ అబ్బాస్ బ్రతిమాలడంతో ఈ నెల 26న మధ్యాహ్నం పిల్లలతో కలసి తిరిగి అత్తగారింటికి వచ్చింది. ఈ నెల 27న ఉదయం పిల్లలను స్కూల్‌కు పంపించిన అజ్మేరీ బేగం ఇంట్లో పనిచేసుకుంటుంది. ఆ సమయంలో అత్త ఫర్జానా బేగం కోడలితో టీ పెట్టమని కోరింది. ఆమె టీ పెట్టకపోవడంతో మహ్మద్ నూర్ సహాయంతో అజ్మేరీ బేగంను వెనుకాల నుంచి చున్నీతో ఉరి వేసి హత్య చేశారు. ఈ కేసులో హతురాలి తల్లి కొండాపూరం చోటీ బీ ఇచ్చిన ఫిర్యాదుతో ఫర్జానా బేగం, మహ్మద్ నూర్‌లను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

## మతిస్థిమితం లేని యువతి అదృశ్యం

మదీన, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోనుంచి బయటికి వెళ్లిన ఓ యువతి తిరిగిరాలేదు. హుసేనిఆలం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జలాల్ కుంచ ప్రాంతానికి చెందిన అబ్దుల్ నయీమ్ కుమార్తె రేష్మా బేగం (25) మతిస్థిమితం సరిగాలేదు. ఈనెల 26న మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో హుసేనిఆలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ సుధీర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

## బోనాలు సమీపిస్తున్నా.. ప్రారంభం కాని అభివృద్ధి పనులు

చాంద్రాయణగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బోనాలు సమీపిస్తున్నాయి. మరి కొద్ది రోజుల్లో బోనాల ఉత్సవాలు పాతబస్తీలో ప్రారంభం కానున్నాయి. అయితే నేటికి పలు అమ్మవారి ఆలయాల వద్ద ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. ఉత్సవాల ప్రారంభానికి ఇంకా నెల రోజులు కూడాలేదు. అయినా అధికారులు అలయాల వద్ద చెట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టిసారించడం లేదు. దాంతో ఆలయాల వద్ద అభివృద్ధి పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని దుస్థితి నెలకొంది. బోనాల ఉత్సవాల నిర్వహణకు గత ప్రభుత్వాలు కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించినా తూతూమంత్రంగా పనులు చేయించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలూ ఉన్నాయి. రోడ్లు వేయాల్సిన చోట ప్యాచ్‌వర్క్‌తో సరిపెట్టారని పలువురు భక్తులు వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనైనా ఆలయాల వద్ద సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికే పాతబస్తీలోని పలు ఆలయాల వద్ద రోడ్లపై గుంతలు పడ్డాయి. పలుచోట్ల కుంగిపోయి మూతలేని డ్రైనేజీలు, వెలగని వీధి దీపాలు ఉన్నాయి. అసలే వర్షాకాం కావడం, ఎప్పుడు వాన వస్తుందో తెలియదు. చిన్నపాటి వర్షానికే రోడ్లపై పారుతున్న మురుగునీరు వంటి సమస్యలు దర్శనమిస్తున్నాయి.



ఉప్పుగూడ మహంకాళి ఆలయం ఎదుట గొయ్యి



బలిగంప ఊరేగింపు మార్గంలో కుంగిపోయిన మ్యాన్ హోల్

**బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి**

బోనాల ఉత్సవాల నిర్వహణపై ఇప్పటికే ఉన్నతాధికారులతో రాష్ట్ర మంత్రులు మూడుసార్లు సమావేశం నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా, బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. మంత్రులు ఎదుటు తలలు ఊపిన ఆధికారులు ఆ తర్వాత యధావిధిగా చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటి వరకు దేవాలయాల వద్ద పర్యటించి సమస్యలను గుర్తించలేదు. వాటి పరిష్కారానికి కృషి చేసిన దాఖలాలు కూడా లేవు.

**బోనాలకు ముందే అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**



బోనాల ఉత్సవాలు సమీపిస్తున్నా ఇప్పటివరకు ఆలయాల వద్ద ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రతి సంవత్సరం బోనాల పండుగకు ఆలయాల వద్ద పనులు జరుగుతాయని ఎదురు చూస్తుంటాము. ఇప్పటికైన అధికారులు స్పందించి బోనాల ఉత్సవాలకు ముందుగానే అభివృద్ధి పనులు పూర్తి చేయాలి - కె.వెంకటేశ్, మాజీ చైర్మన్, లాల్‌దర్వాజ మహంకాళి దేవాలయం

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AttL6u0లో చదవండి.
**Note:** Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
**నోట్:** htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



ఆలయ నూతన కార్యవర్గ సభ్యులు

## దూద్‌బౌలి పైనీరు ముత్యాలమ్మ ఆలయ కార్యవర్గం నియామకం

మదీన, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం బోనాల జాతరను పురస్కరించుకుని దూద్‌బౌలి పైనీరు ముత్యాలమ్మ దేవాలయం చైర్మన్‌గా దోరేటి ఆనంద్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారావు ముదిరాజ్ నియమితులయ్యారు. శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటాచలం ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసచారి, భరత్‌చారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ప్రమోద్‌కుమార్, కోశాధికారిగా సంతోష్ గుప్తా, ముఖ్య సలహాదారులుగా బాలకిషన్ ముదిరాజ్, వరకాల యాదగిరిలతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌గుప్తా మాట్లాడుతూ బోనాల జాతరను వైభవంగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. జులై 25 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గోల్కొండ ఆస్పత్రి అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు పంపండి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని 200 పడకలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. శుక్రవారం గోల్కొండ ఆస్పత్రిని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మెయినోద్దీన్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల ఓపీ, డెంటల్ వార్డు, ఐసీయూ, డయాలసిస్ సెంటర్, ఫార్మసీ స్టోర్, ఔట్ పేషెంట్ వార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆస్పత్రి సందర్శన తర్వాత గోల్కొండలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలను ఎమ్మెల్యేతో కలిసి సందర్శించారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో విద్యార్థులు ఎందుకు హాజరుకావడం లేదని హెచ్ఎంలను ప్రశ్నించారు. వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా వెంటనే పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడాలని వారిని ఆదేశించారు. టెస్ట్‌బుక్స్, నోట్ బుక్స్ అందరికీ అందేలా చూడాలని, విద్యా వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, పాఠశాలల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత, గోల్కొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ మహ్మద్ మజారుద్దీన్, కార్పొరేటర్లు, వైద్యులు, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.



గోల్కొండ ఆస్పత్రిలో డీసీహెచ్ఎస్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

## పెట్టుబడికి రెట్టింపు ఇస్తామంటూ బురిడీ

- డిపాజిట్లు వసూలు చేసిన సంస్థ నిర్వాకుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పెట్టిన పెట్టుబడి మూడు నెలల్లో రెట్టింపు, ఏడాదిలో నాలుగు రెట్లు చేసి ఇస్తామని పలువురిని మోసం చేసిన వ్యక్తిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. బీఎన్ సతీష్, ఆకుల కొండప్ప వెంకట చలపతిలు బెంగళూరులో 2015లో జేబిటీఓ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించారు. కడప జిల్లా రాజంపేటకు చెందిన గాదిరాజు గురుప్రసాద్ రాజు (32), గాదిరాజు రాజేంద్రప్రసాద్ రాజు, పాశం వెంకట ప్రసాద్, బైరెడ్డి జ్యోతిలతో కలిసి కేపీహెచ్‌బీలో సంస్థ శాఖను స్థాపించారు. పలువురు ఉద్యోగులను నియమించుకొని తక్కువ సమయంలోనే పెట్టుబడులు రెట్టింపు చేస్తామని ప్రచారం చేసుకున్నాడు.

పెట్టుబడి మూడు నెలల్లో రెట్టింపు ఏడాదిలో 4 రెట్లు పెంచుతామని ప్రచారం చేసుకుంటూ పలువురి నుంచి రూ.2 కోట్లు వసూలు చేశారు. పెట్టుబడి పెట్టిన వారికి, తమ లాభాలు చూసుకునేందుకు ఎక్స్‌బిటీఓ వెబ్‌సైట్‌లో లాగిన్ ఇచ్చాడు. విత్ డ్రా ఆప్షన్ లేకపోవడంతో, సంస్థ కార్యాలయం మూసి వేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న ఆర్థిక నేరాల విభాగం అధికారులు నిందితుడు గాదిరాజు గురుప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఫ్రంట్ చైర్మన్ వీ.జీ.ఆర్ నారగోని, సలీం బాషా, సూర్యనారాయణ తదితరులు

## బహుజన రాజ్యం సాధించడమే లక్ష్యం

- నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బహుజన రాజ్యం సాధించడమే లక్ష్యంగా నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఆవిర్భా వించింది. శుక్రవారం బషీర్‌బాగ్ క్లబ్‌లో ఫ్రంట్ ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రంట్ చైర్మన్ వీ.జీ.ఆర్.నారగోని, వైస్ చైర్మన్‌లు సలీం బాషా, ఎం. సూర్యనారాయణ, కన్వీనర్లు ఎం. నర్సయ్య, గోపి బోయ, కె.లక్ష్మణ్, బాలాజీ నాయక్, వెంకటస్వాములు మాట్లాడారు. అన్ని కులాలకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం, పరిపాలనలో భాగస్వామ్యం అనే నినాదంతో సీట్లు ఇవ్వని పార్టీలకు ఓట్లు వేయవద్దంటూ ఓటు నిరాకరణ ఉద్యమాన్ని జూలై 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## మోదీ.. మద్దతు ధరలపై చట్టం చెయ్..!

- రైతులకిచ్చిన హామీని ప్రధాని నిలబెట్టుకోవాలి
- లేదంటే పోరాటం ఉధృతం: సంయుక్త కిసాన్ మోర్చా

పంజాగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలను ఉపసంహరించుకునే సమయంలో రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, హరియాణ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రచారం చేస్తామని హెచ్చరించింది. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతుల మద్దతు కూడగట్టేందుకు సంయుక్త కిసాన్ మోర్చా చేపట్టిన యాత్ర హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంఏర్పాటు చేశారు. మోర్చా జాతీయ కన్వీనర్ జగ్జీత్‌సింగ్ దల్లెవాలా, జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు, దక్షిణ భారత రాష్ట్రాల సమన్వయకర్త కె.శాంతకుమార్, రైతు నాయకుడు పి.చెంగల్‌రెడ్డి, వివిధ రాష్ట్రాల నాయకులు మాట్లాడారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎంపీలతో పాటు ఎన్డీఏలోని బీజేపీయేతర ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. రైతుల సమస్యలపై ప్రైవేటు బిల్లు పెట్టాలని కోరుతామని చెప్పారు. కనీస మద్దతు ధరపై చట్టం కోసం ఫిబ్రవరి 13 నుంచి 4 చోట్ల నిరసనలు చేస్తున్నామని, 125 రోజులకు పైగా వేలాది మంది రైతులు రోడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నామని, వర్షాకాల పార్లమెంటు సమావేశాలకు ముందు ఢిల్లీలో రెండు భారీ సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతించారు. సాగు చట్టాలపై నిరసనల సందర్భంగా రైతులపై ప్రయోగించిన తూటాలు, బాష్పవాయు గోళాలను సమావేశంలో ప్రదర్శించారు. అభిమన్యు కోహర్, లక్వీందర్‌సింగ్ (హరియాణ), పీఆర్ పాండ్యన్ (తమిళనాడు), సూర్జిత్‌సింగ్ (యూపీ), జాఫర్‌ఖాన్, సుఖ్‌జిత్‌సింగ్ (ఢిల్లీ), గోవిందరెడ్డి (కర్ణాటక) తదితరులు పాల్గొన్నారు.




రైతులపై ప్రయోగించిన తుపాకి తూటాలను, బాష్పవాయు గోళి, రాకెట్ బాంబులను చూపిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

## విగ్రహాల ముసుగు తొలగేనా..?

- ఉద్యోగ సంఘాలతో మేయర్ చర్చలు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో విగ్రహాల ముసుగు తొలగించే దిశగా అడుగులు పడుతున్నాయి. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంస్థలోని ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన వారితో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట అభిప్రాయం చెప్పాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంతగ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన విగ్రహం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అప్పటి స్టాండింగ్ కమిటీలో నిర్ణయించారు. విగ్రహాన్ని తయారు చేయించి మేయర్ కార్యాలయం గేటు వైపు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగకముందే.. నాడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పోటీగా మహాత్మ గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తీసుకువచ్చి వైఎస్ విగ్రహం పక్కన పెట్టారు. ఇది వివాదాస్పదం కావడంతో మూడు విగ్రహాలకు ముసుగులు కప్పి ఉంచారు. దాదాపు దశాబ్దన్నర కాలంగా విగ్రహాల ముసుగులు అలానే ఉన్నాయి. సున్నిత అంశం కావడం.. కేసు కోర్టు విచారణలో ఉండడంతో వాటిని ఎవరూ ముట్టుకోలేదు. ముసుగులతో విగ్రహాలు ఉండడం ఇబ్బందికరంగా ఉందని భావించిన మేయర్ ముసుగుల తొలగింపునకు ఉపక్రమించారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. కార్యాలయ ప్రాంగణంలోని మరోచోట విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అభిప్రాయం తీసుకున్నారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే చాలని కొందరు చెప్పగా.. ఇంకొందరు మూడు విగ్రహాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై ఏకగ్రీవ నిర్ణయంతో రావాలని.. మరోసారి సమావేశం నిర్వహించనున్నట్టు విజయలక్ష్మి తెలిపారు.




ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చిస్తోన్న మేయర్ విజయలక్ష్మి



నాట్యం చేస్తున్న కళాకారులు

## 'మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు'

### ఆకుట్టుకున్న నృత్యరూపకం

రవీంద్రభారతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్ర్య సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు, స్ఫూర్తిదాయక జీవితాన్ని ఆవిష్కరిస్తూ ప్రదర్శించిన నృత్యరూపకం ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, శంకరానంద కళాక్షేత్ర ఆధ్వర్యంలో డాన్స్ థియేటర్ ప్రొడక్షన్‌లో రూపుదిద్దుకున్న 'మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు' నృత్యరూపకాన్ని శుక్రవారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. ప్రముఖ నర్తకీమణి, జాతీయ అవార్డుగ్రహీత ఆనంద శంకర్ జయంత్ దర్శకత్వం వహించిన ఈ ప్రదర్శన ప్రయోగాత్మకంగా సాగింది. చక్కటి నాట్యంతో కళాకారులు ఆకట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆవిష్కరించేలా సాగిన ఈ నృత్యరూపకం ప్రేక్షకుల్ని ఉద్వేగపరిచింది. 45 నిమిషాల పాటు ప్రదర్శించిన ఈ నాట్యం ఆహుతుల్ని అదరహో అనిపించింది. అల్లూరి సీతారామరాజు వీరత్వాన్ని ప్రదర్శించిన కళాకారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రమా భరద్వాజలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు.



ఎంబీఎస్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న అతిథులు

## ఎంబీఎస్ ప్రసాద్‌కు ముళ్లపూడి వెంకటరమణ స్మారక పురస్కారం

రవీంద్రభారతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగానికి ముళ్లపూడి వెంకటరమణ చేసిన సేవ ఎనలేనిదని వక్తలు అభివర్ణించారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శోభా ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ముళ్లపూడి వెంకటరమణ 94వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత ఎంబీఎస్ ప్రసాద్‌కు ముళ్లపూడి వెంకటరమణ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ డా.మోహన్ కందా హాజరై పురస్కారగ్రహీతను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముళ్లపూడి జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎస్వీ రామారావు, ముళ్లపూడి శ్రీదేవి, లంక లక్ష్మీనారాయణ, యాట సత్యనారాయణ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది.

## బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి: ఆశీష్

అఫ్జల్‌గంజ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడి ఇతర పార్టీలకు వెళ్లాల్సిన అవసరం లేదని త్వరలో మంచి రోజులు వస్తాయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో గోషామహల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆశీష్ కుమార్ యాదవ్ నేతృత్వంలో నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలతో కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశీష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... గోషామహల్‌లో బీఆర్ఎస్‌ను బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి శైలేష్ కురుమ, అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రధాని పీవీ నర్సింహా రావు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో టీపీసీసీ సెక్రెటరీ మనీలాల్‌షా, ఎల్ఎంసీ చైర్మన్ ప్రేమలత అగర్వాల్, భాస్కర్ రావు, శ్రీనివాస్, సునీత, మక్బూల్ భాయ్ పీవీ నర్సింహా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. -గోషామహల్, ఆంధ్రజ్యోతి

## వాహనం మిస్ అయిందా?

● ఇక్కడ ఉందేమో చెక్ చేసుకోండి ● 6 నెలలు దాటితే వేలం వేస్తాం

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో పోలీస్‌స్టేషన్లు, బస్తీల్లో వదిలేసిన సుమారు 160 ద్విచక్రవాహనాలను రాచకొండ పోలీసులు అంబర్‌పేట్‌లోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్ క్వార్టర్స్‌లో ఉంచారు. ఆరు నెలల వరకు వాహనం కోసం ఎవరూ రాకుంటే వేలం వేయాలని నిర్ణయించారు. వాహనాలు వదిలేసిన వారు, ఎక్కడైనా పోగొట్టుకున్న వారు తమ వాహనాలు అందులో ఉన్నాయేమో చూసుకోవాలని పోలీసులు సూచించారు. వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను www.rachakondapolice.telangana.gov.in(Citizen services– Abandoned vehicles–2024) వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆయా వాహనాల యజమానులు వాహనానికి సంబంధించిన ఆధారాలు చూపి తీసుకెళ్లే అవకాశముందని, వివరాలకు 8712662661, 8008338535లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## ప్రజావాణికి 494 దరఖాస్తులు


సమస్యలు తెలుసుకుంటున్న డా.చిన్నారెడ్డి, దివ్య

బేగంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి, ప్రత్యేక అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సమస్యలపై ఇచ్చిన వినతిపత్రాలను తీసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 494 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ పరమైనవి 125, హౌసింగ్ 43, పౌరసరఫరాల శాఖ 71, హోంశాఖ 45, పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించివి 47, ఇతర శాఖలకు చెందినవి 48 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

## బోనాల పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న ముషారఫ్ ఫరూఖీ

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీజీఎస్ పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఆలయాల వద్ద నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. శుక్రవారం ఆయన కార్పొరేట్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో బోనాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ జూలై 2 నాటికి సంబంధిత సీఈలు, ఎస్ఈలు ఆలయాలు, ప్రాంగణాలను సందర్శించి 24 గంటలపాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ప్రతీ ఆలయానికి నోడల్ అధికారి, ఏఈని కేటాయించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర జరిగే నెలరోజులపాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ సామగ్రిని ఏర్పాటు చేయాలన్నారు.ప్రధాన రహదారులు, లైన్లు, బై-లైన్లలో ప్రజలు గుమిగూడే చోట పోల్‌షాక్‌లను తనిఖీ చేయాలని, విద్యుత్ లీకేజీలు ఉండకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమీక్షలో ఇన్‌చార్జి డైరెక్టర్లు నందకుమార్, డాక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజనీర్లు సాయిబాబా, ఎల్.పాండ్య, శివాజీ, బిక్షపతి, ఆనంద్, సీజీఎం కృష్ణారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## మార్పులేని మోదీ వ్యవహారశైలి

● టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలు పూర్తి స్థాయి మెజారిటీ ఇవ్వకపోవడంతో ప్రధాని మోదీ వ్యవహారశైలిలో మార్పు వస్తుందని ఆశించిన వారికి నిరాశే మిగిలిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చి అందరినీ కలుపుకుని పోతారనే ఆశలు ఆవిరయ్యాయని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్‌గా మళ్లీ ఎన్నికైన ఓంబిర్లా మొదటి రోజునే ఎమర్జెన్సీపై తీర్మానం చదివించి కాంగ్రె‌స్‌ను టార్గెట్ చేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతిని స్వాగతించే సమయంలో రాజముద్రను ముందుగానే ఉంచి స్వాగతించడం రాచరిక వ్యవస్థకు నిదర్శనమని విమర్శించారు. బ్రిటిష్ వారు దేశాన్ని వదిలిపోయేటప్పుడు మార్పుకు సూచనగా లార్డ్ మౌంట్ బాటెన్ నెహ్రూకు రాజముద్రను అందజేశారని, అది బ్రిటిష్ రాచరిక వ్యవస్థకు చెల్లుతుందేమో గాని, ప్రజాస్వామ్య భారతదేశ వ్యవస్థలో ఈ సంప్రదాయం అనుసరించడం శోచనీయమని పేర్కొన్నారు.

## విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను జెన్కో ద్వారా నిర్మించాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టబోయే అన్ని థర్మల్, జల, సోలార్ విద్యుత్ ప్రాజెక్టలను ప్రభుత్వ రంగంలోని జెన్కో ద్వారా నిర్మించాలని కోరుతూ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శుక్రవారం ట్రాన్స్‌కో, జెన్కో సీఎండీకి వినతిపత్రం అందజేశారు. టీజీజీఈఎన్‌సీఓకి చెందిన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌ను మూసివేసి సుమారు 580 ఎకరాల స్థలాన్ని సింగరేణికి అప్పగించి సింగరేణితో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సాయిబాబు, వైస్ చైర్మన్‌లు వజీర్, అనిల్ కుమార్, నాయకులు వెంకటనారాయణరెడ్డి, ఈశ్వర్‌గౌడ్, నెహ్రూ, పి.సదానందం, ఎన్.సురేష్ కుమార్, పీవీ రావు, వేణుగోపాల్, కుమారస్వామి, మోజెస్ పాల్గొన్నారు.

## టీ పెట్టనందుకు కోడలిని హత్య చేసిన అత్తా, మామల అరెస్ట్

రాజేంద్రనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టీ పెట్టనందుకు కోడలిని హత్య చేసిన అత్త, మామలను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. హసన్‌నగర్ మదీనా మసీదు ప్రాంతానికి చెందిన ఫర్హానాబేగం, మహ్మద్ నూర్‌ల పెద్ద కుమారుడు అబ్బాస్ భార్య అజ్మేరీ బేగం(28) ఇళ్లలో పనిచేసేది. కొంతకాలంగా ఆమె పనిచేయడం మానేసి ఇంట్లోనే ఉంటున్నది. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. అజ్మేరీ బేగంను పనికి వెళ్లాలని భర్త, అత్త, మామలు వేధిస్తున్నారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. తనను భర్త వేధిస్తున్నాడని మహిళా మండలిలో ఫిర్యాదు చేసింది. ఇరు కుటుంబాల పెద్దలు కూర్చుని మాట్లాడారు. ఆ సమయంలో భర్త ఇక మీదట మంచిగా చూసుకుంటానని చెప్పడంతో అజ్మేరీ బేగం ఇద్దరు పిల్లలను తీసుకుని అత్తగారింటికి వచ్చింది. ఆ తర్వాత కూడా వేధింపులు ఆపలేదు. బక్రీద్ పండుగకు ఆమె పుట్టింటికి వెళ్లింది. తిరిగి అత్తగారింటికి రాలేదు. దీంతో భర్త అబ్బాస్ బతిమాలడంతో ఈ నెల 26న మధ్యాహ్నం పిల్లలతో కలిసి అత్తగారింటికి వచ్చింది. 27న ఉదయం పిల్లలను స్కూల్‌కు పంపించిన అజ్మేరీ బేగం ఇంట్లో పనిచేసుకుంటుండగా, అత్త ఫర్హానాబేగం టీ పెట్టమని కోరింది. ఆమె టీ పెట్టకపోవడంతో మహ్మద్ నూర్ సహాయంతో అజ్మేరీ బేగంను వెనకాల నుంచి చున్నీతో ఉరి వేసి హత్య చేశారు. మృతురాలి తల్లి కొండాపురం చోటీ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫర్హానా బేగం, నూర్‌లను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు.

## ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

● తల్లి మృతి, పిల్లల పరిస్థితి విషమం ● నిలోఫర్‌కు తరలింపు


ప్రియాంక

శంషాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్‌లో శుక్రవారం దారుణం చోటుచేసుకుంది. ఓ తల్లి ఇద్దరు పిల్లలకు విషమిచ్చి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరు పిల్లలను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సోమశేఖర్, ప్రియాంక(26) దంపతులు ఆర్బీనగర్ బస్తీలో అద్దెకుంటున్నారు. సోమశేఖర్ ఓ కొరియర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. అద్విక్(3), ఆరాధ్య(7 నెలలు) ఉన్నారు. భర్త డ్యూటీ ముగించుకొని ఇంటికొచ్చేసరికి భార్య ఉరివేసుకుంది. విషం ఇవ్వడంతో కొట్టుమిట్టాడుతున్న ఇద్దరు పిల్లలను బస్తీవాసులు నగరంలోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. కొడుకు అద్విక్ కోలుకుంటుండగా ఆరాధ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రియాంక పిల్లలకు విషం ఇచ్చి తాను ఎందుకు ఆత్మహత్య చేసుకుందన్న వివరాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్న శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ బాల్‌రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తాగునీటి పరీక్షలు మూడోవంతే!



● ప్రస్తుతం 4 వేల వరకే చేస్తున్న వాటర్‌బోర్డు
● గతంలో రోజుకు 12 వేలకు పైగా..
● వర్షాకాలంలో 25 వేల వరకు పరీక్షలు
● నీటి నాణ్యతలో క్వాలిటీ విభాగం డొల్లతనం
● మున్సిపల్ శాఖ ఆదేశాలు భేఖాతర్

గ్రేటర్‌లో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడం వాటర్‌బోర్డు లక్ష్యం కాగా, ఇందుకు భిన్నంగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారు. వాటర్‌బోర్డు పరిధి విస్తరించడంతోపాటు కనెక్షన్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నీటి నాణ్యత పరీక్షలు పెంచాల్సి ఉండగా క్రమేణా తగ్గిస్తున్నారు. వర్షాకాలంలో పరీక్షలు పెంచుతారా? లేదా? అనేది ఇప్పటికీ స్పష్టత లేదు.

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో సరఫరా అవుతున్న నీటిలో నాణ్యత ఉందా? లేదా? తేల్చడంలో వాటర్‌బోర్డు విఫలమవుతోంది. వర్షాకాలం నేపథ్యంలో తాగునీటి పరీక్షలు పెంచాల్సి ఉండగా అందుకు భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. గతంలో రోజూ 12 వేల నీటి పరీక్షలు చేయగా, ప్రస్తుతం 4 వేల వరకు చేస్తున్నామని వాటర్‌బోర్డు క్వాలిటీ విభాగం అధికారులే చెబుతున్నారు. తాగునీటిలో కలుషితజలాలు చేరి పలు బస్తీలు, కాలనీలు ప్రమాదంలో చిక్కుకున్న ఘటనలు జరిగినా అధికారులు ఏమాత్రం అప్రమత్తంగా లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. నీటి పరీక్షలు పెంచాలని మున్సిపల్ శాఖ నుంచి ఆదేశాలున్నా పట్టించుకోవడం లేదు. గ్రేటర్‌తో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని కోటిన్నరకు పైగా జనాభాకు వాటర్‌బోర్డు తాగునీటిని సరఫరా చేస్తోంది. వందల కిలోమీటర్ల దూరం నుంచి నగరానికి 2,656 మిలియన్ లీటర్ల నీటిని తీసుకొస్తున్నారు. ఇందులో కృష్ణాజలాలు 1,255 మిలియన్ లీటర్లు, గోదావరి జలాలు 772 మిలియన్ లీటర్లు, సింగూరు నుంచి 313 మిలియన్ లీటర్లు, మంజీర జలాలు 184 మిలియన్ లీటర్లు, ఉస్మాన్‌సాగర్ నుంచి 97 మిలియన్ లీటర్లు, హిమాయత్‌సాగర్ నుంచి 35 మిలియన్ లీటర్లు నిత్యం నగరానికి సరఫరా అవుతున్నాయి. ఈ నీటిని వివిధ దశల్లో శుద్ధి చేస్తున్నారు.

### కీలకంగా క్షేత్రస్థాయి పరీక్షలు

నగరంలో సరఫరా చేసేందుకు డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్‌లోకి నీరు చేరిన తర్వాత బూస్టర్ క్లోరినేషన్ చేస్తారు. నీటిని వివిధ ప్రాంతాలకు సరఫరా చేసే క్రమంలో కూడా నీటి పరీక్షలు చేస్తారు. ప్రతీ ఇంటికి సరఫరా చేసే నీటిలో సాధారణంగా రెసిడ్యూల్ క్లోరిన్ స్థాయి 0.2 పీపీఎం నుంచి 0.5 పీపీఎంగా ఉండాలి. పరీక్షల్లో ఏమాత్రం తేడా వచ్చినా నీటిని నిలిపివేస్తారు. తాగేనీటిలో రెసిడ్యూల్ క్లోరిన్ స్థాయి అధిక మోతాదులో ఉంటే వాంతులవడం, గొంతునొప్పి, ఛాతీనొప్పి, కళ్లు దురదగా ఉండడం, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.

### వర్షాకాలంలో పరిస్థితేంటి..?


చిన్న వర్షానికే నగరం అతలాకుతలం అవుతున్నది. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మెరుగైన తాగునీటి సరఫరా సాధ్యమవుతుందా..? సరఫరా చేసే నీటి నాణ్యత పరీక్షలు పెంచుతారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అత్యధిక ప్రాంతాల్లో మురుగు పైపులైన్, తాగునీటి పైపులైన్‌లు పక్కపక్కనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక దానిపైనే మరొకటి ఉన్నాయి. తాగునీటి పైపులైన్లకు చాలా ప్రాంతాల్లో లీకేజీలు ఉన్నాయి. వర్షం వచ్చినప్పుడు మురుగంతా కలిసే అవకాశముంది. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో తాగునీటికి బదులు కుళాయి ద్వారా మురుగునీరు వస్తున్నది. ఈ పరిస్థితుల్లో వాటర్‌బోర్డు క్వాలిటీ విభాగం, ఈపీటీఆర్ఐ, ఐపీఎం, ఐహెచ్ఎస్ఎంఏఎస్ లాంటి సంస్థలు పరీక్షలు నిర్వహించి వివిధ ప్రాంతాల్లో రెసిడ్యూల్ క్లోరిన్, కెమికల్ అండ్ బ్యాక్టీరియా స్థాయిలను తెలుసుకోవాల్సి ఉంది. గతంలో మాదిరిగా క్షేత్రస్థాయి సిబ్బంది, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో రోజుకు 25 వేల పరీక్షలు చేసేందుకు చర్యలు చేపడితే తాగునీటి నాణ్యతపై నగరవాసులకు భరోసా కలుగుతుంది. లేకుంటే భోలక్‌పూర్, మాదాపూర్, మైలార్‌దేవ్‌పల్లి ఘటనలు పునరావృతమయ్యే అవకాశాలున్నాయి.

# ఆర్ఆర్ఆర్‌తో మౌలిక సదుపాయాల వృద్ధి

● రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ● ఐఐఐడీ షో కేస్ ఇన్‌సైడర్ ఎక్స్-2024 ప్రదర్శన ప్రారంభం


ఐఐఐడీ షో కేస్ ఇన్‌సైడర్ ఎక్స్-2024 ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ప్రారంభంతో హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు గణనీయంగా వృద్ధి చెందనున్నాయి. కేంద్ర ప్రభుత్వంతో ఇప్పటికే ఆర్ఆర్ఆర్ గురించి మాట్లాడాం. మరో 3-4 నెలల్లో ఈ పనులు ప్రారంభంకానున్నాయన్నారు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ) హైదరాబాద్ రీజనల్ చాప్టర్ నిర్వహిస్తున్న ఐఐఐడీ షో కేస్ ఇన్‌సైడర్ ఎక్స్-2024 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పై వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు హైటెక్స్ ప్రాంగణంలో జరగనున్న ఈ బీ 2 బీ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించి ఎగ్జిబిషన్ నిర్వహణ తీరును ప్రశంసించారు. ఇటీవలకాలంలో ఆర్కిటెక్ట్ పాత్ర గృహ రూపకల్పనలో కీలకంగా మారిందన్న ఆయన, తెలంగాణ కళాకృతులకు సైతం ఈ ప్రదర్శనలో స్థానం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇప్పుడు దేశంలోని కీలక మెట్రోలలో ఒకటిగా వెలుగొందుతున్నప్పటికీ, ఆర్ఆర్ఆర్ తర్వాత దేశంలోనే అత్యంత కీలకమైన మెట్రో నగరంగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్ట్‌తో పర్యాటకపరంగా కూడా హైదరాబాద్‌ను అందంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయ, సహకారాలను అందించేందుకు తామెప్పుడూ సిద్ధంగానే ఉంటామని ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ హరిచందన అన్నారు. కార్యక్రమంలో ఐఐఐడీ హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ పల్లవి అంచూరి, డిజైన్ షో కేస్ కన్వీనర్ రాకేష్ వాసు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శన చివరి రోజు సాధారణ సందర్శకులకు సైతం అనుమతి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



టీజీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్

## ఇంటి కరెంట్ బిల్లు లెక్క చూసుకోవచ్చు..!

● ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో కొత్త ఆప్షన్

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు ఏవైనా సంస్థ వెబ్‌సైట్, టీజీఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా పరిష్కరించుకునే కొత్త ఆప్షన్‌ను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) అందుబాటులోకి తెచ్చింది. సంస్థ వెబ్‌సైట్ (tgsouthernpower.org)లోని హాట్ లింక్స్‌లో ఎనర్జీ చార్జెస్ క్యాలికులేటర్ ఫర్ డొమెస్టిక్ సర్వీసెస్ ఆప్షన్ వస్తుంది. దానిపై క్లిక్ చేయగానే ఎనర్జీ చార్జెస్ క్యాలిక్‌లేటర్ ఫర్ డొమెస్టిక్ సర్వీసెస్ అని ఓపెన్ అవుతుంది. అందులో గత నెల రీడింగ్ తేదీ, నమోదైన రీడింగ్, ప్రస్తుత నెల రీడింగ్ తేదీ, మీటర్‌లో నమోదైన రీడింగ్ వివరాలు నమోదు చేసి కింద ఉన్న క్యాలిక్‌లేట్ ఎనర్జీ చార్జెస్‌పై క్లిక్ చేయాలి. వెంటనే ఆ నెలలో మొత్తం ఎన్ని రోజులు..? మీకు ఎన్నిరోజులకు బిల్లు తీశారు, మొత్తం వాడిన యూనిట్లు, సగటు బిల్లింగ్ లెక్కలు కనిపిస్తాయి.

# త్వరలోనే భారతదేశపు బ్లూ ఎకానమీ విధానం

● ఫ్లో నిర్వహించిన సదస్సులో ప్రఫుల్ తలేరా


సదస్సును ప్రారంభిస్తున్న ప్రఫుల్ తలేరా తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సముద్రమార్గం ప్రపంచాన్ని ఎంతగా కలిపిందో, అంతగా మన దేశ సంపదను తరలించుకుపోయేలాగానూ చేసింది. బ్రిటీషర్లు మన దేశంలోకి ప్రవేశించింది ఈ మార్గంలోనే! అజ్మల్ కసబ్ లాంటి ఉగ్రవాదులు ప్రవేశించిందీ ఈ మార్గంలోనే. సముద్రం నుంచి వచ్చే ముప్పు చాలా పెద్దది. మరీ ముఖ్యంగా నిత్యం మారుతున్న భౌగోళిక-రాజకీయ పరిస్థితులలో ఇది సమస్యాత్మకంగానూ నిలిచింది. అందువల్ల మనం బ్లూ ఎకానమీ పై దృష్టి సారించాల్సి ఉందని అన్నారు బ్లూ ఎకానమీ నిపుణులు, మారిటైమ్ రీసెర్చ్ సెంటర్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు ప్రఫుల్ తలేరా. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఫ్లో) శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన 'బియాండ్ హారిజన్స్ : ఏ మెరైన్ ఒడెస్సీ టు ఎండ్‌లెస్ పాజిబిలిటీస్' సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిటైమ్ రంగంలో ఆవిష్కరణ అంటే సాంకేతికత మాత్రమే కాదన్న ఆయన భావి తరాలకు ఆహ్లాదకరమైన ప్రకృతిని అందించడంలోనే అది ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటరిగా నౌకాయానం చేసి ప్రపంచాన్ని చుట్టి వచ్చిన మొదటి భారతీయుడు కెప్టెన్ దిలిప్ దోండే, ఐఎన్ఎస్‌వీ తరిణిలో విధులు నిర్వహించిన తెలుగు వ్యక్తి ఐశ్వర్య బోడపాటి, ఫ్లో హైదరాబాద్ చైర్‌పర్సన్ రిధి జైన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐశ్వర్య ఇండియన్ నేవీలో తమ పది సంవత్సరాల అనుభవాలను వివరించారు.

# టెన్త్ సప్లిమెంటరీలో 71.22 శాతం ఉత్తీర్ణత

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. వార్షిక ఫలితాల్లో మాదిరిగానే బాలుర కంటే మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు. సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా నుంచి 10,694 మంది, రంగారెడ్డిలో 4,874, మేడ్చల్‌లో 4,881 మంది హాజరయ్యారు.

సప్లిమెంటరీ ఫలితాలు ఇలా..

| జిల్లా | హాజరు | ఉత్తీర్ణత | శాతం |
|---|---|---|---|
| హైదరాబాద్ | 10,694 | 7,616 | 71.22 |
| రంగారెడ్డి | 4,847 | 3,801 | 77.99 |
| మేడ్చల్ | 4,881 | 4,248 | 87.03 |

హైదరాబాద్ జిల్లాలో 6,597 మంది బాలురు పరీక్ష రాయగా, 4,547 మంది(68.93 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 4,097 మందికి 3,069 మంది (74.91 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 3,188 మంది బాలురు పరీక్ష రాయగా, 2,435 మంది (76.38 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 1,686 మందికి 1,366 మంది(81.02 శాతం) ఉత్తీర్ణులయ్యారు. కాగా, మేడ్చల్ జిల్లాలో 3,088 మంది బాలురు పరీక్ష రాయగా, 2,680 మంది (86.79 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 1,793 మందికి 1,568 మంది (87.45 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

## నగరంలో మోస్తరు వర్షం

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పొడి వాతావరణం ఏర్పడినప్పటికీ సాయంత్రం 6 గంటల తర్వాత ఒక్కసారిగా చల్లదనం ఏర్పడింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. మల్కాజిగిరి, ఉప్పల్, మారేడ్‌పల్లి, వెంగళ్‌రావునగర్, ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. కాగా, అడ్డగుట్ట, ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో అత్యధికంగా 1.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మల్కాజిగిరిలోని మధుసూదన్‌నగర్, వినాయక్‌నగర్‌లో 1.0, లాలాపేట్‌లో 9.3 మిల్లీమీటర్లు పడింది.

## నేడు బోడుప్పల్ మేయర్‌పై అవిశ్వాసం

● కాంగ్రెస్‌కు మద్దతుగా 22 మంది కార్పొరేటర్లు

ఉప్పల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లపై శనివారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. వీరిపై అవిశ్వాసం తెలుపుతూ నెల రోజుల క్రితం కాంగ్రెస్ కార్పొరేటర్ల బృందం 22 మంది కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీని ఆధారంగా మేడ్చల్ కలెక్టర్ ఈ నెల 6న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సమయమిచ్చారు. తీర్మానం నోటీసులో ఓ కార్పొరేటర్ సంతకం సరిపోలడం లేదని కొందరు కోర్టుకెళ్లిన నేపథ్యంలో న్యాయస్థానం స్టే విధించి వాయిదా వేసింది. తదుపరి విచారణ అనంతరం అవిశ్వాస తీర్మానానికి సమ్మతించారు. దాంతో శనివారం అవిశ్వాస తీర్మానానికి నిర్ణయించడంతో క్యాంపులో ఉన్న 22 మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు తిరిగి నగరానికి చేరుకున్నట్లు సమాచారం. బోడుప్పల్ కార్పొరేషన్‌లో మొత్తం 28 మంది కార్పొరేటర్లు ఉండగా, ఇందులో 22 మంది కాంగ్రెస్, ఐదుగురు బీఆర్ఎస్, ఒకరు బీజేపీకి చెందిన వారు ఉన్నారు. ప్రస్తుతమున్న మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాసం నెగ్గిన తర్వాత మేడ్చల్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన తోటకూర వజ్రేష్‌యాదవ్ కుమారుడు స్థానిక బోడుప్పల్ కౌన్సిలర్ తోటకూర అజయ్ యాదవ్ మేయర్‌గా ఎన్నికయ్యే అవకాశాలున్నాయి.

## అవి పడేయాల్సిన ఆహార పదార్థాలు..!

● నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తాం : లులు మాల్ యాజమాన్యం

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో గుర్తించిన ఆహార పదార్థాలు గడువు ముగిశాయని గుర్తించి తాము పక్కన పెట్టినవే అని లులు మాల్ యజమాన్యం ప్రకటించింది. వినియోగదారులకు నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులు అందించేందుకు తాము ప్రాధాన్యతనిస్తామని పేర్కొన్నారు. సురక్షిత ఆహార పదార్థాలు అందించాలన్న ప్రభుత్వ విభాగాల నిబంధనలు తప్పకుండా పాటిస్తామన్నారు. కూకట్‌పల్లి లులు మాల్‌లో కాలం చెల్లిన పదార్థాలు గుర్తించినట్టు ఉన్న ఫొటోలు.. తాము పడేసేందుకు పక్కన పెట్టామన్నారు.

# ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు వినతిపత్రం ఇస్తున్న తిరుపతి

తార్నాక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేయకుండానే నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీరింగ్ బీ కేటగిరి సీట్లను భర్తీ చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ప్రొ.శ్రీరామ్‌వెంకటేశ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# జలవనరుల సంరక్షణకు ఏఐ దోహదం

● ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం ● జేఎన్‌టీయూలో 'ఏఐ వార్' వర్క్‌షాప్


ప్రొఫెసర్ జీకే విశ్వనాథ్ దంపతులతో ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తరిగిపోతున్న జలవనరులను సంరక్షించుకునేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎంతగానో దోహపడుతుందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ బుర్రా వెంకటేశం అన్నారు. సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ జీకే విశ్వనాథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా 'ఏఐ వార్' పేరిట ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పరిశ్రమల నిర్వహణ, వాతావరణంలో మార్పులు, నీటి వనరుల నిర్వహణ వంటి అంశాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కీలకపాత్ర పోషించనుందని చెప్పారు. అలాగని, సంప్రదాయక ఇంజనీరింగ్ కోర్సులను అలక్ష్యం చేయడం తగదని సూచించారు. ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నీటికోసం కొన్ని ప్రాంతాల మధ్య, దేశాల మధ్య యుద్ధాలు జరిగే అవకాశం లేకపోలేదన్నారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు వనరులను అభివృద్ధి చేసేందుకు ఏఐ ఆధారిత పరిశోధనలు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ మహేశ్వరన్ మాట్లాడుతూ నీటి లభ్యత, నాణ్యతను తెలుసుకోవడానికి, పరిస్థితులను అంచనా వేసేందుకు కృత్రిమ మేధస్సు ఎంతగానో సహాయపడుతుందన్నారు. ఏఐ అప్లికేషన్స్‌తో భూగర్భ జల స్థాయిలను కూడా పర్యవేక్షించవచ్చని, కరువు లేదా వరదలు వచ్చే పరిస్థితులను మరింత కచ్చితత్వంతో ముందుగానే అంచనా వేయవచ్చని పేర్కొన్నారు.

### ప్రొఫెసర్ విశ్వనాథ్‌కు ఘనసన్మానం

శనివారం ఉద్యోగ విరమణ చేయనున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ జీకే విశ్వనాథ్‌ను ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, రెక్టార్ విజయకుమార్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆచార్యుడిగా విద్యార్థులకు కొత్త విషయాలను నేర్పించేందుకు తన వంతు కృషి చేశానన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ ఎంవీఎస్ గిరిధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూ క్యాంటీన్ కాంట్రాక్ట్ రద్దు

● రిజిస్ట్రార్‌కు ఇన్‌చార్జి వీసీ ఆదేశం

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ క్యాంటీన్ కాంట్రాక్టర్‌పై వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ బుర్రా వెంకటేశం కొరడా ఝుళిపించారు. ఈ నెల 26న వర్సిటీ క్యాంటీన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి కేసులు నమోదు చేయడంతో సదరు కాంట్రాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని రిజిస్ట్రార్‌ను వీసీ ఆదేశించారు. క్యాంటీన్ నిర్వహణకు అవసరమైన లైసెన్స్ లేకపోవడం, అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు వండడం, కాలంచెల్లిన పిండితో తయారు చేసిన వంటకాలు విద్యార్థులకు ఇస్తున్నట్లు తేలడంతో క్యాంటీన్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులపై వైస్‌చాన్స్‌లర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారంలోగా కొత్త టెండర్లను పిలవాలని సూచించారు. ఇదిలా ఉంటే.. యూనివర్సిటీ/కాలేజీల్లో వివిధ రకాల పనులకు సంబంధించి పలు కాంట్రాక్టుల గడువు ముగిసినా, ఏళ్ల తరబడి కొత్త టెండర్లు పిలవకుండా పాతవారినే కొనసాగిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. క్యాంటీన్ మాదిరిగానే ఇతర(సెక్యూరిటీ, స్వీపింగ్, జిరాక్స్. తదితర) పనులకు సంబంధించి.. గడువు ముగిసిన కాంట్రాక్ట్‌లపైన కూడా వైస్ చాన్స్‌లర్ దృష్టి సారించాలని కోరుతున్నారు.



భాగేకం నింబుజం తోయం షడ్భాగః శర్కరోదకం!
లవంగ మరితోన్మిశ్రం పానకం పానకోత్తమం!

క్షేమ కుతూహలం

# ఆయుర్వేద పద్ధతిలో నిమ్మ షర్బత్

షర్బత్ అంటే నీళ్లు, పంచదార కలిపిన తియ్యని పానీయం అని అర్థం. ఆ షర్బత్‌లో నిమ్మ రసం కలిపితే కమ్మని నిమ్మ పండు షర్బత్ అవుతుంది. 'షర్బత్' సంస్కృత పదమని, అందరికీ ఇష్టమైనదనే అర్థంలో 'సర్వత్' అనే పదం 'షర్బత్'గా ఉత్తరాది నుంచి వచ్చిందని, అరబ్బీ, పర్షియన్ భాషల్లోకి ఇక్కడి నుంచే వెళ్లిందనీ చెప్తారు. ఇక నిమ్మ షర్బత్ గురించి చర్చించాల్సింది చాలా ఉంది.

నిమ్మ రసం ఆహార ద్రవ్యం. పులుపు కోసం ఆహార పదార్థాల్లో కలుపుతాం. ఇది ఔషధ ద్రవ్యం కూడా. నిమ్మ రసంతో మర్దించి అనేక ఆయుర్వేద ఔషధాలు తయారు చేస్తారు. లోహాలతో, ఖనిజాలతో తయారయ్యే రసౌషధాల తయారీలో శుద్ధి కోసం కూడా వాడతారు. కఠినమైన లోహాలనే శుద్ధి చేస్తుందంటే... మన కడుపుని ఇంకెంత శుద్ధి చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. జీర్ణకోశ వ్యాధుల్లో దీని ప్రభావం ఎక్కువ. పుల్లని ఔషధం. నిమ్మ పండు తినటానికి, నిమ్మ రసం తాగటానికి ఏమాత్రం సంకోచించనక్కర్లేదు.

నిమ్మ రసాన్ని వేడి చేస్తే మంచి గుణాలు హరిస్తాయి. వేడి నీళ్లలో నిమ్మరసం కలిపితే దాని గుణాలు పెరుగుతాయి.

**నిమ్మని కాయగూరల జాబితాలో చేర్చాలా? ఫల వర్గాల జాబితాలో చేర్చాలా? లేక ఔషధ వర్గాల్లోనా? అనే మీమాంస మొదటి నుంచీ ఉంది. ఆయుర్వేద సంహితాకారుల్లో కూడా చరకుడు దీన్ని పుల్లని రుచి కలిగిన కూరగాయల్లో చేరిస్తే, సుశ్రుతుడు, వాగ్భటుడు ఫల వర్గంలో చేర్చారు.**

స్థూలకాయం తగ్గుతుందని పొద్దున్నే వేడి నీటిలో నిమ్మ రసం కలిపి తాగే అలవాటు చాలామందికి ఉంది. ఇందులో తేనె లేదా పంచదార, కొంచెం సోడా ఉప్పు, ఉప్పు కలిపి తాగితే దప్పిక తీరటమే కాదు వడదెబ్బ కొట్టకుండా కాపాడుతుంది.

నిమ్మ రసానికి ఇనుమును స్వీకరించే గుణం ఉంది. రక్తహీనత ఉన్నవారికి గొప్ప ఔషధం ఇది. జిడ్డు తొలగిస్తుంది. చర్మానికి వర్ఛన్నిచ్చి, ప్రకాశవంతం చేస్తుంది. మానసిక ఒత్తిడిని, బీపీనీ అదుపు చేస్తుంది. సి-విటమిన్ కోసం ఆధారపడదగిన ఫలం నిమ్మ. దీన్ని కాచడం గానీ, ఉడికించటం గానీ చెయ్యకూడదు. అలా చేస్తే... సి-విటమిన్ ఎగిరిపోతుంది. క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో నిమ్మకాయ షర్బత్ తయారు చేసే విధానాన్ని ఇలా వివరించాడు...

ఒక భాగం నిమ్మ రసానికి ఆరు భాగాలు పంచదార జత చేయాలి. అందులో లవంగాలు, మిరియాల పొడి తగినంత చేర్చి, బాగా కలపాలి. ఈ మిశ్రమానికి ఎంత కావాలో అంత చల్లని నీటిని కలుపుకుంటే అదే నిమ్మ షర్బత్.

నీళ్లు కలపటానికి కొలత ఏమీ లేదు. తీపి, పులుపులను చూసుకుంటూ కలపాలి. ఇదే నిమ్మపండు పానకం. ఇంగ్లీషువాళ్లు దీన్ని 'లెమనేడ్' అంటారు.



ఇది మౌలికంగా పుల్లని ద్రవ్యం అయినప్పటికీ, చింతపండులా వేడి చెయ్యదు. చింతపండు ఆహార ద్రవ్యాన్ని కష్టంగా అరిగేలా మారుస్తుంది. కానీ నిమ్మ రసం కలిపితే తేలికగా అరిగేలా చేస్తుంది. వేగంగా శరీరం అంతా వ్యాపించేలా చేస్తుంది. నోటిని, గొంతును శుద్ధి చేస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. దప్పిక తీరుస్తుంది. వాంతి, వికారాలను ఆపుతుంది. కడుపులో నొప్పిని హరిస్తుంది. వాత వ్యాధులున్నవారు సాధ్యమైనంతగా పులుపు వాడకాన్ని తగ్గించాలి. చింతపండుకి బదులుగా నిమ్మరసాన్ని పరిమితంగా వాడుకుంటే కీళ్ల నొప్పులు చాలావరకూ తగ్గుతాయి. కఫాన్ని తగ్గించే గుణం కూడా ఉంది కనుక దగ్గు, జలుబులు వచ్చినప్పుడు ఒక కప్పు వేడి నీళ్లలో నిమ్మ రసం కలిపి తాగటం ఉత్తమం.

నిమ్మకాయ లేదా నిమ్మపండు ఏదైనా ఒకటే! పండినా పులుపులో మార్పేమీ ఉండదు.

నింబజా ఫలభవం పానమత్యమ్లం వాతనాశనమ్!
హృద్యం రుచికరం భవ్యం సర్వాహారస్య పాచకమ్!

క్షేమశర్మ దీన్ని 'సర్వాహార పాచకం' అన్నాడు. కష్టంగా అరిగే నూనె పదార్థాలు, పులావు, బిర్యానీలు తిన్నప్పుడు దీన్ని తాగితే తేలికగా అరిగేలా చేస్తుందని దీని భావం. ఆయిల్ ఫుడ్స్ ఎక్కువగా తినేవారు... నిమ్మ రసం షర్బత్ తాగితే జిడ్డు త్వరగా వదిలి, పేగులు దెబ్బతినకుండా ఉంటాయి. నిమ్మ షర్బత్‌ని పులపుల్లగా ఉండేలా తాగితేనే మంచిది. అతిగా నీళ్లు కలపనవసరం లేదు. ఇది గుండెకు మేలు చేస్తుంది. రుచిని పెంచుతుంది. ఎసిడిటీ సమస్యతో బాధపడేవారు, అల్సర్లున్నవారు తప్ప అందరూ తీసుకోదగిన పానీయం. విపరీతంగా జలుబు, పడిశ భారం, పొడి దగ్గు, గొంతు బొంగురు పోవటం లాంటి సమస్యల్ని ఇది చక్కగా నివారిస్తుంది. లవంగం, మిరియాలపొడి కలపటాన్ని మరిచిపోకండి! ఇవి రెండూ కేవలం రుచివర్ధకాలు మాత్రమే కాదు కఫహరాలు కూడా! వాతాన్నీ హరిస్తాయి. అనుకున్నంత వేడి చేయవు. అన్నం తిన్న తరువాత దీన్ని తాగితే ఎసిడిటీ పెరక్కుండా ఉంటుంది.

• గంగరాజు అరుణాదేవి



వంటిల్లు

**రొయ్యలతో చేసే వంటకాలు రుచికరమే కాదు... ఆరోగ్యకరం కూడా. ఇందులో విటమిన్లు, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. రొయ్యల బిర్యానీ, గోంగూర రొయ్యల కూర, క్రిస్పీ గోల్డెన్ ఫ్రై ప్రాన్స్ రెసిపీలు మీ కోసం...**

# రుచికరమైన రొయ్యల వంటలు!

## రొయ్యల బిర్యానీ

**కావాల్సిన పదార్థాలు:** బాస్మతి బియ్యం- 2 కప్పులు, రొయ్యలు- అర కేజీ, ఉల్లిపాయలు- 4 (పొడవుగా ముక్కలు కట్ చేసుకోవాలి), వేయించిన ధనియాలు- 2 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- 1 టీస్పూన్, మిరియాలు- ముప్పావు టీస్పూన్, ఇలాచి- 8, లవంగాలు- 8, దాల్చిన చెక్క- 2 (వేలంత పొడవు ఉండేంత), ఉప్పు- రుచికి తగినంత, పసుపు- కొద్దిగా, కారం- రెండు టేబుల్ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్- రెండు టేబుల్ స్పూన్లు, పుదీనా- రెండు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- రెండు టేబుల్ స్పూన్లు, నిమ్మరసం- ముప్పావు టీస్పూన్, పెరుగు- అరకప్పు, పచ్చిమిర్చి- 3, బిర్యానీ ఆకు- 1, సాజీరా- ముప్పావు టీస్పూన్, నెయ్యి- టేబుల్ స్పూన్,

**తయారీ విధానం:** బిర్యానీ చేయటానికి ముందు బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా కడిగి నలభై నిముషాల పాటు మంచి నీళ్లలో నానబెట్టుకోవాలి. ఉల్లిపాయలను డీప్‌ఫ్రై చేసుకుని పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత చిన్న జార్‌లో ధనియాలు, నాలుగు ఇలాచి, జీలకర్ర, నాలుగు లవంగాలు, మిరియాలు, ఒక దాల్చిన చెక్క వేసి మిక్సీ పట్టాలి. ఈ మసాలా పౌడర్‌ను పక్కన ఉంచుకోవాలి.

పసుపు కొద్దిగా, తగినంత ఉప్పు, కారం పొడి వేసి రొయ్యలకు పట్టేట్లు కలపాలి. ఆ తర్వాత తయారు చేసుకున్న మసాలా పౌడర్, డీప్ ఫ్రై చేసిన సగం ఉల్లిపాయ ముక్కలను వేశాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాలి. పచ్చిమిర్చి తర్వాత పుదీనా, కొత్తిమీర కొద్ది కొద్దిగా వేయాలి. ఆ తర్వాత నిమ్మరసం వేశాక.. పెరుగు వేయాలి. ఈ మిశ్రమాన్నంతా బాగా కలిపాక.. గంటపాటు మారినేట్ చేసుకోవాలి.

గిన్నెలో సగానికి నీళ్లు తీసుకుని కొద్దిగా వేడయ్యాక.. బిర్యానీ ఆకు, ఇలాచి, లవంగాలు, సాజీరా వేసి.. తగినంత ఉప్పు, నెయ్యి వేసి మీడియం ఫ్లేమ్‌లో పది నిముషాల పాటు కుక్ చేయాలి. ఆ ఉడికే నీళ్లలో నానబెట్టుకున్న బాస్మతి బియ్యం మాత్రమే వేయాలి. మూత ఉంచి గరిటెతో 80 శాతం వరకూ బియ్యాన్ని ఉడికించుకోవాలి. ఈ లోపు మరో పెద్ద కడాయిలో కొద్దిగా నూనె వేసి మారినేట్ చేసుకున్న రొయ్యల మిశ్రమాన్ని వేయాలి. ఆ బౌల్‌లో కొద్దిగా నీళ్లు పోసి తిప్పిన తర్వాత ఆ నీళ్లను రొయ్యల మిశ్రమం మీద వేయాలి. పుదీనా, కొత్తిమీర



చల్లుకున్న తర్వాత మిగిలిన డీప్‌ఫ్రై చేసిన ఉల్లిపాయలు వేయాలి. ఈ లోపు ఉడికిన బియ్యంలోని నీళ్లను వార్చిన తర్వాత ఆ బియ్యాన్ని- రొయ్యల మిశ్రమం మీద వేయాలి. ఈ బియ్యం మీద కొద్దిగా నెయ్యి అన్ని వైపులా చల్లిన తర్వాత.. స్టవ్ ఆన్ చేయాలి. పెద్ద కడాయి మీద మూత ఉంచి.. మూత చివర గోధుమపిండితో క్లోజ్ చేయాలి. హైఫ్లేమ్‌లో పది నిముషాల పాటు ఉడికించుకోవాలి. ఆ తర్వాత స్టవ్‌మీద పెనం ఉంచి దాని మీద కడాయిని ఉంచాలి. దీని వల్ల రొయ్యలు మాడిపోవు. ఐదు నిముషాల పాటు ఉడికించుకోవాలి. స్టవ్ కట్టేశాక.. చివరగా పదిహేను నిముషాల పాటు మూత తీయకుండా అలానే ఉంచాలి. రొయ్యల బిర్యానీ రెడీ.

## గోంగూర రొయ్యల కూర



**కావాల్సిన పదార్థాలు:** పొట్టు తీసిన రొయ్యలు- కేజీ, కారం- రెండు స్పూన్లు, ఉప్పు రుచికి తగినంత, పసుపు- టీస్పూన్, నూనె- రెండున్నర టేబుల్ స్పూన్స్, మీడియం సైజ్ ఉల్లిపాయలు- 3 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 5 (నిలువుగా కోయాలి), అల్లం, వెల్లుల్లి పేస్ట్- టేబుల్ స్పూన్, టమోటాలు-2 (సన్నగా తరగాలి), గోంగూర పేస్ట్- టేబుల్ స్పూన్,

**తయారీ విధానం:** మొదట రొయ్యలను శుభ్రం చేసి ఒక బౌల్‌లో తీసుకోవాలి. ఇందులో ఒక స్పూన్ కారం, కొద్దిగా ఉప్పు, చిటికెడు పసుపు వేసి రొయ్యలకు పట్టేట్లు బాగా కలపాలి. ఆ తర్వాత ప్యాన్‌లో ఒక స్పూన్ నూనె తీసుకుని కాస్త వేడయ్యాక.. రొయ్యలు వేసి కలపాలి. ప్యాన్‌పై మూత ఉంచి.. మీడియం ఫ్లేమ్‌లో ఉడికించుకోవాలి. రొయ్యల్లోని నీరు బయటకు వస్తుంది. ఆ నీరు పోయేంత వరకు గరిటెతో కదుపుతూ ఉడికించుకోవాలి. ఆ తర్వాత వీటిని ప్లేట్‌లో వేసి పక్కన ఉంచుకోవాలి.

మరో ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి కాస్త వేడయ్యాక.. తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, ఉప్పు, కొద్దిగా పసుపు వేసి మీడియం ఫ్లేమ్‌లోనే కలపాలి. మూత ఉంచి.. నాలుగు నిముషాల పాటు కుక్ చేయాలి. ఉల్లిపాయల రంగు మారిన తర్వాత అల్లం వెల్లులి పేస్ట్ వేసి ఆ పచ్చివాసన పోయేంత వరకూ గరిటెతో కదపాక.. టమోటా ముక్కలతో పాటు గ్రైండ్ చేసిన గోంగూర పేస్ట్ వేసి కలపాలి. ప్యాన్‌పై మూత ఉంచి ఐదు నిముషాల పాటు కుక్ చేశాక.. గరిటెతో కదిపిన తర్వాత స్పూన్ కారం, తగినంత ఉప్పు, గరం మసాలా వేసి కలపాలి. గ్రేవీకి అవసరమైన నీళ్లు కొన్ని తీసుకుని గరిటెతో కలపాలి. ప్యాన్‌మీద మూత ఉంచి ఐదు నిముషాల పాటు ఉడికించుకోవాలి. కొద్దిగా నీళ్లు చూసుకుని వేసుకున్న తర్వాత.. గరిటెతో కదపాలి. చివరగా పక్కన ఉంచిన రొయ్యలను ఇందులో వేయాలి. గరిటెతో కదిపాక ఉప్పు, కారం సరిచూసుకున్న తర్వాత ప్యాన్‌పై మూత ఉంచి ఐదు నిముషాల పాటు కుక్ చేయాలి. చివరగా గరిటెతో రెండు నిముషాలు కదిపిన తర్వాత అన్నంలోకి వేడివేడిగా వడ్డించుకుని తినటమే తరువాయి.

## క్రిస్పీ గోల్డెన్ ఫ్రై ప్రాన్స్

**కావాల్సిన పదార్థాలు**

పొట్టు తీసేసిన పెద్ద రొయ్యలు- అరకేజీ, పెప్పర్ పొడి- అర టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, మైదా- కప్పు, కోడిగుడ్లు- రెండు, సన్నటి బ్రెడ్ ముక్కల పొడి- కప్పు,

**తయారీ విధానం**

బౌల్‌లో రొయ్యలు వేసి పెప్పర్ పొడి, ఉప్పు వేసి కలపాలి. నలభై నిముషాల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. చతురస్రాకారం బాక్సులో మైదా వేశాక కొద్దిగా పెప్పర్ పొడి, చిటికెడు ఉప్పు వేసి కలపాలి. మరో బాక్సులో రెండు కోడిగుడ్ల సొనను వేసి మ్యాష్ చేయాలి. మరో బాక్సులో బ్రెడ్ ముక్కలను వేసుకోవాలి. ఇపుడు మైదాలో రొయ్యలను వేసి బాగా కలపాలి. పిండి అంటుకుంటుంది.

ఈ రొయ్యలను ఒక్కోదాన్ని కోడిగుడ్ల సొనలో ముంచి చివరగా బ్రెడ్ ముక్కల్లో వేసి ముక్కలు అతుక్కునేట్లు రొయ్యలను కదపాలి.

ఈ రొయ్యలను అన్నింటిని ఒక ప్లేట్‌లో ఉంచుకోవాలి. చివరగా డీప్ ఫ్రైకి తగినంత నూనె తీసుకుని వేడయ్యాక ఈ రొయ్యలను గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చేంత వరకూ కాల్చుకోవాలి. క్రిస్పీగా భలే రుచిగా ఉంటాయివి.

**చిన్న వయసులోనే కంటిచూపును కోల్పోయినా... కలలు కనడం ఆపలేదు. ఆ కలలు నెరవేర్చుకోవడానికి ఎన్ని అవరోధాలు ఎదురైనా వెరువలేదు. ఐఐటి-హెచ్‌లో అడ్మిషన్ సాధించిన మొదటి అంధురాలిగా చరిత్రకెక్కిన పద్దెనిమిదేళ్ళ రుహిన్ భట్టసాలి యువతకు స్ఫూర్తిదాతగా నిలుస్తున్నారు.**

# చూపులేకున్నా.. గురి తప్పలేదు

ట్రిపుల్ ఐటీ విజేత



రుహిన్ భట్టసాలి బాల్యం పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో గడిచింది. ఆటపాటలతో ఆనందంగా సాగిపోతున్న ఆమెకు జీవితంలో ఊహించని కుదుపు. రుహిన్‌కు కంటి సమస్యలు ఏర్పడడంతో... వైద్యుల సూచన మేరకు శస్త్రచికిత్స చేయించాల్సి వచ్చింది. ఆ ఆపరేషన్ వికటించడంతో... ఆమె దృష్టిని పూర్తిగా కోల్పోయింది. "అప్పుడు మా అమ్మాయి ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమెకు చూపు ఇక రాదని తెలియడంతో... మా ప్రపంచం ఒక్కసారిగా తల్లకిందులైపోయింది. ఈ పోటీ ప్రపంచంలో ఆమె ఎలా నెగ్గుకురాగలదా? అని ఆవేదన చెందని రోజంటూ లేదు" అని గుర్తు చేసుకున్నారు రుహిన్ తల్లి మంజూషా చౌధురి. మెరుగైన చికిత్స కోసం ఆమె కుటుంబం కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు మారింది. ఒక బహుళ జాతి కంపెనీలో టెక్నికల్ రైటర్‌గా పని చేస్తున్న మంజూష... తన కుమార్తెను ఆమె ఆకాంక్షల మేరకు చదివించాలని నిర్ణయించుకున్నారు. నేర్చుకొనే నైపుణ్యం రుహిన్‌కు చాలా ఎక్కువ. దీన్ని ఆమె తల్లితండ్రులు రాహుల్ భట్టసాలి, మంజూష ఉపాధ్యాయులు గుర్తించారు. ఆమెకు అండగా నిలిచి, ఆమె చదువుకు అనువైన వాతావరణాన్ని కల్పించారు. "అయినప్పటికీ నేను చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సిబిఎస్‌సి పాఠ్య ప్రణాళిక కఠినంగా ఉంటుంది. విస్తృతంగా చదవాలి, అవగాహన పెంచుకోవాలి, తార్కికంగా విశ్లేషించుకోవాలి. దృష్టి లోపం ఉన్న వారికి ఇవన్నీ చాలా కష్టం" అంటున్న రుహిన్ అంకితభావంతో, తన సామర్థ్యాల మీద అచంచలమైన నమ్మకంతో ఆ అవరోధాలన్నీ దాటింది. ప్లస్2లో 98.2 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. "నాకు చిన్నప్పటినుంచీ ఆస్ట్రోఫిజిసిస్ట్ కావాలని ఉండేది. కానీ సైన్స్, ఇంజనీరింగ్ టెక్నాలజీ, గణితాల్లో పరిశోధనకు అవకాశం తక్కువ. కాబట్టి ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నాను" అని చెబుతోంది రుహిన్. "ఎగ్జామ్స్‌కు సన్నద్ధం కావడం రుహిన్‌కు ఒక సవాలే అయింది. మంచి టీచర్లున్న కోచింగ్ సెంటర్లలో ఆమెను చేర్చుకోరని మాకు తెలుసు. అందుకే ఆన్‌లైన్ కోచింగ్‌ను ఎంచుకున్నాం. ఆమెకు అది ఎంతో సాయపడింది" అంటారు మంజూష.

### సాంకేతికత ఆసరాతో...

సాంకేతికతపై రుహిన్‌కు ఉన్న ఆసక్తి కూడా ఆమె పురోగతికి చాలా సాయపడింది. "నేనెప్పుడూ

**"ఎగ్జామ్స్‌కు సన్నద్ధం కావడం రుహిన్‌కు ఒక సవాలే అయింది. మంచి టీచర్లున్న కోచింగ్ సెంటర్లలో ఆమెను చేర్చుకోరని మాకు తెలుసు. అందుకే ఆన్‌లైన్ కోచింగ్‌ను ఎంచుకున్నాం. ఆమెకు అది ఎంతో సాయపడింది" అంటారు మంజూష.**

బ్రెయిలీలో చదవడం, రాయడం నేర్చుకోలేదు. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతనే ఉపయోగించుకోవాలనుకున్నాను. నా చదువుకు అవసరమైన సాధనాలన్నిటినీ ఆ ప్రకారంగానే సిద్ధం చేసుకున్నాను. యాప్స్ ఎల్లప్పుడూ ఉపయుక్తంగానే ఉండేవి.. కానీ గత రెండు మూడేళ్ళుగా చాలా వేగవంతమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు, నా కన్నులా వ్యవహరించే యాప్ ఒకటుంది. అది ఏ చిత్రం గురించైనా, దృశ్యం గురించైనా స్పష్టంగా వివరించగలదు అని చెబుతోంది



రుహిన్. అందుబాటులో ఉన్న అని వనరులను ఉపయోగించుకుంటూ... ఆమె పెద్ద పోరాటమే చేసింది. ఇటీవల జరిగిన ఐఐటి ఎగ్జామ్స్‌లో... 'పర్సన్ విత్ డిజేబిలిటీ' (పిడబ్ల్యూడీ) కేటగిరీలో... ఆలిండియా ర్యాంక్ 48ను సాధించింది. హైదరాబాద్ ఐఐటీలో... కంప్యూటర్ సైన్స్- అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో అడ్మిషన్ సంపాదించింది. ఐఐటిహెచ్‌లో అడ్మిషన్ సాధించిన తొలి అంధురాలు ఆమే కావడం విశేషం. తోటివారికి సాయం చెయ్యాలన్న తపన కూడా రుహిన్‌కు ఎక్కువే. ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఇద్దరు అమ్మాయిలకు చదువులో సాయపడుతోంది. వాళ్ళకు లెక్కలు, సైన్స్ చెబుతోంది.. "వారితో మాట్లాడే సమయంలో నెట్‌వర్క్ సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. తరచూ కాల్ కట్ అవుతూ ఉంటుంది. అయినప్పటికీ... రోజూ కొన్ని గంటలు వాళ్ళకోసం కేటాయిస్తున్నాను. ఇది ఎంతో సంతృప్తిని ఇస్తోంది" అంటున్న రుహిన్ ప్రయాణం... యువతకు స్ఫూర్తిదాయకం.

మేకప్

# డ్రస్‌కు తగినట్టు... అదిరేట్టు

మేకప్ సందర్భానుసారంగా ఉండాలి. వేసుకున్న దుస్తులకు మ్యాచ్ అయ్యేలా ఉండాలి. అందుకోసం ఎలాంటి మేకప్ మెలకువలు పాటించాలో తెలుసుకుందాం!

### మోడర్న్ వేర్

గౌన్స్, షార్ట్స్ లాంటి మోడర్న్ వేర్ ధరించినప్పుడు, వేసుకున్న దుస్తులకు తగ్గట్టుగా బోల్డ్ లుక్ మేకప్ ఎంచుకోవాలి. ముదురు రంగు లిప్‌స్టిక్, ఐషాడోలతో పాటు, బ్లష్ కూడా స్పష్టంగా కనిపించేలా వేసుకోవాలి. స్మోకీ ఐస్ లుక్ నలుపు రంగు మోడర్న్ వేర్‌కు చక్కగా సూటవుతుంది. ఫాల్స్ ఐల్యాషెస్ వాడుకునేవాళ్లు, రెండు కోట్స్ మస్కారా అప్లై చేయాలి.

### డిజైనర్ చీరల్లో...

డిజైనర్ వేర్‌లో తళుకులకే ఎక్కువగా ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి మెరుపులీనే మేకప్ టిప్స్ అనుసరించాలి. గ్లిట్టర్ లిప్‌స్టిక్, మస్కారాలు ఎంచుకోవచ్చు. నుదురు, ముక్కు, గొంతు దగ్గర హైలైటర్ తప్పనిసరిగా అప్లై చేయాలి. లిప్‌గ్లాస్ కూడా వాడుకోవచ్చు. సిల్వర్ లేదా గోల్డ్ హ్యూ ఉన్న బ్లష్, లిప్‌స్టిక్‌లు కూడా డిజైనర్ వేర్‌కు చక్కగా సూటవుతాయి.

### సంప్రదాయ దుస్తుల్లో...

పట్టు చీరల్లో మెరిసిపోవాలనుకుంటే, మ్యాట్ లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. చీర పవిట ఏ కాంట్రాస్ట్ కలర్‌లో ఉంటే, ఆ రంగు లిప్‌స్టిక్, ఐష్యాడోలను ఎంచుకోవాలి. అయితే కొట్టొచ్చేలా అవసరానికి మించి మేకప్ వేసుకోకుండా, వీలైనంత తక్కువ మేకప్ వాడుకోవాలి. కళ్ల దిగువన, పెదవుల చుట్టూరా ముడతలు పడే వీల్లేకుండా పల్చని మేకప్ వేసుకోవాలి.



# గుమ్మడి గింజలు తింటే...



గుమ్మడి గింజలలో మన శరీరానికి మేలు చేసే పోషకాలు ఎన్నో ఉన్నాయి.

**నిద్రలేమికి:** మనలో ఎంతో మంది ప్రస్తుత కాలంలో ప్రశాంతమైన నిద్ర పట్టక ఇబ్బంది పడుతుంటారు. గుమ్మడి గింజలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ మంచి నిద్రను కలగజేస్తుంది.

**రోగ నిరోధకశక్తికి:** గుమ్మడి గింజలలో ఉండే జింక్ మన రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

**గుండె ఆరోగ్యానికి:** ఈ గింజలలోని పొటాషియం, మెగ్నీషియం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. తద్వారా గుండె ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది.

ఈ గింజల్లోని ఆరోగ్యకరమైన కొవ్వు, ఐరన్, కాపర్‌లు శరీరానికి మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపు చేస్తాయి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గిస్తాయి.

**కీళ్లకు:** గుమ్మడి గింజలలోని పోషకాలు, విటమిన్లు ఎముకలు, కీళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పీచు పదార్థము జీర్ణ వ్యవస్థ పని తీరును మెరుగు పరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.

# జియో బాటలో ఎయిర్‌టెల్, వొడాఫోన్

## మొబైల్ చార్జీలను 10-21% పెంచిన ఎయిర్‌టెల్.. 11-24 శాతం పెంచబోతున్న వొడాఫోన్ ఐడియా

» రెండున్నరేళ్ల తర్వాత ఇదే తొలిసారి..

న్యూఢిల్లీ: ప్రైవేట్ టెలికాం సంస్థలైన భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా (వీఐ) సైతం చార్జీలు పెంచేశాయి. ప్రీ-పెయిడ్, పోస్ట్-పెయిడ్ ప్లాన్ల రుసుమును 10 శాతం నుంచి 21 శాతం వరకు పెంచుతున్నట్లు ఎయిర్‌టెల్ శుక్రవారం ప్రకటించింది. కొత్త టారిఫ్‌లు జూలై 3 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ స్పష్టం చేసింది. కాగా, జూలై 4 నుంచి అమలులోకి వచ్చేలా మొబైల్ చార్జీలను 11-24 శాతం వరకు పెంచబోతున్నట్లు వీఐ వెల్లడించింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే అతి పెద్ద టెలికాం కంపెనీ రిలయన్స్ జియో చార్జీలను 12-27 శాతం పెంచుతున్నట్లు ప్రకటించగా.. ఆ తర్వాత రోజే ఎయిర్‌టెల్, వీఐ కూడా చార్జీల పెంపును ప్రకటించడం గమనార్హం. టెలికాం సంస్థలు మొబైల్ చార్జీలను గణనీయంగా పెంచడం రెండున్నరేళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 5జీ స్పెక్ట్రమ్ కొనుగోలు, నెట్‌వర్క్ విస్తరణ కోసం భారీగా పెట్టుబడులు పెట్టిన టెల్కోలు ఇక ఆదాయం పెంచుకోవడంపై దృష్టిసారించాయి. ఈ మార్చి చివరి నాటికి రిలయన్స్ జియో కస్టమర్లు 48.18 కోట్లకు చేరుకోగా, ఎయిర్‌టెల్ 40.6 కోట్లు, వీఐ 12.26 కోట్ల కస్టమర్లను కలిగి ఉన్నాయి. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో జియోకు ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పు) రూ.181.7గా నమోదైంది. ఎయిర్‌టెల్ ఆర్పు రూ.209గా, వీఐ ఆర్పు రూ.146గా నమోదైంది.

### మొబైల్ కస్టమర్లపై రూ. 47,500కోట్ల అదనపు భారం

చార్జీల పెంపుతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎయిర్‌టెల్, జియోతోపాటు వొడాఫోన్ ఐడియాకు రూ.40,000 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరనుందని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ అంచనా. కాగా, పన్నులతో కలిపి మొబైల్ కస్టమర్లపై రూ.47,500 కోట్ల మేర అదనపు భారం పడనుందని తన నోట్‌లో పేర్కొంది.

### ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ ప్లాన్ల టారిఫ్ సవరణలు

| ప్లాన్ | వాలిడిటీ (రోజులు) | ప్రయోజనాలు | పాత చార్జీ (రూ.) | కొత్త చార్జీ (రూ.) |
|---|---|---|---|---|
| అన్‌లిమిటెడ్ | 28 | 2జీబీ డేటా, అపరిమిత కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు | 179 | 199 |
| | 84 | 6జీబీ డేటా, అపరిమిత కాలింగ్ రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు | 455 | 509 |
| వాయిస్ ప్లాన్ | 365 | 24జీబీ డేటా, అపరిమిత కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు | 1,799 | 1,999 |
| | 28 | రోజుకు జీబీ డేటా, అపరిమిత కాలింగ్ రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు | 265 | 299 |
| | 28 | రోజుకు 1.5 జీబీ డేటా, అపరిమిత కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు | 299 | 349 |
| | 28 | రోజుకు 2.5జీబీ, అపరిమిత కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు | 359 | 409 |
| | 28 | రోజుకు 3జీబీ డేటా, అపరిమిత కాలింగ్ రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు | 399 | 449 |
| డేటా యాడ్ ఆన్స్ | 1 | ఒక జీబీ | 19 | 22 |
| | 1 | 2 జీబీ | 29 | 33 |
| | ప్లాన్ వాలిడిటీ | 4 జీబీ | 65 | 77 |

## రిలయన్స్ మార్కెట్ క్యాప్ రూ.21లక్షల కోట్లు




ముంబై: ఈక్విటీ మార్కెట్ శుక్రవారం స్వల్ప నష్టాల్లో ముగిసినా రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు మాత్రం లాభాలు నమోదు చేశాయి. బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు 2.31 శాతం లాభంతో రూ.3,131.85 వద్ద క్లోజయ్యాయి. మొబైల్ టారిఫ్‌లు 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్లు ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ జియో ఇన్ఫోకామ్ ప్రకటించడం ఇందుకు ప్రధానంగా దోహదం చేసింది. దీంతో రిలయన్స్ షేర్ల మార్కెట్ క్యాప్ రూ.21.19 లక్షల కోట్లకు చేరింది. ఇప్పటి వరకు మరే భారతీయ లిస్టెడ్ కంపెనీ ఈ బెంచ్ మార్క్ సాధించలేదు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు సెన్సెక్స్ పది శాతం పెరిగితే, ఆర్ఐఎల్ షేర్లు మాత్రం 20 శాతం పెరిగాయి.

## రికార్డుల ర్యాలీకి బ్రేక్

ముంబై: సెన్సెక్స్, నిఫ్టీ రికార్డుల ర్యాలీకి శుక్రవారం బ్రేక్ పడింది. ఉదయం లాభాలతో ప్రారంభమై ఇంట్రా డేలో మరో సరికొత్త రికార్డు సృష్టించిన సూచీలు చివరికి నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 210.45 పాయింట్ల నష్టంతో 79,032.73 వద్ద, నిఫ్టీ 33.90 పాయింట్ల నష్టంతో 24,010.60 వద్ద క్లోజయ్యాయి. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లోనే ఉన్నా బ్యాంకింగ్, ఫైనాన్సియల్, టెలికాం, టెక్ కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ సూచీలను కిందికి లాగాయి. ఈ ఏడాది జూన్ నెల దేశీయ స్టాక్ మార్కెట్‌కు బాగానే కలిసొచ్చింది. ఈ నెల్లో సెన్సెక్స్ 7.14 శాతం లాభంతో ముగిసింది. దీంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల షేర్ల మార్కెట్ క్యాప్ రికార్డు స్థాయిలో రూ.439.24 లక్షల కోట్లకు చేరింది.

## వ్రజ్ ఐరన్ ఐపీఓ సూపర్ హిట్

వజ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ ఐపీఓ సూపర్ హిట్టయింది. కంపెనీ 61.38 లక్షల షేర్లు జారీ చేయగా, మదుపరుల నుంచి 73.07 కోట్ల బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 54.93 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

## సిమ్ రీప్లేస్‌మెంట్ తర్వాత ఎంఎన్‌పీకి 7 రోజులు

న్యూఢిల్లీ: సిమ్ స్వాప్ లేదా రీప్లేస్‌మెంట్ తర్వాత మొబైల్ నంబరు పోర్టబిలిటీకి అర్హత పొందేందుకు వేచి చూడాల్సిన సమయం 10 రోజుల నుంచి 7 రోజులకు తగ్గనుంది. జూలై 1 నుంచి ఇది అమలులోకి రానుంది. టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ ఈ మార్చి 14న జారీ చేసిన టెలికమ్యూనికేషన్ మొబైల్ నంబరు పోర్టబిలిటీ (9వ సవరణ) నిబంధనలు ఈ జూలై నుంచి అమలులోకి రానున్నాయి.

## డాక్టర్ రెడ్డీస్ నుంచి మరో కేన్సర్ ఔషధం

హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ 'వొమాబ్' పేరుతో మహిళల వక్షోజ కేన్సర్ ఔషధాన్ని మార్కెట్‌లో విడుదల చేయనుంది. జైడస్ లైఫ్ సైన్సెస్ అభివృద్ధి చేసిన పెర్టుజుమాబ్ అనే ఈ బయోసిమిలర్ ఔషధాన్ని రెండు కంపెనీలు భారత్‌లో వేరు వేరు పేర్లతో మార్కెట్ చేస్తాయి. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య లైసెన్సింగ్ ఒప్పందం కుదిరింది. జైడస్ 'సిగ్రిమా' పేరుతో, డాక్టర్ రెడ్డీస్ 'వొమాబ్' పేరుతో ఈ ఔషధాన్ని మార్కెట్ చేస్తాయి.

## 1:5 నిష్పత్తిలో కిమ్స్ షేర్ల విభజన

హైదరాబాద్: స్థానిక కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్) బోర్డు రూ.10 ముఖ విలువ ఉన్న షేర్లను రూ.2 ముఖ విలువ ఉండే ఐదు షేర్లుగా విభజించేందుకు ఆమోదం తెలిపింది. శుక్రవారం జరిగిన సమావేశంలో డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించినట్లు కిమ్స్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఈ షేర్ల విభజనకు రికార్డు తేదీని సరైన సమయంలో వాటాదారులకు తెలియజేస్తామని పేర్కొంది.

## అరబిందో చేతికి బ్రిటిష్ కంపెనీ

హైదరాబాద్: అరబిందో ఫార్మా బ్రిటన్ కేంద్రంగా పనిచేసే ఏస్ లేబరేటరీస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసింది. నెదర్లాండ్‌లోని అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఎజైల్ ఫార్మా బీవీ ద్వారా ఈ కొనుగోలు జరిపింది. ఇందు కోసం రూ.17.91 కోట్లు చెల్లించినట్లు రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఏస్ లేబరేటరీస్ వివిధ ఫార్మా ఉత్పత్తులకు అవసరమైన క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్, అనలిటికల్ డెవలప్‌మెంట్ సేవలు అందిస్తోంది. యూరోపియన్ దేశాల్లో ఎజైల్ ఫార్మా సొంత అవసరాల కోసం ఈ కొనుగోలు జరిపినట్లు అరబిందో ఫార్మా తెలిపింది.

## రూ.10 లక్షల వరకు బేసిక్ డీమ్యాట్ ఖాతానే

న్యూఢిల్లీ: బేసిక్ సర్వీస్ డీమ్యాట్ ఖాతాలో (బీఎస్‌డీఏ) ఉండే షేర్లు, రుణ పత్రాల విలువ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ సెబీ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. దీంతో చిన్న మదుపరులు మరింత చురుగ్గా స్టాక్ మార్కెట్‌లో పాల్గొంటారని భావిస్తున్నారు. కొద్ది మొత్తాల్లో స్టాక్ మార్కెట్ పెట్టుబడులున్న చిన్న మదుపరులపై డీమ్యాట్ చార్జీల భారం తగ్గించేందుకు రూ.2 లక్షల పరిమితితో సెబీ 2012లో బీఎస్‌డీఏని ప్రవేశ పెట్టింది. ఇపుడు దీన్ని రూ.10 లక్షలకు పెంచడంతో చిన్న మదుపరులకు మరింత సౌలభ్యం కానుంది.

### ఎంఎఫ్ పథకాలకూ ఆర్ఏఆర్ నిబంధన !

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల రాబడుల పనితీరుకీ రిస్క్ అడ్జెస్టెడ్ రిటర్న్ (ఆర్ఏఆర్) నిబంధన అమలు చేయాలని సెబీ భావిస్తోంది. ఇందుకు సంబంధించి ఒక ప్రతిపాదన చేసింది. ఆర్ఏఆర్ అమలు చేస్తే ఎంఎఫ్ పథకాల ఫండ్ మేనేజర్లు, ఆయా పథకాలకు సంబంధించిన నష్ట భయాల పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. దీనివల్ల మదుపరులు ఆయా పథకాల్లో పెట్టుబడులకు సంబంధించి సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారని సెబీ భావిస్తోంది.

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72,160 ▲ | 66,150 ▲ | 94,200 ▼ |
| ముంబై | 71,840 ▲ | 65,800 ▲ | 88,000 ▲ |

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 515 | విజయవాడ | 525 |
| వరంగల్ | 517 | గోదావరి | 520 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 530 |

డజను గుడ్లు రూ. 72

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 110 | విజయవాడ | 123 |
| వరంగల్ | 110 | గుంటూరు | 123 |
| కరీంనగర్ | 110 | ఒంగోలు | 123 |
| మహబూబ్‌నగర్ | 110 | చిత్తూరు | 130 |
| కర్నూలు | 110 | నెల్లూరు | 130 |
| విశాఖపట్నం | 129 | అనంతపురం | 123 |
| గోదావరి | 123 | | |

నవ్య | చిత్రజ్యోతి

# కలలో కూడా హాని తలపెట్టడు

● అభిమాని హత్యకేసులో అరెస్టయిన హీరో దర్శన్‌కు నాగశౌర్య మద్దతు



'దర్శన్ గురించి నాకు బాగా తెలుసు, ఆయన ఎంతో మందిని ఆదుకున్నాడు. వీలైతే సాయం చేస్తాడే తప్ప కలలో కూడా ఇతరులకు హాని తలపెట్టడు. త్వరలోనే ఆయన నిర్దోషిగా బయటకొస్తాడు' అని టాలీవుడ్ హీరో నాగశౌర్య అన్నారు. రేణుకాస్వామి అనే అభిమానిని క్రూరంగా హత్య చేసిన కేసులో అరెస్టయిన కన్నడ హీరో దర్శనకు నాగశౌర్య మద్దతుగా నిలిచాడు.

'ఎన్నో కుటుంబాలు దర్శన్ మీద ఆధారపడి బతుకుతున్నాయి. నిజాలు నిగ్గుతేలేవరకూ ఆయన కుటుంబానికి కాస్త గౌరవం ఇవ్వండి. ముందే విమర్శలకు దిగడం సరికాదు' అని శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నెటిజన్లకు హితవు పలికారు. 'న్యాయవ్యవస్థ పైన నాకు నమ్మకం ఉంది. త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయి. నిజమైన దోషులకు శిక్ష పడుతుంది. దర్శన్ అన్న నిర్దోషిగా బయటకు వస్తాడు. ఈ గడ్డు పరిస్థితుల్లో వారి కుటుంబాన్ని కించపరచడం, బాధపెట్టడం చేయవద్దు' అని తన పోస్ట్‌లో నాగశౌర్య పేర్కొన్నారు. దర్శన్‌తో దిగిన ఫొటోను ఆయన షేర్ చేశారు.

దర్శన్ తన భార్య, పిల్లలను వదిలి హీరోయిన్ పవిత్రగౌడతో కొన్నాళ్లుగా సహజీవనం చేస్తూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే కారణంతో రేణుకాస్వామి అనే అభిమాని పవిత్రగౌడకు సోషల్ మీడియాలో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపాడు. ఆ కోపంతో రేణుకా స్వామిని దర్శన్ తన అభిమానులతో కిడ్నాప్ చేయించి, హత్య చేశారని పోలీసులు చెబుతున్నారు. దర్శన్, పవిత్రగౌడను కఠినంగా శిక్షించి, రేణుకాస్వామికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో నెటిజన్లు దర్శన్‌ను బండబూతులు తిడుతూ ట్రోల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగశౌర్య దర్శన్‌కు మద్దతు తెలుపుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టడం చర్చనీయాంశం అయింది.

# తమన్నా యాక్షన్



తమన్నా భాటియా, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఓదెల 2'. అశోక్ తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్‌నంది క్రియేట్ చేసిన 'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. భారీ బడ్జెట్‌తో, బహుభాషా చిత్రంగా మేకర్స్ రూపొందిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్‌ను చిత్రబృందం ప్రారంభించింది. కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. టాప్ క్లాస్ యాక్షన్ డైరెక్టర్స్ పోరాట ఘట్టాలను అద్భుతంగా రూపొందిస్తున్నారనీ, తమన్నా యాక్షన్ పార్ట్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారని మేకర్స్ తెలిపారు. వశిష్ట ఎన్ సింహా, నాగమహేశ్, గగన్ విహారి కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్.



# 'కల్కి'లో కృష్ణుడు ఇతనే!



అమితాబ్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపికా పదుకొనే వంటి అగ్ర నటీనటులు నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. కురుక్షేత్ర యుద్ధం నేపథ్యంలో సాగే సన్నివేశాల్లో శ్రీకృష్ణుని పాత్ర పోషించిన నటుడి ముఖాన్ని చూపించకపోవడంతో అతనెవరా.. అనే చర్చ మొదలైంది. ఆ పాత్ర పోషించిన నటుడి నడక తీరు చూసి హీరో నాని అన్నారు కొందరు. కాదు కాదు అర్జున్‌దాస్ అన్నారు మరికొందరు. ఈ చర్చకు తెర దించుతూ ఆ సినిమాలో కృష్ణ పాత్ర పోషించింది నేనే అంటూ సోషల్ మీడియా వేదికగా స్వయంగా వెల్లడించారు తమిళ నటుడు కృష్ణకుమార్ బాలసుబ్రహ్మణ్యన్. 'ఒక అద్భుత చిత్రంలో అటువంటి ప్రత్యేక పాత్ర పోషించే అవకాశం రావడం నిజంగా అదృష్టం' అని ఆయన పేర్కొన్నారు. కృష్ణకుమార్ కొత్త నటుడేమీ కాదు, 2010లోనే ఆయన చిత్ర రంగ ప్రవేశం చేశారు. 'కదలగై' తమిళ చిత్రంలో నటించిన ఆయన ఆ తర్వాత రంగస్థల ప్రవేశం చేసి పలు నాటకాల్లో నటించారు. పదేళ్ల తర్వాత మళ్లీ తమిళ చిత్రరంగ ప్రవేశం చేశారు. సూర్య నటించిన అనువాద చిత్రం 'ఆకాశం నీ హద్దు'లో కీలక పాత్ర పోషించారు. ధనుష్ 'మారన్' సినిమాలో అతనికి ఫ్రెండ్‌గా నటించారు. 'కల్కి' కృష్ణకుమార్‌కు ఐదో చిత్రం కావడం గమనార్హం.

## రికార్డులు కోసం సినిమాలు తీయం

- నిర్మాత స్వప్న దత్



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర భారీ వసూళ్లను రాబడుతోంది. తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 200 కోట్ల వసూళ్లకు చేరువైంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సృష్టించబోయే రికార్డులపై అందరి దృష్టి పడింది. ఏఏ రికార్డులు బద్దలవుతాయనే చర్చ అటు పరిశ్రమలో, ఇటు ప్రేక్షకుల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో 'కల్కి' నిర్మాతల్లో ఒకరైన స్వప్నదత్ సోషల్ మీడియాలో స్పందించారు. 'మా సినిమా అధిగమించిన రికార్డుల గురించి చాలా మంది అడుగుతున్నారు. ఇది హాస్యాస్పదం. రికార్డులు సృష్టించేవారు ఎప్పుడూ రికార్డుల కోసమే సినిమాలు తీయరు. సినిమా, ప్రేక్షకుల పైన ప్రేమతోనే మేం సినిమాలు తీస్తాం. 'కల్కి' చిత్రాన్ని కూడా ఇదే విధంగా రూపొందించాం' అన్నారు.

## కొంచెం కొంచెం...



చిమటా రమేశ్‌బాబు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నేను-కీర్తన'. ఈ చిత్రం నుంచి 'కొంచెం కొంచెం గుడుగుడు గుంజం' అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేను-కీర్తన' ట్రైలర్, సాంగ్స్ బావున్నాయి. నేను విడుదల చేసిన ఐటమ్ సాంగ్ థియేటర్స్‌లో విజిల్ వేయిస్తుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. ఈ చిత్రంలో రిషిత, మేఘన ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. త్వరలో 'నేను-కీర్తన' విడుదల తేదీని ప్రకటిస్తామని రమేశ్‌బాబు చెప్పారు. కులుమనాలిలో చిత్రీకరించిన పాటలతో పాటు ఆరు రోప్ ఫైట్స్ ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ అని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్ రాజా, ఛాయాగ్రహణం: కె. రమణ, ఎడిటింగ్, వినయ్‌రెడ్డి.

## గ్యాంగ్ వార్ సరికొత్తగా



చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ హీరోయిన్. ఆగస్టులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. శుక్రవారం 'గ్యాంగ్‌స్టర్' టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ 'నిర్మాత దిల్ రాజు, రచయిత విజయేంద్రప్రసాద్ మా చిత్రం టీజర్‌ను చూసి మెచ్చుకున్నారు. గ్యాంగ్ వార్‌ను మా సినిమాలో సరికొత్త రూపంలో చూపించబోతున్నాం' అన్నారు.

## మీడియాకే తెలియాలి



నటి హేమ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బెంగళూరు రేవ్‌పార్టీ వ్యవహారంలో అరెస్టయిన ఆమె బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కాలినడకన తిరుమలకు చేరుకున్న హేమ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. నేను చిన్నప్పటి నుంచి శ్రీవారి దర్శనానికి వస్తున్నాను, తిరుమల నాకు పుట్టినిల్లు అన్నారు. రేవ్ పార్టీ కేసు గురించి మీడియా ప్రశ్నించగా 'మీకే తెలియాలి. మీరే వేస్తున్నారు కదా న్యూస్. మీ ద్వారానే నేనూ తెలుసుకుంటున్నా' అని బదులిచ్చారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

## 'దీక్ష' షూటింగ్ పూర్తి



కిరణ్‌కుమార్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. సినిమా ప్రోగ్రెస్ గురించి దర్శకుడు మాట్లాడుతూ 'పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో హీరో కిరణ్ చేసిన ఫైట్స్, ఆయన వేసిన భీముడు, ఆంజనేయుడి గెటప్స్ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. నలుగురు హీరోయిన్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. 'ఇంతకుముందు నేను తెలుగులో పది, తమిళంలో రెండు చిత్రాల్లో హీరోగా నటించాను. ఈ సినిమా నాకు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నా' అన్నారు కిరణ్.

## నటి హీనాఖాన్‌కు కేన్సర్



ప్రముఖ బాలీవుడ్ బుల్లితెర నటి హీనాఖాన్ రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'ప్రస్తుతం స్టేజ్ 3 కేన్సర్‌తో పోరాడుతున్నాను. చికిత్స తీసుకుంటున్నాను. కేన్సర్‌ను జయించి మళ్లీ మామూలు మనిషిగా మీ ముందుకు వస్తాననే నమ్మకం ఉంది. ఈ ఆపత్కాలంలో నాకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. బుల్లి తెర సీరియల్ 'ఏ రిస్తా క్యా కెహ్‌లాతా హై'లో అక్షర పాత్రతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. 'బిగ్‌బాస్, ఖత్రోన్ కే ఖిలాడి' వంటి రియాలిటీ షోల్లో హీనాఖాన్ పాల్గొన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/93JKRlr లో చదవండి.



గాంధీ మార్చురీ టెక్నీషియన్‌గా ఉద్యోగ విరమణ పొందిన సలీంను సన్మానిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు

## ఒకే ఒక్కడు.. 60వేల శవపరీక్షల్లో సాయం!

- గాంధీ ఆస్పత్రి మార్చురీ టెక్నీషియన్ సలీం రికార్డు
- 42 ఏళ్ల సర్వీసు.. ఘనంగా వీడ్కోలు పలికిన వైద్యులు

అడ్డగుట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి మార్చురీ పరిసరాల పేరు చెబితేనే వామ్మో అంటాం. మృతదేహాలు, సంబంధిత బంధువుల రోదనలతో అక్కడి పరిస్థితి ఒళ్లు జలదరింపజేస్తుంది. మరి.. నిత్యం మార్చురీలో పనిచేసే వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి! ఏడాది.. రెండేళ్లు కాదు.. 'మార్చురీ టెక్నీషియన్'గా గాంధీ ఆస్పత్రిలో 42 ఏళ్ల సర్వీసులో 60వేలకు పైగా శవపరీక్షల్లో వైద్యులకు సాయం చేశారు సలీం అనే ఉద్యోగి! ఇది ఓ రికార్డు అని చెబుతున్నారు. సలీం శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు ఆధ్వర్యంలో గాంధీ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో సలీంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాంధీ మార్చురి విభాగాధిపతి కృపాల్ సింగ్, ఫోరెన్సిక్ వైద్యులు, గాంధీ పూర్వ వైద్య విద్యార్థులు, పీజీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు

## రైతుల గోడు పట్టించుకోని సర్కార్: కొప్పుల

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగుకు డబ్బుల్లేక, సరైన విత్తనాలు అందక, రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతు భరోసా డబ్బులు ఇంకా విడుదల చేయలేదని, రుణమాఫీ ఎవరెవరికి ఇస్తారన్న దానిపై స్పష్టత లేదని ధ్వజమెత్తారు. కాగా, రాష్ట్రంలో తుగ్లక్ ప్రభుత్వం నడుస్తోందని, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతల అక్రమాలపై కోర్టుకు వెళ్తామని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇప్పటికే బ్లాక్ బుక్, రెడ్ బుక్, గ్రీన్ బుక్‌లను రెడీ చేసినట్లు తెలిపారు.

## ఆ వ్యాఖ్యలు నిజమని నిరూపిస్తే రాజీనామా చేస్తా

- మాజీ మంత్రి హరీశ్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ సవాల్

అచ్చంపేట, జూన్ 28: రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చాయని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని, లేదంటే హరీశ్ రాజీనామా చేస్తారా? అని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సవాల్ విసిరారు. కొండారెడ్డిపల్లికి సంబంధించి 15, 16 బూత్‌ల్లో కాంగ్రెస్‌కు 983 ఓట్ల మెజారిటీ వచ్చిందని, కావాలంటే ఎన్నికల కమిషన్ నుంచి వివరాలు తెప్పించుకోవాలని సూచించారు. జడ్పీటీసీ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా అంచెలంచెలుగా ఎదిగి సీఎం అయిన ఘనత రేవంత్‌ది అని అన్నారు. హరీశ్ మాదిరిగా మామను అడ్డుపెట్టుకొని ఎదగలేదని దుయ్యబట్టారు.

## డ్రగ్స్ కేసులో దోషులకు శిక్ష పడాలి:ఎఫ్‌జీజీ

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదకద్రవ్యాలను కట్టడి చేయాలంటే.. ఇప్పటికే నమోదైన కేసులపై త్వరితగతిన విచారణ చేపట్టి, దోషులకు శిక్ష పడేలా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ)' కోరింది. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభ రెడ్డి లేఖ రాశారు. డ్రగ్స్ కేసులు నమోదవుతున్నా... విచారణ సరిగా సాగడం లేదని, నేరస్థులకు శిక్ష పడడం లేదని లేఖలో పేర్కొన్నారు. 2017లో డ్రగ్స్ రవాణా చేసిన, వినియోగించిన వారిపై 12 కేసులు నమోదయ్యాయని, దీనిపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసి 62 మంది విచారించారని కాని ఏడేళ్ల తర్వాత ఈ కేసులను కోర్టు కొట్టివేసిందని వివరించారు. ప్రాసిక్యూషన్‌వారు నేరాన్ని రుజువు చేయడంలో విఫలమయ్యారని, దీంతో దోషులకు శిక్ష పడకుండా పోయిందని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులపై సమగ్ర విచారణ జరిపి దోషులకు శిక్ష పడేలా చేయాలని కోరారు.

## నేడు కొండగట్టుకు పవన్‌కళ్యాణ్

మల్యాల, జూన్ 28: ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేనాని కొణిదెల పవన్‌కళ్యాణ్ శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకోనున్నారు. ఏపీ శాసనసభ ఎన్నికల ఫలితాల అనంతరం ఆంజనేయస్వామి ఆశీస్సులు తీసుకుని మొక్కులు తీర్చుకునేందుకు ఆయన కొండగట్టుకు వస్తున్నట్లు తెలుస్తోంది. పవన్ తన వారాహి వాహనానికి తొలిపూజ కొండగట్టులోనే చేయించారు. ఆ వాహనంలోనే ఆయన ఎన్నికల ప్రచారం చేసి, తన పార్టీ పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధించారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. పవన్‌కళ్యాణ్ రాక మేరకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కేసీఆర్ బుద్ధి మారలేదు: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించి ఫామ్‌హౌస్‌కు పంపించినా కేసీఆర్ బుద్ధి మారలేదని, ఇప్పటికీ పగటి కలలు కంటున్నారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాను లేకపోతే తెలంగాణనే లేదన్న భ్రమల్లోనే ఇంకా తేలియాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎందుకూ పనికి రాని దున్నపోతును తన్ని తరిమేసి కామధేనువు లాంటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌ను మించి మళ్లీ తనను గెలిపించుకుంటారంటూ కార్యకర్తలకు కాకమ్మ కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. సరిగ్గా ఆరు నెలల్లో బీఆర్ఎస్.. బంగాళాఖాతంలో కలవడం ఖాయమన్నారు.

## 5 లక్షల మొక్కలు నాటుతాం : బీజేపీ

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, అధికార ప్రతినిధి రాణి రుద్రమ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి శ్యామాప్రసాద్ దేశం కోసం చేసిన బలిదానం గురించి వివరించడంతో పాటు మొక్కలు పంపిణీ చేస్తామన్నారు.

## సొంత జిల్లాలకు తహసీల్దార్ల బదిలీకి ఓకే!

- మంత్రి పొంగులేటితో ట్రెసా ప్రతినిధుల బృందం భేటీ

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా బదిలీ అయిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు పంపాలనే తమ అభ్యర్థనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్టు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ తెలిపారు. నెల రోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఏడుగురు తహసీల్దార్‌లను వారి సొంత జిల్లాలకు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. శుక్రవారం ట్రెసా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితోపాటు ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, కె.నిరంజన్ రావులతో కూడిన బృందం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నారంలో కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూన్ 28: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన సరస్వతీ (అన్నారం) బ్యారేజీలో సెంటర్ వాటర్ పవర్ స్టేషన్ రీసెర్చ్ నిపుణులు చేస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజైన శుక్రవారం బ్యారేజీలోని వివిధ ప్రాంతాల్లో డ్రిల్లింగ్ చేసి భూ పొరల సాంద్రతను, వాటి స్థిరత్వంపై అధ్యయనం చేశారు. గత ఏడాది వరదల సమయంలో బుంగలు ఏర్పడటంతో మళ్లీ ఎక్కడైనా అవి వచ్చే అవకాశం ఉందా? అనే అంశాన్ని పరీక్షిస్తున్నారు.

## కవితతో హరీశ్ ములాఖత్

న్యూఢిల్లీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఎమ్మెల్యే హరీశ్ రావు కలిశారు. శుక్రవారం ఉదయం కవితతో హరీశ్ ములాఖత్ అయ్యారు. కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండమని చెప్పారు.

# దొంగలతో కలిసేటోళ్లను పట్టించుకోం

### బీఆర్ఎస్‌ను వీడే నాయకుల గురించి బాధ లేదు.. ఒక్కరు పోతే పది మందిని తయారు చేసుకుంటాం



- అధికారం ఉంటేనే పనిచేస్తామనడం సరికాదు: కేసీఆర్

మర్కుక్/హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌ను వీడుతున్న ఎమ్మెల్యేలు, నాయకుల గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి తమకు బాధ లేదని వ్యాఖ్యానించారు. ఒక్కరు పోతే.. పది మంది నాయకులను పార్టీ తయారు చేసుకుంటుందని చెప్పారు. మెరికల్లాంటి యువనాయకులను బీఆర్ఎస్ సృష్టిస్తుందని ప్రకటించారు. శుక్రవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని, ప్రజల ఆకాంక్షలు, కలలను నెరవేర్చగలిగే అవగాహన తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ, సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా ఉద్యమాన్ని నడిపించి.. రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. "మనం రెట్టించిన ఉత్సాహంతో భవిష్యత్తులో ఇంకా బాగా ప్రజల కోసం పనిచేయాల్సి ఉంది. పదేండ్లు చిత్తశుద్ధితో రాజీపడకుండా ఉద్యమ ఆకాంక్షల సాధన దిశగా లక్ష్యం ప్రకారం పని చేసి ప్రగతిని సాధించి ప్రజల మన్ననలు పొందినం. కుల వృత్తులను అభివృద్ధి చేసి గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసినం. అయితే, కొన్నిసార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తా పడుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది. అంతమాత్రాన నిరుత్సాహ పడొద్దు. అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతి కాదు. మనం ఏ హోదాలో ఉన్నా ప్రజల కోసం పనిచేయాల్సిందే" అని కేసీఆర్ అన్నారు.. "మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీయే. అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటది" అని అన్నారు. ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కేసీఆర్ నిర్వహిస్తున్న సమావేశాలకు మూడు రోజులపాటు విరామం ఇస్తున్నట్లు ఆ పార్టీ పేర్కొంది.

# విలీనం దాకా చేరికలు!

### 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్‌లో చేరగానే బీఆర్ఎస్ఎల్పీ విలీనం!

- గతంలో కేసీఆర్ అమలు చేసిన వ్యూహంతోనే కాంగ్రెస్ కార్యాచరణ
- హైకమాండ్‌ను ఒప్పించిన సీఎం రేవంత్!



హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా!' పౌరాణిక నాటకాల్లోని ఈ పాపులర్ డైలాగ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రస్తుతం సరిగ్గా సూటవుతుందేమో! 2018 ఎన్నికల తర్వాత ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీలో ఎలా చేరారో.. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లో అలాగే చేరుతున్నారు. తాజాగా ఎమ్మెల్యే కాలె యాదయ్య చేరికతో బీఆర్ఎస్ బలం 32కు పడిపోయింది. రానున్న రోజుల్లోనూ మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విడతల వారీగా తమ పార్టీలో చేరనున్నారని, విలీనానికి అవసరమైనంత మంది సభ్యులు వచ్చేవరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వంలో సుస్థిరత, రాష్ట్రంలో బీజేపీని కట్టడి చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక ప్రక్రియకు కాంగ్రెస్ ఇలా తెరతీసినట్లు తెలుస్తోంది. కేంద్రంలో మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ కొలువుదీరడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదంటూ బీఆర్ఎస్ అగ్రనేతలు తరచూ వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో తిరుగులేని సుస్థిరత సాధించాలన్న భావనకు హస్తం పార్టీ నాయకత్వం వచ్చినట్లు తెలుస్తోంది. పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 8 సీట్లు సాధించిన బీజేపీ.. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై, లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కించుకోలేకపోయిన బీఆర్ఎస్‌పైనే బీజేపీ దృష్టి సారిస్తుందని, ఆ పార్టీ ప్రజాప్రతినిధులను చేర్చుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకత్వం అంచనాకు వచ్చింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ రోజురోజుకూ బలహీనపడుతున్న నేపథ్యంలో తమ రాజకీయ భవిష్యత్తుపై ఆందోళనలో ఉన్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తున్నారని తమ అధిష్ఠానం దృష్టికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ప్రభుత్వానికి తిరుగులేని సుస్థిరత తీసుకురావడంతోపాటు బీజేపీని కట్టడి చేసేందుకూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని వారిని కోరినట్లు, ఇందుకు అధిష్ఠానం సంతృప్తి చెంది అనుమతి ఇచ్చినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

### అదే వ్యూహం..!

2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడంలో నాటి సీఎం కేసీఆర్ అమలు చేసిన వ్యూహాన్నే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా అనుసరిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. 2018 ఎన్నికల్లో 19 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ.. శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. మల్లు భట్టివిక్రమార్క ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారు. అయితే ఆ తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా ప్రగతి భవన్‌కు వెళ్లడం, నియోజకవర్గ అభివృద్ధి పేరుతో బీఆర్ఎస్ కండువాలు కప్పుకోవడం కొనసాగింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చుట్టూ అప్పటి సీఎల్పీ నేత భట్టివిక్రమార్క తిరగడం ఆనవాయితీగా మారిపోయింది. నల్లగొండ నుంచి ఎంపీగా గెలిచిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. తన హుజూర్‌నగర్ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో సభలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య సాంకేతికంగా 18కి పడిపోయింది. ఇదే అదనుగా పార్టీ మారిన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. శాసనసభాపక్షంగా మారి బీఆర్ఎస్ఎల్పీలో విలీనం అయ్యారు. మూడింట రెండొంతుల మంది చీలినందున ఇది రాజ్యాంగ విరుద్ధం కాదంటూ నాటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. ఆ విలీనానికి ఆమోద ముద్ర వేశారు.

### బీఆర్ఎస్ ఓటమితో సీన్ రివర్స్..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత.. సీన్ రివర్స్ అయిపోయింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో మొదలై.. కాలె యాదయ్య వరకు ఇప్పటివరకు ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటి దాకా ఆరుగురు ఎమ్మెల్యేలు చేరారు. మరోవైపు బీఆర్ఎస్ సిటింగ్ సీటు కంటోన్మెంట్‌ను ఉప ఎన్నికల్లో కోల్పోవడంతో అసెంబ్లీలో ఆ పార్టీ బలం 32కు పడిపోయింది. బీఆర్ఎస్ఎల్పీ నుంచి చీలి శాసనసభాపక్షంగా ఏర్పడి సీఎల్పీలో విలీనం కావాలంటే మూడింట రెండొంతులుగా ఆ పార్టీ నుంచి 26 మంది ఎమ్మెల్యేలు చీలాల్సి ఉంటుంది. దీంతో సంఖ్య 26కు చేరే వరకూ ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకునే ప్రక్రియ కొనసాగుతుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్‌లో మరో ఎమ్మెల్యేతో చర్చలు తుది దశకు చేరుకున్నట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్‌కు అత్యధికంగా ఎమ్మెల్యేలు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మెదక్‌లలోనే ఉన్న సంగతి తెలిసిందే. దీంతో రానున్న రోజుల్లో ఈ జిల్లాల నుంచే చేరికలు ఉంటాయని అంటున్నారు.

### ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా గల్లంతే..!

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలో అమలు చేసిన వ్యూహాన్నే తు.చ తప్పకుండా అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తన టాస్కును చేరుకుంటే శాసనసభలో బీఆర్ఎస్‌కు ఉన్న ప్రధాన ప్రతిపక్ష హోదా గల్లంతయ్యే అవకాశం ఉందంటున్నారు. శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కాలంటే సదరు పార్టీకి కనీసం 12 మంది సభ్యులు ఉండాలి. గతంలో కాంగ్రెస్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ఎల్పీలో విలీనం కావడంతో ఆ పార్టీ సభ్యుల సంఖ్య 6కు పడిపోయింది. దాంతో ఆ పార్టీ ప్రధాన ప్రతిపక్ష హోదాను, భట్టివిక్రమార్క.. ప్రధాన ప్రతిపక్ష నేత హోదాను కోల్పోయారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు సభలో 38 మంది సభ్యులుండగా.. 26 మంది ఎమ్మెల్యేలు చీలి కాంగ్రెస్‌లో చేరితే.. సభలో ఆ పార్టీకి 12 మందే మిగులుతారు. ఆ సంఖ్యకు ఒక్కటి తగ్గినా బీఆర్ఎస్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష హోదాతో పాటుగా కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేత హోదానూ కోల్పోతారు. కాంగ్రెస్‌లో చేరే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 26తో ఆగకున్నా, కాంగ్రెస్ పార్టీ అనుమానిస్తున్నట్లు బీజేపీ గూటికి కొందరు ఎమ్మెల్యేలు చేరుకున్నా శాసనసభలో బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా గల్లంతు కావడం తథ్యమని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

## జూలై 18 నుంచి డీఎస్సీ పరీక్షలు

- 13 రోజుల పాటు జిల్లాలు, షిఫ్టుల వారీగా నిర్వహణ
- పరీక్షల షెడ్యూల్ ప్రకటించిన విద్యాశాఖ

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఉపాధ్యాయ అభ్యర్థులు ఎదురు చూస్తున్న డీఎస్సీ పరీక్షల తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం విడుదల చేశారు. జిల్లాల్లో ఖాళీల ఆధారంగా కొన్ని పరీక్షలను రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తున్నారు. పరీక్షల ప్రక్రియ జూలై 18న ప్రారంభమై మొత్తం 13 రోజుల పాటు కొనసాగనుంది. ఆగస్టు-5న హిందీ లాంగ్వేజ్ పండిట్ పరీక్షతో ప్రక్రియ ముగియనుంది.

| తేదీ | పరీక్ష |
|---|---|
| 18 జూలై | స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్, ఫిజికల్ సైన్స్) |
| 19 జూలై | ఎస్జీటీ |
| 20 జూలై | ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) |
| 22 జూలై | ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్) |
| 23 జూలై | ఎస్జీటీ |
| 24 జూలై | స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్) |
| 25 జూలై | స్కూల్ అసిస్టెంట్ (తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్, మరాఠీ) |
| 26 జూలై | ల్యాంగ్వేజ్ పండిట్ (తెలుగు) ఎస్జీటీ, పీఈటీ |
| 30 జూలై | స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్) |
| 31 జూలై | స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్) |
| 1 ఆగస్టు | ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్) |
| 2 ఆగస్టు | ల్యాంగ్వేజ్ పండిత్ (తెలుగు, ఉర్దూ, కన్నడ, మరాఠీ, సంస్కృతం), స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్, హిందీ) |
| 5 ఆగస్టు | స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), ల్యాంగ్వేజ్ పండిట్ (హిందీ) |

# బీఆర్ఎస్‌కు మరో షాక్!

### కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

న్యూఢిల్లీ/(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఎమ్మెల్యేలు చేజారకుండా బీఆర్ఎస్ అధినాయకత్వం ఓవైపు ప్రయత్నాలు చేస్తున్నా.. మరో ఎమ్మెల్యే ఆ పార్టీకి షాకిచ్చారు. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఢిల్లీలో.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో యాదయ్యను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్దకు తీసుకెళ్లి పరిచయం చేశారు. ప్రభుత్వ సుస్థిరతకు ఎమ్మెల్యేల చేరికలు అవసరమంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించి 24 గంటలు గడవక ముందే యాదయ్య చేరిక చోటుచేసుకోవడం గమనార్హం. కాగా, ఎమ్మెల్యే యాదయ్య చేరిక విషయాన్ని కాంగ్రెస్ నాయకత్వం చివరి దాకా గోప్యంగా ఉంచింది. యాదయ్య పార్టీ మారతారంటూ గత కొంతకాలంగా ఊహాగానాలు వెలువడుతున్నా ఆయన ఖండిస్తూ వచ్చారు. కానీ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నగర శివారు ఎమ్మెల్యేలతో ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన భేటీకి యాదయ్య దూరంగా ఉన్నారు. అయితే ఆ రోజు వికారాబాద్‌లో జిల్లా పరిషత్ భవన సముదాయం ప్రారంభానికి హాజరైనందున వెళ్లలేదని ఆయన చెప్పారు. ఈ ప్రారంభోత్సవ సభలో యాదయ్య మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో నిధుల విషయంలో స్వల్పంగా ఘర్షణ కూడా పడ్డారు. దీంతో యాదయ్య పార్టీ మార్పు ప్రచారంపై ఎవరికీ అనుమానం కూడా రాలేదు. కానీ, మూడు రోజుల్లోనే ఆయన హస్తం గూటికి చేరి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. యాదయ్య చేరిక సమయంలో ఆయన వెంట మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా ఉన్నారు. కాలె యాదయ్య తొలిసారిగా 2014లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చిత్రంలో సీఎం రేవంత్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ

తరువాత ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. 2019, 2023 ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. మళ్లీ దాదాపు దశాబ్ద కాలం తరువాత తిరిగి సొంత గూటికి చేరుకున్నారు.

### యాదయ్య బాటలో మరికొందరు?

కాలె యాదయ్య కారు దిగడంతో ఇప్పటివరకు బీఆర్ఎస్‌ను వీడిన ఎమ్మెల్యేల సంఖ్య 6కు చేరింది. బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన గెలిచిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్ ఇదివరకే కాంగ్రెస్ కండువా కప్పుకొన్న సంగతి తెలిసిందే. కాగా, ఉమ్మడి రంగారెడి జిల్లాలో బీఆర్ఎస్‌కు అత్యధికంగా 10 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరందరిపై కూడా అధికార కాంగ్రెస్ కన్నేసింది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. శివారులోని ఇద్దరు ఎమ్మెల్యేలు ఏ క్షణంలోనైనా తమ పార్టీలో చేరవచ్చని పేర్కొన్నాయి.

## మంత్రి కావాలంటే అదృష్టం ఉండాలి!

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబిత ఆసక్తికర వ్యాఖ్య



సరూర్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి రావాలంటే అదృష్టం కూడా ఉండాలని, నుదుటి రాత ఎలా ఉంటే అలా జరుగుతుందని అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆమె విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. "బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల ఎర్రవల్లి ఫాంహౌస్‌లో ఎమ్మెల్యేలతో ఏర్పాటు చేసిన మీరు వెళ్లలేదు కదా! దీనిపై స్థానికంగా పార్టీ శ్రేణులు అయోమయంలో ఉన్నాయి. మీరు కూడా పార్టీ మారతారనే అనుమానం వారిలో కలుగుతున్నట్టు కనిపిస్తోంది" అని 'ఆంధ్రజ్యోతి' విలేకరి ప్రస్తావించగా, "కేసీఆర్ కేవలం హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల ఎమ్మెల్యేలను మాత్రమే పిలిచారు. ఇంకా మా వంతు (రంగారెడ్డి జిల్లా వంతు) రాలేదు" అని సబితా ఇంద్రారెడ్డి బదులిచ్చారు. "రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి కూడా ముఖ్యమంత్రేనట. ఏ శాఖకు ఎవరు మంత్రో అర్థం కావడంలేదు. ఇంతకీ హోంశాఖ ఎవరి వద్ద ఉందో, ఆ శాఖ మంత్రి ఎవరో ఎవరికీ తెలియదు" అని ఆమె అన్నారు. దీంతో, "మీ కోసమే ఖాళీగా ఉంచారేమో మేడమ్! మీరు వెళ్తే మీకే ఆ శాఖ ఇస్తారేమో!' అని రిపోర్టర్ నవ్వుతూ వ్యాఖ్యానించగా.. "మంత్రి పదవి కావాలంటే అదృష్టం కూడా ఉండాలి. ఎంత కష్టపడ్డా నుదుటి రాత బాగా లేకుంటే ఏమీ చేయలేం" అని సబిత సరదాగా వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో లేకుండా పదవి ఎలా సాధ్యమవుతుందని గానీ, మరో ఐదేళ్ల తర్వాత చూద్దామని గానీ ఆమె అనకపోవడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే సబిత చేసిన వ్యాఖ్యలను బట్టి రాజకీయంగా ఏదో జరగబోతోందనే సంకేతాలు వెలువడినట్టేనని స్థానిక నేతలు గుసగుసలాడుకుంటున్నారు. మరోవైపు రంగారెడ్డి జిల్లాకు చెందిన చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య శుక్రవారమే కాంగ్రెస్‌లో చేరడంతో సబితమ్మ సైతం అదే దారిలో పయనించే అవకాశం లేకపోలేదనే అభిప్రాయాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

# మోదీ హయాంలో వంద ఎమర్జెన్సీలు!

### ఇందిరను దుర్గామాతగా వాజ్‌పేయి అభివర్ణించారు.. ఆ విషయాన్ని ప్రధాని మోదీ ఎందుకు ప్రస్తావించరు?



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

- వెనక్కి తీసుకున్న సాగు చట్టాలపై చర్చ ఎందుకు పెట్టరు?
- పుల్వామా దాడి ఘటనపై చర్చ చేపట్టే ధైర్యం లోక్‌సభస్పీకర్‌కు ఉందా?
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): "ఎప్పుడో 50 ఏళ్ల కిందటి ఎమర్జెన్సీ గురించి ప్రధాని మోదీ మాట్లాడుతున్నరు. కానీ.. మోదీ నేతృత్వంలో వంద ఎమర్జెన్సీలు ఉన్నట్టుగా పాలన సాగింది" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ఆరోపించారు. బంగ్లాదేశ్ విమోచన కోసం పాకిస్తాన్‌తో యుద్ధం చేసినప్పుడు అప్పటి బీజేపీ నేత వాజ్‌పేయి.. ఇందిరాగాంధీని దుర్గామాతతో పోల్చారని గుర్తు చేశారు. బీజేపీ నేతలకు ఆ విషయం గుర్తు లేదా? సభలో ప్రధాని మోదీ ఎందుకు ప్రస్తావించలేదు? అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాతైనా ప్రజలకు ఉపయోగపడే అంశాల గురించి పార్లమెంట్‌లో మోదీ మాట్లాడతారని అందరూ ఎదురు చూశారు. కానీ ఎమర్జెన్సీ అంశాన్ని ఆయన ప్రస్తావించడం దురదృష్టకరం" అని అభిప్రాయపడ్డారు. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఇందరాగాంధీ ఓడినా.. ఆ తర్వాతి ఎన్నికల్లో 353 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఎప్పుడో జరిగిన ఘటనను ఇప్పుడు సభలో ప్రస్తావించడం వల్ల ప్రజలకు ఏమైనా ఉపయోగం ఉంటుందా? అని నిలదీశారు. మోదీ తీరును మోహన్ భాగవత్ సైతం తప్పు పట్టారని పేర్కొన్నారు. "బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరాగాంధీది. మోదీ ప్రధాని అయ్యాక.. బ్యాంకులనే ఎత్తివేశారు. ఈ అంశంపై చర్చకు సిద్ధమా?" అని సవాల్ విసిరారు. ఆనాడు భారత భూభాగాన్ని చైనా ఆక్రమిస్తే యుద్ధం చేసి తిరిగి తీసుకువచ్చారని, ఇప్పుడు మోదీ ఆ పని ఎందుకు చేయలేకపోతున్నారని నిలదీశారు. గుజరాత్‌కు మోదీ సీఎంగా ఉన్నప్పుడే గోద్రా ఘటన జరిగిందని, 2 వేల మంది చనిపోయారని గుర్తు చేశారు. ఈ ఘటనపై చర్చకు సిద్ధమేనా? అని ప్రశ్నించారు. సాగు చట్టాలను తెచ్చి రైతులను హింసించిన బీజేపీ.. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చిస్తుందా? పుల్వామా దాడి ఘటనపై చర్చ చేపట్టే ధైర్యం లోక్‌సభ స్పీకర్‌కు ఉందా? అని నిలదీశారు.

## పదేళ్లలో ఒక సారి సీఎం అవుతా!

"సోనియా, రాహుల్ ఆదేశిస్తే రెండేళ్లు గాంధీభవన్‌లో అటెండర్‌గా పనిచేస్తా. కానీ, వచ్చే పదేళ్లలో ఒక్క సారి పీసీసీ చీఫ్, సీఎంను అవుతా" అని జగ్గారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన వయస్సు 58 ఏళ్లని, 68 వచ్చేలోగా సీఎం అవుతానని పేర్కొన్నారు. తాను ఒక విజన్‌తో ఉన్నానని, ఎవరికీ పోటీ కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం టీపీసీసీ చీఫ్ ఎంపికకు సంబంధించి తనను ఎవరూ సంప్రదించలేదని, ఆ ప్రొటోకాల్‌లో కూడా తాను లేనని చెప్పారు. సోనియా, రాహుల్ తీసుకునే నిర్ణయం సరిగ్గానే ఉంటుందని, దాన్నే తాను అనుసరిస్తానని వెల్లడించారు. టీపీసీసీ చీఫ్ పోస్టు కోసం పది మంది నేతల పేర్లపై చర్చ జరుగుతోందని ఇంతటి స్వేచ్ఛ బీజేపీలో ఉంటుందా? అని నిలదీశారు.

# వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడి మృతి

**మరో ఘటనలో 7 నెలల పాపకు తీవ్ర గాయాలు.. పటాన్‌చెరు మండలంలోనే ఈ రెండు ఘటనలు**


స్వాతి

- చనిపోయిన బాలుడు బిహార్ వలస కూలీల కొడుకు

పటాన్‌చెరు, జూన్ 28: రాష్ట్రంలో వీధి కుక్కలు చిన్న పిల్లలను కరిచి చంపుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో బహిర్భూమికి వెళ్లిన ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేయడంతో బాలుడు అక్కడికక్కడే చనిపోయాడు. పటాన్‌చెరు మండలంలో ఇస్నాపూర్ నుంచి నందిగామ గ్రామానికి వెళ్లే దారిలో మహీధర వెంచర్స్‌లో కూలీలుగా పనిచేస్తున్న బిహార్ దంపతులకు విశాల్(8) అనే కుమారుడు ఉన్నాడు. విశాల్ శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో వారి గుడిసె నుంచి కొద్ది దూరంలో బహిర్భూమికి వెళ్లాడు. అక్కడికి గుంపుగా వచ్చిన వీధి కుక్కలు విశాల్‌పై దాడి చేశాయి. బాలుడిని పీక్కు తినడానికి ప్రయత్నించాయి. దీంతో, విశాల్‌కు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అక్కడికక్కడే చనిపోయాడు. తర్వాత కొంత సేపటికి అటుగా వెళ్తున్న వారు కుక్కలను, బాలుడిని గమనించి వాటిని వెళ్లగొట్టారు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు పోలీసులు, పంచాయతీ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, పటాన్‌చెరు మండలంలోనే మత్తంగి గ్రామంలో గుడిసె ముందు నిద్రిస్తున్న ఏడు నెలల చిన్నారి స్వాతిపై వీధి కుక్కలు దాడి చేశాయి. మత్తంగిలో భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్న స్వాతి తల్లిదండ్రులు ఆమెను గుడిసె ముందు పడుకోబెట్టి పక్కనే పని చేసుకుంటున్నారు. ఇంతలో అక్కడికి వచ్చిన వీధి కుక్కలు స్వాతిని లాక్కెళ్లేందుకు ప్రయత్నించాయి. చిన్నారి ఏడుపులు విని తల్లిదండ్రులు పరుగెత్తుకురావడంతో పారిపోయాయి. కుక్కల దాడిలో తీవ్రగాయాల పాలైన స్వాతిని హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్న చోట్ల చిన్నారులను ఒంటరిగా వదిలేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. నిర్మాణ సంస్థల వద్ద పనిచేసే కూలీలు చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

## ఆదాయ పన్ను పరిధి పెంచండి

- సీతారామన్‌కు తెలంగాణ ఉద్యోగుల వినతి

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని, పాత పింఛను విధానం అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగులు కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. టీఎస్‌జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు నేతృత్వంలోని ఉద్యోగుల నాయకులు శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఢిల్లీలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇప్పుడున్న ఆదాయపన్ను విధానం వల్ల ఉద్యోగులు మూడు నెలల వేతనాన్ని కోల్పోతున్నారని వివరించారు. విద్య, వైద్య ఖర్చులు పెరుగుతున్నందున ఆదాయ పన్ను పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ. 2.50 లక్షల నుంచి రూ.7.50 లక్షలకు, సేవింగ్ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ. 1.50 లక్షల నుంచి రూ.4 లక్షలకు, గృహరుణాల మీద వడ్డీని రూ.4.50 లక్షలకు, వైద్య బీమా పరిమితిని రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని కోరారు. 2004 నుంచి అమల్లోకి వచ్చిన నూతన పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక మంత్రిని కలిసిన వారిలో టీఎస్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్లు, ఎం. సత్యానారాయణ గౌడ్, తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో రహదారులను అభివృద్ధి చేయండి

**కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ ఈటల వినతి**

న్యూఢిల్లీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రహదారులను అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. శుక్రవారం ఢిల్లీలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కొంపల్లిలో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు నత్తనడక సాగుతున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో వేగం పెంచాలని, శామీర్‌పేటలో రోడ్డు, ఎల్‌బీ నగర్‌లో అండర్ పాస్ నిర్మించాలని కోరారు. అదేవిధంగా హుజూరాబాద్ పరిధిలో రోడ్డు సమస్యలను పరిష్కరించాలని, సింగాపూర్, రాంపూర్, రంగాపూర్, పెద్దపాపాయపల్లిలో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని విన్నవించారు.



# విచారణను అడ్డుకోవాలనే..!

**ప్రెస్‌మీట్‌లో తీర్పు ప్రకటించేశారన్న వాదనలో అర్థం లేదు.. వివక్ష, పక్షపాతం, అగౌరవం వంటివన్నీ కేసీఆర్ ఊహలే**

- ప్రభుత్వ నిర్ణయాలనే అమలు చేశామని అధికారులంతా చెప్పారు
- అందుకే కేసీఆర్‌కు నోటీసులు
- విచారణ కమిషన్ వేయాలని జగదీశ్ రెడ్డే సవాల్ చేశారు: ఏజీ
- విచారణ కమిషన్ అంటే నిజ నిర్ధారణ సంఘం.. అభ్యంతరమెందుకు?
- కేసీఆర్ తరపు న్యాయవాదిని ఉద్దేశించి హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్య



హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తుపై జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి నేతృత్వంలోని విచారణ కమిషన్ వివక్ష, పక్షపాతం చూపుతోందని, అగౌరవంగా ప్రవర్తిస్తోందనే వాదన కేవలం పిటిషనర్ కేసీఆర్ ఊహ మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. తాను తప్పు చేశాననే నిర్ణయానికి కమిషన్ ముందే వచ్చిందని, ఈ మేరకు ప్రెస్‌మీట్ పెట్టి తీర్పు ప్రకటించేసిందంటూ ఆయన చేస్తున్న వాదనలో అర్థం లేదని తెలిపింది. తనకు వ్యతిరేకంగా నివేదిక ఇస్తుందని ముందే ఊహించుకొని. కమిషన్ విచారణను పూర్తిగా అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ కోర్టుకు వచ్చారని ఆరోపించింది. విద్యుత్తు కమిషన్ ఏర్పాటు జీవో చెల్లదని, విద్యుత్తు చట్టం ప్రకారం వివాదాలపై కమిషన్ వేసే అధికార పరిధి ప్రభుత్వానికి లేదని, కమిషన్ తనకు ఇచ్చిన నోటీసులను కొట్టి వేయాలని పేర్కొంటూ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. "కేవలం ఊహించుకుని మాత్రమే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఒక్క కారణంతో ఈ పిటిషన్‌ను కొట్టేయవచ్చు. కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసుల్లో కమిషన్ అత్యంత మర్యాదపూర్వకమైన భాషను వినియోగించింది. వివక్ష, పక్షపాతం, అగౌరవం చూపిస్తోందన్న వాదనకు తావు లేదు. విద్యుత్తు కమిషన్ బహిరంగ విచారణ చేపడుతోంది. దానికి ఎవరైనా వివరాలు అందజేయవచ్చని బహిరంగంగా నోటీసు ఇచ్చింది. ప్రజలకు ఆ వివరాలు తెలియజేయడానికే విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అంతే తప్ప అది ఎవరికీ వ్యతిరేకంగా పెట్టలేదు. అందులో కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు" అని వివరించారు. విద్యుత్తు వ్యవహారంపై విచారణ కమిషన్ వేయాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేయడంతోపాటు అసెంబ్లీలో సవాల్ చేశారని, ఆయన కోరిన విధంగానే ప్రభుత్వం కమిషన్‌ను వేసిందని గుర్తు చేశారు. కమిషన్ ఏర్పాటు ఏకపక్షం కాదని స్పష్టం చేశారు. "అప్పటి సీఎండీ ప్రభాకర్ రావు సహా 15 మందిని కమిషన్ విచారించింది. అప్పటి ప్రభుత్వ నిర్ణయాలనే తాము అమలు చేశామని వారంతా చెప్పారు. తమ పాత్ర ఏమీలేదని స్పష్టం చేశారు. అందుకే వివరాలు సమర్పించాలని కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారు" అని వివరించారు. అంతేనా.. అత్యంత మర్యాదపూర్వకంగా మీ వీలును బట్టి ఏర్పాట్లు చేస్తామని కమిషన్ పేర్కొందని తెలిపారు. కమిషన్ ఇచ్చిన బహిరంగ నోటీసుపై ఎవరూ ఎలాంటి అభ్యంతరం తెలపలేదని గుర్తు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాదులు ప్రస్తావించిన 'కోట్ల విజయభాస్కర్ రెడ్డి వర్సెస్ ఏపీ సర్కారు' తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికే అనుకూలంగా ఉందని, ఆ కేసులో కూడా ప్రెస్‌మీట్ పెట్టినట్లు ప్రస్తావన ఉందని, సదరు తీర్పులో విచారణ కమిషన్ ఏర్పాటును ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించిందని గుర్తు చేశారు. ఆ తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడమే కాకుండా కమిషన్ విచారణ కొనసాగుతున్న ఈ దశలో హైకోర్టు జోక్యం చేసుకోరాదని వ్యాఖ్యానించిందని తెలిపారు. మరోవైపు.. కమిషన్ ప్రెస్‌మీట్ పెట్టడంపై కేసీఆర్ తరఫున హాజరైన సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి తన వాదనను కొనసాగించారు. 'ప్రెస్‌మీట్ పెట్టి వందల కోట్లలో నష్టం జరిగిందని కమిషన్ చైర్మన్ చెప్పారు. టెండర్లు లేకుండా పవర్ ప్రాజెక్టులు కేటాయించారని అన్నారు. కమిషన్ ఎలా వ్యవహరించాలో 'పీలా పోతినాయుడు' కేసులో అప్పటి ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్న ఇప్పటి చైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి తీర్పు ఇచ్చారు. కానీ, దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కమిషన్ ఏర్పాటు నోటిఫికేషన్‌లో భాష సరిగా లేదు" అని పునరుద్ఘాటించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. "విచారణ కమిషన్ అంటే నిజ నిర్ధారణ సంఘం. ఆ కమిషన్ ఇచ్చే నివేదికను ఆర్టికల్ 226 కింద హైకోర్టులో సవాల్ చేయవచ్చని మీరే చెప్పారు. అలాంటప్పుడు అభ్యంతరం ఏముంటుంది?" అని ఆదిత్య సోంధిని ఉద్దేశించి ప్రశ్నించింది. పిటిషన్‌ను విచారణకు తీసుకోవాలా వద్దా అనే అంశంపై వాదనలు పూర్తికావడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం తీర్పు వెలువడే అవకాశం ఉంది.

## భర్తకు వేరే పెళ్లి చేస్తామని బెదిరించి కిరాతకం

- సూర్యాపేట జిల్లాలో గర్భిణి మృతి ఘటనలో భర్త, ఆడపడుచులు, అబార్షన్ చేసిన వారిపై కేసులు

సూర్యాపేటక్రైం, జూన్ 28: మళ్లీ ఆడపిల్ల పుడితే భర్తకు వేరే పెళ్లి చేస్తామని బెదిరించి లింగనిర్ధారణ పరీక్షకు ఒప్పించి, పుట్టేది ఆడపిల్లని తెలుసుకుని గర్భస్రావం చేయించి గర్భిణి మరణానికి కారకులైన వారిపై పోలీసులు కేసుపెట్టారు. మహబూబాబాద్ జిల్లా భట్టుతండాకు చెందిన భట్టు క్రిష్ణ కుమార్తె సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో 2019లో వివాహమైంది. వీరికి ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలుండగా సుహాసిని మరోసారి గర్భం దాల్చింది.మగ సంతానం కోసం భర్త, అతని అక్కలు డేస్‌వాన్ సక్కు, దేవత్ నాగమ్మ, బంధువులు డేస్‌వాన్ మోహన్, రత్నావత్ నాగరాజు, రత్నావ్ బీమ్‌సింగ్, రత్నావత్ కమిళి, లక్ష్మి ఆమెను వేధింపులకు గురి చేసేవారు. మగ పిల్లాడు పుట్టకపోతే హరిసింగ్‌కు మరో పెళ్లి చేస్తామని బెదిరించి సుహాసినిని లింగనిర్ధారణ పరీక్షకు తీసుకెళ్లారు. గర్భంలో ఉన్నది ఆడపిల్లని తేలడంతో గర్భస్రావం చేయించుకోవాలని బలవంతంగా ఒప్పించారు. దీంతో బంధువులతో కలిసి సుహాసినిని భర్త హరిసింగ్ సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. 8 నెలల గర్భిణి కావడంతో కుదరదని వారు చెప్పడంతో అక్కడ్నించి హుజూర్‌నగర్‌లోని కమల ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ ఆస్పత్రి సిబ్బంది నాగేందర్, ఖాసీం, శ్రీనివాసరావు సుహాసినికి అబార్షన్ చేసే ప్రయత్నం చేశారు. దీంతో సుహాసిని ఆరోగ్యం విషమించడంతో ఆమెను కోదాడకు అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచనతో హైదరాబాద్‌కు తీసుకువెళుతుండగా సుహాసిని ఆరోగ్యం విషమించడంతో తిరిగి సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మరణించింది. హరిసింగ్ ద్వారా మరణవార్త తెలుసుకుని సూర్యాపేట చేరుకున్న సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు మృతికి కారణాలను ఆరా తీసి పోలీసులను ఆశ్రయించారు.

## పోగొట్టుకున్న సొమ్మును 11 నిమిషాల్లో పట్టేశారు

- సైబర్ నేరగాళ్ల వలలో పడ్డ టెకీ
- 18 లక్షలు కొల్లగొట్టిన ముఠా
- అప్రమత్తమై వెంటనే ఫిర్యాదు చేసిన బాధితుడు
- వేగంగా స్పందించి రికవరీ చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడ్డ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ. 18లక్షలు పోగొట్టుకున్నాడు. వెంటనే తాను మోసపోయానని తెలుసుకొని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయం చెప్పి తనకు సాయం చేయాలని విన్నవించాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసి, నగదు బదిలీ జరిగిన బ్యాంకు అధికారులతో మాట్లాడి నేరగాళ్ల ఖాతాలో జమైన డబ్బును ఫ్రీజ్ చేశారు. ఈ మొత్తం ప్రక్రియను కేవలం 11 నిమిషాల్లోనే పూర్తి చేసి భేష్ అనిపించుకున్నారు. సైబర్ క్రైమ్ డీసీపీ కవిత దార వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రెండు రోజుల క్రితం ఫోనొచ్చింది. ముంబై క్రైమ్ బ్రాంచి నుంచి మాట్లాడుతున్నాం అని నమ్మించిన కేటుగాళ్లు, ఆయన అడ్రస్‌తో ముంబై నుంచి ఇరాన్‌కు వెళుతున్న డ్రగ్స్ పార్శిల్‌ను పట్టుకున్నామని, క్రిమినల్ కేసు నమోదైందని, వెంటనే డిజిటల్ అరెస్టు చేస్తున్నామని భయపెట్టారు. పైగా ఆయన బ్యాంకు ఖాతా నుంచి అనుమానాస్పదమైన ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సమాచారం ఉందని, ఖాతా నుంచి కొంతడబ్బును ఆర్థిక శాఖ ఖాతాకు బదిలీ చేయాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించారు. భయపడిపోయిన బాధితుడు బ్యాంకు లోన్ తీసుకొని మరీ రూ.18లక్షలు వారి ఖాతాలో జమ చేశారు. డబ్బులు ఖాతాలో జమ అయిన వెంటనే స్పందించడం మానేశారు. అనుమానించిన బాధితుడు వెంటనే ఈనెల 27న సాయంత్రం 6:58 గంటలకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి తన గోడు వెల్లబోసుకున్నాడు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ శ్రీకాంత్ నాయక్ వెంటనే అప్రమత్తమై బాధితుడి ఫిర్యాదును ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాడు. ఆ తర్వాత బాధితుడు డబ్బులు బదిలీ చేసిన బ్యాంకులోని నోడల్ అధికారితో మాట్లాడి ఆ డబ్బులు ఏ ఖాతాకు బదిలీ అయ్యాయో తెలుసుకొని సైబర్ క్రైమ్ 1930 సిబ్బందిని అప్రమత్తం చేశాడు. వెంటనే స్పందించిన సిబ్బంది బాధితుడు పంపిన డబ్బు రూ. 18 లక్షలు ఒక అనుమానిత ఖాతాలో ఉన్నట్లు గుర్తించి వెంటనే ఆ మొత్తాన్ని ఫ్రీజ్ చేయించారు. ఈ మొత్తం ప్రక్రియను కానిస్టేబుల్ శ్రీకాంత్ 11 నిమిషాల్లో పూర్తి చేసినట్లు డీసీపీ వెల్లడించారు. సైబర్ మోసానికి గురైన బాధితులు వెంటనే గంటలోపే స్పందించి పోలీసులను ఆశ్రయిస్తే.. సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును ఎక్కడో ఒక చోట ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని డీసీపీ కవిత పేర్కొన్నారు. దాన్నే గోల్డెన్ అవర్ అంటారని చెప్పారు.


ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్


తెలంగాణ భవన్‌లో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్

# పీవీ సంస్కరణలతో దేశం ప్రగతి బాట

- సీఎం రేవంత్
- మాజీ ప్రధానికి ఘనంగా నివాళి
- సేవలను కొనియాడిన పలువురు నేతలు


పీవీఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు


న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని సీఎం రేవంత్ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రేవంత్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి కూడా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పీవీ జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. మాజీ ప్రధాని దివంగత పి.వి నర్సింహారావు 103వ జయంతి వేడుకలు టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శుక్రవారం ఘనంగా జరిగాయి. పి.వి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు వి.హన్మంతరావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పీవీ చిత్రపటానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పీవీ జయంతి సందర్భంగా ట్వీట్ చేశారు. హైదరాబాద్‌లో పీవీ మార్గ్‌లోని ఆయన ఘాట్ వద్ద రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాళులర్పించి పీవీ సేవలను గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్సీ పీవీ తనయ సురభి వాణీదేవి, ఎమ్మెల్సీ తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీసీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎంపీ వి.హన్మంత రావు, పీవీ నరసింహారావు కుటుంబసభ్యులు పీవీకి ఘనంగా నివాళులర్పించారు. దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన పీవీ నరసింహారావును దేశ ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పీవీ జయంతి శుక్రవారం తెలంగాణభవన్‌లో నిర్వహించారు. దక్షిణాది నుంచి తొలి ప్రధానిగా కొనసాగిన పీవీ నరసింహారావు స్ఫూర్తి మరవలేనిదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ప్రతిభకు చిరునామా పీవీ : ప్రధాని మోదీ

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు నాయకత్వం, ప్రతిభకు చిరునామాగా నిలిచిపోతారని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం పీవీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధాని మోదీ నివాళి అర్పించారు. దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తించి ఈ ఏడాది ప్రారంభంలో ఆయనకు భారతరత్న ఇవ్వడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని మోదీ ఎక్స్(ట్విటర్) వేదికగా పేర్కొన్నారు. మరోవైపు యూపీఏ ప్రభుత్వ హయాంలో కొనసాగిన వృద్ధిపై పీవీ ఆర్థిక సంస్కరణలు ప్రభావాన్ని చూపాయని కాంగ్రెస్ పేర్కొంది. పీవీ ఆర్థిక సరళీకరణ విధానాలు దేశంలో నవ శకానికి నాంది పలికాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. దేశ పురోగతిలో పీవీపాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు.

# బాసరలో అక్రమాలు బట్టబయలు

- ప్రసాద విక్రయాల్లో చేతివాటం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న గ్రామస్థులు
- ఇద్దరు ఉద్యోగులు, నలుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై వేటు
- అక్రమాలను గతంలోనే వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'


తిరిగి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన ప్రసాదం టికెట్లను పరిశీలిస్తున్న ఈవో

బాసర, జూన్ 28 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రసాదాల విక్రయాల్లో అక్రమాలు మరోసారి బట్టబయలయ్యాయి. బాసర గ్రామస్థుల చొరవతో ఆలయ సిబ్బంది అవినీతి బాగోతం బట్టబయలైంది. గ్రామస్థుల ముందస్తు సమాచారం మేరకు అధికారులు ప్రసాదాల విక్రయ కేంద్రం వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టారు. తయారీ కేంద్రం నుంచి ఆటోలో ప్రసాదాలను విక్రయ కేంద్రాలకు తీసుకెళుతున్న సమయంలో లెక్కించగా.. లెక్క తప్పినట్లు గుర్తించారు. ఒక్కో డబ్బాలో 100 ప్రసాదాలు ఉన్నట్లు రికార్డుల్లో ఉండగా.. డబ్బాల్లో మాత్రం 150 నుంచి 170 వరకు ఉన్నట్లు తనిఖీల్లో తేలింది. అధికంగా ఉన్న ప్రసాదాలను సిబ్బంది అనధికారికంగా విక్రయిస్తూ అవినీతికి పాల్పడుతున్నట్లు అర్థమవుతోంది. భక్తులకు విక్రయించిన టికెట్లు చించకుండా వాటినే తిరిగి విక్రయిస్తూ ఆలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గ్రామస్థులు ఆలయ ఈవో విజయ రామారావుకు సమాచారం అందించి.. ఆయన సమక్షంలోనే తనిఖీలు చేయగా ఈ అక్రమం వెలుగుచూసింది. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల ఆలయ సిబ్బంది అవినీతికి అడ్డు లేకుండాపోయింది. ప్రసాదాల విక్రయాల్లో అవకతవకలపై ఆలయ సూపరింటెండెంట్ శివరాజ్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్‌ను సస్పెండ్ చేసినట్లు ఆలయ ఈవో విజయ రామారావు తెలిపారు. మరో నలుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సైతం విధుల్లో నుంచి తొలగించినట్లు ఈవో చెప్పారు. 2 నెలల క్రితమే 'ఆంధ్రజ్యోతి' బాసరలో ప్రసాద విక్రయాల్లో అక్రమాలను వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే.

## ఆ భూములను వెనక్కి ఇచ్చేయండి

» పీఎస్‌యూలకు గతంలో రాష్ట్రంలో ఇచ్చిన భూములపై కేంద్ర మంత్రి కుమారస్వామికి మంత్రి దుద్దిళ్ల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ (పీఎస్‌యూ)లకు రాష్ట్రప్రభుత్వం గతంలో కేటాయించిన భూములను వెనక్కు తిరిగి ఇవ్వాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కోరారు. ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి కుమారస్వామిని కలిశారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం కింద విక్రయించాలని నిర్ణయించినందున వాటి మిగులు భూములను తిరిగి రాష్ట్రానికి అప్పగించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాల్లో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయగా వాటికి అప్పట్లో వేలాది ఎకరాల భూములను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖాయిలా పడిన ఆదిలాబాద్ సీసీఐ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించి స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని కోరారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నందున కొత్తగా వచ్చే పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని సందర్శించి ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్న శ్రీధర్ బాబు అభ్యర్థనకు కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. త్వరలో హైదరాబాద్‌కు వచ్చి.. తన దృష్టికి తెచ్చిన అన్ని విషయాలపై అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

## హరితహారం.. ఇకపై వన మహోత్సవం

» కొత్త లోగోను ఆమోదించిన సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): హరితహారం పేరును ఇకపై వన మహోత్సవంగా పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పేరుతో పాటు ఇప్పటివరకు ఉన్న లోగోను కూడా మార్చింది. ఈ మేరకు కొత్త లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదించారు. కొత్త లోగోలో భారీ వృక్షంతోపాటు స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు అవుతున్న సందర్భానికి సంకేతంగా 75 నంబర్‌ను ఉంచారు.

## మహబూబాబాద్‌లో రైస్ మిల్లర్ల అడ్డదారి

» 1.13 లక్షల క్వింటాళ్ల ధాన్యం మాయం..

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జూన్ 28: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని పలు రైస్ మిల్లులపై పౌరసరఫరా శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేసి 1.13 లక్షల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు మాయమైనట్లు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం ఇచ్చే (సీఎంఆర్) విధానంలో కొందరు రైస్ మిల్లర్లు మూడేళ్లుగా ఇవ్వలేదని అధికారులు నిర్ధారించారు. దీంతో నగరంలోని మణికంఠ రైస్ ఇండస్ట్రీస్, మహాదేవ రైస్ మిల్లు, మారుతి రైస్ మిల్లులపై అధికారులు సోదాలు చేపట్టారు. మూడు మిల్లుల్లో 1.13 లక్షల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు మాయం కాగా, వాటి విలువ దాదాపు రూ. 30 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. మారుతి రైస్ మిల్లులో 43.36 వేల క్వింటాళ్ల ధాన్యం, మణికంఠ రైస్ ఇండస్ట్రీస్‌లో 12.36 వేల క్వింటాళ్ల ధాన్యం, మహాదేవ రైస్ ఇండస్ట్రీస్‌లో 58 వేల క్వింటాళ్ల నిల్వలులేవని అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## పది సప్లిమెంటరీ ఫలితాల్లో 73% ఉత్తీర్ణత

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో 73 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల జరిగిన పది సప్లిమెంటరీ పరీక్షలకు 51,272 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 46,731 మంది పరీక్షలకు హాజరవ్వగా 34,126 మంది(73.03%) ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత 71.01 శాతం ఉండగా బాలికల ఉత్తీర్ణత 76.37 శాతంగా ఉంది. ఇక నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 100 శాతం ఉత్తీర్ణత నమోదవ్వగా, వికారాబాద్ జిల్లాలో అన్ని జిల్లాల కంటే తక్కువగా 42.14 శాతం ఉత్తీర్ణత నమోదయింది. కాగా, విద్యార్థులు రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500ల చొప్పున చెల్లించి వచ్చేనెల 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. విద్యార్థులు www.bse.telangana.gov వెబ్‌సైట్ ద్వారా ఫలితాలు తెలుసుకో

## పోషకాహార సర్వస్వం న్యూట్రీషన్ అట్లాస్

» వెబ్‌సైట్ విడుదల చేసిన ఎన్ఐఎన్

హైదరాబాద్, జూన్ 28: రాష్ట్రాల వారీగా అన్ని వయసుల వారికి సంబంధించిన సంపూర్ణ పోషకాహార సమాచారాన్ని క్రోడీకరించి రూపొందించిన న్యూట్రీషన్ అట్లాస్-2.0 https://nutritionatlasindia.com/ వెబ్‌సైట్‌ను హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శుక్రవారం అందుబాటులోకి తెచ్చింది. వివిధ సర్వేల ద్వారా శాస్త్రీయంగా సేకరించిన సమాచారాన్నంతటినీ ఒకేచోట పొందుపరిచామని సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్. హేమలత తెలిపారు. నిపుణులతో పాటు సామాన్య ప్రజలకు కూడా ఉపయోగపడే రీతిలో ఈ వెబ్‌సైట్‌ను తీర్చిదిద్దామని, నేషనల్ న్యూట్రీషన్ మానిటరింగ్ బ్యూరో సర్వే, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వంటి పలు సర్వేల సమాచారాన్ని పొందుపరిచామని పేర్కొ

## మే నెలలో రాబడులు రూ.11,328 కోట్లు

» ఇదే నెలలో రూ.14,575 కోట్ల వ్యయం: కాగ్ నివేదిక

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానాకు మే నెలలో రూ.11,328.76 కోట్ల రాబడులు సమకూరాయి. గత ఏప్రిల్ (రూ.11,818.88 కోట్లు)తో పోల్చితే మేలో రూ.490 కోట్ల మేర రాబడి తగ్గింది. మే నెల రెవెన్యూ రాబడుల్లో పన్నుల ద్వారా రూ.10,954.96 కోట్లు వచ్చాయి. ఈమేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) శుక్రవారం రాష్ట్ర రాబడులు, వ్యయాల నివేదిక విడుదల చేసింది. ఇక వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద ఏప్రిల్‌లో రూ.4,475.57 కోట్లు, మే నెలలో రూ.3,711.89 కోట్లు వచ్చాయి. ఈ రెండు నెలల్లో జీఎస్టీ కింద వచ్చిన సొమ్ము రూ.8,187.46 కోట్లు. స్టాంపులు-రిజిస్ట్రేషన్లతో ఈ రెండు నెలల్లో రూ.2,189.91 కోట్లు, సేల్స్ టాక్స్‌తో రూ.5,459.02 కోట్లు, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ.3,321.23 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.1,817.74 కోట్లు సమకూరాయి. అయితే కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల ద్వారా ఈ రెండు నెలల్లో నయా పైసా రాలేదు. ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వం నికరంగా తీసుకున్న అప్పు రూ.7,380 కోట్లు. ఇక మే నెలలో ప్రభుత్వం చేసిన మొత్తం వ్యయం రూ.14,575.46 కోట్లుగా నమోదైంది. ఇందులో అప్పుల వడ్డీ చెల్లింపులకు రూ.1,864.04 కోట్లు, ఉద్యోగుల జీతభత్యాల కింద రూ.3,725.64 కోట్లు, పెన్షనర్ల పెన్షన్ల కోసం రూ.1,296.04 కోట్లు, సబ్సిడీల కింద రూ.1104.09 కోట్ల వ్యయం చేశారు.

## ఐదు సర్కారీ ఆస్పత్రులకు జాతీయ గుర్తింపు

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు ప్రభుత్వ ఆస్పత్రులు జాతీయస్థాయి గుర్తింపు సాధించాయి. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుడడంతో నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్)సర్టిఫికెట్ పొందాయి. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఏరియా ఆస్పత్రి, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు సీహెచ్‌సీ, జగిత్యాల జిల్లా కథలాపూర్ పీహెచ్‌సీ, అడ్డగుంటపల్లె యూపీహెచ్‌సీ, ధ్వంసులాపురం పల్లెదవాఖాన ఈ ఘనత సాధించాయి. కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌హెచ్ఎమ్(నేషనల్ హెల్త్ మిషన్) ఎండీ. ఆర్వీ కర్ణన్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ సర్టిఫికెట్ మూడేళ్ల పాటు వర్తిస్తుంది. ఆ తర్వాత అదే ప్రమాణాలను పాటిస్తుంటే సర్టిఫికేషన్ గడువును పొడిగిస్తారు. ఆస్పత్రిలోని ఒక్కో పడకకు రూ.10వేలు చొప్పున లెక్కించి సర్టిఫికెట్ పొందిన ఆస్పత్రికి ఏటా నిధులిస్తారు. ఉదాహరణకు ఓ పీహెచ్‌సీలో 30 పడకలుంటే రూ.3లక్షలు చొప్పున మూడేళ్ల పాటు నిధులిస్తారు. ఈ నిధుల్లో 75 శాతాన్ని ఆస్పత్రి అభివృద్ధికి, మిగిలిన మొత్తాన్ని సిబ్బందికి కేటాయిస్తారు.

## బొగ్గును దిగుమతి చేసుకోండి: కేంద్రం

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో థర్మల్ విద్యుదుత్పాదనకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి లేనందున ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని కేంద్ర విద్యుత్తు శాఖ తెలిపింది. ఈ మేరకు దేశంలోని అన్ని విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లు, స్వతంత్ర విద్యుదుత్పత్తిదారుల (ఐపీపీ)కు శుక్రవారం సూచనలు చేసింది. విద్యుత్తు డిమాండ్‌కు తగినట్లుగా బొగ్గు లేదని, ఈ నేపథ్యంలో విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవడం తప్పనిసరని స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే మంత్రి పదవులు

(మొదటిపేజీ తరువాయి)



రుణాలన్నీ మాఫీ చేస్తాం. రుణ మాఫీకి రేషన్ కార్డుకు సంబంధం లేదు. పాస్ పుస్తకం ఉంటే సరిపోతుంది" అని స్పష్టత ఇచ్చారు. తమ తొలి ప్రాధాన్యం రుణ మాఫీ అని, అసెంబ్లీ తర్వాత రైతు బంధు అమలు చేస్తామని తెలిపారు. ఆ తర్వాత పింఛన్ పెంపు చర్యలు చేపడతామన్నారు. "కల్వకుర్తి ఏరియాలో నేషనల్ హైవే భూములకు కూడా రైతు బంధు ఇచ్చారు. దీనిపై సబ్ కమిటీ వేశాం. అది సమగ్ర నివేదిక ఇచ్చిన తర్వాత అసెంబ్లీ చర్చిస్తాం. భవిష్యత్తులో ఇటువంటి తప్పులు జరగకుండా చూడాలనేదే మా ఉద్దేశం" అని వివరించారు. రైతుబంధు కింద రూ.75 వేల కోట్లు ఇచ్చానని కేసీఆర్ చెబుతున్నారని, అందులో రూ.25 వేల కోట్లు అనర్హులకే ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారని, సంక్షేమం అనేది పేదలకు, మధ్య తరగతికి చెందాలని, కానీ, ఫాంహౌజ్‌లో ఉన్నోళ్లకూ రైతు బంధు ఇచ్చారని తప్పుబట్టారు.

### కక్ష సాధించను

ఫిరాయింపులు ఒక్క తెలంగాణలోనే ప్రత్యేకం కాదని, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు ఫిరాయించారని, నలుగురు టీడీపీ రాజ్యసభ సభ్యులను బీజేపీ విలీనం చేసుకుందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. "అధికారాలను దుర్వినియోగం చేయను. కక్షసాధింపు చర్యలకు పాల్పడను. అధికారులతో సమర్థంగా పని చేయించుకుంటాను. డీజీపీని కూడా నేను మార్చలేదు. కేంద్ర ఎన్నికల సంఘం మార్చింది" అని వివరించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ జరుగుతోందని, దర్యాప్తు చేసిన తర్వాత నిజానిజాలన్నీ కోర్టులకే చెప్పాలని అధికారులకు సూచించానని తెలిపారు. ధరణిపై అధ్యయనం తర్వాత అసెంబ్లీలో చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

### జిల్లాలను తగ్గిస్తామని చెప్పలేదు

కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తామని లేదా జిల్లాలను తగ్గిస్తామని తాను చెప్పలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల డీలిమిటేషన్‌పై సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ వేస్తానని చెప్పాను. సదరు నివేదికపై అసెంబ్లీలో చర్చ జరిపి నిర్ణయాలు తీసుకుంటాం. అంతే తప్ప.. జిల్లాలను కుదిస్తానని నేను చెప్పలేదు. అలాగే, జిల్లాలను పెంచుతానని కూడా చెప్పలేదు" అని వివరించారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాలు పెద్దగా, మరికొన్ని చిన్నగా ఉన్నాయని, వాటిని హేతుబద్ధీకరించినప్పుడు పెరగొచ్చు.. తగ్గొచ్చునని వ్యాఖ్యానించారు. మండలాలను ఇష్టానుసారంగా విభజించారని, చిన్న పల్లెలను కూడా కేసీఆర్ రెవెన్యూ డివిజన్ చేశారని, మండల కేంద్రానికి ఒక ప్రాతిపదిక లేదని, వీటిపై బడ్జెట్ సమావేశాల్లో చర్చ పెడతామని తెలిపారు.

### కాళేశ్వరంతో ఆర్థిక నష్టమే

"కాళేశ్వరం ప్రాజెక్టుతో ఆర్థిక నష్టమే. దీనిపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడాం. అలోపే ఎన్నికలు వచ్చాయి. మరోసారి చర్చించాలి" అని సీఎం రేవంత్ తెలిపారు. కాళేశ్వరం లక్షన్నర కోట్ల రూపాయల ప్రాజెక్టు అని, ఇప్పటికే లక్ష కోట్లు ఖర్చు పెట్టారని, ఇంకో యాభై వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని తెలిపారు.

### వడ్డీల భారాన్ని తగ్గించే పనిలో పడ్డాం

"తెలంగాణ అప్పు రూ.7 లక్షల కోట్లు. మరికొన్ని చిన్నా చితకా రుణాలు కలిపితే ఇంకో లక్ష కోట్లు ఉంటుంది. మొత్తం కలిపితే రూ.8 లక్షల కోట్ల అప్పు. శ్వేతపత్రంలో ఆ లక్ష కోట్లు పెట్టలేదు. గత ప్రభుత్వం 7 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చింది. అందుకే ఇప్పుడు రుణ భారం తగ్గేలా రుణాల వడ్డీని తగ్గించుకునే పనిలో పడ్డాం. ఒక్క శాతం వడ్డీ తగ్గినా రూ.700 కోట్లు ఆదా అవుతుంది. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం" అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అప్పులు తీసుకొచ్చి ఆస్తులు కల్పించానని కేసీఆర్ చెబుతున్నారని, కానీ, వాస్తవంలో అవి ఎక్కడా కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ వచ్చినప్పుడు అప్పులకు వడ్డీలుగా ఏడాదికి రూ.6,500 కోట్లు చెల్లించేవాళ్లమని, పదేళ్ల కేసీఆర్ పాలన తర్వాత నెలకు రూ.7000 కోట్లు కట్టాల్సి వస్తోందని తెలిపారు.

### కేంద్ర బడ్జెట్ పెట్టిన వెంటనే రాష్ట్ర బడ్జెట్

జూలై చివరి వారంలో కేంద్ర బడ్జెట్ ఉండే అవకాశం ఉందని, కేంద్ర బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఒకటి రెండు రోజుల్లోనే రాష్ట్ర బడ్జెట్ పెట్టాలని అనుకుంటున్నామని సీఎం రేవంత్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు పరిశీలించిన తర్వాత రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. "ప్రజలను మభ్యపెట్టేలా కాకుండా వాస్తవికతతో కూడిన బడ్జెట్ పెడతాం. ఒకప్పుడు బడ్జెట్‌లో రాబడి, వ్యయానికి మధ్య వ్యత్యాసం 5 శాతం మాత్రమే ఉండేది. కానీ, కేసీఆర్ వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. అంచనాలకు, రాబడికి మధ్య 30 శాతం వ్యత్యాసం ఉండేది. పేపర్లలో బడ్జెట్ భారీగా ఉండేది. కానీ, వాస్తవం వేరేలా ఉండేది. అందుకే, మేం అధికారంలోకి వచ్చిన తర్వాత నిజమైన బడ్జెట్ పెట్టాలని అధికారులకు సూచించా. గత బడ్జెట్ కూడా అలాగే పెట్టాం. గతంలో కేసీఆర్ రూ.2.95 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టారు. మా అధికారులు రూ.3 లక్షల కోట్లకు మించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తీరా లెక్కలన్నీ చూస్తే రూ.2.60-2.70 లక్షల కోట్ల మధ్యలోనే రాబడి వస్తోంది. అందుకే, రూ.2.75 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టాం. ఈసారి కూడా అలాగే వాస్తవికతకు దగ్గరలోనే ఉంటుంది" అని వివరించారు. కేంద్ర బడ్జెట్ కంటే ముందే వినతులు ఇస్తే ఫలితం ఉంటుందని వరుసగా మంత్రులను కలుస్తున్నామని, వినతులు ఇస్తున్నామని, ప్రధాని, హోం మంత్రిని తప్ప మిగిలిన అందరినీ కలిశామని చెప్పారు.

### ఉచిత బస్సుతో రాష్ట్రానికి రాబడి పెరిగింది

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రాష్ట్రానికి రాబడి పెరిగిందని, దేవాలయాల వంటి వాటికి ఆదాయం పెరిగిందని సీఎం రేవంత్ చెప్పారు. "మహిళలకు ఉచిత బస్సుతో ఆర్టీసీకి మేలు జరిగింది. లాభం వస్తోంది. నెలకు రూ.350 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తున్నాం. తద్వారా, నో లాస్, నో ప్రాఫిట్ స్థితికి తీసుకు రాగలిగాం. గతంలో జీతాలకు దిక్కులు చూడాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి మారింది" అని వివరించారు. కొన్ని రోజుల్లోనే ఆర్టీసీ లాభాల్లోకి వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

### కేసీఆర్ కలలు కంటున్నారేమో

"మళ్లీ నేను ముఖ్యమంత్రి అవుతానని కేసీఆర్ కలలు కంటున్నాడేమో. ఆయన చెప్పినట్టే జరుగుతుందని అనుకుంటున్నాడేమో? అందుకే విద్యుత్తు కమిషన్ పట్ల అలా వ్యవహరిస్తున్నాడు" అని సీఎం రేవంత్ మండిపడ్డారు. మీకు చేతనైతే కమిషన్ వేసి విచారించాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అడిగారని, అట్లనే కమిషన్ వేశామని, దాని పని అది చేసుకు వెళుతుంటే.. దానిని రద్దు చేయాలని కేసీఆర్ అంటున్నారని తప్పుబట్టారు. రాష్ట్రంలో విద్యుత్తు కోతలు లేవని, కావాల్సినంత విద్యుత్తు కొనుగోలు చేస్తున్నామని, అనివార్యమైన అంతరాలు, మెయింటినెన్స్ పనుల కారణంగా సరఫరాలు అంతరాయం వస్తూ ఉండవచ్చని వివరించారు.

## ఉభయ సభల ప్రొరోగ్.. గవర్నర్ ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలను గవర్నర్ రాధాకృష్ణన్ ప్రొరోగ్ (నిరవధిక వాయిదా) చేశారు. ఈమేరకు రెండు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేశారు. శాసనసభ ఫిబ్రవరి 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మొత్తం ఎనిమిది రోజుల పాటు, శాసన మండలి 9 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజుల పాటు భేటీ అయ్యాయి. అనంతరం వాయిదా పడ్డాయి. మళ్లీ ఆరు నెలల్లోపు తదుపరి సమావేశాలను ప్రారంభించాలంటే ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేయాల్సి ఉంటుంది. ఈ దృష్ట్యా ఫిబ్రవరిలో జరిగిన ఉభయసభల సమావేశాలను 27 నుంచి ప్రొరోగ్ చేస్తున్నట్లు గవర్నర్ ప్రకటించారు.

## పీసీసీ చీఫ్‌పై కసరత్తు కొలిక్కి!

» అయితే మహేష్‌కుమార్‌గౌడ్.. లేదంటే బలరాంనాయక్!

» కొత్త మంత్రులుగా నలుగురికి చాన్స్?

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)కి కొత్త అధ్యక్షుడి నియామకం, మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం కసరత్తు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ రెండు అంశాలపై శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సుదీర్ఘంగా చర్చించారు. టీపీసీసీ చీఫ్ నియామకానికి సంబంధించి మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్, సురేశ్ షెట్కార్, బలరాంనాయక్, సంపత్ కుమార్ పేర్లపై చర్చ జరిగినట్లు సమాచారం. లోతైన విశ్లేషణ తర్వాత రేసులో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ బలరాం నాయక్ పేర్లు మిగిలినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బీసీ సామాజిక వర్గం నుంచి ఎంపిక చేసేట్లయితే వివాద రహితుడు, పార్టీ సంస్థాగత కార్యకలాపాలపై సమగ్ర అవగాహన ఉన్న వాడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ వైపు అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో ఎస్టీ (లంబాడా)లకు చోటు దక్కకపోతే ఆ వర్గం నుంచి బలరాం నాయక్‌కు టీపీసీసీ చీఫ్‌గా అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనపైనా చర్చ జరిగింది. రేవంత్, భట్టి, ఉత్తమ్, మున్షీల అభిప్రాయాలను పరిశీలించి.. అధిష్ఠానం నిర్ణయం తీసుకోనుంది. అలాగే మంత్రివర్గ విస్తరణపైనా లోతైన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచిన వారికే మంత్రివర్గంలో చోటు ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి మీడియాకు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సామాజిక కూర్పు, ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాలను పరిగణనలోకి తీసుకుని చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తామన్న సీఎం హామీ మేరకు పార్టీ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి, నిజామాబాద్ నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవులు దాదాపు ఖరారైనట్లు చెబుతున్నారు. ఆదిలాబాద్ నుంచి పార్టీ ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, ఎడ్మ బొజ్జులపైనా చర్చ జరిగింది. టీపీసీసీ చీఫ్ ఎంపిక ఆధారంగా సామాజిక సమీకరణలు చూసుకుని మిగిలిన మంత్రి పదవులపై నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకటి లేదా రెండు బెర్తులు పెండింగ్‌లో పెట్టే అవకాశం ఉంది. జూలై మొదటి వారంలో టీపీసీసీ అధ్యక్షుడి నియామకం, మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## అదానీ సంస్థకు విద్యుత్తు బాధ్యత!

» సరఫరా నుంచి బిల్లుల జారీ వరకు

» నష్టాల నుంచి తప్పించుకునేందుకే..!

» అప్పగించే యోచనలో ఎస్‌పీడీసీఎల్?

» హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో అమలు

» ఢిల్లీలో సూచనప్రాయంగా సీఎం వెల్లడి

హైదరాబాద్ సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు సంస్థలకు మోయలేని భారంగా మారుతున్న బకాయిలు, నష్టాలను తగ్గించుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో భారంగా మారిన పలు సర్కిళ్లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే యోచనలో ఉంది. గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో అధిక నష్టాలు మూటగట్టుకుంటున్న దక్షిణ సర్కిల్ బాధ్యతను ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి చెందిన సంస్థకు ఇవ్వనున్నట్లు స్పష్టమైంది. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్తు బిల్లుల వసూలును అదానీ కంపెనీకి ఇవ్వామని, భూగర్భ లైన్లు వేసి అక్కడ మొత్తం వ్యవస్థను మార్చాలని కోరామని తెలిపారు. ఈ నేపథ్యంలో నష్టాలు ఎక్కువగా వస్తున్న సర్కిళ్లను ప్రైవేటుకు అప్పగిస్తారని ఖాయమైంది. అయితే, విద్యుత్తు సరఫరా, లైన్ల నిర్వహణ, మీటర్ రీడింగ్, బిల్లుల జారీ, వసూళ్లు.. ఇలా అన్నింటిలోనూ ప్రైవేట్ వ్యవస్థను భాగస్వామ్యం చేస్తారా? బిల్లుల జారీ, వసూళ్ల వరకేనా? అన్నది తెలియాల్సి ఉంది.

### బకాయిలు అధికం

గ్రేటర్ హైదరాబాద్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో గృహ/వాణిజ్య విభాగంలో 60 లక్షల విద్యుత్తు కనెక్షన్లున్నాయి. ప్రతి నెల బిల్లుల రూపంలో రూ.900 కోట్లు వసూలవుతుంటాయి. గత మే నెల నాటికి రూ.380 కోట్ల బకాయిలు పేరుకున్నాయి. వీటిలో అత్యధికంగా హైదరాబాద్ దక్షిణ సర్కిల్‌లో రూ.83.4 కోట్లు, రాజేంద్రనగర్‌లో రూ.63.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. హబ్సిగూడలో రూ.48.3 కోట్లు, హైదరాబాద్ సెంట్రల్‌లో రూ.45.4 కోట్లు, సైబర్ సిటీలో రూ.45.4 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితోపాటు 41 శాతం నష్టాలు దక్షిణ సర్కిల్‌లోనే నమోదవుతున్నాయి. అయినా, వాటిని నియంత్రించడానికి విద్యుత్తు సంస్థలు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. బిల్లుల వసూళ్ల కోసం ఇళ్లకు వెళ్లిన సిబ్బందిపై దాడులు జరిగినా ఉన్నతాధికారులు పట్టించుకోరనే ఆరోపణలున్నాయి. గతంలో పలువురు ఇంజనీర్లు, సిబ్బంది దక్షిణ సర్కిల్‌లో తాము పని చేయలేం అని, బదిలీ చేయాలని లేఖలు రాయడం పరిస్థితికి అద్దం పడుతోంది.

### ఇదీ హైదరాబాద్ దక్షిణ సర్కిల్ స్వరూపం

● మొత్తం విద్యుత్ కనెక్షన్లు- 7.21 లక్షలు ● వాణిజ్య: 1.40 లక్షలు ● గృహ విద్యుత్తు: 5.68 లక్షలు ● హెచ్‌టీ కనెక్షన్లు: 241 ● డివిజన్లు: బేగం బజార్, అస్మాన్‌ఘడ్, చార్మినార్ ● సబ్ డివిజన్లు: 9 ● సెక్షన్లు: 30 ● ప్రతి నెల రావాల్సిన బిల్లులు: రూ.110 కోట్ల నుంచి రూ.120 కోట్లు.

# పనుల్లో జాప్యానికి సాకులు చెప్పొద్దు

**ఆర్ఆర్ఆర్‌పై పకడ్బందీగా కసరత్తు చేయండి.. గత ప్రభుత్వం వల్లే కేంద్రం నుంచి తక్కువ నిధులు**

» రోడ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు

» ప్రమాదాల నియంత్రణకు చర్యలు

» సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పనులకు సంబంధించి ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని, జాప్యానికి సాకులు చెప్పొద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. రాష్ట్రానికి రహదారులు జీవనాడులని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూడేళ్లుగా కేంద్రం నుంచి అతి తక్కువ నిధులు మంజూరయ్యాయని ఆరోపించారు. ఇకపై అలసత్వానికి తావులేకుండా రహదారుల నిర్మాణానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కార్యాలయంలో జాతీయ రహదారులపై ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీశ్, ఎన్‌హెచ్ఏఐ ఆర్వో రజాక్, కేంద్ర రహదారుల ప్రాంతీయ అధికారి కుష్వా, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్ని కోట్లు వెచ్చించినా పోయిన ప్రాణం తిరిగి రాదని, ప్రజలను కాపాడలేకపోతే.. ప్రభుత్వం ఉండి ఎందుకు? అని ప్రశ్నించారు. రీజినల్ రింగ్ రోడ్డు రాష్ట్రానికే మణిహారం కానుందని, పనులను ప్రారంభించేందుకు పకడ్బందీగా కసరత్తు చేయాలని సూచించారు. ఈ రోడ్డు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పనులను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభమైతే డిస్నీల్యాండ్ వంటి ప్రఖ్యాత సంస్థలు ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ట్రాన్స్‌పోర్టు హబ్‌లు, పారిశ్రామిక కారిడార్లు ఏర్పడుతాయని చెప్పారు. హైదరాబాద్- విజయవాడ (ఎన్‌హెచ్-65) రహదారిని ఆరు లేన్లుగా విస్తరించేందుకూ చర్యలు చేపట్టాలన్నారు. జూలైలో కొత్త టెండర్లను ఆహ్వానించి, సెప్టెంబర్‌లోగా పనులు ప్రారంభించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఎన్‌హెచ్-645ను గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మించే డీపీఆర్‌పైనా చర్చించారు. ఉప్పల్-ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ టెండర్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మన్నెగూడ రోడ్డు నిర్మాణంలో ఆలస్యంపై మంత్రి ప్రశ్నించగా.. ఎన్జీటీ ఆదేశాల ప్రకారం 930 చెట్లను మరోచోటకు మార్చాల్సి ఉందని, మరికొన్ని అనుమతులు రావాల్సి ఉందని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి.. చెట్లను మరోచోటకు తరలించే ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసేలా నిర్మాణ సంస్థతో మాట్లాడాలన్నారు. ఆర్మూర్- మంచిర్యాల జాతీయ రహదారి కోసం మరో 100హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉందని, త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. కాగా, జాతీయ రహదారుల నిర్మాణ స్థితిగతులను తెలుసుకునేందుకు జూలై మొదటి వారంలో ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల బృందం తెలంగాణకు రానుందని మంత్రి చెప్పారు. ఇప్పటివరకు మంజూరైన రహదారులు, నిర్మాణంలో ఉన్న రోడ్లు, అనుమతులు రాక నిలిచిపోయిన వాటి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

## పీహెచ్‌సీలకు కొత్తగా 435 మంది వైద్యులు!

» పోస్టుల భర్తీకి మెడికల్ బోర్డు నోటిఫికేషన్

» 2 నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలో మెడికల్ బోర్డు నుంచి తొలి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలైంది. ప్రజారోగ్య విభాగంలో 435 మంది వైద్యుల భర్తీకి వైద్య నియామక బోర్డు కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు జూలై 2 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై 11 సాయంత్రం 5 గంటల వరకు గడువిచ్చారు. ఈ పోస్టులన్నింటికీ ఎంబీబీఎస్‌ను అర్హతగా నిర్ణయించారు. అలాగే అభ్యర్థులు కచ్చితంగా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలిలో నమోదు చేసుకొని ఉండాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే వారు అనుభవానికి సంబంధించిన ధ్రువపత్రాన్ని జత చేయాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులు ప్రైవేటు ప్రాక్టీస్ చేసేందుకు అనర్హులని నోటిఫికేషన్‌లోనే పేర్కొన్నారు. ఇక అభ్యర్థుల వయసు ఈ ఏడాది జూలై 1 నాటికి 46 ఏళ్లకు మించి ఉండకూడదు. ఈ పోస్టుల భర్తీకి రాత పరీక్ష ఉండదు. అభ్యర్థులకు ఎంబీబీఎస్‌లో వచ్చిన మార్కులు, కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేవారికి ఇచ్చే మార్కుల ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు. మొత్తం వంద పాయింట్లు ఉంటాయి. ఇందులో వైద్యవిద్యలో వచ్చిన మార్కులకు 80 పాయింట్లు, వెయిటేజీగా 20 మార్కులు కేటాయిస్తారు. మొత్తం 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల్లో మల్టీ జోన్ 1లో 271, మల్టీ జోన్ 2లో 164 పోస్టులున్నాయి. వీటిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగంలో నాలుగు పోస్టులున్నాయి. వివరాలకు www.mhsrb.telangana.govను సందర్శించవచ్చు.



## రైతు భరోసాపై ప్రజాభిప్రాయం!

» నేటి నుంచి 4వ తేదీ వరకు చర్చలు.. రైతులు, నేతలతో భేటీలు



హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా పథకాన్ని ఎలా అమలుచేయాలనే అంశంపై క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ శ్రీకారం చుట్టింది. ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొన్నిచోట్ల రైతులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించగా... క్షేత్రస్థాయిలో రైతులు, రైతుసంఘాల నేతలు, ఇతరవర్గాల అభిప్రాయాన్ని కూడా సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు శనివారం నుంచి జూలై నాలుగో తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. సాగుకు యోగ్యంలేని భూములను తొలగించడంతోపాటు ఎకరాల వారీగా కటాఫ్ పెట్టాలన్న అభిప్రాయాలు గతంలోనే వ్యక్తమయ్యాయి. ఈ అంశాలపై అభిప్రాయ సేకరణ సదస్సుల్లో చర్చించనున్నారు.

## సాగు చేయని భూములపై ఐదు జిల్లాల్లో సర్వే

ఖమ్మం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాగు చేయకుండా ఖాళీగా ఉంటున్న భూముల లెక్క పక్కాగా తేలుస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో సర్వే చేస్తున్నారు. రాష్ట్రంలో ఐదు జిల్లాలను సర్వేకు నమూనాగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఖమ్మం, సంగారెడ్డి, కామారెడ్డి, కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లో నాలుగు రోజులుగా సర్వే ప్రక్రియ సాగుతోంది. ఏటా వ్యవసాయాధికారులు వానాకాలం, యాసంగి సాగు వివరాలను నివేదిక ద్వారా సిద్ధం చేస్తుండగా.. కొన్ని సర్వే నంబర్లలో ఏ పంట వేయడం లేదని ఖాళీగా చూపుతున్నారు. ఖమ్మం జిల్లాలో 53 వేల సర్వే నంబర్లు, సంగారెడ్డి జిల్లాలో 97,293, కామారెడ్డిలో 35,672, హన్మకొండలో 29 వేలు, కరీంనగర్ జిల్లాలో 50,785 సర్వే నంబర్లలో ఏ పంటలు వేయకుండా ఖాళీగా ఉన్నట్లు అంచనాలున్నాయి. ఈ మేరకు వ్యవసాయశాఖ ఏవోలు, ఏఈవోలు, గ్రామ కార్యదర్శులు తదితర సిబ్బంది సహకారంతో క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు.

## వ్యాపార కేంద్రంగా తిరుమల శారదామఠం

- ఆక్రమణలను కూల్చకపోతే ప్రాణత్యాగాలకైనా సిద్ధం
- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



తిరుమలలో శారదా మఠం నిర్మిస్తున్న ఆరంతస్తుల భవనం

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శారదామఠంలో ఆక్రమణలను కూల్చపోతే ప్రాణత్యాగాలకైనా సిద్ధమేనని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి హెచ్చరించారు. శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో ఏపీ సాధు పరిషత్ స్వామిజీలు శుక్రవారం తిరుమలకు చేరుకుని శారదామఠంలోని నిర్మాణాలను పరిశీలించారు. ముందు, వెనుకభాగాలతో పాటు బేస్మెంట్‌ను కూడా తనిఖీ చేశారు. అనంతరం శ్రీనివాసానంద సరస్వతి మీడియాతో మాట్లాడారు. శారదా పీఠాధిపతినని చెప్పుకుంటూ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారం మఠంలో నిర్మాణాలు చేపట్టారన్నారు. ఐదు వేల చదరపు అడుగుల వరకు మాత్రమే నిర్మాణాలు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అదనంగా మరో రెండు వేల చదరపు అడుగులు ఆక్రమించి కట్టడాలు నిర్మించారని టీటీడీ అధికారులే చెప్పారన్నారు. నాలుగు అంతస్తులే ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ శారదా మఠంలో ఆరు అంతస్తులు కట్టారని చెప్పారు. టీటీడీ చర్యలు చేపట్టకపోతే హిందూ సమాజంతో కలిసి తాము ముందుకొస్తామని హెచ్చరించారు. అధికారులు వచ్చేంత వరకు మౌన దీక్ష చేస్తామని స్వామిజీలు మఠం ముందు బైఠాయించారు. పోలీసులు, విజిలెన్స్ అధికారులు తప్ప ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు రాకపోవడంతో సుమారు రెండు గంటల పాటు మఠం ముందే కూర్చున్నారు. తర్వాత రెవెన్యూ అధికారులు వచ్చి మఠంలో జరిగిన అక్రమ కట్టడాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.



## చంద్రబాబును కలిసిన తెలంగాణ గవర్నర్

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, జూన్ 28: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం ఇక్కడ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఆయనకు చంద్రబాబు, ఆయన తనయుడు, రాష్ట్ర మంత్రి లోకేశ్ స్వాగతం పలికి నివాసంలోకి తీసుకువెళ్లారు. చంద్రబాబు ఆయనకు జ్ఞాపిక బహూకరించగా.. లోకేశ్ మంగళగిరి చేనేత శాలువాను కప్పి సత్కరించారు.

# గ్లాస్ పరిశ్రమలో పేలుడు

**ఐదుగురు కార్మికుల దుర్మరణం.. 10 మందికి తీవ్ర గాయాలు.. అత్యంత విషమంగా ఉన్న ముగ్గురికి హైదరాబాద్‌లో చికిత్స!**

- పేలుడు ధాటికి ఛిద్రమై.. చెల్లాచెదురయిన మృతదేహాలు
- రంగారెడ్డి జిల్లా బూర్గుల గ్రామశివారులో విషాద ఘటన
- మృతులు యూపీ, ఒడిసా, బిహార్ రాష్ట్రాలకు చెందినవారు
- బాధితుల్ని పరామర్శించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక
- సీఎం రేవంత్ ఆరా.. సహాయకచర్యలు చేపట్టాలని ఆదేశం





ప్రమాదానికి కారణమైన ఆటోక్లేవ్; గాయపడ్డ కార్మికులను పరామర్శిస్తున్న కలెక్టర్ శశాంక

షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఒక్క కార్మికుడు పనిలో చేసిన పొరపాటు.. పెను ప్రమాదానికి కారణమైంది! అద్దాలు తయారుచేసే పరిశ్రమలో రియాక్టర్ పేలి ఐదుగురు కార్మికులు మృతి చెందగా.. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బూర్గుల గ్రామ శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం జరిగిందీ దుర్ఘటన. గాయపడ్డవారిలో తొమ్మిదిమందిని షాద్‌నగర్ పట్టణంలోని వివో ఆస్పత్రికి తరలించారు. మరో కార్మికుడిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని లిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ పది మందిలో.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ముగ్గురిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్ అపోలో ఆస్పత్రికి తరలించారని.. వారి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని.. యాజమాన్యం ఈ విషయం బయటపడకుండా రహస్యంగా ఉంచుతోందని పలువురు కార్మికులు చెబుతున్నారు.

### ప్రమాదం ఇలా..

ఈ పరిశ్రమలో.. వాహనాల అద్దాలు తయారు చేసేందుకు ఆటోక్లేవ్ అనే యంత్రాన్ని ఉపయోగిస్తారు. ఇందులో గ్యాస్‌తో పాటు అధిక ఉష్ణం గల పరికరాలను ఉపయోగిస్తారు. అద్దాలు తయారయ్యాక.. తొలుత అందులో ఉన్న గ్యాస్‌ను బయటకు పంపి, తయారైన అద్దాలను బయటకు తీయాల్సి ఉంటుంది. కానీ అక్కడ పనిచేస్తున్న ఓ కార్మికుడు గ్యాస్‌ను విడుదల చేయకుండానే ఆటోక్లేవ్‌ను ఓపెన్ చేయడం వల్ల పెద్ద శబ్దంతో రియాక్టర్ పేలి.. అక్కడే పనిచేస్తున్న యూపీవాసులు నితీశ్‌కుమార్(22), రామ్‌సేత్(24), బిహార్‌కు చెందిన రామ్ ప్రకాశ్(31), చిత్తరంజన్(31), ఒడిసాకు చెందిన రతికాంత్(23) అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడ్డవారిలో.. షైకేల్ ఇమ్రాన్(25), గోవింద్(25), కార్తీక్(19), సుబోధ్(22), మంతు(23), సమిత్‌కుమార్(18), రోషన్ కుమార్(20), సురేందర్ పాశ్వాన్(21), రవికాంత్(37), రాజేష్ పాషా(36), మమత (26), నీలమ్మ(40), సుజాత(24) ఉన్నారు. వీరిలో రాజేష్ పాషా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

### చేతులు తెగి..

ఈ ఫ్యాక్టరీలో షిఫ్టుకు 50 మంది చొప్పున మొత్తం 200 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో రియాక్టర్ వద్ద 16 మంది.. ఫ్యాక్టరీలో మొత్తం 50 మంది ఉన్నారు. పేలుడు ధాటికి ప్రాణాలు కోల్పోయిన ఐదుగురి కాళ్లు, చేతులు విరిగి చెల్లాచెదురుగా పడ్డాయి. ఒక వ్యక్తి మృతదేహం మరో యంత్రంలో ఇరికి ఒక కాలు మాత్రమే బయటకు కనిపిస్తోంది. కొందరి శరీర భాగాలు 20 అడుగుల ఎత్తువరకూ ఎగిరి.. పరిశ్రమలోని రేకుల పైభాగం నుంచి బయట ఆవరణలోకి వచ్చిపడ్డాయి. పరిశ్రమలో ఎక్కడ చూసినా శరీర భాగాలు, రక్తపు మడుగులతో భీతావహ దృశ్యాలు కనిపించాయి. గాజుముక్కలు చెల్లాచెదురయ్యాయి. రేకులతో ఉన్న పైకప్పు ఎప్పుడు కూలుతుందో అన్న భయాందోళనలు నెలకొన్నాయి. కాగా.. జరిగిన ఘోరం పట్ల జిల్లా కలెక్టర్ శశాంక దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం సంగతి తెలియగానే ఆయన హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. షాద్‌నగర్ ఆస్పత్రిని సందర్శించి, గాయపడిన కార్మికులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. మృతుల కుటుంబసభ్యుల వివరాలను సేకరించి, వారికి ప్రమాద ఘటన గురించి సమాచారం తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఇక.. ప్రమాదానికి కారణాలను తెలుసుకుని పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేస్తామని డీసీపీ వెల్లడించారు. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రమాదంపై ఆరా తీశారు. గాయపడ్డవారికి సత్వరం వైద్యచికిత్స అందించాలని.. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మిక శాఖ అధికారులతోపాటు వైద్యబృందాలు కూడా ఘటనాస్థలి వద్దే ఉండి సహాయకచర్యలు అందించాలని ఆదేశించారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో విపత్తు నిర్వహణ ప్రణాళిక అమలుచేయాలని, భద్రతా ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## 2 లారీల ఢీ.. ఐదుగురి మృతి

- ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే యత్నంలో మేకల లోడ్ లారీ ఢీ

తూప్రాన్, జూన్ 28: రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మృతిచెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం బైపాస్‌రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం సంభవించింది. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లా గృహ, బుర్హా, గుడువా గ్రామాలకు చెందిన మేకల వ్యాపారులు, కూలీలు.. డ్రైవర్‌తో కలిపి మొత్తంగా పది మంది హైదరాబాద్‌లోని మేకల మండీకి మేకలను తీసుకెళ్లేందుకు గురువారం సాయంత్రం లారీని కిరాయికి మాట్లాడుకున్నారు. సుమారు 450 మేకలతో వారు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి లారీలో బయలుదేరారు. క్యాబిన్‌లో డ్రైవర్ పక్కన ఇద్దరు వ్యాపారులు కూర్చున్నారు. వెనుక రెండు ర్యాకుల్లో మేకలను నిల్చోబెట్టారు. వాహనం కుదుపులకు గురైతే ఒకదానిపై మరొకటి పడకుండా చూసేందుకు వ్యాపారులు, కూలీలు కలిపి ఏడుగురు ఎక్కారు. లారీ శుక్రవారం ఉదయం 4:30 గంటలకు మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం 44వ జాతీయ రహదారి బైపాస్‌లో ప్రమాదానికి గురైంది. గోధుమల లోడ్‌తో వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసేక్రమంలో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో మేకల లోడ్‌తో వెళుతున్న లారీ క్యాబిన్‌లో కూర్చున్న వ్యాపారులు చిక్వా రాజు (57), మనీశ్ కుమార్ (30) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూలీల్లో ఎండీ ఇబ్రహీం (21), ఎండీ షబ్బీర్ ఖాన్ (48), ఎండీ జీసన్ (21) మేకలు మీద పడి, వాటి మధ్య ఇరుక్కొని ప్రాణాలొదిలారు. మేకల వ్యాపారులు రమేశ్ (40), మహేశ్ (35), మణిలాల్ (54), కూలీలు శుక్లాల్ (45), మహారాష్ట్ర నాగ్‌పూర్ జిల్లా టేకెన్ తనారికి చెందిన లారీ డ్రైవర్ బుట్టాసింగ్ (45) గాయపడ్డారు. ఈ ప్రమాదంలో లారీలోని 200 మేకలు మృతిచెందాయి.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

# నవ్య స్మార్ట్

శనివారం • 29 జూన్ 2024

# స్నాప్‌చాట్ పటిష్టంగా బ్లాక్ ఫీచర్

స్నాప్‌చాట్ తాజాగా కొన్ని ఫీచర్లను జోడించింది. టీనేజర్లను ఉద్దేశించి పంపే అభ్యర్థనలకు సంబంధించి సేఫ్టీ సెట్టింగ్స్, ఫ్రెండ్స్‌కు లొకేషన్ షేరింగ్, స్నాప్‌చాటింగ్‌లో ఫంక్షనాలిటీని బ్లాక్ చేయడం వంటివి ఈ ఫీచర్లు, ఇంప్రూవ్‌మెంట్స్‌లో ఉన్నాయి. ఇకపై బ్లాక్ ఫీచర్‌ను మరింత ప్రభావపూరితంగా ఉపయోగించవచ్చు. పదే పదే వేధింపుల నుంచి యూజర్లను ప్రొటెక్ట్ చేసేందుకు వీలుగా బ్లాక్ ఫీచర్‌ను మెరుగుపర్చినట్టు స్నాప్ చాట్ షేర్ చేసిన వివరాల్లో ఉంది. ఉదాహరణకు యూజర్ ఒక అకౌంట్‌ను బ్లాక్ చేశారని అనుకుందాం. బ్లాక్ చేసిన అకౌంట్ నుంచి ముఖ్యంగా యూజర్ ఉపయోగిస్తున్న డివైజ్‌కు మాత్రం వేరే నంబర్ లేదా అకౌంట్‌తో అదే వ్యక్తి అభ్యర్థన పంపినా అంగీకరించదు. 13-17 మధ్య వయస్కులకు స్నేహ అభ్యర్థనలు పంపే సదుపాయం ఇక ఉండబోవడం లేదు. పరస్పరం స్నేహితులైతే ఇబ్బంది ఉండదు. లొకేషన్ విషయంలోనూ ఇండియాకు ఉపయోగపడేలా లోకలైజ్డ్ వెర్షన్‌ను కూడా త్వరలో తీసుకువస్తోంది. లొకేషన్ షేరింగ్‌ను కూడా సరళీకరించింది. ముఖ్యంగా పిన్న వయస్కులు తమకు సంబంధించిన షేర్ లొకేషన్‌పై కంట్రోల్‌ను వారికే ఇచ్చింది. అలాగే రెవ్యూ కోసం రెగ్యులర్‌గా లొకేషన్ వివరాలను పంపే స్నేహితుల వివరాలనూ పంపుతుంది. ఇన్-యాప్ వార్నింగ్ సిస్టమ్‌ను తీసుకువచ్చింది. మరో ప్రాంతం నుంచి వచ్చే మెసేజ్‌ల విషయంలో అది యూజర్ని తగువిధంగా హెచ్చరిస్తూ ఉంటుంది.



# మార్కెటింగ్ మెసేజెస్ బ్లాకింగ్ ఇలా

వాట్సాప్ ద్వారా బిజినెస్ ప్రమోషన్ ఈ మధ్య కాలంలో ఎక్కువైంది. భారత దేశానికి చెందిన పలు వ్యాపార సంస్థలు ప్రస్తుతం ఈ పద్ధతిని అనుసరిస్తున్నాయి. ఫలితంగా వాట్సాప్ యూజర్లు తమ యాప్ తెరిస్తే చాలు, సదరు మెసేజ్‌లతో బాక్స్‌లు నిండుతున్నాయి. వాటిని తొలగించుకోవడం నిజానికి పెద్ద పని. సమయం కూడా వృథా అవుతుంది. ప్రభుత్వం సైతం వీటిని అరికట్టే యత్నాల్లోనే ఉంది. వాట్సాప్ ఈ రోజుల్లో ఒక మంచి కమ్యూనికేషన్ సాధనం అంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ప్రయాణాలకు సంబంధించి టికెట్స్ నుంచి ఎంతో విలువైన సమాచారాన్ని స్టోర్ చేసుకునేందుకు వాట్సాప్ ఉపయోగపడుతోంది. అయితే మధ్యలో ఈ బిజినెస్ మెసేజ్‌లు యూజర్లకు చాలా చిరాకు కలిగిస్తున్నాయి. వాటిని నిరోధించేందుకు ముఖ్యంగా....

- కాంటాక్ట్ లిస్టు నుంచి బ్లాక్ చేయడం ఒక పద్ధతి. ఒకసారి బ్లాక్ చేస్తే వ్యాపార సముదాయాలు తమ ప్రచారాన్ని పంపలేవు. అయితే వాటి బిజినెస్ ప్రొఫైల్, కేటలాగ్స్‌లో ఆ సంస్థలకు సదరు నంబర్ల యాక్సెస్ మాత్రం ఉంటుంది.
- యూజర్లకు రిపోర్ట్ చేసే అవకాశం ఉంది. నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్టు అనుకుంటే యూజర్లు ఆ పని చేయవచ్చు.
- అదే మాదిరిగా యూజర్లకు కంటిన్యూ ఆప్షన్ కూడా ఉంటుంది. సదరు వ్యాపార సంస్థతో సంబంధాలను మెయింటైన్ చేయవచ్చు. బిజినెస్ సంస్థలతో మెసేజింగ్‌కు చొరవ కూడా చూపించవచ్చు.
- కొన్ని సంస్థలు మాత్రం తమ ప్రచారం వద్దనుకుంటే డిక్లెయిన్‌ని ఎంచుకునే అవకాశాన్ని యూజర్లకు ఇస్తాయి. యూజర్ దాన్ని యాక్టివేట్ చేసుకుంటే చాలు, తమ జాబితా నుంచి సదరు వ్యక్తిని ఆ వ్యాపార సంస్థ తొలగిస్తాయి. ఈ ఫీచర్ లేకుంటే బ్లాక్ చేయడం తప్ప మరో ఆప్షన్ ఉండదు.

## మెటా ఏఐ చాట్‌బోట్‌తో ఇంటరాక్షన్

మెటా ఏఐ చాట్ బోట్ ఇండియాలోకి వచ్చేసింది. మెటాకు చెందిన ఫేస్‌బుక్, మెసంజర్ యాప్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో అందుబాటులోకి వచ్చింది. మెటా ఏఐ ప్రస్తుతం లేటెస్ట్ ఎల్‌లమా3(లార్జ్ లాంగ్వేజ్ మోడల్ మెటా ఏఐ 3)ని రన్ చేస్తోంది. యూజర్లు అడిగే క్లిష్టమైన విషయాలను, సందేహాలను అర్థం చేసుకుని రెస్పాండ్ అవుతుంది. రియల్ టైమ్ సమాచారాన్ని సులువుగా అర్థం చేసుకునే సామర్థ్యం దీనికి ఉంది. ఎము ఇమేజ్ సింథసిస్ మోడల్‌ని ఇంటిగ్రేట్ చేసుకుంది. చాలా కొద్ది పదాలతో ఇమేజెస్‌ను సృష్టించగలదు. ఇది ప్రస్తుతానికి ఇంగ్లీష్ భాషకు మాత్రమే సపోర్ట్ ఇస్తోంది. ఐఫోన్ లేదంటే ఆండ్రాయిడ్ డివైజ్‌లోని ఇన్‌స్టాగ్రామ్ మెసెంజర్ యాప్‌లో మెటా ఏఐతో ఇంటరాక్షన్ కోసం...

- ఎగ్జిస్టింగ్ చాట్‌ను ఓపెన్ చేయాలి.
- టెక్స్ట్ బాక్స్‌లో ఎట్‌ని ఎంటర్. ఆపై మెటా ఏఐని టాప్ చేయాలి. తదుపరి ప్రశ్నించవచ్చు లేదా జోక్ చెప్పమని అడగొచ్చు. చిన్న పిల్లలకు హోంవర్క్‌లో సహాయపడుతుంది. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ కోసం కోడ్స్‌ని రాస్తుంది. ముందే పేర్కొన్నట్టు కొన్ని పదాలతో ఏఐ ఫొటోలను క్రియేట్ చేస్తుంది. షార్ట్ యానిమేటెడ్ జీఐఎఫ్‌లను కూడా సృష్టిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో వీటిని చాలా సులువుగా షేర్ చేసుకోవచ్చు. ఫన్ యానిమేటెడ్ ఎమోజీలను జనరేట్ చేసుకోవచ్చు. ఏఐ స్పందనలను చాట్‌లో భాగంగా పంపుకోవచ్చు. అయితే మెటా ఏఐ, యూజర్ మధ్య మెసేజ్‌లు ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయి ఉండవు. ప్రైవేటు వ్యక్తులు, గ్రూపులో జరిగే సంభాషణలకు మాత్రమే ఆ సౌలభ్యం ఉంటుంది. వాట్సాప్, ఎఫ్‌బీ మెసంజర్ యాప్‌లకూ ఇదే నిబంధన వర్తిస్తుంది.

## స్విచ్‌బాట్ యూనివర్సల్ రిమోట్ కంట్రోల్




స్విచ్‌బాట్‌కు చెందిన లేటెస్ట్ యూనివర్సల్ రిమోట్‌తో స్మార్ట్ హోమ్‌ను కూడా అదుపులోకి తీసుకోవచ్చు. ఎనభై వేలకు పైగా డివైజులతో కంపాటబుల్ చేయగలిగే దీని ధర సుమారు అరవై(59.99) డాలర్లు. బ్లూటూత్, మేటర్ సపోర్ట్‌తో స్మార్ట్ హోమ్ డివైజ్‌లను ఆపరేట్ చేయవచ్చు. అక్కడికి స్మార్ట్‌ఫోన్ రీచ్ కాకున్నా ఇబ్బంది ఉండదు. స్విచ్‌బోట్‌కు చెందిన ఇతర స్మార్ట్ హోమ్ డివైజ్‌లను కూడా ఈ రిమోట్ సపోర్ట్ చేస్తుంది. ఆరంభంలో యాపిల్ టీవీ, ఫైర్ టీవీని సపోర్ట్ చేస్తుంది రోకు, ఆండ్రాయిడ్ టీవీ యూజర్లు మాత్రం కొంతకాలం అందుకు ఆగాల్సి ఉంటుంది. భవిష్యత్తు అప్డేట్‌తో అంటే వాటి హార్డ్‌వేర్‌కు అనుగుణంగా అది ఉంటుంది. అయితే ఈ రిమోట్ తొలి అని చెప్పలేం. ఎందుకంటే ఇంతకుముందే ఇలాంటి లక్షణాలతో హాప్టిక్ నుంచి ఒకటి వచ్చింది. అది కూడా స్విచ్‌బోట్ రిమోట్ మాదిరిగానే పనిచేస్తుంది. స్విచ్‌బోట్ యూనివర్సల్ రిమోట్ 2.4 ఇంచీల ఎల్‌సీడీ స్ర్కీన్‌ను కలిగి ఉంది. అక్కడ నేవిగేషన్ జరుగుతుంది. యూజర్ ఫ్రెండ్లీ అయినప్పటికీ దాని టచ్ చేయడం కుదరదు. ఫిజికల్ బటన్స్‌తో మాత్రమే అన్ని కంట్రోల్స్‌ను హ్యాండిల్ చేయాల్సి ఉంటుంది. దీన్లో 2000ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. దాని జీవితకాలం 150 రోజులు. అలాగే రోజుకు సగటు వినియోగం పది నిమిషాలకు మించి ఉండదు కూడా. యూజర్లు తమకు తాము దీనికి చార్జింగ్ చేసుకోవచ్చు.

## ఇక అన్ని గాడ్జెట్స్‌కూ టైప్-సి చార్జరే!



గాడ్జెట్స్ లేకుంటే క్షణం గడవదు. వాటి బ్యాటరీ డౌన్ అయినప్పుడు ఒక్కో గాడ్జెట్‌కు ఒక్కో చార్జర్ అని పలు చార్జర్లు వెంట పెట్టుకుని తిరగలేము. దీనికి పరిష్కారం అన్ని గాడ్జెట్స్‌కు ఒకే చార్జర్. యురోపియన్ యూనియన్ 'యూఎస్‌బీ టైప్-సి' చార్జర్‌ని తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇండియాలోనూ ఆ నిబంధనను అమలు చేయనున్నట్టు సమాచారం. స్మార్ట్‌ఫోన్ల నుంచి టాబ్లెట్స్, ల్యాప్‌టాప్‌ల వరకు ఇది వర్తిస్తుంది. వచ్చే ఏడాది జూన్ నాటికి ఫాలో కావాలి. 2026 నాటికి మేండేటరీ కానుంది. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రతిపాదనపై ప్రకటనకు వేచి చూస్తున్నట్టు సమాచారం. ఎలక్ట్రానిక్ వృథాను దీంతో అరికట్టవచ్చు. స్టాండర్డ్ చార్జర్‌తో కలిగే మొదటి ప్రయోజనం అది. 'లైవ్‌మింట్' రిపోర్ట్ ప్రకారం స్టాండర్డ్ చార్జర్‌పై కేంద్ర ఐటీ మంత్రిత్వ విభాగం ఒక ప్రకటన చేయనుంది. మొత్తమ్మీద దీన్ని ఆచరణలోకి తీసుకుని వచ్చేందుకు వీలుగా సదరు కంపెనీలకు సరిపోను సమయాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. ఇదే అమలులోకి వస్తే మన దేశంలోనూ వేర్వేరు డివైజ్‌లకు సింగిల్ కేబుల్ సొల్యూషన్ లభిస్తుందని చెప్పవచ్చు.



## ట్రిపుల్ ఐపీ రేటింగ్స్‌తో ఒప్పో స్మార్ట్ ఫోన్

ఒప్పో నుంచి ట్రిపుల్ ఐపీ రేటింగ్స్‌తో స్మార్ట్ ఫోన్ ఒకటి వస్తోంది. 'ఒప్పో ఎఫ్27 ప్రొ ప్లస్ 5జీ' పేరిట ఇది విడుదల అవుతోంది. ట్రిపుల్ అంటే ఐపీ69, ఐపీ 68 ఐపీ 66 ఎలా, ఏ స్థాయిలో మెరుగైనవి అన్నది మొదటి చూడాలి. హై ఎండ్ అలాగే మిడ్ రేంజ్ ఫోన్లు ఈ మధ్య ఐపీ రేటింగ్స్‌తో వస్తున్న విషయం తెలిసిందే. అయితే ఒప్పో తాజా ఫోన్ ఆ మూడు రేటింగ్స్‌తో రిలీజ్ అవుతోంది. అసలీ నంబర్ల వ్యవహారం ఏమిటంటే...

- ఐపీ 69 డివైజ్ అంటే డస్ట్ - సీల్డ్. హై ప్రెజర్, హై టెంపరేచర్ వాటర్ జెట్స్‌ను తట్టుకోగలదు. ప్రొటక్షన్‌కు సంబంధించి ఇదే అత్యున్నతం. తీవ్ర పరిస్థితుల నుంచి కూడా బైటపడగలదు. ఇండస్ట్రియల్ క్లీనింగ్ ప్రాసెసస్, కఠినమైన బైటి వాతావరణ పరిస్థితులను భరించగలదు.
- ఐపీ68... ఇది కూడా డస్ట్-సీల్డ్. అయితే నీటి విషయంలో ఒక మీటరు లోతుకు మించకూడదు. పూల్స్ నదులు దగ్గర్లో పడినా ఇబ్బంది ఉండదు.
- ఐపీ66 కూడా డస్ట్ విషయంలో ఒకే విధంగా ఉంటుంది. శక్తిమంతమైన వాటర్ జెట్స్ స్ప్రేలను తట్టుకోగలదు.
- దరిమిలా ఒప్పో కొత్త స్మార్ట్ ఫోన్ విషయానికి వస్తే ట్రిపుల్ రేటింగ్ ఉన్నందున దాదాపుగా అన్ని విధాలుగా యోగ్యమైనదిగా చెప్పవచ్చు. హై ఇంటెన్సిటీతో పైనుంచి కిందకు నీరు పడుతున్నా ఇబ్బంది ఉండదు. మందు పేర్కొన్నట్టు ఒక్కో రేటింగ్‌తో కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. అలా చూసుకున్నప్పుడు ఈ మూడు రేటింగ్‌లు ఉన్న కొత్త ఫోన్ ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా అధిగమించగలదని చెప్పవచ్చు.

## ఐఫోన్ 16 రీడిజైన్‌తో ఫీచర్ల మెరుగు

అప్‌డేట్



ఐఫోన్ 16 విడుదల తేదీని ఇంకా ప్రకటించినప్పటికీ సంబంధిత ఫీచర్ల విషయమై లీక్‌లు మాత్రం ఆగటం లేదు. మేజర్ రీడిజైన్ ప్రస్తావన ఇప్పుడు యవనికపైకి వచ్చింది. కెమెరా ఫీచర్ల నుంచి పర్ఫార్మెన్స్‌లో మెరుగుదల వరకు అన్నీ బైటకు వస్తూనే ఉన్నాయి. రీడిజైన్‌కు సంబంధించిన వాటిని తాము సంపాదించినట్టు తాజాగా 'టెక్‌నెట్‌బుక్' తెలిపింది. ఆ రిపోర్ట్ ప్రకారం ప్రొ, నాన్ ప్రొ మోడల్స్‌లో ఇకపై వెర్టికల్ కెమెరా కాన్ఫిగరేషన్ ఉండనుంది. తద్వారా 3డి వీడియో రికార్డింగ్ ఫీచర్ మెరుగుపడుతుంది. స్పేషియల్ వీడియోస్‌గా బ్రాండ్ అవుతాయి. అడ్వాన్స్‌డ్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ సామర్థ్యాల పెంపు అలాగే మిక్స్‌డ్-రియాల్టీ ప్రాజెక్ట్స్‌తో ఇంటిగ్రేషన్‌కు అవకాశం ఉంటుంది. స్టాండర్డ్ ఐఫోన్ మోడల్స్‌కు యాక్షన్ బటన్‌ను పరిచయం చేస్తోంది. దీనికి తోడు ప్రొ సిరీస్‌కు డెడికేటెడ్ షట్టర్ బటన్‌ను ఉంచనున్నట్టు సమాచారం. హాప్టిక్ ఇంజన్ పవర్ కలిగి ఉంటుంది. దీంతో వేర్వేరు లెవెల్స్‌తో ఫొటోలను తీసుకోవచ్చు. ఫిజికల్ బటన్స్ అన్నింటినీ తొలగిస్తారన్న పుకారు కూడా వినవచ్చింది. సరికొత్తగా టాక్టికల్ కంట్రోల్స్‌ను ఇంటిగ్రేట్ చేయవచ్చు. ప్రొ మోడల్స్‌లో ఈ పని చేయవచ్చని అంటున్నారు. కెమెరా మాడ్యూల్‌కు ఔట్‌సైడ్‌లో ఫ్లాష్ యూనిట్ ఉండనుంది. 6.1 ఇంచీలు, 6.7 ఇంచీల ఓలెడ్ డిస్‌ప్లేకి తోడు 60 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉండనుంది. ఎ17 ప్రొ చిప్ కారణంగా లేటెస్ట్ యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లను సపోర్ట్ చేస్తుందని అంటున్నారు.

## మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌లో మాల్వేర్

మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌లో భద్రతపరంగా ఇబ్బందులకు ఆస్కారం ఏర్పడింది. మాల్వేర్‌తో కూడిన వెబ్ పేజీలకు మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ బ్రౌజర్‌కు చెందిన సెక్యూరిటీని ఛేధించుకుని లక్షిత కంప్యూటర్‌లను టార్గెట్ చేసే సామర్థ్యం ఉంది. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సీఈఆర్‌టీ-ఇన్) ఈ విషయాలను మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌కు తెలియజేసింది. వీ8లో టైప్ కన్ఫ్యూజన్, వెబ్ అసెంబ్లీని సక్రమంగా అమలు చేయకపోవడం, డాన్‌లో ఔట్ ఆఫ్ బౌండ్స్ మెమరీ యాక్సెస్, డాన్ కాంపోనెంట్స్‌లో అనుచిత వినియోగం ఇందుకు కారణమని కూడా తెలిపింది. సదరు లూప్ హోల్స్ ప్రస్తుత థ్రెట్‌కు కారణమని తేల్చింది. అయితే మైక్రోసాఫ్ట్ తన ఎడ్జ్ బ్రౌజర్‌కు తగు సెక్యూరిటీ పాచెస్‌ను విడుదల చేసింది. ఈ ప్రమాదంలో భాగంగా డివైజుల్లోని సెన్సిటివ్ సమాచారాన్ని తస్కరించేందుకు ఆస్కారం కలుగుతుంది. డినయల్ ఆఫ్ సర్వీస్(డీఓఎస్) అటాక్‌కు కూడా ఆస్కారం ఏర్పడింది. పిక్సెల్ 5ఎ 5జీ, పిక్సల్ 6ఎ, ఎ, 6ప్రొ, పిక్సల్ 7, 7ప్రొ, 7ఎ, పిక్సల్ 8, 8ప్రొ, 8ఎ, పిక్సల్ ఫోల్డ్ డివైజ్‌లు దీనికి ఎఫెక్ట్ కానున్నాయి. గూగుల్ ఇదే సందర్భంలో అన్ని డివైజ్‌లకు, మేక్స్-లినక్స్‌కు చెందిన క్రోమ్ బ్రైజర్లకు, విండోస్ పీసీలకు కూడా సెక్యూరిటీ పేచెస్‌ను విడుదల చేసింది.

## గూగుల్ క్రోమ్‌కు కొత్త ఫీచర్లు

గూగుల్ - క్రోమ్ కోసం కొన్ని ఫీచర్లను ఆండ్రాయిడ్, ఐఫోన్లను ఉద్దేశించి తీసుకువచ్చింది. తాజాగా మరో 110 భాషలకు గూగుల్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్ సపోర్టు అందించింది. దీంతో సపోర్టు పొందిన భాషల మొత్తం సంఖ్య 243 అయింది. ఇటీవలే క్రోమ్‌కు జెమినీ ఏఐ ఫీచర్లను కలిపింది. పారిస్ ఒలింపిక్స్‌కు చాలా ముందుగానే స్పోర్ట్స్ కార్డును తీసుకువస్తోంది. ఐసీసీ టి20 క్రికెట్ వంటివి కూడా ఈ జాబితాలో ఉన్నాయి. దీంతో ఇక లేటెస్ట్ అప్డేట్స్ కోసం సెర్చ్ చేయాల్సిన పని యూజర్లకు ఉండదు. క్రోమ్‌కు చెందిన డిస్కవర్ ఫీడ్‌లో స్పోర్ట్స్ కార్డ్స్ - ఐఓఎస్, ఆండ్రాయిడ్‌లో కొత్త టాబ్ పేజీలో లభ్యమవుతాయి. తమకు నచ్చిన టీమ్‌కు సంబంధించిన అప్డేట్స్‌ను వీక్షించే సౌలభ్యం యూజర్లకు ఉంటుంది. ఐప్యాడ్స్, ఆండ్రాయిడ్ టాబ్లెట్స్ కోసం క్రోమ్ అడ్రస్ బార్‌ను గూగుల్ రీడిజైన్ చేసింది. క్రోమ్ యాక్షన్స్ మరొకటి. లోకల్‌గా ఉండే రెస్టారెంట్ పేరు టైప్ చేస్తే ఫోన్ నంబర్లు సహా బిజినెస్ వివరాలు, మ్యాప్, రెవ్యూలు అందుబాటులోకి వస్తాయి.

## ఇండియాలోకి ఎంట్రీ లెవెల్ ఫోన్

ప్రొడక్ట్




రియల్‌మి తాజాగా ఎంట్రీ లెవెల్ ఫోన్ ఒకటి ఇండియన్ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ఆరంభ ధర రూ.7,699 మాత్రమే. సీ61 పేరిట ఈ స్మార్ట్ ఫోన్‌ని రిలీజ్ చేసింది. సీ61 యూనిసోక్ 612 ఆక్టా-కోర్ ప్రాసెసర్ కలిగి ఉంది. 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, డ్యూయల్ కెమెరా ఉన్నాయి. డ్యూయల్ కెమెరా సెటప్, 32 ఎంపీ ప్రైమరీ సెన్సర్ ఉన్నాయి. వెయ్యి చార్జింగ్ సైకిల్స్ తరవాత కూడా 80 శాతం కెపాసిటీకి తోడు 1.8 రోజుల మేర బ్యాటరీ లైఫ్ ఉంటుంది. ఇంటర్నల్ స్టోరేజీ 128 జీబీ వరకు కాగా వాటర్, డస్ట్ రెసిస్టెన్స్‌పరంగా ఐపీ 54 రేటింగ్ దీనికి ఉంది. ఈ ఫోన్ మూడు వేరియంట్లు ఉన్నాయి. 4జీబీ ర్యామ్ + 64 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ మోడల్ ధర రూ.7,699. 4జీబీ ర్యామ్ + 128 జీబీ మోడల్ రేటు రూ.8,499 కాగా 6జీబీ + 128జీబీ మోడల్ రేటు రూ.8,999. మార్బుల్ బ్లాక్, సఫారీ గ్రీన్ రంగుల్లో ఇవి లభ్యమవుతాయి. రియల్‌మి వెబ్‌సైట్‌కుతోడు ఫ్లిప్‌కార్ట్, ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో లభ్యమవుతుంది. నిబంధనల మేరకు డిస్కౌంట్ కూడా ఇస్తున్నారు.

## రెజ్యూమే తయారీలో ఏఐ

ఇన్‌ఫో



ఉద్యోగాన్ని పొందడంలో సీవీ(కరికులమ్ వీటే) ప్రాధాన్యం తెలిసిందే. మన పరోక్షంలో మనల్ని పరిచయం చేసేది సీవీ. అందుకోసం సీవీని పటిష్టంగా రూపొందించుకోవాలి. ఆ క్రమంలో ఇప్పుడు వేగంగా చొచ్చుకు వస్తున్న ఏఐని సైతం ఉపయోగించుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల్లో మనది విలక్షణంగా కనిపించాలంటే, రిక్రూటర్‌ను ఆకట్టుకోవాలంటే ఏఐని సమర్థంగా ఉపయోగించుకోవాలి అని చెబుతున్నారు రిక్రూటర్లు.

- కవర్ లెటర్ కోసం చాట్ జీపీటీని ఉపయోగించుకోవాలి. అభ్యర్థి తన గురించి తాను వివరించుకుంటే చాలు అర్థవంతంగా లెటర్‌ను రూపొందిస్తుంది. వ్యాకరణ దోషాలు, స్పెల్‌చెక్ సహా అన్ని పనులు చేసిపెడుతుంది. ప్రత్యేకించి ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలి అనుకుంటే చాలు, అక్కడి అవసరాలకు అనుగుణంగా సంబంధిత కేపబిలిటీస్‌ని జతచేస్తూ, ముఖ్యమైన పాయింట్లను హైలైట్ చేస్తూ కవర్ లెటర్‌ను రూపొందిస్తుంది. అయితే ఒకసారి పూర్తయిన తరవాత మాన్యువల్‌గానూ చెక్ చేసుకుంటే మంచిది. సంప్రదాయాలకు విరుద్ధంగా ఏదైనా జోడించి ఉంటే కట్ చేసుకోవచ్చు.
- చాట్ జీపీటీ వాయిస్‌తో ఇంటర్వ్యూలకు ప్రిపేర్ కావడం మరో అంశం. జీపీటీ 4oని ఇంటిగ్రేట్ చేయడంతో వాయిస్ టూల్ నుంచి సహజమైన ధ్వని వస్తోంది. చాట్‌జీపీటీని డౌన్‌లోడ్ చేసుకుని వాయిస్ విభాగంలోకి వెళితే ఇంటర్వ్యూ సీన్‌ను క్రియేట్ చేసుకోవచ్చు. పెట్టుకున్న జాబ్‌ను అనుసరించి అది ప్రశ్నిస్తుంది. నిజానికి ఇదో ఎఫెక్టివ్ ప్రాక్టీస్ మెథడ్. రియల్ లైఫ్ సిట్యుయేషన్‌లో ఉద్యోగార్థి శిక్షణ పొందే వీలు దీంతో ఉంటుంది.
- మెటా ఏఐ ఇప్పుడు ఇండియాలో అధికారికంగానే లభ్యమవుతోంది. అందులో క్విజ్జింగ్ ముఖ్యమైన టాపిక్. అడిగిన సబ్జెక్టునుబట్టి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. అలాగే మరింతగా ప్రిపేరయ్యేందుకు ట్రెడిషనల్ రీసెర్చ్ కోసం మెటా ఏఐని ఉపయోగించుకోవచ్చు.
- ఈమెయిల్స్‌ను సమ్మరైజ్ చేసుకునేందుకు గూగుల్‌కు చెందిన ఏఐ ప్రోయస్‌ను ఉపయోగించుకోవాలి. ఒకసారి జాబ్‌కు అప్లయ్ చేశారంటే చాలు, మెయిల్ బాక్స్ అంతా అకనాలెడ్జ్‌మెంట్స్, సమాధానాలతో నిండుతుంది. వాటన్నింటి సార్టింగ్ కోసం చాలా టైమ్ పడుతుంది. అందుకు దీని ఉపయోగిస్తే అవసరమైనవి ముందుకు వస్తాయి. దీనికోసం జీమెయిల్‌లో బిల్ట్ ఇన్ ఫీచర్ కూడా వచ్చింది. ముఖ్యంగా దీంతో సమయం ఆదా అవుతుంది.
- మైక్రోసాఫ్ట్ కోపైలెట్ యాప్‌తో సెల్ఫ్ బ్రాండింగ్‌కు వీలు ఉంటుంది. టెక్స్ట్ ప్రాంప్ట్‌తో ఇది ఇమేజెస్‌ను జనరేట్ చేస్తుంది. రెజ్యూమే నుంచి సోషల్ మీడియా వరకు ఇవి ఉపయోగపడతాయి. అయితే అవసరానికి తగ్గట్టు వీటిని వాడుకోవడంలో మాత్రం అభ్యర్థులకు తగు నైపుణ్యం ఉండాల్సిందే.

# ఆంధ్రజ్యోతి దిక్సూచి

హైదరాబాద్ ● శనివారం 29 జూన్ 2024

diksuchi@andhrajyothy.com



## పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం(ఎస్‌పీఎంవీవీ), స్వీడన్‌లోని బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్(బీటెక్ & బీఎస్+ఎంఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి మూడేళ్లు ఎస్‌పీఎంవీవీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో, చివరి మూడేళ్లు బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది అంటే బీటీహెచ్‌లో ఒక సంవత్సరం చదివిన తరవాత ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఎస్‌పీఎంవీవీ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి. మిగిలిన రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది. సీఎస్ఈ విభాగంలో మొత్తం 10 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా 50 శాతం సీట్లను; ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024/ఇతర రాష్ట్రాల కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ 2024 స్కోర్ ద్వారా మిగిలిన 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అవేర్‌నెస్ సెషన్‌ను జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. స్వీడన్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

**ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు:** ఎస్‌పీఎంవీవీలో మొదటి మూడేళ్లు బీటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్), బీటీహెచ్‌లో నాలుగో ఏడాది బీఎస్(కంప్యూటర్ సైన్స్) చదవాల్సి ఉంటుంది.

- బీటీహెచ్‌లో చివరి రెండేళ్ల ఎంఎస్ ప్రోగ్రామ్‌లో కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు.

**అర్హత:** బీఐఈ(ఏపీ)/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024/ఇతర రాష్ట్రాల కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ స్కోర్ ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5, మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్; టోఫెల్‌లో అయితే 575/90 స్కోర్ ఉండాలి.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 22
- పూర్తిచేసి దరఖాస్తును కింది ఈ-మెయిల్‌కు అప్‌లోడ్ చేయాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 25న
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డీన్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆఫీస్, ఎస్‌పీఎంవీవీ, తిరుపతి-517502, ఆంధ్రప్రదేశ్
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, cir@spmvv.ac.in
- **వెబ్‌సైట్:** www.spmvv.ac.in

## ఐఐటీ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

సంగారెడ్డి-కందిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ హైదరాబాద్)- డైరెక్ట్ పీహెచ్‌డీ 2024 ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పెషల్ రౌండ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. సంస్థ నిబంధనల ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

**విభాగాలు:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, క్లయిమేట్ ఛేంజ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

**అర్హత:** ఐఐటీలు/నిట్ సంస్థలు/ఐసర్ సంస్థలు/ఐఐఎస్సీ నుంచి కనీసం 9 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీడిజైన్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ అర్హత తప్పనిసరి కాదు.

**ఫెలోషిప్:** అయిదేళ్ల వరకు ఫెలోషిప్ ఇస్తారు. మొదటి రెండేళ్లు జేఆర్ఎఫ్ కింద నెలకు రూ.50,000; చివరి మూడేళ్లు ఎస్ఆర్ఎఫ్ కింద నెలకు రూ.55,000 ఇస్తారు.

### ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 7
- **వేదిక:** అకడమిక్ సెక్షన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్, కంది-502284, సంగారెడ్డి, తెలంగాణ
- **వెబ్‌సైట్:** iith.ac.in/phdadmissions/

## ఎన్ఐపీహెచ్ఎంలో డిప్లొమా, పీజీ డిప్లొమా



హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(పీజీడీపీహెచ్ఎం)', 'డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(డీపీహెచ్ఎం)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే రిటెన్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లలో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ల్యాబొరేటరీ తరగతులు, ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్టయిపెండ్‌తో కూడిన ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

**పీజీడీపీహెచ్ఎం:** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ బయోసెక్యూరిటీ, పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ మొత్తానికి 40 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్లాంట్ హెల్త్ ఎక్స్‌పర్ట్‌లుగా, పెస్టిసైడ్ క్వాలిటీ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(కెమిస్ట్రీ) అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికోసం అయిదు సీట్లు ప్రత్యేకించారు.

**ప్రోగ్రామ్ ఫీజు:** నిరుద్యోగులకు రూ.80,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.2,00,000

**డీపీహెచ్ఎం:** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. దీనికి 20 క్రెడిట్లు నిర్దేశించారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

**ప్రోగ్రామ్ ఫీజు:** రూ.40,000

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూలై 30
- **రిటెన్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **రిటెన్ ఎగ్జామినేషన్ తేదీ:** ఆగస్టు 12
- **సెలెక్టయిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 19
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 25 నుంచి
- **వెబ్‌సైట్:** https://niphm.gov.in

## జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో డిప్లొమాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ స్ట్రీమ్‌లో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి విభాగంలో 60 శాతం సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



**డిప్లొమా ఇన్ అగ్రికల్చర్:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి. జోగిపేటలో బాలికల పాలిటెక్నిక్; బసంత్‌పూర్, జమ్మికుంట, మల్తుమ్మెదలలో బాలుర పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్నాయి. వీటితోపాటు పాలెం, పొలాస, కంపసాగర్, మధిర, సిరిసిల్ల, రుద్రూర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 20 సీట్లు; నారాయణపేట పాలిటెక్నిక్ కళాశాలలో 40 సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో మొత్తం 390 సీట్లు ఉన్నాయి.

**డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్:** ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. సంగారెడ్డి-కందిలోని అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. మెదక్-తునికి, ఖమ్మం-సత్తుపల్లి, సంగారెడ్డి-తుర్కాల ఖానాపూర్‌లలో ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 30 చొప్పున మొత్తం 90 సీట్లు ఉన్నాయి.

**డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వికారాబాద్-గింగుర్తిలోని ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డ్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఎన్ఐఓఎస్, తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 35 శాతం మార్కులు తప్పనిసరి. అగ్రికల్చరల్ విభాగంలో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి 22 ఏళ్లు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 4
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** జూలై 6
- **వెబ్‌సైట్:** diploma.pjtsau.ac.in

## జాబ్ కార్నర్

### ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 40

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
2. టెక్నీషియన్ అప్రెంటిస్
3. జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్

**విభాగాలు:** కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీహెచ్ఎం

**అర్హతలు:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

**శిక్షణ వ్యవధి:** ఒక సంవత్సరం

**స్టయిపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్/జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000. టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.8000.

**వయోపరిమితి:** 14-18 ఏళ్ల మధ్య ఉండాలి.

**ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

**దరఖాస్తు:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను చీఫ్ జనరల్ మేనేజర్,ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ భండారా, భండారా, మహారాష్ట్ర చిరునామాకు పంపించాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూలై 13

**వెబ్‌సైట్:** https://munitionsindia.in/

### కాటన్ కార్పొరేషన్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు 214

నవీ ముంబయిలోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్(లీగల్): 1 పోస్టు
2. అసిస్టెంట్ మేనేజర్(అఫీషియల్ లాంగ్వేజ్): 1
3. మేనేజ్‌మెంట్ ట్రైనీ (మార్కెటింగ్): 11
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(అకౌంట్స్): 20
5. జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్: 120
6. జూనియర్ అసిస్టెంట్(జనరల్): 20
7. జూనియర్ అసిస్టెంట్(అకౌంట్స్): 40
8. జూనియర్ అసిస్టెంట్(హిందీ ట్రాన్స్‌లేటర్): 1

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, సీఏ/సీఎంఏ, బీఎస్సీ, బీకాం, లా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు

**ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

**పరీక్ష కేంద్రాలు:** ముంబయి/నవీ ముంబయి, హైదరాబాద్, న్యూఢిల్లీ, చెన్నై, లఖ్‌నవూ, చండీగఢ్, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పట్నా, జయపుర.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా

**దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2

**వెబ్‌సైట్:** cotcorp.org.in/

### యంగ్ ప్రొఫెషనల్స్

#### ఐఐఓఆర్

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. యంగ్ ప్రొఫెషనల్-1(క్రాప్ ప్రొడక్షన్)
2. యంగ్ ప్రొఫెషనల్-1(క్రాప్ ఇంప్రూవ్‌మెంట్)

**అర్హతలు:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ(అగ్రికల్చరల్/కెమిస్ట్రీ)తోపాటు పని అనుభవం ఉండాలి.

**జీతం:** నెలకు రూ.30,000

**ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 11, 27

**వేదిక:** ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సీడ్స్ రీసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్.

**వెబ్‌సైట్:** https://www.icariior.org.in/

#### సీఐఆర్‌బీ

హిసార్‌లోని ఐసీఏఆర్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ బఫెల్లోస్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

**పోస్టు:** యంగ్ ప్రొఫెషనల్


**ఖాళీలు:** 2

**అర్హత:** డిప్లొమా/డిగ్రీ(అగ్రికల్చరల్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

**వయోపరిమితి:** 21 నుంచి 45 ఏళ్లు ఉండాలి

**ఇంటర్వ్యూ తేదీ:** జూలై 17

**వెబ్‌సైట్:** cirb.icar.gov.in/



## ఐఐటీ మద్రాస్

### ఎంబీఏ(డీఎంఎస్‌సీ)

ఐఐటీ మద్రాస్‌లో ప్రపంచంలోనే తొలిసారిగా ఎంబీఏ డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్(డీసీఎస్‌సీ)ని ఆరంభించారు. ఇది రెండేళ్ళ కాలవ్యవధి కలిగిన ప్రోగ్రామ్. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ అంటే ఐఓటీ, ఏఐ, ఎంఎల్, బ్లాక్‌చైన్‌ని కోర్సులో చేర్చారు. ఆధునిక మారిటైమ్ సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా నేర్పుతారు. మద్రాస్ ఐఐటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఓషన్ ఇంజనీరింగ్ విభాగం, ఇండస్ట్రీ పార్టనర్ ఐ-మారిటైమ్ కన్సల్టెన్సీ ఉమ్మడిగా ఈ ప్రోగ్రామ్‌ను తీర్చిదిద్దాయి. కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ, రెండేళ్ళపాటు ఫుల్‌టైమ్ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ఉన్న అభ్యర్థులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. ఐఐటీ మద్రాస్ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొదటి బ్యాచ్ ఆరంభమవుతుంది. ఫీజు రూ.తొమ్మిది లక్షలు కాగా వాయిదా పద్ధతిలో చెల్లించే వెసులుబాటు ఉంది.

### సస్టయినబిలిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

యూకేకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్‌తో కలిసి సస్టయినబిలిటీలో జాయింట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ మద్రాస్ ఆరంభించింది. నాలెడ్జ్ అడ్వాన్స్‌మెంట్‌కు తోడు వేర్వేరు క్లిష్ట రంగాల్లో ఇన్నోవేషన్ కోసం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సంబంధిత మెమరాండంపై రెండు వర్సిటీలు సంతకాలు చేశాయి. ఆ ప్రకారం 'వర్చ్యువల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ సస్టయినబుల్ డెవలప్‌మెంట్'ను ఆరంభించారు. కొలాబిరేటివ్ రీసెర్చ్ ప్రాజెక్టులు, జాయింట్ అకడమిక్ కార్యకలాపాలు, కోర్సులు, సదస్సులు, సెమినార్లు, సింపోజియాలు, లెక్చర్లు దీనిలో భాగంగా ఉంటాయి. రీసెర్చ్, టీచింగ్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉంటాయి.

## చిట్టీస్




### మిణుగురు పురుగు ఉపాయం

ఒక చిట్టడవిలో తేజ అనే మిణుగురు పురుగు ఉండేది. అది ఎంచక్కా అడవంతా తిరుగుతూ, అందరినీ చలాకీగా పలకరిస్తూ, ఆనందంగా గడిపేది. ఒక రోజు దాని దగ్గరికి పెద్దకాకి ఒకటి వచ్చి నోరు తెరిచి, మిణుగురును మింగబోయింది.



మిణుగురు పురుగు వెంటనే కాకిని ఆపి, 'ఆగు, నా మాట విన్నావంటే, నీకే లాభం. నేను చాలా చిన్న ప్రాణాన్ని, నాతో వస్తే, నాలాంటిమిణుగురు పురుగులు చాలా దొరికే చోటు చూపిస్తాను' అన్నది. ఆశ కొద్దీమిణుగురు పురుగు మాటలు నమ్మిన కాకి దాని వెనక వెళ్లింది. మిణుగురు పురుగు కాకిని దగ్గర్లో మనుషులు చలి కాచుకుంటున్న నెగడు దగ్గరికి తీసుకెళ్లి, అక్కడ కనిపించే నిప్పు రవ్వలను చూపించి, "అదిగో బోలెడు మిణుగురు పురుగులు చూడు అన్నది. కొంచెందూరం నుండి చూసిన కాకి నిజమే అనుకుని, నిప్పు రవ్వల దగ్గరికి వెళ్లి, నోరు తెరిచి వాటిని మింగబోయి, నోరు కాల్చుకుని, అక్కడినుండి వెళ్లిపోయింది. అలా మిణుగురు పురుగు ఉపాయంతో కాకిని దెబ్బ కొట్టి, తన ప్రాణాలను కాపాడుకుంది.

### దారి కనుక్కోండి










### సరైన నీడ ఏది?



### డైలీ సుడోకు - 345

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | | 5 | | 2 | 1 | | | |
| 9 | | | 8 | | | | | |
| | 1 | | 7 | | | 8 | | |
| | | | | 7 | 5 | | 8 | 6 |
| | | | | | | | | |
| 7 | 5 | | 9 | 4 | | | | |
| | | 4 | | | 6 | | 7 | |
| | | | | | 7 | | | 5 |
| | | | 5 | 3 | | 2 | | 1 |

#### సుడోకు - 344 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 8 | 5 | 4 | 2 | 1 | 6 | 9 | 7 |
| 9 | 4 | 7 | 8 | 6 | 3 | 5 | 1 | 2 |
| 6 | 1 | 2 | 7 | 5 | 9 | 8 | 3 | 4 |
| 2 | 9 | 1 | 3 | 7 | 5 | 4 | 8 | 6 |
| 4 | 3 | 8 | 6 | 1 | 2 | 7 | 5 | 9 |
| 7 | 5 | 6 | 9 | 4 | 8 | 1 | 2 | 3 |
| 5 | 2 | 4 | 1 | 9 | 6 | 3 | 7 | 8 |
| 1 | 6 | 3 | 2 | 8 | 7 | 9 | 4 | 5 |
| 8 | 7 | 9 | 5 | 3 | 4 | 2 | 6 | 1 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

శనివారం • 29 జూన్ 2024

cinema@andhrajyothy.com


# కలలో కూడా హాని తలపెట్టడు

● అభిమాని హత్యకేసులో అరెస్టయిన హీరో దర్శన్‌కు నాగశౌర్య మద్దతు



'దర్శన్ గురించి నాకు బాగా తెలుసు, ఆయన ఎంతో మందిని ఆదుకున్నాడు. వీలైతే సాయం చేస్తాడే తప్ప కలలో కూడా ఇతరులకు హాని తలపెట్టడు. త్వరలోనే ఆయన నిర్దోషిగా బయటకొస్తాడు' అని టాలీవుడ్ హీరో నాగశౌర్య అన్నారు. రేణుకాస్వామి అనే అభిమానిని క్రూరంగా హత్య చేసిన కేసులో అరెస్టయిన కన్నడ హీరో దర్శనకు నాగశౌర్య మద్దతుగా నిలిచాడు.

'ఎన్నో కుటుంబాలు దర్శన్ మీద ఆధారపడి బతుకుతున్నాయి. నిజాలు నిగ్గుతేలేవరకూ ఆయన కుటుంబానికి కాస్త గౌరవం ఇవ్వండి. ముందే విమర్శలకు దిగడం సరికాదు' అని శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నెటిజన్లకు హితవు పలికారు. 'న్యాయవ్యవస్థ పైన నాకు నమ్మకం ఉంది. త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయి. నిజమైన దోషులకు శిక్ష పడుతుంది. దర్శన్ అన్న నిర్దోషిగా బయటకు వస్తాడు. ఈ గడ్డు పరిస్థితుల్లో వారి కుటుంబాన్ని కించపరచడం, బాధపెట్టడం చేయవద్దు' అని తన పోస్ట్‌లో నాగశౌర్య పేర్కొన్నారు. దర్శన్‌తో దిగిన ఫొటోను ఆయన షేర్ చేశారు.

దర్శన్ తన భార్య, పిల్లలను వదిలి హీరోయిన్ పవిత్రగౌడతో కొన్నాళ్లుగా సహజీవనం చేస్తూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే కారణంతో రేణుకాస్వామి అనే అభిమాని పవిత్రగౌడకు సోషల్ మీడియాలో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపాడు. ఆ కోపంతో రేణుకా స్వామిని దర్శన్ తన అభిమానులతో కిడ్నాప్ చేయించి, హత్య చేశారని పోలీసులు చెబుతున్నారు. దర్శన్, పవిత్రగౌడను కఠినంగా శిక్షించి, రేణుకాస్వామికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో నెటిజన్లు దర్శన్‌ను బండ బూతులు తిడుతూ ట్రోల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగశౌర్య దర్శన్‌కు మద్దతు తెలుపుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టడం చర్చనీయాంశం అయింది.

# రేఖ ఆస్తుల వివరాలు తెలుసా?



బాలీవుడ్‌కి వెళ్లి సత్తా చాటిన తొలి తెలుగు హీరోయిన్ రేఖ. ఇప్పటి వరకూ దాదాపు రెండు వందల చిత్రాల్లో నటించి ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారామె. రేఖ కెమెరా ముందుకు వచ్చి పదేళ్లు అవుతోంది. ముందే జాగ్రత్త పడి, ఆస్తులు సంపాదించుకోకపోతే ఆర్టిస్టుల చివరి రోజులు ఎంత దుర్భరంగా గడుస్తాయో చెప్పనక్కర్లేదు. తన పిన్ని, మహానటి సావిత్రిలా తన జీవితం కష్టాలమయం కాకూడదని రేఖ అనుకున్నారో ఏమో కానీ దీపం ఉండగానే అన్నీ చక్కదిద్దుకున్నారు. ప్రస్తుతం ఆమెకు సినిమా నుంచి సంపాదన ఏమీ లేకపోయినా ఆస్తులకు కొదవలేదు. ప్రస్తుతం ముంబై రేఖ ఉంటున్న ఇంటి ఖరీదు ఎంతో తెలుసా.. అక్షరాలా రూ. వంద కోట్లు. ఇక నెల నెలా అద్దెల రూపంలో లక్షలాది రూపాయలు వచ్చి ఆమె అకౌంట్‌లో పడుతుంటాయి. బ్యాంక్‌లో ఉన్న ఫిక్సడ్ డిపాజిట్ల సంగతి చెప్పనక్కర్లేదు. కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు అనవసరపు ఖర్చుల జోలికి పోకుండా తన సంపాదనలో అధిక శాతం ఫిక్సడ్ డిపాజిట్లలో దాచుకున్నారు రేఖ. ఆమె ఇంట్లో మందీ మార్బలం కూడా పెద్దగా లేరు. ఒక సెక్రటరీ, డ్రైవర్ తప్ప. వీళ్లిద్దరూ చాలా ఏళ్లుగా ఆమె దగ్గర పని చేస్తున్నారు.

# 'కల్కి'లో కృష్ణుడు ఇతనే!



అమితాబ్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపికా పదుకొనే వంటి అగ్ర నటీనటులు నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. కురుక్షేత్ర యుద్ధం నేపథ్యంలో సాగే సన్నివేశాల్లో శ్రీకృష్ణుని పాత్ర పోషించిన నటుడి ముఖాన్ని చూపించక పోవడంతో అతనెవరా.. అనే చర్చ మొదలైంది. ఆ పాత్ర పోషించిన నటుడి నడక తీరు చూసి హీరో నాని అన్నారు కొందరు. కాదు కాదు అర్జున్ దాస్ అన్నారు మరికొందరు. ఈ చర్చకు తెర దించుతూ ఆ సినిమాలో కృష్ణ పాత్ర పోషించింది నేనే అంటూ సోషల్ మీడియా వేదికగా స్వయంగా వెల్లడించారు తమిళ నటుడు కృష్ణకుమార్ బాలసుబ్రహ్మణ్యన్. 'ఒక అద్భుత చిత్రంలో అటువంటి ప్రత్యేక పాత్ర పోషించే అవకాశం రావడం నిజంగా అదృష్టం' అని ఆయన పేర్కొన్నారు. కృష్ణకుమార్ కొత్త నటుడేమీ కాదు, 2010లోనే ఆయన చిత్ర రంగ ప్రవేశం చేశారు. 'కదలగై' తమిళ చిత్రంలో నటించిన ఆయన ఆ తర్వాత రంగస్థల ప్రవేశం చేసి పలు నాటకాల్లో నటించారు. పదేళ్ల తర్వాత మళ్లీ తమిళ చిత్రరంగ ప్రవేశం చేశారు. సూర్య నటించిన అనువాద చిత్రం 'ఆకాశం నీ హద్దు'లో కీలక పాత్ర పోషించారు. ధనుష్ 'మారన్' సినిమాలో అతనికి ఫ్రెండ్‌గా నటించారు. 'కల్కి' కృష్ణకుమార్‌కు ఐదో చిత్రం కావడం గమనార్హం.


## రికార్డులు కోసం సినిమాలు తీయం

- నిర్మాత స్వప్న దత్



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర భారీ వసూళ్లను రాబడుతోంది. తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 200 కోట్ల వసూళ్లకు చేరువైంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సృష్టించబోయే రికార్డులపై అందరి దృష్టి పడింది. ఏఏ రికార్డులు బద్దలవుతాయనే చర్చ అటు పరిశ్రమలో, ఇటు ప్రేక్షకుల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో 'కల్కి' నిర్మాతల్లో ఒకరైన స్వప్నదత్ సోషల్ మీడియాలో స్పందించారు. 'మా సినిమా అధిగమించిన రికార్డుల గురించి చాలా మంది అడుగుతున్నారు. ఇది హాస్యాస్పదం. రికార్డులు సృష్టించేవారు ఎప్పుడూ రికార్డుల కోసమే సినిమాలు తీయరు. సినిమా, ప్రేక్షకుల పైన ప్రేమతోనే మేం సినిమాలు తీస్తాం. 'కల్కి' చిత్రాన్ని కూడా ఇదే విధంగా రూపొందించాం' అన్నారు.

# ఇస్మార్ట్... స్టెప్స్‌తో



రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఆగస్టు 15న విడుదలవుతోంది. చిత్రబృందం సంగీత ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ చిత్రం నుంచి తొలి గీతం విడుదలకు తేదీ ఖరారైంది. 'స్టెప్పా మార్' అంటూ సాగే ఈ మాస్ గీతాన్ని జూలై 1న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో శివుని విగ్రహం ముందు రామ్ పోతినేని డాన్స్ చేస్తూ కనిపించారు. ఈ చిత్రంలో సంజయ్‌దత్ విలన్‌గా నటిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయిక. అలీ, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీకౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు. సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: సామ్ కే నాయుడు



# భయపెట్టే రారాజా

సుగి విజయ్, మౌనిక మగులూరి హీరో హీరోయిన్లుగా నటించిన హారర్ థ్రిల్లర్ 'రారాజా'. శ్రీ పద్మిని సినిమాస్ బేనర్‌పై బి. శివప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రధాన పాత్రధారి మొహం కనిపించకుండా డిజైన్ చేసిన కాన్సెప్ట్ ఆసక్తికరంగా ఉంది. హారర్ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వబోతున్నాయని ట్రైలర్‌ను చూస్తే తెలుస్తోంది. త్వరలోనే 'రారాజా' విడుదల తేదీని ప్రకటిస్తామని శివప్రసాద్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: రాహుల్ శ్రీ వాత్సవ్.

# కొంచెం కొంచెం...




చిమటా రమేశ్‌బాబు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నేను-కీర్తన'. ఈ చిత్రం నుంచి 'కొంచెం కొంచెం గుడుగుడు గుంజం' అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేను-కీర్తన' ట్రైలర్, సాంగ్స్ బావున్నాయి. నేను విడుదల చేసిన ఐటమ్ సాంగ్ థియేటర్స్‌లో విజిల్ వేయిస్తుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. ఈ చిత్రంలో రిషిత, మేఘన ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. త్వరలో 'నేను-కీర్తన' విడుదల తేదీని ప్రకటిస్తామని రమేశ్‌బాబు చెప్పారు. కులుమనాలిలో చిత్రీకరించిన పాటలతో పాటు ఆరు రోప్ ఫైట్స్ ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ అని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్ రాజా, ఛాయాగ్రహణం: కె. రమణ, ఎడిటింగ్, వినయ్‌రెడ్డి.

# నటి హీనాఖాన్‌కు కేన్సర్



ప్రముఖ బాలీవుడ్ బుల్లితెర నటి హీనాఖాన్ రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'ప్రస్తుతం స్టేజ్ 3 కేన్సర్‌తో పోరాడుతున్నాను. చికిత్స తీసుకుంటున్నాను. కేన్సర్‌ను జయించి మళ్లీ మామూలు మనిషిగా మీ ముందుకు వస్తాననే నమ్మకం ఉంది. ఈ ఆపత్కాలంలో నాకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. బుల్లి తెర సీరియల్ 'ఏ రిస్తా క్యా కెహలాతా హై'లో అక్షర పాత్రతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. 'బిగ్‌బాస్, ఖత్రోన్ కే ఖిలాడి' వంటి రియాలిటీ షోల్లో హీనాఖాన్ పాల్గొన్నారు.

# అమితాబ్, కమల్, రజనీ.. ఒకే చిత్రంలో




ఇటీవల విడుదలైన 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో అమితాబ్, కమల్ హాసన్ నటించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలసి నటించిన చిత్రం ఇదే కావడం గమనార్హం. కమల్ నటించిన హిందీ చిత్రాల సంఖ్య తక్కువే. అలాగే అమితాబ్ ఏనాడూ తమిళ సినిమాలో నటించింది లేదు. చివరికి తెలుగు చిత్రం 'కల్కి' వల్ల వీరిద్దరి కలయిక మరోసారి సాధ్యమైంది. అలాగే అమితాబ్ తొలిసారిగా ఓ తమిళ చిత్రంలో నటిస్తున్నారు. ఆ చిత్రం 'వేట్టయాన్'. అందులో హీరో రజనీకాంత్. 1991లో వచ్చిన 'హమ్' చిత్రం తర్వాత వీరిద్దరూ కలసి నటిస్తున్న చిత్రం ఇదే కావడం విశేషం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అమితాబ్, కమల్, రజనీకాంత్ కలసి ఓ హిందీ చిత్రంలో నటించారు. 1985లో వచ్చిన ఆ చిత్రం పేరు 'గిరఫ్తార్'. ఇందులో కమల్ హీరో. ఈ సినిమాలో అమితాబ్‌ది మొదట అతిథి పాత్రే. అప్పట్లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో అమితాబ్ ఎన్నిక కావడంతో సినిమాలు తగ్గించుకుని రాజకీయాలకు పరిమితం కావాలనుకున్నారు అమితాబ్. కానీ దర్శకుడు ప్రయాగ్ రాజ్ కథ చెప్పి అమితాబ్‌ను ఒప్పించారు. మొదట అతిథి పాత్రే అనుకున్నా క్రమంగా ఆ పాత్ర పరిధి పెరిగి మెయిన్ రోల్ అయింది. రజనీకాంత్ ఈ సినిమాలో అతిథి పాత్ర పోషించారు.

# రేవ్ పార్టీ కేసు.. మీడియాకే తెలియాలి



నటి హేమ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బెంగళూరు రేవ్‌పార్టీ వ్యవహారంలో అరెస్టయిన ఆమె బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కాలినడకన తిరుమలకు చేరుకున్న హేమ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. నేను చిన్నప్పటి నుంచి శ్రీవారి దర్శనానికి వస్తున్నాను, తిరుమల నాకు పుట్టినిల్లు అన్నారు. రేవ్ పార్టీ కేసు గురించి మీడియా ప్రశ్నించగా 'మీకే తెలియాలి. మీరే వేస్తున్నారు కదా న్యూస్. మీ ద్వారానే నేనూ తెలుసుకుంటున్నా' అని బదులిచ్చారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

# తమన్నా యాక్షన్



తమన్నా భాటియా, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఓదెల 2'. అశోక్ తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్‌నంది క్రియేట్ చేసిన 'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. భారీ బడ్జెట్‌తో, బహుభాషా చిత్రంగా మేకర్స్ రూపొందిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్‌ను చిత్రబృందం ప్రారంభించింది. కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. టాప్ క్లాస్ యాక్షన్ డైరెక్టర్స్ పోరాట ఘట్టాలను అద్భుతంగా రూపొందిస్తున్నారనీ, తమన్నా యాక్షన్ పార్ట్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారని మేకర్స్ తెలిపారు. వశిష్ట ఎన్ సింహ, నాగమహేశ్, గగన్ విహారి కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్.


# గ్యాంగ్ వార్ సరికొత్తగా



చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ హీరోయిన్. ఆగస్టులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. శుక్రవారం 'గ్యాంగ్‌స్టర్' టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ 'నిర్మాత దిల్ రాజు, రచయిత విజయేంద్రప్రసాద్ మా చిత్రం టీజర్‌ను చూసి మెచ్చుకున్నారు. గ్యాంగ్ వార్‌ను మా సినిమాలో సరికొత్త రూపంలో చూపించబోతున్నాం' అన్నారు.



# మూడేళ్లు.. ఏడు ఫ్లాపులు.. రూ.800 కోట్ల నష్టం!



చిత్రపరిశ్రమలో ఎప్పుడూ సక్సెస్‌దే పై చేయి. వ్యాపారంతో కూడుకున్న కళారంగం కనుక డిమాండ్ లేని నటుల జోలికి ఎవరూ వెళ్లరు. ఫ్లాపుల్లో ఉన్నవారిని పట్టించుకోరు. కానీ ఈ విషయంలో బాలీవుడ్ నటుడు అక్షయ్‌కు మాత్రం మినహాయింపు ఇవ్వాలి. నలభై ఏళ్ల సుదీర్ఘమైన నట జీవితం ఆయనది. పదేళ్లుగా అత్యధిక పారితోషికం అందుకొంటున్న హీరోల జాబితాలో ఆయన పేరు ఉంటోంది. అయితే మూడేళ్ల నుంచి అక్షయ్‌ను వరుస అపజయాలు వెంటాడుతున్నాయి. ఏడు సినిమాలు.. 'బచ్చన్ పాండే', 'సమ్రాట్ పృథ్వీరాజ్', 'రక్షాబంధన్', 'రామ్‌సేతు', 'సెల్ఫీ', 'మిషన్ రాణీగంజ్', 'బడేమియా ఛోటే మియా'.. బాక్సాఫీసు దగ్గర బోల్తా పడ్డాయి. వీటిల్లో 'సమ్రాట్ పృథ్వీరాజ్', 'బడేమియా ఛోటేమియా' చిత్రాలైతే ఇండియన్ సినిమా హిస్టరీలోనే బిగ్గెస్ట్ ఫ్లాప్స్. ఈ ఏడు చిత్రాల వల్ల దాదాపు రూ.800 కోట్లు చిత్ర పరిశ్రమ నష్టపోయిందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. ఇంత ఫ్లాపుల చరిత్ర ఉన్న నటుడిని పరిశ్రమ పట్టించుకోకూడదు. కానీ అక్షయ్ ప్రత్యేకతే వేరు. ఆయనకు డిమాండ్ తగ్గలేదు. నిర్మాతలు వెంటబడుతూనే ఉన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో అక్షయ్ నటించిన పది చిత్రాలు విడుదల కానున్నాయి. వీటిల్లో తెలుగు సినిమా 'కన్నప్ప' కూడా ఉంది. అందుకే అక్షయ్ అదృష్టవంతుడు అంటున్నారంతా.

# 'దీక్ష' షూటింగ్ పూర్తి

కిరణ్‌కుమార్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. సినిమా ప్రోగ్రెస్ గురించి దర్శకుడు మాట్లాడుతూ 'పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో హీరో కిరణ్ చేసిన ఫైట్స్, ఆయన వేసిన భీముడు, ఆంజనేయుడి గెటప్స్ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. నలుగురు హీరోయిన్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. 'ఇంతకుముందు నేను తెలుగులో పది, తమిళంలో రెండు చిత్రాల్లో హీరోగా నటించాను. ఈ సినిమా నాకు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నా' అన్నారు కిరణ్. నటి తులసి మాట్లాడుతూ 'ఇందులో లీడ్ రోల్ పోషించాను. నా పాత్రకు మంచి డైలాగులు కుదిరాయి. సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

